

## నా వాక్కు ఏదీ వృథా పోదు.- శ్రీ సత్యసాయిబాబా

స్వామి అద్భుత లీలలు అంతుపట్టనివి. మనం చేయవలసిందల్లా ఆ అద్భుతంలో మునిగి తేలటమే. మనకు తెలిసిందల్లా ఆయన చెప్పిందంతా జరుగుతుందనేదే. అలా జరగబోతుండగా ఇక మిగతావన్నీ ప్రాధాన్యత లేని విషయాలే. వివిధ సందర్భాలలో స్వామి సూచించిన సంకేతాలు అవతార కాలం పూర్తి అవ్వ లేదన్న దాన్ని స్పష్టంగా తెలుపు తున్నాయి. అంటే భగవాన్ శ్రీ సత్యసాయిబాబా రూపంలోనే వారు తప్పక తిరిగి వస్తారని !!! స్వామి కూడా తమ రాకని గురించి ఆశ్చర్యం గొలిపే సంకేతా లిచ్చారు. ఇంకా కొన్ని ప్రత్యేక మత శాస్త్ర గ్రంధాలు స్వామి పునరాగమనం గురించి స్పష్టంగా భవిష్యవాణులు తెలుపుతున్నాయి. అక్కడక్కడ ఉన్న ఇలాంటి విషయాలను సేకరించి ఒక క్రమంలో సాధకులకు, భక్తులకు అందివ్వాలనే సవినయ ప్రయత్నమే ఇది.

పుస్తకం గురించి సంగ్రహంగా :
- స్వామి మాటల్లో తమ రాకడ గురించి సంకేతాలు.
- ఈ ధరణీ తలంపై తమ జీవిత కాలం గురించి స్వామి చెప్పిందేమిటి?
- వివిధ మత శాస్త్ర గ్రంధాల్లో స్వామి యొక్క రెండవ రాకడ సత్యమవబోతోందని తెలిపే అద్భుత ఆశ్చర్యాలు గొలిపే భవిష్యవాణులు.
- రాబోయే శాంతి సౌభాగ్యాలు తెచ్చే "స్వర్ణయుగోదయం" గురించి.


ఈ పుస్తకం మహాత్మ్యం గురించి చెప్పటం మాటలకందనిది. స్వామికి అసాధ్యమ నునది ఏది లేదు. స్వామి భక్తులకు మీరీ గ్రంధం ద్వారా చేసిన సేవకి కృతజ్ఞతాభి వందనములు. -ఫాదర్ చార్లెస్ ఒగాడా

రచయిత ప్రశాంతంగా అన్ని విషయాలూ పరిశీలించి ఖండింప వీలులేని తర్కంతో నింపిన ఈ పరిశోధనా గ్రంధం తప్పు పట్టడానికి వీలు లేనిది. ఈ గ్రంధం సూచించిన అభిప్రాయంతో ఏకీభవించినా, ఏకీభవించక పోయినా ముగింపు వరకూ జాగ్రత్తగా పరిశీలిస్తే మాత్రం ఈ గ్రంధం చెప్పే దాన్ని అంత తేలిగ్గా ఉపేక్షించలేము. - జోడీ క్లియరీ మరియు టెడ్ హెన్రీ

ఈ పుస్తకాన్ని ఉచితంగా ఇంటర్ నెట్‌లో చదవటానికి దయచేసి www.saikingdom.com చూడండి. - జై సాయిరామ్


సాయీ నీ రాజ్యం వచ్చుగాక, మూలం : శ్రీజిత్ నారాయణ్, తెలుగు అనువాదం : పి.వి. మల్లికార్జునరావు

# సాయీ నీ రాజ్యం వచ్చుగాక



శ్రీసత్య సాయిబాబావారు మరల ఈ దేహంతోనే తిరిగి దర్శనం ఇస్తారన్న ఒక వైవిధ్యంతో కూడిన చర్చల సారాంశం.

మూలం : శ్రీజిత్ నారాయణ్
తెలుగు అనువాదం : పి.వి.మల్లికార్జునరావు.





- *సాయిసేవలో శ్రీజిత్ నారాయణ్. గ్రంధకర్త.*

*తెలుగు అనువాదం : పి.వి.మల్లికార్జునరావు*

# సాయీ నీరాజ్యం వచ్చుగాక

## (శ్రీ సాయిబాబా మరల ఈ దేహంతోనే తిరిగి దర్శనం ఇస్తారన్న ఒక వైవిధ్యంతో కూడిన చర్చల సారాంశం.)

**మూలం : శ్రీజిత్ నారాయణ్**



**" భూలోక స్వర్గమును అనుభవ పూర్వకముగా తెలుసు కొనగలవారు నిజంగా ఎంత అదృష్టవంతులో గదా ! "**

**- శ్రీసత్యసాయిబాబా.**

## దివ్య ఆశీర్వచనైః

ఇక "సాయి దై కింగ్‌డమ్ కమ్." అనే గ్రంధానికి తెలుగుభాషలో అనువాదం అత్యంత భక్తి శ్రద్ధలతో అమెరికా నుంచి సహకరించిన మా పెద్దమ్మాయి, దూరంగా ఉన్న మా చిన్నమ్మాయి మరియు మా కుమారుడు చిరంజీవి గణేష్‌లకు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారు దివ్యాశీస్సులు అందించాలని వేడుకుంటున్నాను. ఆంగ్లంలో ఉండే ఈ ప్రతిని నా కుమారుడు పెన్ డ్రైవ్‌లో తీసుకువస్తే, నాకు సౌలభ్యంగా చదివేందుకు డస్క్‌టాప్‌పై ఉంచిన మా అమ్మాయిలు చి॥మాధవి, సిరివల్లీ మీనాక్షీ వీరిరువురికి సత్య సాయిబాబా వారి దివ్య ఆశీస్సులు లభించుగాక!. ఈ గ్రంధ తెలుగు అనువాద మహా యజ్ఞమునకు ఎందరెందరో తోడ్పడినారు. శ్రీ కె.ఎస్.మూర్తిగారు ప్రశాంతి నిలయం పుట్టపర్తి నుంచి ప్రూఫ్ దిద్ది తిరుగుటపాలో నాకు పంపినారు. శ్రీ మాదిరాజు శ్రీనివాసు, వారి సతీమణి శ్రీమతి సుమతి వ్రాత ప్రతి డిటిపి గావించి సవరణలు నిక్షిప్తం కావించి, భక్తి శ్రద్ధలతో నాకు సహకరించినారు. ఈ యజ్ఞమునకు నా సతీమణి మొదటి నుంచి చిట్టచివరి వరకు వెన్నంటి ఉండి ప్రూఫ్ చదివి సవరణలకు తోడ్పడి ఇంత అందముగా ఈ గ్రంధము మీ ముందుకు వెలువడుటకు సహకరించినది. వీరందరికి స్వామి దివ్య ఆశీస్సులు లభించుగాకం.

# సాయీ నీరాజ్యం వచ్చు గాక

ప్రధమ ముద్రణ : తెలుగులో - ఆగష్టు 2013, రాజమండ్రి.
**: ఆంగ్లంలో - ద్వితీయ ముద్రణ - జూన్ 2012, అమెరికా.**
**: ఆంగ్లంలో - ప్రధమ ముద్రణ - ఏప్రియల్ 2012,అమెరికా.**
**ముద్రణ తేది : 24 ఏప్రియల్ 2012.** ఈస్టర్ దినము.
గ్రంధకర్త : శ్రీజిత్ నారాయణ.
మూలం : "సాయీ దై కింగ్‌డమ్.కమ్ (ఆంగ్లం)
తెలుగు అనువాదం : పిల్లుట్ల వెంకట మల్లికార్జునరావు.

Copyright©2013 Sreejith Narayan,

ఈ గ్రంధము ఇప్పటికి తెలుగు మళయాళం, హిందీ, తమిళం, మరియు ఆంగ్లము, స్పానిష్, ఫ్రెంచ్, డచ్చి, పోర్చుగీసు, జెర్మనీ, జపనీస్, రష్యన్, వంటి దేశ, విదేశీయ భాషలలో ముద్రించడమైనది.

Telugu printed at : **Sai SAHAY** Prints, Rajahmundry .

## కాపీరైట్

ఈ గ్రంధంపై సర్వ హక్కులు రచయితవి. మరియు ఇతర భాషలలోకి అనువదించు అధికారములన్నియు కూడా గ్రంధకర్తవే. పూర్తిగా కానీ, చిత్ర పటములు గాని, కళా కౌశల్యముగాని, నకలు తీయరాదు. గ్రంధకర్త శ్రీజిత్ నారాయణ్‌గారి లిఖితపూర్వక అనుమతి లేనిదే ఇతర భాషల లోనికి అను వదించరాదు. మరి ఏ ఇతర రూపములోనైనా, ఫోటో కాపీ, రికార్డింగ్, మరియు ఏ ఇతర సాధనముల వలనగాని ఈ పుస్తకములోని ఏభాగమును ఉపయో గించరాదు. గ్రంధ సమీక్షకు మాత్రం ఈ నిషేధం వర్తించదు. ఈ పుస్తక మును ఎగుమతి చేయు అధికారము కేవలం గ్రంధకర్తవే.

**పాఠకులకు నా విన్నపము :** పాఠకులారా...! వెబ్‌సైట్‌లో ఆంగ్లభాషలో ఉన్న "సాయి దై కింగ్‌డమ్ కమ్" గ్రంధం ఆసక్తి గల ప్రతి సాయి భక్తునకు, పాఠకునకు అందించవచ్చు. ఈ గ్రంధము యొక్క పిడిఎఫ్ ఫైలు మాత్రం ఎవరికి పంప వద్దని నా వినయపూర్వక అభ్యర్ధన. ఎందుకంటే ఇది దుర్వినియోగం అవుతుం దనే భయంతో మిమ్ముల్ని వేడుకుంటున్నాను. - మీ శ్రీజిత్ నారాయణ్, *గ్రంధకర్త.*

**పాఠకుల ప్రతి స్పందన నాకత్యంత ముఖ్యం :** ఈ పుస్తకము మీకు నచ్చినచో మీ అభిప్రాయాలు, ప్రశ్నలు, ఇష్టాయిష్టాలు,snarayan@ saikingdom.com కి గాని లేక తమ వెబ్ సైట్ www.saikingdom.com కి గాని మీ అభిప్రాయములు పంపవచ్చు.

వెల : **60-00** రూ॥

---

## పుస్తకాల కొరకు

**చిరునామా : పిల్లుట్ల వెంకట మల్లికార్జునరావు,**
**ప్రకాశం ఎంప్లాయిస్ కాలనీ, కొంతమూరు, రాజమండ్రి- 533 102.**
**సెల్ : 9441608221. ఫోన్ : 0883-2487486**



# ఇష్ట దేవతా స్తుతి.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు నాచేత అనేకమైన అద్భుత కీర్తనలు వ్రాయించారు. అందులో ఏక వింశతి నామాలతో కూడిన గణపతి స్తుతి.

పల్లవి : దయాకరో భగవాన్ గణపతి
కృపాకరో భగవాన్ దయా॥

1. ఈశ్వర పుత్ర! విఘ్న వినాయక !
పార్వతి తనయా! పాప నాశక !
షణ్ముఖ అగ్రజ! 1.క్షిప్రప్రదాయ !
2.లక్ష ప్రదాయ ! దయాకరో ॥ దయా॥

2. 3.ఢుంఠి వినాయక ! 4.మహా గణపతే !
5.వాచాసిద్ధాయ ! దయాకరో ॥
6.శ్రీగణంజయాయ !7. హేరంబాయ !
8.ధరణీ ధరాయ దయాకరో ॥ దయా॥

3. 9.చింతామణయే! 10.సుమంగళాయ !
11.గణపతయే! దయాకరో ॥
12.ఆశాపూరకాయ! 13.అమితాయ! 14.శివాయ!
15. కాశ్యపాయ! దయాకరో ॥ దయా॥

4. 16.నందనాయ! 17. నిధయే! 18. వరదాయ!
19.అమోఘ సిద్ధయే! దయాకరో॥
20. మంత్రాయ! మహిమాన్వితాయ! 21.బీజాయ!
ఓంకారాయ దయాకరో ॥ దయా॥

1. క్షిప్రము= శ్రీఘ్రము(ముహూర్తమున 15వ భాగము),చూపుడు వేలు, బొటన వేలు మధ్య భాగము. 2.లక్ష= లక్ష్యము,గురి 3.ఢుంఠి=కాశీలో వాయువ్య భాగమున ఉన్న వినాయకుడు. ఢుండి=డుంఠి. (రూపాంతరము డుంఠి). 4. హేరంబాయ= వినాయకుడు.

ప్రేమ స్వరూపులు, దయాసముద్రులు అయిన భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారు ఈ గ్రంధమును ఆమూలాగ్రం నా వెంట ఉండి నాచేత ఆంధ్రంలో అనువదించుటకు కవిత్వ, పటుత్వ, మహత్వ సంపదలనందిస్తారని హృదయ పూర్వకంగా భక్తి, వినయములతో స్వామి దివ్య పాద పద్మములకు శత సహస్ర కోటి వందనములు, అర్పించుకుంటూ వందన సమర్పణలు గావించుకుంటున్నాను.

## సాయినాధునికి సాష్టాంగ ప్రణతులు.

పల్లవి : కోటి కోటి వందనాలు కోటి సూర్యతేజునకు
కోటి కోటి వందనాలు సహస్ర శీర్షధారికి– ॥కోటి కోటి॥

1. ఆరాధనలారాధనలాద్యంత రహితునకు
ఆరాధనలారాధన లాది దేవతా మూర్తికి ॥కోటి కోటి॥

2. ప్రణామాలు ప్రణామాలు ప్రణవనాదమూలునికి
ప్రణామాలు ప్రణామాలు [1]ప్రళయాంతస్థితునకు ॥కోటి కోటి॥

3. సాష్టాంగ ప్రణతులు షిరిడిసాయి నాధునకు
సాష్టాంగ ప్రణతులు సద్గురు సాయీశునకు ॥కోటి కోటి॥

4. సుమాంజలులు సుమాంజులులు పుటపర్తి ప్రభునకు
సుమాంజలులు, సుమాంజులులు సత్యసాయి దేవునకు
॥కోటి కోటి॥

5. హృదయ పుష్పాంజలులు ప్రేమావతారునకు
హృదయ పుష్పాంజలులు ప్రేమసాయి మూర్తికి ॥కోటి కోటి॥

---

[1] ప్రళయాంత స్థితుడు : వటపత్రసాయి

## ముందుమాట

సాయిరామ్! ముందుగా తెలుగులో ఇంత చక్కటి నిత్యపారాయణ గ్రంధాన్ని అందించటానికి, స్వామి సంకల్పంతో ఉపకరణాలయిన శ్రీ జిత్ నారాయణ్‌గారికి, శ్రీ పి.వి.మల్లికార్జునరావుగారికీ నా ధన్యవాదాలు.

మత గ్రంధాలలోని మర్మాలను, ముఖ్యంగా ఎప్పటికీ పొల్లుపోని, స్వామి వ్యాఖ్యలను, మనకర్థమయ్యే విధంగా వివరించటంలోను, తోటి సాధకుల ఆధ్యాత్మిక ఉన్నతికి సాయపడటంలోను, తమ ఇష్టదైవము యొక్క సందేశాలను, ప్రపంచం నలుమూలలకి చేర్చాలని తపన పడటంలోను, వీరిరువురూ అందరికీ ఆదర్శప్రాయులు. ఈ గ్రంథంలో బ్రదర్ జైరోస్ బోర్జాస్‌తో స్వామి మాట్లాడుతూ, రాబోయే ఘట్టం ఎంత వైభవోపేతంగా ఉంటుందో దాని విషయమై అందరికి వివరించడం ఎంత క్లిష్టమైనదో స్వామి నొక్కినొక్కి పలుమారులు పలకడం మనం చూడవచ్చు. స్వామి అనుగ్రహంతో ఆశ్చర్యం గొలిపే ఆ ఘట్టం యొక్క వైభవాన్ని ఊహించగలిగే తెలివి, దాని విషయమై ప్రపంచానికి ప్రకటించగలిగే ధైర్యసాహసాలు శ్రీ శ్రీజిత్‌నారాయణ్‌కు సమకూరాయి. వీరు స్వామి వారి సద్భక్తుల కుటుంబానికి చెందినవారు. స్వామి కేరళ పర్యటనకు వెళ్ళిన సందర్భంలో, స్వామి వారి పూర్వీకుల పట్టణాన్ని సందర్శించటం విశేషం.

శ్రీ మల్లికార్జునరావుగారు ఇరవై రెండు సంవత్సరాల క్రితం సాయి అవతారం గురించిన భవిష్యవాణిని వీరు భారతీయ నౌకాదళంలో చెన్నైలో ఉండగా, గిండి మందిర స్వాధ్యాయమండలిలో సేకరించిన అద్భుత విషయాలతో గూర్చిన పరిమిత ప్రతుల ప్రచురణలోని ఒక ప్రతిని 12 సం॥ల క్రితం పొందే భాగ్యం నాకు కలిగింది. బాలవికాస్ పనులలో తలమునకలైన దంపతుల పిల్లలకు స్వామి అనుగ్రహం ఉంటుందనటానికి నిదర్శనంగా వీరి పిల్లలకు మంచి విద్యాబుద్ధులిచ్చి స్వామి దండిగా మెండుగా ఆశీర్వదించారు. వీరు విధివిధానాలతో స్వయంగా రూపొందించిన సాయి సామూహిక "సత్య సాయివ్రతా"ల్లో పాల్గొన్న భక్తులు స్వామివారి మహిమోపేత సాన్నిధ్యం చుట్టూ ఆవరించి ఉండటాన్ని, స్వయంగా అనుభూతి పొందవచ్చు".

ఈ గ్రంథం మొట్టమొదట ఆంగ్లంలో వెలువడే నాటికి మనలో చాలామంది పరిస్థితి బ్రహ్మరాక్షసి కథలోని సందేహాల పుట్ట అయిన వ్యక్తిలా ఉండేది. కథలోని సంశయాళువు, ఒక బ్రహ్మరాక్షసి బాగా బలిసిన ఒక ఒంటెను అమాంతంగా మ్రింగివేయటం తన కళ్ళ ఎదుటే చూసినా, మరు క్షణమే అది ఒంటెను మ్రింగటం నిజమే కాని దాని కాలి గిట్టలను ఎలా మ్రింగ గలిగిందో తాను నమ్మలేక పోతున్నానంటాడు.

గరుడుని నోటినుండి చిన్న పాము క్షణకాలం తప్పించుకున్నట్లు నృసింహ దేవుని పట్టునుండి హిరణ్యకశిపుడు క్షణకాలం తప్పించుకున్నప్పుడు, దూరంగా దాక్కుని చూస్తున్న దేవతలు నృశింహ దేవుని శక్తిని శంకించి ఏదో అపాయం జరగబోతోందనుకుంటారు. అప్పటికే పదవీచ్యుతులై హిరణ్యకశిపుని భయంచే మేఘాల వెనుక దాక్కుని ఉన్న దేవతలు దేవదేవుని శక్తి కూడా తమ అల్పశక్తి వంటిదేననుకున్నారు.

కృష్ణపరమాత్మ శక్తినీ లీలానాటక ఉద్దేశ్యాన్నీ శంకించిన ఉదంక మహర్షిలా, గోప బాలురతో ఆడుకుంటున్న బాల కృష్ణున్ని పరీక్షింపదలచి గోవత్సాల్ని, గోపబాలురని అదృశ్యం చేసిన బ్రహ్మదేవునిలా, మనకూ మాయా శక్తి ప్రభావంవల్ల ఎన్నెన్నో సందేహాలు కలిగాయి. దేవతలూ, మునులే మాయా ప్రభావాన్ని తప్పించుకోలేనపుడు మనమెంతటివారము.

ఇలాంటి పరిస్థితిలో స్వామి సాక్షాత్తూ పరిపూర్ణ శాశ్వత దివ్యతత్వమనీ, వారి శక్తికి పరిమితులు విధించగల మరో శక్తి ఏదీ లేదనీ, స్వామి 1976లో ఊటీలో చారిత్రాత్మక ప్రకటనలోనూ, తదుపరి అనేక సందర్భాలలోనూ, తమ శేషఅవతార కాలం గురించి, చెప్పేటప్పుడు తమ శరీరంవైపు చూపించి దాన్ని గట్టిగా తట్టి, ఇది ఇంకా ఇన్నేళ్ళు ఉంటుందని నొక్కి చెప్పేవారనీ, అందుచే అవతారకాలం గుణించి, వారు చెప్పన మాట వమ్ముకాదనీ, స్వామి అనుగ్రహం పొంది పరిణతి చెందిన ఒక పరమ భక్తయోగి తెలుపగా నాలాంటి వారికి మాయా తెరలు తొలిగాయి.

బాలకృష్ణుడు సాందీప మహర్షికి గురు దక్షిణగా ఎన్నో సంవత్సరాల క్రితం గతించిన తన కుమారుణ్ణి సజీవంగా తెచ్చియిచ్చే ఘట్టాన్ని కళ్ళకు కట్టినట్లు వివరించ గలిగే విశ్వాసంగల పరమ భక్తులు కూడా ప్రస్తుత అవతార ఘట్టంలో నశించే తత్వమున్న కాయాన్ని గుర్తుకు తెచ్చుకొని "అక్కణ్ణుంచి మళ్ళీ రాగలరా" అని ముందుకెళ్ళలేక, అక్కడే అతుక్కుపోతున్నారు. సర్వ లోకాల్నీ తన బొజ్జలో వుంచుకొని, విశ్వమంతా తానైన నియంత ఎన్ని చోట్ల నుండి ఎన్నెన్ని రూపాల్లో మనకు ప్రత్యక్ష మవ్వలేరూ ! ఒకవేళ వీరనుకున్నట్లు

అక్కణ్ణించే రావాలన్నా ఆయనకు అసాధ్యమా?

సాయిఖేడా(మధ్యప్రదేశ్)లో దునీవాలే బాబా, మూడుసార్లు సమాధి చెంది మూడుసార్లూ తమ భక్తుల కోసం లేచి రాలేదా? నవనాధుల్లోని ఒక యోగి (మాతృశ్రీ ఈశ్వరాంబా సమాధి మందిరం ప్రక్కనున్న తోటలో స్వామి ప్రతిష్ఠించిన దత్తమందిరం యొక్క ప్రదక్షిణ బాట చుట్టూ నవనాధ యోగుల విగ్రహాలు చూడవచ్చు) ఎన్నో సంవత్సరాల తరువాత తన భక్తులకోసం అక్కడ నుంచే తిరిగి లేచి రాలేదా? సెయింట్ కట్‌బెర్ట్ యొక్క కాయం దశాబ్ధాల తరువాత ఎన్నో శతాబ్ధాల తరువాతా పేటికను మళ్ళీ మళ్ళీ తెరచి చూచినప్పుడు అప్పుడే ప్రార్ధనా సమావేశానికి వెళ్ళటానికి సిద్ధమైనట్లు "తాజా"గా మధుర సుగంధ పరిమళాలీనుతూ కన్పించినట్లు, గ్రంధస్థం చేయబడి ఉండటం మనం చూడలేదా? అన్నింటికంటే గొప్పలీల శ్రీ సత్యసాయి జనరల్ ఆసుపత్రిలో చిరకాలం పనిచేసిన డా॥అల్ రేజా గారు ముంబాయిలో ప్రభుత్వ డాక్టరుగా వున్నప్పుడు ఆయన ఇచ్చిన శవపరీక్ష రిపోర్టును గిట్టనివాళ్ళు తప్పుపట్టి నెలల తర్వాత కోర్టుకెళ్ళగా, తన భక్తుడైన డాక్టరును కాపాడటానికి, స్వామి రెండవ రిపోర్టు పనులయ్యే వరకు కాయాన్ని తాజాగా ఉంచి అదేరోజు వారు తిరిగి చూడగా కుళ్ళిన ఎముకల ముద్దగా పూర్వపు స్థితికి మార్చటం మనం డాక్టరుగారి ద్వారా వినలేదా? యోగులతోను, సత్పురుషులతోను, ఇక్కడ పోల్చటం, దేవదేవుని శక్తిని తగ్గించి చూపటానికి కాదు గోళాల గతులను సరిచేసే మన స్వామిని మనం పిప్పరమెంటు మాత్రమే అడిగితే ఆ కోర్కెకూడా తీరుస్తారని చెప్పటానికే ఆ శక్తి వైభవము బైబిలులో చెప్పినట్లు నిన్న, నేడూ, మరి ఎప్పటికీ కించిత్ కూడా తరగనిది.

మైసూరు దగ్గరి శ్రీరంగపట్టణంలోని భక్తునికి స్వామి అనుగ్రహించిన సాయి రూపం ఉన్న పతకాల నుండి దివ్య మకరందం ఎప్పటిలాగే జాడీల కొద్దీ జాలువారుతూనే ఉంది. దాన్ని భక్తులు సీసాల కొద్దీ తెచ్చుకుంటూనే ఉన్నారు. స్వామి దివ్య ఆశీర్వచన బలంతో ఆంధ్రదేశంలోని ఒక గ్రామంలో ప్రారంభించిన వందేళ్ళ నిరంతర నామసంకీర్తన, మూడున్నర దశాబ్ధాలు పూర్తి చేసుకుని, 365 రోజులూ, ఆహోరాత్రాలు క్షణం విరామం లేకుండా ఇప్పుడూ కొనసాగుతూనే ఉంది. ప్రశాంతినిలయంలో జరిగిన సాధు పరిషత్‌లో పాల్గొన్న ఒక మాతాజీకి చిన్నమొత్తం ఇస్తూ "దీన్ని మీరు అన్నదానాలు చేస్తారు గదా, దాన్లో కలపండి." అన్న ఒక్క వాక్కు అన్నపూర్ణా మాతవాక్కై ఆశ్రమానికి నిరంతరం వచ్చే భక్తులకు అక్షయంగా ఆకలి తీరుస్తూనే వుంది. న్యూఢిల్లీలోని వసంత్‌కుంజ్‌లో స్వామి చిరకాల భక్తురాలికి వారం, వారం స్వామి అందించే స్వదస్తూరీతో వున్న అద్భుత సందేశాలూ, ఇతర లీలలూ క్రమం తప్పకుండా ఇప్పుడూ కొనసాగుతూనే ఉన్నాయి.

ఏర్పేడులోని మహర్షి మళయాళ స్వామీజీ ఆశ్రమానికి వెళ్ళినప్పుడు స్వామి అంటారు– "మళయాళ స్వామి స్థాపించిన సంస్థలు వేలాది సంవత్సరాలు వర్ధిల్లుతాయి ఎందుకంటే మళయాళ స్వామి సంకల్పం గొప్పది" అని. దేవుడు అనుగ్రహించిన మహర్షి సంకల్పమే అంత ప్రభావంత మైనదైతే దేవదేవుని సంకల్పం ఇంకెంత గొప్పదో ఊహించగలమా !

స్వామియొక్క పునరాగమన ఘట్టం ఎంత వైభవోపేతంగా ఉంటుందంటే అన్ని దేశాలవారూ, అన్ని కాల మాన ప్రదేశాల్లోని వారు ఒకేసారి దాన్ని దర్శించ గలుగుతారు. ఒక పురాతన మత గ్రంధం రాబోయే ఆ ఘట్టం గుఱించి ఇలా వ్రాసింది. "ఒకానొక దినపు ప్రారంభంలో రాబోయే దేవుడు, తను చెప్పే విషయాలని, అన్ని దేశాలవారూ తమ తమ మాతృభాషల్లో అర్ధం చేసుకునే విధంగా ఆదేశిస్తారు." ఆ ఘట్టాన్ని బహుశా మనమంతా ముక్తకంఠం తో జై..జై.. ధ్వానాలతో స్వాగతిస్తాము. స్వామివారు ఐదు సంవత్సరముల క్రితం జై కార నినాదఘోషని మైకులో చెప్పించటానికి అంకురార్పణ చేయటానికి గల కారణం అదేనేమో! స్వామి "జై, బోలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబాజీ కీ జై !" అనే ఈ జయకారాన్ని అధికారికంగా అనుమతించక ముందు భక్తులు చిన్న చిన్న గ్రూపుల్లో మగవారిపైపు రెండుమూడుచోట్ల, మహిళల వైపు ఒకటి రెండు చోట్ల జై కారం చెప్పుకొనేవారు. జైకార నినాదాన్ని ప్రారంభించే భక్తులు భయంతో సేవాదళ్ దృష్టిని ఆకర్షించకుండా జాగ్రత్తలు తీసుకునేవారు. భక్తులు తమ ప్రేమను వ్యక్తీకరించుకొనే కార్యాలు మొదట్లో తిరస్కరించబడుతూ ఉండేవి. దేవుడు మాత్రమే తన భక్తుల ఆకాంక్షలకు అధికారిక హోదా ఇచ్చి మహిమోపేతం చేయగలడు. ఆ మహిమోపేత ఘట్టంలో మనందరిని భాగస్వాములను చేయటానికి లక్ష యోజనముల విస్తీర్ణం గల మూపుతో కూర్మనాధుడిగా వచ్చిన మనస్వామి ఇప్పుడు ఒక్కొక్క భక్తునికోసం, ఒక్కొక్క చిన్న కూర్మావతారంగా వచ్చి, ప్రాపంచిక జంజాటంలో మునిగిన మనలను తమ దివ్యతేజం వైపుకు, తమ మెత్తని మూపుతో ప్రేమగా ఎత్తుతున్నారు.

అన్ని మత శాస్త్రాల్లో చెప్పబడిన విషయాలూ నెరవేర్చబడే సమయం, సరిగ్గా ఇప్పుడే రాబోతోందని, ఆయా మత అనుయాయులు గట్టిగా నమ్ము తున్నారు. వాటన్నింటితో పాటు మనకు మనస్వామి మాటలే అన్నింటి కంటే పెద్దశాస్త్రమూ, వేదమూనూ.

మండువేసవిలో భారతంలోని విరాటపర్వం, సామూహిక పారాయణ పూర్తి చేసిన వెంటనే, వర్షపు జల్లులు వచ్చినట్లు ఈ గ్రంధ పారాయణ తగి నంత మంది చేసినప్పుడు, స్వామి రాకడ సత్యమవుతుంది. దానికి మన పారాయణ అవసరం లేకపోయినా, ఆ కీర్తిని స్వామిమనందరికీ ఆపాదించ బోవటం, ఆయన అవ్యాజ కరుణకు నిదర్శనం.

"సమయము సమీపించినది, గనుక ఈ ప్రవచన వాక్యములు చదువు వారును, వాటిని విని ఇందులో వ్రాయబడిన సంగతులను గైకొను వారును ధన్యులు. – (ప్రకటన గ్రంథము 1:3)

జై సాయిరామ్ !

సాయి ఆగమనాభిలాషి

**కె. సత్యనారాయణమూర్తి,**

ప్రశాంతి నిలయం,

# నా అభిప్రాయం

నేను పి.వి.మల్లికార్జునరావుగారి(పెద్దబాబు) జ్యేష్ఠ సోదరిని. వానికి చిన్నతనం నుండి శ్రీ సత్యసాయిబాబా వారంటే చాలా ఇష్టం. చదువు మీద అంతగా శ్రద్ధ ఉండేది కాదు. లౌకిక వ్యవహారాలంటే ఇష్టపడేవారు కాదు. నాన్నగారి వద్ద కూర్చుని భారతం, భాగవతం వంటి పురాణ కథలు వింటూ ఉండేవారు. పాఠశాలకు వెళ్ళడానికి, చదువుకోవడానికి ఇష్టపడని మా తమ్ముడు ఆంగ్లంలో వున్నసాయి "దైకింగ్‌డమ్" అన్న గ్రంథాన్ని చక్కని తెలుగులో ఆంధ్రీ కరించడం చూసి చాలా ముగ్ధురాలినయ్యాను. ఏదీ రాని వాని చేత ఏదైనా చేయించగల శక్తి స్వామిది మాత్రమే అనీ అదే శ్రీసత్యసాయి అంటే అని నా పూర్తి విశ్వాసం. ఇక్కడ బైబిల్‌లో చెప్పబడిన ఒక సూక్తి నాకు జ్ఞాపకం వస్తోంది "తిరస్కరింపబడిన రాయే మూలస్తంభం అవుతుంది" అని. ఒకసారి మా తమ్ముడు 1994సం॥లో కుటుంబ సమేతంగా పుట్టపర్తి వెళుతూ నన్ను కూడా తీసుకు వెళ్ళారు. ఆ విధంగా మొట్టమొదటిసారి స్వామిని దర్శించుకొనే అదృష్టం నాకు లభించింది. కానీ పుట్టపర్తిలో స్వామి లేరు. బెంగళూరు వెళ్ళి వైట్‌ఫీల్డ్‌లో స్వామిని దర్శించుకున్నాము. స్వామి చక్కగా దర్శనమిచ్చి ఆశీర్వదించినట్లుగా వారి హస్తములు పైకెత్తి దీవిస్తూ నా ప్రక్కనుండి వెళ్ళుట నా భాగ్యము అనిపించింది. ఆ దివ్య మంగళ రూపం చూసిన నాకు నా భాగ్యం పండిందనిపించింది. అప్పటి నుండి నా జీవితం మరో మలుపు తిరిగింది. పుట్టపర్తిలో 3రోజులు ఉన్నాము. ప్రతి రోజు ఉదయం నగర సంకీర్తనము. సాయంత్రం భజనామృతము లో మేము పాల్గొనేవారము. ప్రశాంతి నిలయ వాతావరణము నాకు చాలా ఆహ్లాదంగా అనిపించింది. అప్పటి నుండి నాకు స్వామిపై భక్తిభావము ఏర్పడినది. ఆవిధంగా స్వామి అనుగ్రహం నాకు లభించింది. వెంటనే నాకు బి.ఏ స్పెషల్ తెలుగు పండిట్ ట్రైనింగ్ చేసే అదృష్టం లభించింది. తరువాత నేను ఎమ్.ఏ చేసి హైస్కూలులో తెలుగు పండిట్ ఉపాధ్యాయినిగా పనిచేస్తూ స్వామి కృప వలన నా వృత్తికి నేను న్యాయం చేస్తున్నాను.

ఈవిధంగా మా తమ్ముడి అండదండలు, సహాయ సహకారాలు ప్రేమానురాగాలు ఇప్పటికీ నాకు లభిస్తున్నాయి. ఈ చిరంజీవి స్వామి యందు భక్తి పారవశ్యంతో ఇంగ్లీషు, తెలుగు, సంస్కృతము, హిందీ భాషలలో అనేక పాటలు వ్రాసాడు. స్వామియే వారిచేత సందర్భోచితముగా పాటలు వ్రాయించారు. స్వామివారి, ప్రతి జన్మదినానికి పుట్టపర్తి చేరి స్వామి వారి సేవలో పాల్గొని వారి దివ్యాశీస్సులను పొందే అదృష్టము వారికి లభించింది. స్వామి కృప వలన వారి కుటుంబము ఆనందోత్సాహాలతో ముందుకు సాగుతోంది. స్వామి కృప వల్లనే వాళ్ళ పెద్దమ్మాయికి కురుగంటి వారి వంశము నుంచి వచ్చిన చక్కని అబ్బాయితో వివాహము జరిగింది.



స్వామి వారి మహాభినిష్క్రమణం తర్వాత పార్థివ దేహం మహా సమాధిలో ఉంచబడుతోందని తెలిసి చివరి సారిగా స్వామిని దర్శించు కొనుటకు పుట్టపర్తి వెళ్ళి బాధతో తిరిగి వస్తూ "స్వామి మరలా తిరిగి వస్తారు. ఎప్పటిలా దర్శనం ఇస్తారు" అని మా అందరిలో ఆశలు చిగురింపచేసాడు మా తమ్ముడు. స్వామికి సాధ్యం కానిది ఏముంది? ముమ్మాటికి ఇది సత్యం.వీరు అనేక గ్రంథాలు పఠించి తెలుసుకున్న విషయాలు అందరికి తెలియజెప్పే సందర్భములో మహా దానంద పడతారు. స్వామి దేహంతో ఉన్నప్పుడు ఒకేసారి అనేకచోట్ల దర్శన మిస్తూ లండన్‌లోని ఒక డాక్టరుగారి ఇంట్లో సూక్ష్మ శరీరంతో దర్శన మిచ్చి నాలుగు రోజులు వారింట్లో వారితోనే ఉన్నారన్న విషయం, అదే సమయంలో స్వామి భౌతికంగా ప్రశాంతి నిలయంలో అనేక పనులలో నిమగ్నమై ఉన్న సందర్భాలు అలాంటి చాలా విషయాలు మా తమ్ముడు చి॥ రావు విశ్వసిస్తూ అందరికి వివరించేవాడు.

శ్రీ శ్రీజిత్‌నారాయణ్ గారిఆంగ్ల గ్రంథం చాలా అద్భుతంగా ఉంది. వారి కృషి శ్లాఘనీయము. భగవాన్ శ్రీసత్యసాయి బాబా స్వయంగా వారిలో ప్రేరణను కలిగించి, విషయ సంగ్రహం సులువుగా లభించినట్లు చూసి వెన్నంటి ఉండి వారిచే వ్రాయించినట్లనిపిస్తోంది. వీరు ఇస్లాం, క్రిస్టియన్ హిందువుల యొక్క మత గ్రంథ సారాంశ సేకరణ బహు శ్రమకోర్చి చేసారు. అందునా స్వామి భవిష్యవాణి ఒక కలికి తురాయిగా నిలిచింది. స్వామి మరల వస్తారని స్వర్ణయుగం వస్తుందని, స్వామి పునర్దర్శనం ఇస్తారని వ్రాసిన పలుకులు యదార్థ మని నా మనసుకు ఊరట కలిగిస్తోంది. ఇవి తప్పక జరిగితీరతాయి. ఆధారాల తో స్వామి పునరాగమనాన్ని తెలియచేస్తున్న ఈ రచన నాలాంటి చదువరుల అదృష్టంగా నేను భావిస్తున్నాను.

ఇది స్వయంగా భగవాన్ వారికిచ్చిన వర ప్రసాదం. ఆ ప్రసాదాన్ని అందరూ స్వీకరించి జరగబోవు స్వర్ణయుగ ఆవిర్భావాన్ని తిలకించే అదృష్టాన్ని పొందుటకు ఓర్పుతో, భక్తితో స్వామిని ప్రార్థించవలసినదిగా నేను వేడుకొం టున్నాను. ఆంగ్ల గ్రంథ ఆంధ్రీకరణ మా తమ్మునికి స్వామి కలుగచేసిన వర ప్రసాదంగా నేను భావిస్తూ నాకు ఆ తెలుగు వ్రాత ప్రతిలోని భాషాదోషములు సరిదిద్దు అదృష్టం మా తమ్ముని ద్వారా నాకు లభించడం స్వామి కృపకు పాత్రు రాలయినందుకు ఆనందిస్తూ స్వామి కృప ఎల్లవేళలా అందరికి అందిచ మని స్వామిని వేడుకుంటూ – అందరికి సాయిరామ్ !

**చల్లా లక్ష్మీ ప్రసూన,** బిఎ, తెలుగు పండిట్,
సుజాత ఉన్నత పాఠశాల, అబిడ్స్, హైదరాబాద్.

# విషయసూచిక


**ముందుమాట**– జోడీ క్లీయరీ మరియు టెడ్ హెన్రీ 01
**ముందుమాట**– జుల్లీ చౌదరి 03
**తొలిపలుకు** – కెప్టెన్ జతీందర్ షాద్. 07
గ్రంథకర్త గురించి 08
కృతజ్ఞత 10
ఉపోద్ఘాతము 11
**ప్రథమభాగము. నా వాక్కు వృధా పోదు.** 18
**ఒకటవ అధ్యాయము**
చాంద్రమాన పంచాంగ సిద్ధాంతం 20
నిండు నూరేళ్ళు జీవించిన భక్తుల విషయములు 22
స్వామి జీవిత చరిత్ర వ్రాసిన మహానుభావుల అభిప్రాయాలు 25
**రెండవ అధ్యాయము**
అసలు స్వామి ప్రణాళిక ఏమిటి? 27
**మూడవ అధ్యాయము**
ఈ భూమిపై తమ జీవిత కాలం గురించి స్వామి చెప్పిన విషయాలు 29
ఒక సానుకూలమైన వివరణ 31
**నాల్గవ అధ్యాయము** సాయి భవిష్యవాణి 33
సాయి పలుకుల సారాంశం 34
మనమేమాత్రము సందేహించనవసరం లేదు. 35
**ద్వితీయ భాగము. మరలా తిరిగిరాక**
**ఐదవఅధ్యాయము** స్వామి తిరిగి వస్తారనటానికి ఉపకరించు కొన్ని సంఘటనలు 41
ఒక అద్భుతం రాబోతోంది. 43
స్వామి భక్తులకు కలల్లో దర్శనం 45
**ఆరవ అధ్యాయము** అద్భుతమైన నాడీ గ్రంథాలు 53
నాడీ శాస్త్రాల్లో చెప్పబడిన భవిష్యవాణి 54
బ్రహ్మనాడి, అగస్త్యనాడి, శుకనాడి 55
నాడీ గ్రంథాలతో నా అనుభవం 60
నాడీ గ్రంథాలు – స్వామి యొక్క పునరాగమనం 61
అద్భుతమైన నోస్ట్రడామస్ – భవిష్యవాణి 64
**ఏడవ అధ్యాయము** మహదీ ఎవరు? 67
బిహర్ ఉల్ అన్వర్ అనే గ్రంథంలోని మరికొన్ని సంకేతాలు 70
భూమిపై మహదీ పరిపాలన 71
మహదీ యొక్క అదృశ్యము 73
మహది ఎప్పుడు తిరిగి వస్తాడు 75
మహది యొక్క స్వర్ణయుగం 78
మహది ఎందుకు తిరిగి వస్తారు? 79
**ఎనిమిదవ అధ్యాయము** అంతరీక్ష దర్శనం ...ఆకాశంలో దర్శనం 80
విశ్వరూపం దర్శనం వాయిదా పడింది. 84
ఆకాశమార్గంలో స్వామి నడక 89
**తృతీయ భాగము. నీరాజ్యం వచ్చుగాక** 92
**తొమ్మిదవ అధ్యాయము** శ్రీసత్యసాయి స్వర్ణయుగ స్థాపన 93
స్వర్ణయుగ పునరావిర్భావం 95
స్వర్ణయుగము ఎలా ఉంటుంది? 96
సత్యసాయి అవతారమును అందరూ గుర్తిస్తారు 98
భారతదేశ ఔన్నత్యం 99
2012 సంవత్సర ప్రాముఖ్యము 100
మన పురాణాలలో చెప్పబడిన స్వర్ణయుగ లక్షణాలు 102
హోవర్డ్ మర్ఫెట్ – సాయిబాబా అవతార్ 103
మానవ కుమారుని రాక 104
**పదవ అధ్యాయము** స్వామి తన దేహమును ఎందుకు వదిలి పెట్టారు? 110
ఈ దేహము భక్తుల కోసమే వచ్చింది. 110
ప్రార్థనల యొక్క శక్తి 118
సర్వత్రా వ్యాపించిన వార్త 120
ఒక్క వేటుతో అనేక పనులు 122
**పదకొండొవ అధ్యాయము** పునరుద్ధాన వైభవం 123
దేహం గురించిన చర్చ 126
నిర్మాణ కాయములు 128
**పన్నెండవ అధ్యాయము** ముగింపు 131
భక్తులకు ఇది శిక్షణా సమయము 135
ప్రార్థన 141
సంప్రదించిన గ్రంథాలు 142

# ముందుమాట

## జోడి క్లియరీ మరియు టెడ్‌హెన్రీ

మీరు చదవబోయే ఈ పరిశోధనా వ్యాసంలోని విషయాలన్నింటినీ మీకు ముందుగానే వెల్లడి చేసెయ్యకుండా శ్రీ శ్రీజిత్‌నారాయణ గారి "సాయీ నీరాజ్యం వచ్చుగాక" మిమ్మల్ని ఆసక్తికరంగా చదివించే రచన అని చెప్పగలను. దీని గురించి ఎంత చెప్పినా తక్కువే.

రచయిత ప్రశాంతంగా అన్ని విషయాలూ పరిశీలించి ఖండింప వీలులేని తర్కంతో నింపిన ఈ పరిశోధనా గ్రంథం తప్పు పట్టడానికి వీలు లేనిది. ఈ గ్రంథం సూచించిన అభిప్రాయంతో ఏకీభవించినా, ఏకీభ వించకపోయినా ముగింపు వరకూ జాగ్రత్తగా పరిశీలిస్తే మాత్రం ఈ గ్రంథం చెప్పేదాన్ని అంత తేలిగ్గా ఉపేక్షించలేము.

మా విషయానికి వస్తే నాకూ నా భర్త టెడ్‌హెన్రీకి స్వామి తమ సజీవ సాన్నిధ్య సంబంధాన్ని క్షణకాలం కూడా దూరం చేయకుండా కొనసా గిస్తూనే వున్నారు. తమ ఉల్లాసకర లీలలూ, బోధలూ స్వప్నాను భూతులూ, దివ్య సాన్నిధ్యమూ మహాసమాధి తదుపరి కూడా అంతకు పూర్వం లాగే అనుగ్రహిస్తున్నారు. ఇంకాచెప్పాలంటే మా సోల్‌జర్న్స్ సేవా, ప్రేమా స్వామిపై ద్విగుణీకృతం అయ్యాయి. మా కోసం స్వామి చేసిందీ, అనుగ్రహిం చిందీ మేము వూహించుకున్న దానికీ, అడగాలనుకున్నదానికీ ఎన్నో రెట్లు ఎక్కువే. ఎప్పటికీ మేము స్వామిపై కృతజ్ఞతాభావంతో మునిగి వుంటాము.

టెడ్‌కూ, నాకూ స్వామిని అడగవలసింది ఏమీ లేకపోయినా అవతార సాన్నిధ్యాన్ని ఆస్వాదించి లాభం పొందని వారి మాటేమిటి?

ప్రపంచ పతనాన్ని అరికట్టి, స్వామి రాబోతోందని ప్రకటించిన 'వసుధైక కుటుంబం' రావటానికి ప్రస్తుత ప్రపంచ స్థితికి, ఇంకా బలమైన కుదుపు అవసరమయ్యేలా కనిపిస్తుంది.

మన హృదయపు లోతుల్లోని ఎన్నో భావాలనూ, సందేహాలనూ మాటల రూపంలో వ్యక్తం చేయలేని నిగూఢ అపనమ్మకాలనూ, "సాయీ నీ రాజ్యం వచ్చుగాక" అక్షర బద్ధం చేసి మనకు ఊరట నిచ్చింది.

"స్వామి అనిశ్చితత్వాన్ని మనం తప్పకుండా ప్రేమించాలన్న దాన్ని

అనుభవపూర్వకంగా తెలుసుకున్నాము." అన్నింటికంటే ముఖ్యమైనది ఆయనకు సాధ్యం కానిదేది లేదు. ఆయన అన్నింటికీ అతీతులు.

శ్రీ శ్రీజిత్‌నారాయణ్ చాలా జాగ్రత్తగా ధైర్యంగా **'సాయీ నీ రాజ్యం వచ్చుగాక'** లో చెప్పిన స్వర్ణయుగం(సత్యయుగం)లో భాగమైన వ్యక్తిస్థాయి, ప్రపంచస్థాయి పరివర్తనని మనం దైవానుగ్రహంతో చూడగలిగితే ఎంతో ఉప్పొంగిపోతాం.

( అమెరికా దేశీయులైన జోడీ క్లియరీ మరియు ఆమె భర్త టెడ్ హెన్రీ చిరకాలంగా శ్రీ సత్యసాయి బాబా వారి సద్భక్తులు. టెడ్‌హెన్రీ 40 సం॥లు పైగా టెలివిజన్ జర్నలిస్ట్‌గా వున్నారు. అమెరికాలోని ఓహియో లోని క్లీవ్‌లాండ్‌కి చెందిన ఎబిసికి అనుబంధ సంస్థ W.E.W.S-TV నుండి ఇటీవలే పదవీ విరమణ చేశారు. ఇందులో పనిచేసేటప్పుడు వీరు ఇతర కార్యక్రమాలతో పాటుగా "హృదయము– ఆత్మ" అనే ఆధ్యాత్మిక కార్య క్రమాన్ని వారం వారం సమర్పించేవారు. గత 15 సం॥లుగా ఈ దంపతులు విశేషంగా పర్యటిస్తూ అనేకమంది సాయి భక్తులూ, ఇతర ఆధ్యాత్మిక సాధకులతో వీడియో ఇంటర్వ్యూలు చేశారు. ఈ వీడియో ఇంటర్వ్యూలను వీరు నిర్వహిస్తున్న ఈ క్రింది అంతర్జాల చిరునామాలలో చూడవచ్చు.)

www.vimeo.com/souljourns
www.Youtube.com/souljourns
www.souljourns.net



# ముందుమాట

## జుల్లీ చౌదరి

**"సాయీ నీ రాజ్యం వచ్చుగాక"** అన్న ప్రముఖ ప్రార్ధనా వాక్యం వెను వెంటనే **నీ సంకల్పం నెరవేరుగాక** అనే పంక్తి వస్తుంది. మన ప్రియ తమ భగవానుని సంకల్పమే ఉత్కృష్టమైనది. ఆయన రాజ్యం, వారెప్పుడు సంకల్పిస్తే అప్పుడు వస్తుంది. తరతరాలూ, యుగయుగాలూ భక్తులు యశో గానం చేయబోయే ఆ అద్భుత ఘట్టాల ఆవిష్కారం చూడ్డానికి మన వంతుగా ఓర్పుతో వేచి చూడాలి.

వైభవోపేతమైన ఈ సంకలనంలోని పేజీలు అద్భుతాల్ని వివిధ రీతుల్లో అందంగా ఆవిష్కరిస్తూ మనల్ని కట్టిపడేసి చివరికంటా ఆసక్తితో చదివేలా చేస్తాయి. ఈ గ్రంథం జోస్యం చెప్పటానికి ప్రయత్నించడం లేదని రచయిత స్పష్టంగా చెప్పినప్పటికీ అనుకోకుండా **ఇది విద్యావిషయక పరి శోధన రూపం సంతరించుకుంది.** అవతారోద్భవం నుండి మొదలుకొని తరువాతి దశాబ్దాల్లోని స్వామివారి ప్రకటనలను చక్కటి క్రమంలో ఏర్చి కూర్చారు. ఇవి సత్య ప్రకటనలవ్వటం వలన స్వామివారి ధృవీకరణలు మనకు సాంత్వన కలుగచేసి కొత్త ఆశలు చిగురింపచేస్తాయి. **తరాల నాటి నాడీగ్రంథాల్లో భవిష్యద్రష్టలూ, మహర్షులూ స్వయంగా పొందుపరచిన విషయాలతో నిండిన ఈ గ్రంథంలోని ఆయా అధ్యాయాలు నిజంగా అద్భుత ప్రకటనలు.** ఇక దీనిగురించి స్పష్టం చేయవలసిన విషయాలేమీ లేకపోయినా ఈ ఇతివృత్తం భావాలను పెల్లుబికించి వ్యక్తం చేయాలని పించేదిగా వుంది.

**2011వ సంవత్సరములోని ఏప్రిల్ 24వ తేదిని ఎవరైనా ఎన్నటికైనా మర్చిపోగలరా?** రమారమి ఒక నెలరోజుల పాటు తాము స్థాపించిన ఆరోగ్యధామం ప్రశాంతి గ్రామ్‌లోని సూపర్ ఆసుపత్రికి 'పరిమితం' అవ్వాలని సంకల్పించుకున్నారు. ఆదుర్దాతో వేదనాపూరిత అశ్రువులతో భావావేశంతో కూడిన నివేదనలతో, శ్రద్ధాపూర్వక ప్రార్ధనలతో ప్రపంచ వ్యాప్తంగా భక్తులు, స్వామి తమను తాము స్వస్థత పరచుకొనితిరిగి యజుర్ మందిరంలో దర్శనం ప్రసాదించాలని ఆర్తితో ప్రార్ధించారు.

ఆయన పథక రచన వేరుగా ఉంది. అది ఆయన నిర్ణయం మేరకే ఆవిష్కారమవుతుంది. ఆయన పథకాలు ఆయనకు మాత్రమే తెలుసు. అవి దుర్భల, అల్ప మానవ మస్తిష్కాలకు అందనివి. ప్రపంచ క్షేమం

కోసం, మనందరి క్షేమం కోసం నిస్వార్థంగా, షరతులేమీ లేకుండా తమ మీదకు ఏమీ తీసుకోదలిచారో మనపరిమిత జ్ఞానానికీ, సంకుచిత దృక్పథానికీ అందే విషయం కాదు. వారి దేహ త్యాగఘటన లోకమంతా ఉన్న వారి భక్తుల మానసాల్ని ఛిన్నాభిన్నం చేసి గందరగోళపు వెల్లువలో ముంచెత్తి తీవ్ర దుఃఖకారకమయింది. ఇది నిజమెలా అవుతుంది? ఆయన ఈవిధంగా ఎలా మనల్ని వీడిపోగలరు? ఇది నిజంగా కలత చెందించే భయానక అనుభవం. ఈ ఘటనతో మన జీవన మాధుర్యమూ, స్పందనా మనల్ని వీడిపోయాయి. మనసుని ప్రశ్నలు ఆవరించాయి. పగిలిన హృదయం బాధలో మునిగి పోయింది. ఉప్పెనలాంటి దుఃఖంతో ఆత్మ లోతైన శూన్యం లో ఎగురలేక పడిఉంది.

ఆకారం దాల్చిన ప్రతీదీ చివరికి నిరాకారంలో లయం చెందవలసిందేనని బుద్ధికి తెలుసు. ఈ భౌతిక స్తరంలోనికి ప్రవేశించిన తర్వాత ఆత్మ కూడా దాన్ని ఎప్పుడో ఒకప్పుడు విడువవలసిందే; అయితే ఇక్కడేదో అనుచితమైనది జరిగినట్లు అనిపిస్తుంది. ఇంకా ఏదో జరుగుతుందనే భావము బలపడుతూ వచ్చింది. సత్యసాయి అవతార కార్యంలో ఇంకా తప్పకుండా జరగబోయేదేదో ఉంది. **వారి ప్రవేశం అద్భుతంగా, వైభవంగా, ప్రభావవంతంగా జరిగింది. ఆ సమయం వచ్చినపుడు నిష్క్రమణ కూడా అంతే వైభవంగా జరగాలి. ఇది స్వల్ప విరామము. దేవుని విశ్రాంతి సమయం.** జరుగుతున్న లీలానాటక రంగం నుంచి క్షణకాలం పాటు తెర వెనుకకు వెళ్ళడం లాంటి ఈ దేవుని విశ్రాంతి సమయం మన ప్రయత్నాలూ, సాధనలు తీవ్రతరం చేయటం కోసమే. రాబోయే గొప్ప వైభవానికి ముందు వచ్చిన ఈ స్వల్ప విరామసమయం మన వ్యక్తిగత, సామూహిక సాధనలని తీవ్రతరం చేసి మనం ఆధ్యాత్మిక ప్రగతి పథంలో ముందుకు వెళ్ళటానికి సంసిద్ధం అవ్వటం కోసమే. సృష్టంతా నిండివున్న ఆయనని సేవించుకొనేందుకు మన సంసిద్ధతని దృఢపరచుకోవటానికీ, లోతుగా ఆలోచించుకోవటానికీ, ప్రతినపూనటానికీ, పునరంకితమవ్వటానికి ఉద్దేశించినదే ఈ స్వల్ప కాలావధి. అలాగే సామూహిక ఆలోచనావిధానం యొక్క బలముతో **మన ప్రియతమ భగవాన్ పునరాగమనాన్ని ఆకాంక్షించే వారి "ఆవశ్యక రాశి"ని సమీకరించటానికి కూడా ఉద్దేశించబడినది. దైవ సంకల్పం లేకుండా ఏదీ జరగదు కనుక 'సాయీ నీ రాజ్యం వచ్చుగాక' అన్న వ్రాత ప్రతి దివ్య పథకంలో భాగంగా రచయిత మానస, హృదయ,**



**ఆత్మల నుండి పెల్లుబికిన భావావేశ వ్యక్తీకరణ. ఇంత విస్తృత స్థాయిలో ప్రియతమ భగవానుని దివ్య ప్రకటనలపై పరిశోధన చేయటం అనేది ఆయన అనుగ్రహంతో మాత్రమే జరిగిన ఒక అద్భుతము !. "సాయీ నీ రాజ్యం వచ్చ్యుగాక"** ద్వారా ఆవశ్యకరాశిని సమకూర్చటానికి ముందస్తుగా తగిన సమయంకూడా ఆ దివ్య ప్రణాళికారచయిత అయిన భగవానే నిర్ణయించారు. అంతకు ముందు ఎవరికీ వినబడకుండా గుసగుసలాడుతూ చెప్పుకునే రహస్యాలూ; వారుపొందిన దర్శనాలూ, స్వప్న సాక్షాత్కారాలూ, కోరికలూ, వేదనలూ, దృఢ విశ్వాసమూ, పూర్తినమ్మకాల గురించి ఇప్పుడు అందరూ కలసి బహిరంగంగా చర్చించుకుంటున్నారు. **ఇది సంభవించడానికి కారణమైనందుకు స్వామివారి అనుగ్రహ పూర్వక కీర్తి 'సాయీ నీ రాజ్యం వచ్చుగాక' కే దక్కుతుంది.** శ్రీ శ్రీజిత్ గొప్ప సమర్పణాభావంతో అతి జాగ్రత్తగా ఈ పరిశోధన గావించారు. ప్రతిమాట, వాక్యమూ, పేజీ సరళ ధారాప్రవాహంగా దృష్టి మరల్చనీయకుండా చేసి చదివిస్తున్నాయి. **మొత్తం అంతా స్వామి మాటలూ, సందేశాలూ అన్నీ సత్యంతో నిండిన సత్య సాయి వచనాలే.**

ఈ లీలానాటకం ఎలా ఆవిష్కృతం అవుతుందో ఆయనకి మాత్రమే తెలుసు. అయినప్పటికీ మన ధ్యేయం మన నమ్మిక, మన నిశ్చయము, మన సమర్పణాభావం, మన ఆధీనంలోనే ఉన్నాయి. మనలో ఒక్కొక్కరికీ ఎవరి ప్రపంచం వారికుంది, ఆ ప్రపంచంలోనికి ఏమేమి చేర్చుకోవాలో అది మన చేతుల్లోనే ఉంది. మన స్వామికి అసాధ్యమన్న మాటే లేదు. ఆయన సంకల్పానికి అడ్డు తగిలేదేదీ లేదు, తుదకు అంతా జరిగేది ఆయన ప్రణాళిక ప్రకారమే కదా! ఆయనకోసం వేచి చూస్తూ చూస్తూ వాదోపవాదాలకు దిగకుండా ఉందుము గాక; నిశ్శబ్దంగా చింతన చేసుకుంటూ ఆయన గురించీ, ఆయన బోధనల గురించీ లోతుగా ఆలోచించి చర్చించుకుంటూ స్వాధ్యాయ సత్సంగాల్లో గడుపుదాం. మనమంతా కలసి సామూహికంగా స్పష్టమైన భావాలతో పరిశుద్ధ ప్రేమతో దయ నిండిన హృదయాలతో విశ్వ శ్రేయస్సుని ఆవిష్కరించే ఆ సత్యమైన స్వర్ణ యుగ క్షణాల కోసం ప్రార్థిద్దాం. వివిధ గ్రంథాల్లో వున్న భగవానుని సత్య ప్రకటనలను చక్కగా అర్థం చేసుకుని అన్నింటినీ ప్రోగుచేసి ఒకేచోట పరిశీలించుకొనుటకు వీలుగా రూపొందించబడినదీ గ్రంథం.

ఈ పుస్తకం చదువుతూ వుంటే బహిరంగ ప్రకటనల్లో స్వామి పలుమార్లు

**– తమ మాటలు ఎప్పటికీ వమ్ము కావనటం;**

**– వారు సంకల్పించిన ప్రణాళిక జరిగి తీరుతుందనటం;**

**– తమ కార్యక్రమాలూ, పద్ధతులూ నిర్ధేశించిన మార్గం నుండి కించిత్తు కూడా తొలగవనటం;**

**– తను ఎట్టి పరిస్థితుల్లోనూ మాట తప్పననటం;**

**– పరిస్థితుల బలవంతం వలన చిన్న చిన్న సర్దుబాట్లు ఉండటమే తప్ప, అవి శాశ్వతమైనవి కావనీ, తాను నిర్ధేశించుకున్న మార్గాన్ని అవి మార్చ లేవని చెప్పటం;**

**– సత్యసాయి శకంలో క్రొత్త రాకడతో స్వర్ణయుగం తిరిగి వస్తుందనటం;**

**– భగవంతుని యదార్ధవైభవాన్నీ, శక్తినీ బహిరంగ పరచే మేలుకొల్పు దినం వస్తుందనటం గ్రహించవచ్చు.**

తమ రాజ్యం త్వరగా స్థాపించమని మన ప్రియతమ సాయిని మనమంతా వేడుకొని నివేదించుకుందాం. మనల్ని యోగ్యత, అర్హతలు గల వారిగా చేయమని ప్రార్థిద్దాం.

**ఆయన అనంతుడయినా**
**తన మాటకు కట్టుబడి ఉన్నాడు**
**తన భక్తుల చేతిలో బంధింపబడి వున్నాడు**
**శీఘ్ర పునరాగమనానికి కంకణం కట్టుకున్నాడు,**
**దానితో సమాధి అంకానికి తెర దించనున్నాడు.**
**సమస్త లోకాః సుఖినోభవంతు.**

(శ్రీమతి జుల్లీచౌదరి గారు వృతి రీత్యా ఒక కవయిత్రి, ప్రేమమూర్తి సత్యసాయి బాబా గుఱించి అనేక కథలు పద్యములు ప్రచురించిన గొప్ప వ్యక్తి. ఆమె చిన్న వయసులోనే స్వామి దగ్గఱకు చేరిన అదృష్టవంతురాలు. ఆమె పది సంవత్సరాల నుంచి సత్యసాయి న్యూస్ లెటరు, పూణే యువ విభాగం ఎడిటర్‌గా, రచయిత్రిగా సేవలందిస్తున్నారు. ఆ పత్రికకు సంపాద కులుగా ఉన్నారు . 2010 నవంబరు సం॥లో “మదర్‌సాయి” అన్న పద్య గ్రంధాన్ని స్వామి పాద పద్మముల చెంత సమర్పించుకొన్న ధన్యశాలి.)



# తొలిపలుకు

## కెప్టెన్ జతీందర్ షాద్

భక్తుడు తన ఇష్టదైవం యొక్క సాన్నిధ్య వైభవాన్ని ఏడేడు లోకాల్లో దేనితోనూ పోల్చుకోలేడు. ప్రేమ, భక్తితో నీవు సేవించిన దైవము కను మరుగైనపుడు మీరు పడే హృదయ బాధ వర్ణింపలేనిది. తాను తిరిగి వస్తా డన్న వార్త చదువుతున్నప్పుడు మీ పఠనం నిరంతరాయంగా సాగిపోతుంది. ఎట్టి విరామము లేకుండా మొదలునుంచి చిట్టచివరి వరకు కొనసాగి తీరుతుంది.

**“సాయీ నీ రాజ్యము వచ్చుగాక! అన్నది ఒక సాటిలేని పరిశోధనా పత్రము. ఇది మతాల పరిధులు దాటి రాకడ గురించి చేసిన అధ్యయనము. ప్రత్యేకించి సాయిబాబా అని చెప్పనప్పటికి, మహది లేక మెస్సయ్య అన్న సూచనలు ఇతర గ్రంధాలలో తెలుపబడినవి. ఏ భక్తుడైనా తన ఇంట్లో కేవలము రెండు అంగుళముల సత్యసాయి చిన్నపటమును ఉంచుకున్నవారు ఈ పుస్తకము చదవడానికి నేను[1] పొందిన ఆనందమును, చదివేటప్పుడు పొందుటకూ అర్హత సాధించినట్లే.**

ఇట్లాంటి అద్భుత రచన చేసిన గ్రంధకర్తకు నా అభినందనలు. **స్వామి తిరిగి వస్తారనుటకు, నా మస్తిష్కములో ఎట్టి సందేహమూ లేదు.** కేవలం ఓర్పుతో, ఎదురుచూస్తూ ప్రార్ధనలు సలుపుతూ యుండడం అంతే.

మన ఆశలు చిగురించుటకు యిది తప్పక దోహదము చేస్తుంది. మానవజాతికి ఇంకా ఆయన మార్గదర్శకత అవసరం. ఆయన రాకకు వేచి చూద్దాము. **ఆయన గురించి మనం వేచి చూస్తూ ఉన్న సమయంలో మనం ఇంకా ఏమి చేయాల్సిఉంది? ఇప్పటికంటే మెరుగైన సాధకునిగా మనం ఎదగాలి.** ఆయన మనల్ని ఆవరించి ఉన్నారని నిరంతరం ఏకాత్మ భావపు ఎరుకలో ఉండండి. సాయిరామ్ అనండి. అందరూ ఆనందంగా యుండండి.

(కెప్టెన్ షాద్‌గారు భారతీయ పదాతిదళములో పనిచేయు నప్పుడు శ్రీ సత్యసాయి బాబావారిగురించి తెలుసుకున్నారు. 1981లో భారతసైన్యము నుండి విశ్రాంతి తీసుకున్నారు. అప్పటినుంచి అనేక సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్నారు. 1985లో స్వామి, వారికి ఇంటర్వ్యూ ప్రసాదించడం మరియు అతని టీమ్‌కి ప్రశాంతి మందిర పెయింటింగ్‌వర్క్ స్వామి దయతో అప్పచెప్పటం జరిగింది. బాబా 1990లో మొట్ట మొదటి సారిగా బాబాయొక్క ప్రతిబింబము ప్రశాంతి నిలయ చిహ్నముగా తయారు చేయుటలో షాద్‌గార్కి మార్గదర్శిగా యుండి మెళకువలు తెలియచెప్పినారు. అదే మొట్టమొదటి బాబావారి ప్రతిబింబ చిహ్నముగా నిలిచినది.)

1. జతీందర్ షాద్

# గ్రంధకర్త గురించి

శ్రీ శ్రీజిత్ నారాయణ్ గారు స్వామి మార్గములో 1992 సం॥లో చేరినారు. అప్పటినుంచి స్వామి, వారికి మార్గదర్శకం వహిస్తూ, కలలలో కన్పిస్తూ అనేక జీవితపాఠాలు నేర్పుతూ వచ్చారు. వృత్తిరీత్యా ఆయన ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. వారి స్వస్థలము ఇండియాలోని కేరళ రాష్ట్రము. ప్రస్తుతము అమెరికాలో న్యూజెర్సీలోని బ్రిడ్జ్‌వాటర్ సాయిసెంటర్ సేవా కో-ఆర్డినేటర్‌గా యున్నారు. వారి ప్రాంతంలోని సాయీ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ సాయి కుటుంబసభ్యులలో ఒకరిగా యున్నారు. అమెరికా వెళ్ళక ముందు 1997 సం॥వరకు ఇండియాలోని కేరళ రాష్ట్రంలో సాయి యువ విభాగంలో సేవాదళ్‌గా పనిచేశారు.



తనకు శక్తిచాలదని తెలిసికూడా స్వామి గురించి ఒక పుస్తకం రాయాలని తపిస్తూ యుండేవారు. అమెరికాకి వెళ్ళక ముందు 1997లో తన కోరిక ను స్వామికి ఉత్తరంలో వ్రాసి తెలియచేసారు. స్వామి దయతో ఆ ఉత్తరము స్వీకరించి ఆశీర్వదించారు. స్వామి ప్రేమతో తన చేతుల మీద మెల్లగా కొట్టి ఉత్తరము తీసుకొని పాద నమస్కారం అందించారు. ఆ పుస్తకానికి కావలసిన అనేక విషయాలు- అనేకానేక మార్గముల నుంచి సేకరించారు. తన కోరిక అనేకానేక కారణాల వలన 2012 జనవరి వరకు ఫలించలేదు. అకస్మాత్తుగా జనవరి చివరిలో స్వామి మరలా తిరిగి వస్తారన్న దాని గురించి వ్రాయాలని గాఢమైన కోరిక కలిగింది. ఈ గ్రంథము వ్రాయ సంకల్పించుట తోడనే అన్ని విషయాలు ఒకటొకటిగా సమకూడి, స్వామి దివ్య అనుగ్రహంతో గ్రంథము వెలువడినది.వేరే పుస్తకం వ్రాయుటకు చేసిన పరిశోధన యీ గ్రంథము వెలువరించుటకు సహకరించినది. స్వామి ఎప్పుడైతే తన ఉత్తరము తీసుకొని ఆశీర్వదించారో అప్పుడే గ్రంధ రచన బాధ్యత కూడా తీసుకుంటారు. అదే స్వామికి భక్తులపై యున్న అవ్యాజప్రేమ అని మన అందరికి తెలిసిన విషయమే.



పురాతన భారతీయ సంప్రదాయం ప్రకారం పూర్వ కాలములో గురు- శిష్య సంబంధము గురుకుల పాఠశాలల్లో ఏ విధంగా జరిగేవో, శిష్యులు పూర్తిగా గురువు యొక్క వాక్కులు ఆఖరి మాట వరకు శిరసావహించి నడుచుకునేవారో అట్టి గురుశిష్య సంబంధాన్ని జ్ఞప్తికి తెస్తూ స్వామివాక్కు తప్పక జరిగి తీరుతుంది, కార్యరూపం దాలుస్తుందన్న సంపూర్ణ విశ్వాసం కనబరుస్తూ, యీ గ్రంథంలోని అన్ని విషయాలు సత్య దూరం కాకుండా, సోదాహరణ పూర్వకంగా ఋజువులతో నిరూపించడం మన అందరికీ గర్వకారణంగా తెలియజేశారు.

ఈ గ్రంథంలో రచయిత పురాతన భారతీయ సాంప్రదాయంలో ఏ విధంగా శిష్యుడు ఎల్లప్పుడూ గురువాక్యంపై పరిపూర్ణ విశ్వాసంతో వుంటాడో అలాగే స్వామి మాటలన్నింటిపైనా తన దృఢ నమ్మకాన్ని సగర్వంగా పోల్చుకుంటారు. స్వామి మాటలపై అంతటి నమ్మిక విశ్వాసంతో కించిత్ అయినా సందేహించక అవన్నీ జరిగి తీరుతాయని రచయిత నమ్ముతారు.

# కృతజ్ఞత

**(...) "నాకు కృతజ్ఞతలు తెలుపవద్దు. థాంక్స్ చెప్పొద్దు. నేను మూడవ వ్యక్తిని గాను. ప్రతి రోజు మనకు అన్నం పెడుతున్న అమ్మకు మనం థాంక్స్ చెపుతామా? మీరు బైట ఉన్న వ్యక్తికి కృతజ్ఞతలు తెలియచేయవచ్చు, వారు నీకేమైనా సహాయ మొనరించినప్పుడు. కాని నేను బయటనున్న వ్యక్తినిగాను. నేను మీలోనే ఉన్నాను. కనుక మీరు నాకు కృతజ్ఞతలు తెలుపవద్దు. స్వామి మీవాడు అనుకోండి. అప్పుడే మీరు స్వామి సన్నిధికి దగ్గరగా రావటానికి వీలుగలుగుతుంది."**

సత్యసాయి ప్రవచనములు.వాల్యూమ్31.చా.45.-భగవాన్ సత్యసాయిబాబా.

నాకు అత్యంత ప్రేమ పాత్రమైన నా స్వామీ! నేను నీకు కృతజ్ఞతలు తెలుపుకొనుటలేదు. నేను నీ వాణ్ణేగదా! అదే విధంగా ఈ గ్రంధము కూడా మీదే. మీరు వ్రాయించినదే. ఈ గ్రంధ రచనకు చాలామంది సహాయ సహకారములు అందించారు. వారందరూ నా వాళ్ళే గనుక, వారికి కూడా నేను కృతజ్ఞతలు తెలియజేయుట లేదు. మీరే అన్నీ చేస్తున్నారని తెలిసి కూడా అహంకారంతో తప్పులు చేస్తున్న క్షణాలు ఎన్నో ఉన్నాయి. మీరు నన్ను క్షమిస్తారని ప్రార్థిస్తూ, అటులనే పాఠకులు నా లోపాలేమైనాయుంటే మంచి మనస్సుతో మన్నిస్తారని అర్థిస్తున్నా.

సంత్ జ్ఞానేశ్వర్[1] తన చేతితో స్పృశించినంతనే దున్నపోతు వేదాలను వల్లించిందట. జ్ఞానేశ్వర్ అంటేనే జ్ఞానదేవుడు, చదువుల తండ్రి... అంటే చదువులతల్లి సరస్వతి, సాయి(మాతే). సాయిశ్వరుఁడే అన్నమాట. అటులని నేను వేదాలు వల్లించటానికి ఉపక్రమించుట లేదు. స్వామి అనుగ్రహం లేకుండా ఆయన గురించి ఒక్కమాట కూడా వ్రాయడానికి సాహసించలేను. సంత్ జ్ఞానేశ్వర్ దున్నపోతుని తన కరకమలములతో స్పృశించినట్లుగా, ప్రేమమూర్తి, అనంతమైన జ్ఞానమును ప్రసాదించు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు దున్నపోతైన[2] నన్ను స్పృశించి, నన్ను అనుగ్రహిస్తారని, హృదయ పూర్వకముగా ప్రార్థిస్తున్నాను.

---

**1.**సంత్ జ్ఞానేశ్వర్(1275-1296) కాలమునకు చెందినవారు. మహారాష్ట్రములో జన్మించిన సాధువు, కవి, మరియు వేదాంతి. ఆయన భగవద్గీతకు భాష్యము వ్రాశారు. ఆయన విరచించిన జ్ఞానేశ్వరి (భగవద్గీత), అమృతానుభవ అన్న గ్రంధాలు మరాఠీ వాఙ్మయంలో ప్రసిద్ధి చెందిన గ్రంధరత్నాలు.

**2** .స్వామి అప్పుడప్పుడు తన ప్రియమైన భక్తులను "దున్నపోతా" అని సంబోధిస్తూ నవ్విస్తూ, ఉండేవారు.



# ఉపోద్ఘాతము.

ఓం శ్రీ సాయిరామ్

ప్రియమైన పాఠకులారా !........

**ఈ పుస్తకము శ్రీ సత్య సాయిబాబా వారి భక్తుల కొఱకు ఉద్దేశింపబడినది. సాయి భక్తులకు సత్యసాయిబాబా వారి అవతారం గురించి చాలా వివరములు తెలిసియే ఉండును. ఈ గ్రంధములో పొందుపరిచిన వివరములు నా సొంత అభిప్రాయములు మాత్రమే.ఇవి ఏ సంస్థల గుఱించి గాని, సంఘముల గుఱించి గాని మతముల గుఱించి గాని విమర్శించుటకు మాత్రము గాదు. ఎవ్వరి అభిప్రా యములను భావనలను తర్కించుటకు మాత్రము కాదని గ్రహింతురు గాక !**

**-శ్రీజిత్ నారాయణ్.**

ప్ర॥ స్వామి తిరిగి వస్తారా...?

**జ :** అవును, ఈ విషయంలో ఎట్టి సందేహము నాకు లేదు. స్వామి, **ప్రేమసాయి**గా భూమి మీదకి తిరిగి వస్తారని మనందరి సాయిభక్తుల నమ్మకం. కానీ అదే **శ్రీ సత్యసాయి బాబావారి సహజ సిద్ధమైన దివ్య మంగళ శరీరంతోనే తిరిగి వస్తారని నా నమ్మకం. ఇది సత్యం.**

ప్ర॥ నేను ఆ విధంగా ఊహించదానికి కారణమేమిటి?

జ : స్వామే స్వయంగా అనేక పర్యాయములు చెప్పలేదా? ఈ శరీరం తోనే 96 సంవత్సరాలు ఉంటానని ఈ విషయం స్వామి చాంద్రమాన పంచాంగం ప్రకారం చెప్తున్నారని, నేననుకోను. నేను నమ్మను. ఈ విషయం మున్ముందు వివిధ అధ్యాయాల్లో మనం వివరంగా తెలుసుకుందాం. స్వామి మహాభి నిష్క్రమణం చెందారని మన వీలు ప్రకారం మన మనుకుంటున్నాం. ఈ గ్రంధాన్ని యింకా చదువుతూ ముందుకు పోతే, స్వామి దివ్యపలుకులే మనల్ని అర్థం చేసుకునేలా చేస్తాయి. మనకు స్వామి మాటల మీద సంపూర్ణ విశ్వాసం ఉందిగదా ! స్వామి పలుకులే, తన రాబోయే అవతారం ప్రేమసాయి గురించి చెప్పిన విషయాలపై మన సాయి భక్తులకు సంపూర్ణ విశ్వాసం ఉంది గదా! కాని 96 సం॥లు ఈ శరీరంతోనే ఉంటారన్న స్వామి అప్పుడప్పుడు చెప్పిన ఖచ్చితమైన మాటల్ని మనం విస్మరిస్తున్నాము.

**::: ఇంకా వివరాలకు 3వ అధ్యాయం చూడండి.**

## ఈ గ్రంథం గురించి........

ది 24 ఏప్రియల్ 2011. 2.గం॥లకు[1] గాఢనిద్రలో ఉన్న నాకు ఒక టెలిఫోన్ కాల్‌తో మేలుకొలుపు జరిగింది. ఒక సాయి సోదరుడు విషాద భరితమైన వార్త చెప్పాడు. ఆ వార్తతో నా హృదయం బ్రద్దలైనట్లనిపించింది. నా గతి తప్పినట్లనిపించింది. ఎవరో నావెనుక తట్టినట్లు అనిపించింది. నేను వెనక్కి తిరిగాను. నాభార్య తట్టిందేమోనని. కానీ నా శ్రీమతి చాలా దూరంలో కూర్చుని ఉంది. అంత భయంకరమైన క్షణాల్లో కూడా భగవాన్ అదృశ్యహస్తము మన వెంట ఎల్లప్పుడూ ఉంటుంది. అది, చల్లని స్పర్శగా గాని, కలగాగాని, ఒక దృశ్యరూపంలోగాని, శాంతవచనాలతోగాని, కష్ట పరిస్థితులలో ఉన్నప్పుడు మనకు ఆ రూపము గోచరిస్తుంది. అట్టి క్లిష్ట పరిస్థితులలో కూడా అంతులేని సాయి ప్రేమానుగ్రహాలతో ఆ షాక్ నుంచి బయట పడవేసినట్లనిపించింది.

స్వామి మహాభినిష్క్రమణానంతరం కొన్ని రోజులు నా మనస్సు అనేకానేక ఆలోచనలు, ప్రకంపనలతో నిండిపోయింది. స్వామి అంత ఆకస్మాత్తుగా మనల్ని వదలి వెళ్ళిపోతారన్నది నమ్మశక్యంగా లేదు. అది గూడ నిర్ధారించుకున్న సమయాని కంటే ముందుగా. ఏదో అద్భుత లీల జరగబోతోందని ప్రతి భక్తుడు చెప్తున్నాడు. ఏదో ఆలోచన, స్వామి మళ్ళీ తిరిగి వస్తారన్న ఏవేవో తలంపులు. ఆ ఆశ కూడ లేకుండా స్వామి పార్థివ దేహం మహాసమాధిలో ఉంచబడింది. ఇంతలో కొన్ని దూరదర్శన కేంద్రాలు స్వామి 40 రోజులు అదృశ్యంగా ఉంటారని, మరలా తిరిగి వస్తారని తమ విద్యార్థులకు చెప్పినట్లు ప్రసారాలు. ఈ విధంగా "తపోవనం" గ్రంథంలో చెప్పినట్లు సమాచారాలు ప్రసారం చేసాయి. అప్పుడు ఆ పుస్తకం తెప్పించుకుని సంపూర్ణంగా చదివాను. ఆ విధమైన వార్త ఇసుమంతయు ఆ తపోవన గ్రంథంలో లేదు. వెంటనే కొందరు సాయి భక్తులు చాంద్ర మానం ప్రకారం స్వామి చెప్పినట్లే జరిగింది. స్వామికి 96 సంవత్సర ములు (నిండినట్లు) చాంద్రమానం ప్రకారం నిండినవి అని. ఇవన్నీ మనల్ని మనము శాంత పరచుకొనుటకు కొంత ఊరట చెందుటకు చెప్పుకొను సంభాషణములు మాత్రమే. ఏవిధంగా చూసినా, స్వామిమాట తప్పునది కాదు. స్వామి తప్పు పలకరు. నేను జాగ్రత్తగా పరిశీలించాను. స్వామి చాంద్రమానం ప్రకారం ఎప్పుడూ మాట్లాడ లేదు. స్వామి మాటలు కొన్ని

[1] అమెరికా దేశపు తూర్పు తీర కాలమాన ప్రకారం తెల్లవారు ఝాము 2గం.



గుర్తుకు తెచ్చుకుంటే, చాంద్రమానం ప్రకారం చెప్పటం లేదని మన కని పిస్తుంది. ఈ రహస్యం అంతు చిక్కకుండా అలాగే ఉండి పోయింది.

స్వామి ఏం చేసినా అది మన ఊహలకు అందదు. ఇంక ప్రశ్నలెం దుకు? ఏం జరిగినా మెదలక ఉండటమే మన పని అని నిశ్చయించు కున్నాను. సశరీరంగాగాని, అశరీరంగాగాని, స్వామి ఎల్లప్పుడూ మనతోనే యున్నారు. స్వామి అంతర్ధానం ఒక విధంగా నాకుపకరించినది. నా తప్పటడుగుల సగుణారాధన నుంచి నిర్గుణారాధనకు త్రోవచూపునట్లు తోచుచున్నది. ఈ నాటకం అసలు అందుకే అనిపిస్తోంది. మరి స్వామి జగన్నాటక సూత్రధారి గదా! స్వామి భక్తులు శరీర బంధాన్నుంచి తప్పుకుని పైకి ఎదగాలి. మానవులతో ప్రతి స్పందించడానికి వీలుగా మాత్రమే ఈ మాయా శరీరం ప్రశాంతినిలయ ప్రాంగణంలో తచ్చర్లాడింది. కేవలం మనతోనే ఉంటూ మనలానే నడుస్తూ..మన ఉన్నతి ప్రోత్సహిస్తూ ముందుకు నడిపించటానికి మాత్రమే ఈ మాయా శరీరం వచ్చింది. "నేను దేహమును గాదు దేహిని" అన్న స్వామి మాటలు ఈ సందర్భంలో మనకు గుర్తుకు తెస్తున్నాయి. నిజం, స్వామి అంతర్ధానం కూడా మునుపటి అవతారముల వలె మన ఊహకందనిది.

**మానవులతో ఉంటూ మానవులను రక్షించడానికి ఈ మహాశక్తి మయాశక్తి ఆచ్ఛాదనతో భూమి మీదకు అవతరించింది.**

– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్1 చాప్టరు 30

**ఒక రక్షక భటుడు దొంగలను పట్టుకొనటానికి దొంగ యొక్క చేలములు (బట్టలు) ధరించి, దొంగల గుంపులోచేరి, దొంగలనెట్లు పట్టు కొనునో అటులనే నేను మాయాశక్తిని ధరించి మీ మధ్యకు రావలసి వచ్చింది. భగవంతునికి కూడా మహాశక్తి బలహీన పడకుండా క్రిందికి దిగడము సాధ్యము కాదు. ఆయన కూడ హరింపబడిన శోభతోను, పరిమిత మైన ప్రకాశముతోను క్రిందికి దిగిరావాలి.**

– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్1 చాప్టరు 3

ముఖ్యముగా ఈ గ్రంథము స్వామిని, వారి నిగూఢ లీలలను అర్థము చేసుకునుటకు ప్రయత్నించుటకు కాదు,వారి యొక్క సహజ స్థితిని తెలుసుకొనుటకు ఎందరో గొప్ప, గొప్ప మహర్షులు ప్రయత్నించి, ప్రయ త్నించి విఫలమైనారు. నేనెంతటివాడను. కానీ స్వామి మాటలు వృధాకావు. జరిగి తీరుతాయి. ఇది ముమ్మాటికి సత్యము. వారి సంకల్పంలో ఎట్టి

మార్పు కూడా ఉండదు. ప్రపంచానికి ఏమి కావలయునో స్వామికి మాత్రమే తెలుసు. "ప్రపంచాన్ని రక్షించడం ఎలా?" అన్నదే స్వామి అసలు సమస్య. నేనెందుకు వ్యధ చెందాలి? స్వామి అందించిన అమూల్యమైన పాఠాలను నేర్చుకుని నన్ను నేను రక్షించుకోగలిగితే, స్వామికి సేవ చేసినవాడిని అవుతాను. స్వామి తమ యెక్క దివ్య ప్రవచన భాండాగారాన్ని అత్యంత సులభ శైలిలో సాధారణ మానవులు కూడా అర్థం చేసుకొనగల రీతిలో మన ముందు ఉంచి వెళ్ళారు. అవి చాలు, మనం గమ్యం చేరడానికి. మోక్షాన్ని అందుకోడానికి. ఒకవేళ స్వామి తిరిగి వచ్చినా, ఇంకేముంది బోధించడానికి? అన్నీ స్వయంగా ఆచరిస్తూ, ఆచరింపజేస్తూ, అడుగడుగునా రక్షిస్తూ బోధిస్తూ ఉన్నారు. ఇంక మనదే పూర్తి భాధ్యత. స్వామి చెప్పినట్లు నడుచుకొనుటకు ఏది ఏమైనప్పటికి, స్వామి యొక్క అసంఖ్యాక ఉపన్యాసాలలో చెప్పినట్లు గాక, వేరొక విధంగా యింత అకస్మాత్తుగా అంతర్ధానం చెందటం నేను ఇప్పటికీ నమ్మలేక పోవుచున్నాను. ఒక వేళ మహాభినిష్క్రమణానికి ఇది సమయం కాదన్నది సత్యమయితే స్వామి పునరుద్ధానము (తిరిగిరావడం) కూడా అంతే సత్యము. చాలామంది సాయి భక్తులు, ప్రపంచవ్యాప్త స్వామి విశ్వ విద్యాలయం విద్యార్థులు సయితం ఈ నా భావములతో ఏకీభవిస్తూ .. నమ్ముతూ ఉన్నారని నేను తెలుసుకున్నాను.

నేను జనవరి నెల 2012 నెలాఖరు వరకు స్వామి పునఃదర్శనం ఇస్తారన్న ఉద్దేశ్యంతో ఎదురుచూస్తూ... ఈ గ్రంథము వ్రాయుటకు ఉపక్రమించలేదు. ఈ విషయం నాతోటి సాయి భక్తుడైన మిత్రునితో సంప్రదించాను. నన్ను గ్రంథము వ్రాయుటకు ప్రోత్సహించి, స్వామి మరలా తిరిగి వస్తున్నట్లుగా తనకు వచ్చిన ఒక అద్భుతమైన కలలో దర్శించినట్లుగా చెప్పాడు. ఇట్లాంటి కలనే తమకూ వచ్చినట్లుగా చాలామంది సాయి భక్తులు కూడా నాకు చెప్పారు. ఇంకా చాలా ఆశ్చర్యకమైన సాక్ష్యాలు కూడా నాకు లభించాయి. స్వామి యొక్క అదృశ్య హస్తము నా వెంట ఉన్నట్లు నాకు అనిపిస్తూఉంది. ఈ గ్రంథ రచనకు అనేక విషయ సామాగ్రి నాకు అందుతూనే ఉన్నాయి. ఇదే ఒక అద్భుతమైన స్వామి దివ్యలీల. ఏదో ఒక చిన్న వ్యాసం రాద్దామనుకున్న నాకు చాలా విపులంగా ఈ గ్రంథ రూపంలో తయారు కాజొచ్చింది. పెద్ద గ్రంథమయ్యింది.

ఈ నా ప్రయత్నం, భవిష్యత్తు ఇలా ఉంటుంది, అలా ఉంటుంది



అని చెప్పడం కోసం కాదు. అన్నిచోట్ల నుంచి అప్రయత్నంగా నాకందిన చిన్న చిన్న విషయాలన్నీ ప్రోగుచేసుకుని ఒక నిర్దుష్టమైన గ్రంథ రూపంలో అత్యంత ఆతృతతో ఎదురు చూస్తున్న సాధకునికి అందచేయుటకు సల్పిన కృషి మాత్రమేనని పాఠకులు గ్రహింతురు గాక! స్వామి యొక్క తత్వాన్ని మనమెవ్వరమూ అర్థం చేసుకోలేము. మనం చేయగలిగిందల్లా అందులో మునిగిపోవడమే. స్వామి చెప్పింది చెప్పినట్లు జరుగుతుందన్నది మాత్రం సత్యం. సత్యం ముమ్మాటికి సత్యం. ఈ విషయంలో ఎట్టి సందేహాలకు తావు లేదు. స్వామి తిరిగి వచ్చి దర్శనం ఇవ్వడానికి ఏఏ మార్గాలు ఉన్నాయో, ఎలా రావాలో పునర్దర్శనం ఎలా ఇవ్వాలో అన్న విషయం స్వామికి మాత్రమే తెలుసు. అచిరకాలంలోనే స్వామి చెప్పినవి చెప్పినట్లు జరిగాయని మనమూ తెలుసుకుంటాం. ఆనందోత్సహాలలో ఓలలాడతాం. నాకున్న చిన్న మానవ మేధస్సుతో నేను నమ్మిన కొన్ని విషయాలు మీకు అందించదలచుకున్నాను. స్వామి యొక్క దివ్య వాక్కులే దీనికి ప్రధమ సోపానం. స్వామి గురించి చెప్పిన కొన్ని గ్రంథాలను మరియొక ఆధారంగా నేను తీసుకున్నాను. స్వామి సన్నిహిత భక్తుల నుంచి స్వీకరించిన సమాచారం ఒకటయితే, స్వయంగా అనుభవ పూర్వకంగా నేను నమ్మిన నాడీ గ్రంథాల్లో వివరించిన భవిష్యవాణి మరియొక ఆధారం. మన పురాణాల్లో చెప్పబడిన భవిష్యత్తు ధర్మాలు మరొక ఎత్తు అయితే, అన్నింటికీ మించి నా గురువు దైవము అయిన భగవాన్ శ్రీ సత్య సాయిబాబా ఈ గ్రంథం వ్రాయడానికి నన్ను నడిపించిన తీరు ఒక ఎత్తు.

**" నా ప్రతి మాట, క్రియ మీరు కేవలం అత్యంత ఓర్పు, శ్రద్ధలతో గమనించినంత, నా అవతార లక్ష్యం మీరు కొంతవరకు అర్థం చేసుకోగలుగుతారు".** – *శ్రీ స.సా.స్పీక్స్. వాల్యూమ్ 29 చాప్టరు 29.*

నేను ఖచ్చితంగా, త్రికరణ శుద్ధిగా ప్రయత్నించినది కూడా, స్వామి యొక్క దివ్యపలుకులు, క్రియలపై అత్యంత భక్తి శ్రద్ధలు యుంచి, స్వామి ప్రతిమాటకు అర్థం తెలుసుకుంటూ ఈ ప్రయత్నానికి పూనుకున్నాను. పాఠకులకు నా సవినయ విన్నపమేమంటే, నా గురువు, దైవమైన భగవాన్ శ్రీసత్యసాయి మహాభినిష్క్రమణాన్ని నిరాశ, నిస్పృహలతో సమర్థించుట కొరకు మాత్రము గాదు. ఈ ప్రయత్నంలో ఒక శ్రద్ధాభక్తులు గలిగిన, సాయి సేవకుడుగా శిష్యునిగా, గురువు వాక్కులకు నేను నా నేత్రములతో ప్రత్యక్షంగా చూసిన దాని కంటే మిన్నగా వారి మాటల అంతరార్థాన్ని


భక్తి శ్రద్ధలతో కార్య రూపంలో పెట్టిన, నా చిన్న ప్రయత్నమేనని పాఠకులు గమనిస్తారని నా వినయ పూర్వక అభ్యర్ధన.

“ మూకం కరోతి వాచాలం
పంగుం లంఘయతే గిరిమ్॥”

మూగవాడ్ని మాట్లాడించగలిగి, కుంటి వానిని సహితం కొండలపైకి ఎక్కించ గలిగిన స్వామికృప నా కందిస్తారని, స్వామి దివ్య మంగళ పాదపద్మములకు నాయీ చిన్న సాహస చర్యను భక్తి శ్రద్ధలతో సమర్పించు కొనుచున్నాను.

# ప్రథమ భాగం.

## " నా వాక్కు వృధా పోదు"



## ఒకటవ అధ్యాయము

## స్వామి చాంద్రమాన పంచాంగం ప్రకారం మాట్లాడుతున్నారా?

స్వామి శరీరాన్ని త్యజించిన మరుక్షణం నుంచి సాయి విశ్వ కుటుంబ సభ్యులందరు, స్వామి యింత ముందుగానే అంతర్ధానం చెందటానికి కారణాలేమైయుంటాయన్న వివరాలు తెలుసుకొనుటకు తర్జన భర్జనలు పడుతూ ఎదురు చూపులతో మునిగియున్నారు. ఆయన చెప్పినవి తప్పక జరిగి తీరును. 96సం॥లు దేహంతో స్వామి ఉంటారనుకుంటే, 84 సం॥ల 5 నెలలకే దేహాన్ని త్యజించారు. అనుకున్న దానికంటే చాలా ముందుగా, బహుశా స్వామి చాంద్రమాన పంచాంగం బట్టి మాట్లాడి ఉండవచ్చు. నేను ఈ విషయం మొట్ట మొదట విన్నప్పుడు అలాగే అయి ఉండవచ్చునని అనుకున్నాను. అది సాధ్యమనుకున్నాను. కానీ స్వామి భూమిపై తన అవతారం గురించి చెప్పు మాటలు చూస్తే, చాంద్రమాన పంచాంగం ప్రకారం కాదనిపిస్తుంది. అంటే తను చెప్పిన దానికంటే ముందుగానే నిష్క్రమించినట్లవుతుంది. అంటే వారు చెప్పింది చెప్పినట్లు జరగటానికి అదే శరీరంతో మళ్ళీ తిరిగి రావచ్చు.

నా మనసులో మొదలవుతున్న యిలాంటి సంఘర్షణలతో కూడుకున్న నా పరిశోధనలే, ఈ పుస్తక రూపంగా వెలువడుటకు దారి తీసింది.

## చాంద్రమాన పంచాంగ సిద్ధాంతం

చాలామంది సాయి భక్తులు, స్వామి భూమిపై చాంద్రమాన పంచాంగం ప్రకారం తన అవతారవత్సరములు నిర్ణయించుకొన్నారని నమ్ముతున్నారు.

స్వామి శరీరాన్ని త్యజించినప్పుడు స్వామి వయసు ఆయన స్వయంగా చెప్పినది కొంత చర్చిద్దాం. సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్1, చాప్టరు 31 ప్రకారం స్వామి దివ్య సందేశం 9 సెప్టెంబరు1960లో **"నేను ఈ మానవ దేహంతో ఇంకా 59 సం॥లుఉంటాను. నా అవతార లక్ష్యాన్ని సాధిస్తాను. ఈ విషయంలో మీ కెట్టి సందేహాలు వద్దు. నా లక్ష్యాన్ని సాధించడానికి నాకు కావలసిన సమయం నేను తీసుకుంటాను.** మీరు తొందరపడుతున్నారని నేను తొందర పడను. రైలు ఇంజను తనతో పాటు అతికించిన అన్ని పెట్టెలు తన వెంట సక్రమముగా వచ్చునట్లు చూసుకుంటుంది. అటులనే నేను, ఒక దెబ్బతోనే పదిపనులు జరుగునట్లు చూసుకుంటాను. దీనికి కొంత సమయం వెచ్చించవలసి వచ్చినను నేను ఓపికతో ఉంటాను, తొందరపడను."



దీని అర్ధమేమైయుండును? స్వామి 1960 సెప్టెంబరు 9వ తేదిన ప్రకటించిన విధంగా 93-94 సంవత్సరముల వరకు ఈ శరీరంతో ఉంటానని గదా! స్వామి 23 నవంబరు 1926 న జనియించిరి.

కాని స్వామి తన భౌతిక శరీరమును 24-04-2011 న ఏసు క్రీస్తు పునరుద్ధానము చెందిన రోజున (ఈస్టరుడే) ఉ॥7.40ని॥లకు వీడారు. అంటే కేవలం 84 సం॥లకే తన శరీరమును వదిలిరి. ఇన్ని సంవత్సరముల తారతమ్యానికి ఇపుడు వివరణ చూద్దాం. స్వామి బహుశ చాంద్రమానం ప్రకారం మాట్లాడుతున్నారనుకుందాం.

ఇంటర్‌నెట్‌లో లభించిన ఈ కాలిక్యులేషన్ చూద్దాం. దీని ప్రకారం స్వామి 30,833 రోజులు ఈ శరీరంతో ఉన్నారనుకుందాం. **చాంద్రమానం ప్రకారం సరాసరి నెలకు 27.21 రోజులు మాత్రమే. ఒక చాంద్రమాన సంవత్సరానికి 12 నెలలు అంటే 1133 చాంద్రమాన నెలలు ఈ శరీరంతో యున్నారు. అంటే 94.4 చాంద్రమాన సం॥లు అయినది. అంటే స్వామి దివ్య శరీరాన్ని వదిలినపుటికి 94.4 ల్యూనార్ సంవత్సరాలు.**

ఇప్పుడు హిందూ పంచాంగం ప్రకారం చూద్దాం. 27.21 రోజులు కంటే ఎక్కువ నెలకి రోజులు. (ఈ వివరణ తరువాత చూద్దాం) ఈ నెంబరు ప్రస్తుతం గ్రహించుటకు చూద్దాం. పైన దివ్య సందేశంలో స్వామి 94సం॥ల కాలం ఈ శరీరంతో ఉంటానని చెప్పారు. అంటే 94 చాంద్రమాన సం॥లు = 84 సం॥లు. (మనము అనుసరించే గ్రెగోరియన్ క్యాలెండరు) దేహంలో ఉన్నారు. కాని 1960 లో స్వామి యేమి చెప్పారు. నేను ఇంకా 59 సం॥లు ఈ శరీరంలో యుంటానని గదా! అంటే చాంద్రమాన సం॥ల ప్రకారం ఈ స్టేట్‌మెంట్ స్వామి 9-9-1960 న ఉద్ఘాటించారు అంటే 24-04-2011 నాటికి 18,489 రోజులు. ఇవి 59 సం॥లు అవుతాయో లేదో చూద్దాం.

**ఎ.** చాంద్రమాన సం॥కి రోజులు:= 27.2రో॥ × 12=326.52 రోజులు.

18,489 ÷ 326.52 = 56.63 (దగ్గర దగ్గరగా 57 చాంద్రమాన సం॥లు..)

మరియొక ప్రకటన స్వామి 1961లో చేశారు."పుటపర్తి ఒక మధురానగరు కాగలదు. ఈ అభివృద్ధిని ఎవ్వరూ ఆపలేరు. పొడిగించనూ లేరు. నేను మిమ్మల్ని వదలను. అట్లానే మీరు కూడా నన్ను వదిలి పెట్టలేరు. ఒకవేళ మీకు నా మీద నమ్మకం సడలినను, పశ్చాత్తాపంతో నా వద్దకు

తిరిగి వస్తారు. మమ్ము చేరదీయమని ప్రాధేయపడతారు. **ఈ శరీరంతో ఇంకా 58 సం॥లు ఉంటాను. ఈ విషయం మీకు ముందే తెలియజేసి యున్నాను. మీ జీవితాలు, నాతో ఈ భూమిమీద ముడిపడి యున్నాయి.** ఈ అదృష్టాన్ని పోగొట్టుకొనకుండా ఆ విధంగా నడుచుకోండి."

–స.సా.స్పీక్స్ వ్యాల్యూ 2. ప్రశాంతినిలయం, 1961 అక్టోబరు 21.

పైన ఉదహరించిన విధంగా, స్వామి అదే విషయాన్ని అక్టోబరు 21, 1961 న పునరుద్ఘాటించారు.

**బి.** పై ఉద్ఘోషణ ప్రకారము స్వామి ఈ శరీరముతో 18,082 రోజులు ఉన్నారు. చాంద్రమానం ప్రకారం 55.4 చాంద్రమాన సంత్సరాలు. అంటే ఇంకా 3సం॥లు తక్కువ. అంతే కాకుండా హిందూ క్యాలెండర్ నెలకైతే 27.21 రోజుల కంటే ఎక్కువే. హిందూ క్యాలండర్ ప్రకారం నెలకు 29 రోజుల12 గంటల 44 నిముషాలు. ఈ లెక్కన పైన చూపిన విధంగా గణిస్తే తేడా మరీ ఎక్కువవుతుంది.! ఉదాహరణకు 18,489రోజులు (పైన చూడండి) 52.2 సంవత్సరాలవుతాయి.అంటే దగ్గర దగ్గరగా 7 సంవత్సా రాల తేడా (స్వామి చెప్పిన 59 సంవత్సరాలకి) వస్తుంది.

చాంద్రమాన నెలకు 27.21రోజులన్న గణన నోడల్ నెలల పద్ధతిలో చంద్రుడు తన కక్ష్యలో ఒక చుట్టు చుట్టి అదే స్థానానికి రావటానికి పట్టే సమయం (నోడ్స్ లేదా కూడలి స్థానాలంటే చంద్ర కక్ష్య భూకక్ష్య తలాన్ని దాటే రెండు స్థానాలు) సరాసరి న దీనికి పట్టే కాలావధి 27.21 రోజులు. ఇవి హిందూ కేలండర్‌లోని 27 నక్షత్రాలతో సరిపోతున్నాయి అంతేకాని నెలలోని రోజులతో కాదు. (అదే నక్షత్రం ఒక నెలలో రెండోసారి రావచ్చు.) అలా అయినప్పటికీ, మనం ఈ లెక్క ప్రకారం గణించినా పైన (ఎ) (బి) లలో చూపినట్లు లెక్క సరి పోవటం లేదు, దాదాపు వరుసగా 2 సంత్సరాలు, 3 సంవత్సరాలు తేడా వస్తుంది. అందుచేత స్వామి చాంద్రమాన సంవత్సరాల ప్రకారం మాట్లాడటం లేదన్నది సత్యం.

## నిండు నూరేళ్ళు జీవించిన భక్తుల విషయములు

స్వామి, చాంద్రమాన సంవత్సరాధారంగా చెబుతున్నారనే వాదన కు అందరూ అనుకొనే మరియొక కారణము..కొంతమంది ఎక్కువగా జీవించిన భక్తులను "వీరు నిండు నూరేళ్ళు జీవించారు" అని స్వామి అనటం, అలా కానప్పటికి, ఉదాహరణకి మనకి సాయి గాయత్రీ మంత్రం



అందించిన బ్రహ్మశ్రీ ఘుండికోట సుబ్రహ్మణ్య శాస్త్రి గారు నిండు నూరేళ్ళు స్వామి దగ్గరగా జీవించారు అన్నారు. కాని వారి వయసు 93సం॥లు మాత్రమే. మరియు స్వామి శాస్త్రీగారి మనుమలతో వారి తాతగారు కూడా ఒక మహర్షియని వారు కూడా నిండు నూరేళ్ళు జీవించారని ఒక దివ్య సందేశంలో చెప్పారు. కాని ఆయన అప్పటికి 93 సం॥ల వయసువారే. స్వామి శ్రీశేషగిరిరావు[1] గార్ని కూడా (స్వామి యొక్క సన్నిహిత భక్తులు) అటులనే తమ దివ్య సందేశంలో ఒకపరి సంబోధించారు. కాని వారు కేవలం 70 సం॥ల ప్రాయంలోనే శరీరాన్ని విడిచారు.

**"డా॥పద్మనాభంగారి తండ్రి శేషగిరిరావు 63 సం॥ల ప్రాయంలో, తన పదవీ విరమణ తర్వాత యిక్కడకు వచ్చి చేరారు. వారు కూడా నిండు నూరేళ్ళు జీవించి తన భౌతిక కాయాన్ని వదిలారు."**

– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్ 36 చాప్టరు 20

వేరొక సమయంలో స్వామి **శేషగిరిరావు** గురించి చెప్తూ **"ఈయనొక గొప్ప ఆఫీసరు. వారు స్వామికి ఆరతి యిస్తూ ఉండేవాడు. ఆయన నిండు నూరేళ్ళు జీవించాడు."**

– భగవాన్ దివ్య సందేశం, ప్రశాంతి నిలయం ఆగష్టు22, 2001.

పై రెండు విషయాలు చూస్తే (శ్రీశేషగిరిరావు, శాస్త్రీగారు) స్వామికి ఒక ప్రత్యేక క్యాలెండరు సిద్ధాంతం ఉండవచ్చని మనం నమ్మవచ్చు. స్వామి తన గణన రీతిలో, నిజానికి, రెండు వేరువేరు ప్రాయములు నిండు నూరేళ్ళకి సమానంగా ప్రవచించారు. కానీ శ్రీ శేషగిరిరావుగారి వ్యక్తిత్వ జీవితంలో 20సం॥ తేడా[2] సమయం ఏ పంచాంగం ప్రకారం గణనకి వస్తుంది? కానీ శ్రీ గోపాలరావు, స్వామి కారుణ్యానందల ప్రాయముల లోను వీరిరువురు నిండు నూరేళ్ళు జీవించారని చెప్పారు. అప్పటికి శ్రీ గోపాలరావుగారి వయస్సు 96 సం॥లే. కానీ 4 సం॥ల తర్వాత మాత్రమే శ్రీ గోపాలరావుగారి 100 వ జన్మదినం, స్వామి ఆ సందర్భంగా 2007లో వార్ని సత్కరించారు. ఎవర్నైనా "నూరేళ్ళు జీవించాడు" అనటంలో స్వామి

**1.**రేడియోసాయి – ఆధారంగా శ్రీ శేషగిరిరావు స్వామిని 1943లో చూశాడు .అప్పుడు అతని వయసు 58 సం॥లు. శ్రీ శేషగిరిరావు 1961లో చనిపోయారు. కనుక వారు 75–76 సం॥ల ప్రాయం కలిగి యుంటారు.

**2.**స్వామి 100 సం॥లని చెప్పిన దానికి శ్రీ శేషగిరిరావుగారి అసలు ప్రాయానికి వ్యత్యాసం 20సం॥

అసలు ఉద్దేశ్యం తెలుసుకోవాలంటే మనం ఆ చెప్పిన సందర్భం ఏమిటో గమనించాలి. అది తెలుసుకోటానికి మనం ఎక్కడో వెదకనక్కర్లేదు. పైన వివరించిన వారు 78వ జన్మదినోత్సవంలో చేసిన ప్రవచనంలో ఈ విధంగా అన్నారు.

"ఇంకొక ముఖ్య విషయం మీకు చెప్పాలనుకుంటున్నాను. ఇక్కడప్రశాంతి నిలయంలో తమ జీవితాల్ని స్వామికి అంకితం చేసిన వారంతా నిండు నూరేళ్ళు జీవిస్తారు. **డా॥ కస్తూరి ఇక్కడికి వచ్చి పూర్ణ జీవితం జీవించారు.**"

– సత్యసాయి వచనామృతం, వాల్యూ 36, అధ్యాయం 20.

మనందరికి తెలుసు ప్రొఫెసరు కస్తూరిగారు. 90 సం॥ల ప్రాయం లో, స్వామిలో ఐక్యమైనారు. దీన్ని బట్టి ఆలోచిస్తే, "100సం॥ల ప్రాయము అని చెప్పటం నిండు జీవితం–సంపూర్ణ జీవితాన్ని అనుభవించారనటం." నిండు నూరేళ్ళు జీవించే భక్తుల నుంచి స్వామి ఏమి ఆశిస్తున్నారు? 100 సం॥ల ప్రాయయు వచ్చుసరికి తమ పంచకర్మేంద్రియాలు, పంచ జ్ఞానేంద్రి యాలను భక్తులు తమ ఆధీనంలో ఉంచుకొని, స్వామిలో ఐక్యం చెందాలి. ఐదు కర్మేంద్రియాలు వాక్కు, పాణి, పాదము, పాయువు, ఉపస్థము. ఐదు జ్ఞానేంద్రియములు – వాక్కు, చక్షువు, శ్రోత్రము, జిహ్వ, ఘ్రాణము.

–స్వామితో జాన్ హిస్లాఫ్ సంభాషణ "నేనూ–నాబాబా"42 పేజీ

అంటే **స్వామి ఆశయాల కనుగుణంగా ఎవరు నడుచుకుంటారో, అట్టివారు ఏప్రాయములో నున్నప్పటికి, నిండు నూరేళ్ళు జీవించినట్లే నన్నమాట.**

భారతదేశంలో ముఖ్యంగా గ్రామాలలో పెద్దవాళ్ళు, తమ కంటే చిన్నవాళ్ళని "శతమానంభవతి శతాయుః" అని ఆశీర్వదించటం నానుడిగా వస్తోంది. అంటే నిండు నూరేళ్ళు జీవించమని, వేదాల్లో చెప్పబడిన " శతం జీవం," జీవేమ శరదశ్శతం" అంటూ వేదంలో ఒక ప్రార్థన, ఆ వేదమంత్రంలో, సంస్కృత శబ్దం, "శతం" అంటే నూరు. క్రియా యోగ స్థాపకులు పరమహంస ప్రజ్ఞానంద మాటల నుంచి ఈ అర్థాన్ని గ్రహిం చాను. "శతం జీవత్" అంటే దీర్ఘ జీవితము" పూర్తి పాఠము; " శతమానం భవతి, శతాయుః పురుషస్సేవేంద్రియ, ఆయుష్షేవేంద్రియో ప్రతిదిష్ఠతి" నూరు సంత్సరముల ప్రాయము అంటే సంపూర్ణత. భక్తి, ప్రేమలతో నిండు నూరేళ్ళు జీవించటం. 100 సంఖ్య నుంచి1 తీసేస్తే మిగిలేది రెండు



సున్నాలు. ఆ ఒకటి ప్రేమ, భగవంతుడు. ఆ ఒకటి లేక పోతే జీవితానికి అర్థం లేదు. విలువలేదు.[1]

ఈ పూర్వకాలపు స్వామి భక్తులు సంపూర్ణ ప్రేమకు, భక్తికి మూర్తీ భవించిన ప్రేమతరంగాలు, నిదర్శనలు, నిలువెత్తు ఆధారాలు. అట్టి వారు వివిధ పదవులలో స్వామి వద్ద నిండు నూరేళ్ళు జీవించారు. సర్వ శక్తులతో సేవలొనరించుచు స్వామి దివ్య పాద పద్మముల చెంత సర్వస్య శరణాగతి పొందిన మహానుభావులు.

**ఇతర ఆధారాలు.**

ఇంకా స్వామి 79వ జన్మదినాన చెప్పిన వాక్కులు.

"**ఈరోజు, ఈ శరీరమునకు జన్మదినము. నేను 79 ఏళ్ళవానిగా** కనిపిస్తున్నానా? లేదు. ఈ ప్రాయములో ప్రజలు అనేక రోగములతో ఉంటారు. వినికిడి ఉండదు. కంటికి శుక్లాలు వస్తాయి. నుదిటి మీద ముడతలతో ఉంటారు. నా అవయవాలన్నీ సక్రమంగా పనిచేస్తున్నాయి. కాని నా నుదిటిమీద ఏమైనా ముడుతలున్నాయా? చూడండి. ఇప్పుడే కాదు. **ఇంకా 80, 90 సం॥లకి కూడా యిలాగే ఉంటాను**"

–79వ జన్మదిన సందర్భంగా స్వామి ప్రశాంతి నిలయంలో చెప్పిన దివ్య వాక్కులు. 23 నవంబరు 2004.

స్వామి తన 79 వ జన్మదిన సందర్భంలో "79 ఏళ్ళని" చెప్పారంటే ఖచ్చితంగా చాంద్రమాన పంచాంగం ప్రకారం మాత్రం కాదు. స్వామి ఈ దేహంతో 90 సం॥లు ఉంటానని చెప్పారంటే ఖచ్చితంగా హిందూ పంచాంగం ప్రకారమే. "ఇప్పటి క్యాలండరు ప్రకారమే" (రెగ్యులర్ గ్రెగోరి యన్ క్యాలెండరు), 90 ఏళ్ళు పైబడి ఉంటానని.

**స్వామి జీవిత చరిత్ర వ్రాసిన మహానుభావుల అభిప్రాయాలు**

కీ॥శే॥రా. గణపతిగారు స్వామికి అత్యంత ఆంతరంగిక భక్తులు. అనేక ఆధ్యాత్మిక గ్రంథాలలోను అనేక భాషలలోను నిష్ణాతి. "బాబా; సత్యసాయి" అన్న వారి గ్రంథము అనేక సంపుటాలలో రచించి, స్వామికి సమర్పించిన గొప్ప గ్రంథ సంచయము. 2వ భాగంలో యీ సంఘటన చూడండి.

స్వామి కాలేజీ విద్యార్థులకు **జూన్1976** వేసవి తరగతుల సందర్భంగా ఉదక మండలంలో స్వామి సృజించిన అపూర్వ రజత ఫలకాన్ని చూసే

[1]. www.kriya.org.

అదృష్టం కలిగింది. స్వామి తమ విద్యార్థులకు " నేను ఈ దేహంతో 96 సం॥లు ఉంటాను."వచ్చే 46 సంవత్సరాల" లో ఇంకా18 సంస్థలు భారత దేశంలో స్థాపిస్తాను." అని చెప్పారు.

–బాబా సత్యసాయి,2వ భాగము. రా.గణపతి, 85వ పుట.

ఈ విషయాన్ని పరిశీలిస్తే స్వామి 96 సం॥లు ఈ శరీరంతో యుంటా నని న్ని, ఇంకా 1976 తర్వాత 46 సం॥లు ఉంటానని, స్వామి 50సం॥ల ప్రాయంలో ఈ విషయం తమ ప్రియతమ విద్యార్థులకు చెప్పారు. ఇంకా 46 సం॥లు అంటే ఖచ్చితంగా 96 సం॥లు ఈ దేహంతో యుంటారు అన్నమాట. స్వామి పరోక్షంగా తమ ప్రాయము చెప్పినట్లయింది.ఈ విష యం స్వామి రెగ్యులర్ క్యాలెండరు ప్రకారమే చెప్పారని తెలుస్తోంది. అదే సమయంలో స్వామి రెండు ప్రత్యేక క్యాలెండర్లు ఉపయోగించలేదనీ అనిపిస్తుంది. అయితే 1976 నుంచి 2011 మహాభినిష్క్రమణం వరకూ స్వామి కేవలం 35 సంవత్సరాలే ఈ దేహంతో ఉన్నట్లయ్యింది. 35 క్యాలెం డరు సంవత్సరాలు. 46 చాంద్రమానవత్సరములకు[1]గాని మరే మాసము నకు గాని సమానము కాదుగదా! భగవాన్ జీవితచరిత్ర వ్రాసిన ప్రొఫెసరు కస్తూరి గారి మాటలలో "స్వామి మనకు మాటయిచ్చారు. **2020తర్వాత వరకు నేను యీ మానవాకారంలో యుంటాను" అని.**

– భగవాన్ జీవిత చరిత్ర, కస్తూరి ఎన్.1971, 235వ పుట.

మనమెంత అదృష్టవంతుల మంటే ప్రొఫెసరు కస్తూరిగారు భగవాన్ అత్యంత సన్నిహిత భక్తుడు, ఘంటాపథంగా వాదోపవాదాలకు అవకాశ మీయకుండా, సీలు చేసినట్లు 2020 సంవత్సరాన్ని ప్రకటించారు స్వామి ప్రాయమును ప్రస్తావించకుండా, మరలా ఇంకొకరు చెప్పవలసిన అవసరం లేకుండా, చాలా అద్భుతం.

[1] అట్లా అయితే నెలకి 23రోజులే, సంవత్సరానికి 276రోజులే అవుతుంది.



# రెండవ అధ్యాయము

## అసలు స్వామి ప్రణాళిక ఏంటి?

గత భాగంలో, స్వామి చాంద్రమానం ప్రకారం ప్రవచించలేదని మన కర్థమౌతోంది.

**స్వామి తమ ప్రణాళికను మార్చారా?**

అసలు ఏం జరిగింది? ఈ తేడా ఎందుకు వచ్చింది? స్వామి తన అసలు ప్రణాళికను మార్చుకుని ముందగానే "మహాభినిష్క్రమణం" చెందారా?

కొంతమంది భక్తులు ఏమంటారంటే, స్వామి తన ప్రణాళికను ఎప్పుడైనా మార్చుకొనవచ్చు. అవును నిజమే, ఆయన భగవంతుడు, ఆయన అవతార పురుషుడు, ఆయన ప్రణాళిక మన చిన్న మేథస్సుకు అందదు. ఆయన ఏదైనా చేయగలరు. **అసలు నాకర్థం కాని దేంటంటే, స్వామిని ఆక్షేపించే మన తెలివితేటలు, స్వామి ప్రణాళికను ముందుగా ఎందుకు తెలుసుకోలేక పోయాము.** అది కూడా స్వామి అంత వివరంగా ప్రకటించిన మాటలకు భిన్నంగా మన ఆలోచనలు? స్వామి అప్పుడప్పుడు చెప్పిన కొన్ని పల్కులు.

**" నామాట ఎప్పుడూ వృధా కాదు.**
**నేను చెప్పినది, చెప్పినట్లు జరుగుతుంది."**

– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్1 చాప్టరు 31

**"నేను సంకల్పించింది కార్యరూపం ధరిస్తుంది.**
**నా ప్రణాళిక విజయం సాధిస్తుంది."**

– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్12 చాప్టరు 38

**"ఒకతూరి నానోట్లో నుంచి మాట వచ్చిందంటే అది జరిగి తీరవలసిందే. దీన్ని సందేహించకండి."**

– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్1 చాప్టరు 16

**"నా మార్గాన్ని, నా విధి విధానాన్ని కొంచెం కూడా ఎవ్వరూ అడ్డుకోలేరు, మార్చలేరు, నేనంతటికి అధిపతిని."**

– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్1 చాప్టరు 30

**"అవతార పురుషుల ప్రతిఅడుగు, ముందే నిర్ణయించబడి ఉంటుంది."**
– భగవాన్ దివ్య సందేశం 23 నవంబరు 1968,

**"భగవంతుడు తన మాటకు భిన్నంగా ఎప్పుడూ ప్రవర్తించడు."**
– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్2 చాప్టరు 22

**"ఎవరేమి చెప్పిన, నా క్రియలు, నా కదలికలలో ఎప్పటికి మార్పురాదు."**
– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్5 చాప్టరు 42

**"పరిస్థితుల ప్రభావం వల్ల కొన్ని మార్పులు సంభవించవచ్చు. అవి శాశ్వతముగాదు. అట్లాంటి సంఘటనలవల్ల, నా గమనాన్ని నేను మార్చుకోను."** – సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్ 17 చాప్టరు 14

పై ప్రకటనల్లో అన్నింటికన్నా నాకు ముఖ్యమైనది, అద్భుతమైనది, స్థిరమైనది "నా నోటి నుంచి మాట వచ్చిందంటే అది తప్పక జరిగి తీరుతుంది, కార్యరూపం ధరిస్తుంది." స్వామి కేవలం ఆవిధంగా ప్రకటించ డమే కాదు ఏం జరగబోతోందో స్వామికి ముందే తెలుసునన్న మాట. **"ఏదయితే నా నోట ప్రకటింపబడుతోందో, అది జరగబోయేదే."**

ఏతా వాతా నేను చెప్పేది ఏంటంటే, ప్రణాళికలో మార్పు అన్నది, కేవలం కాదని చెప్పేవాళ్ళదే.

## స్వామి ప్రణాళిక ఏంటి?

**"ప్రణాళిక అన్నది భగవంతునికే తెలుసు, ఆయనదే ప్రణాళిక గనుక మీరు ఈ నాటకంలో కొంతభాగం మాత్రమే రంగస్థలం మీద చూస్తు న్నారు. కనుక అదంతా మీకు అయోమయంగా ఉండవచ్చు. మీకు కథ అంతా తేట తెల్లమైనప్పుడు మాత్రమే మీరు అతని ప్రణాళికని అర్థం చేసుకుంటారు. గౌరవిస్తారు. లేనిచో లేదు."**
– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్1 చాప్టరు 30

భగవాన్ ప్రణాళికలను ఎవ్వరూ ఊహించలేరు. ముందుగా తెలుసుకో లేరు. స్వామి చాలాసార్లు చెప్పారు. నా అస్థిరత్వాన్ని కూడా మీరు ప్రేమతో స్వాగతించాలి. స్థిరమైనదేంటంటే, నేను ఏం చెప్పినా జరిగితీరుతుంది. ఎలా? ఎప్పుడు? ఎక్కడ? అన్నది మానవ మేధస్సుకు అందదు. కాలమే యీ వింతని నిర్ణయించగలదు.

**"నా అస్థిరతను ప్రేమించండి,అది తప్పుకాదు, అది నా యిష్టము. నా సంకల్పము. గుర్తుపెట్టుకోండి. నా సంకల్పము లేకుండా లేశ మాత్రము ఏదియు కూడా జరగదు. ప్రశాంతంగా ఉండండి. నన్ను అర్థం చేసుకో టానికి ప్రయత్నించకండి. ఆ ఉద్దేశ్యమే మానుకోండి."**
– సత్యం శివం సుందరం, 3భాగం.



# మూడవ అధ్యాయము

## ఈ భూమి పై తమ జీవితకాలం గురించి స్వామి చెప్పిన విషయాలు.

అనేక సందర్భాలలో భూమిపై తన జీవితకాల పరిమితిని గురించి స్వామి చెప్పారు. కొన్ని జన బాహుళ్యమున పలికిన దివ్య సందేశములు, కొన్ని భక్తులకొసంగిన ఆంతరంగిక సమావేశములలో పలికిన పలుకులు, ఆధ్యాత్మిక పూరితమైనవి. అటువంటి కొన్ని సందేశములు మనము చూద్దాము.

(1) **"ఈ మానవదేహంతో నేను యింకా 59 వత్సరములు ఉంటాను. నా అవతార లక్ష్యాన్ని సాధించి తీరుతాను. ఇందులో సంశయము వద్దు."**
– దివ్య సందేశం.ప్ర.శాం.ని. సెప్టెంబరు 29, 1960.

(పై సందేశాన్ని బట్టి 1960 నుంచి 59 వత్సరములు అంటే వారు 93 లేక 94 సం॥ల ప్రాయము వరకు అని అర్థమౌతుంది. అంటే 2019 సం॥ము వరకు.అప్పటికి స్వామి వయసు 93 సం॥లు అవుతుంది. నవంబరు 23, 2019 కి, స్వామి 94 వ జన్మదినమౌతుంది.)

(2) 1961లో, యిలాంటిదే మరియొక దివ్య ప్రకటన.**"నేను ఈ మానవ దేహంతో ఇంకా 58 వత్సరములు యుంటాను. ఇది మీకు ఇంతకు ముందే చెప్పాను."**
– భగవాన్ దివ్య సందేశం ప్రశాంతి నిలయం. అక్టోబరు 21వ తేదీ. 1961.(పైన ఉదహరించిన 1 లో మాదిరిగానే సూచిస్తుంది.)

(3) **ఈ రోజునే కాదు యింకా 96 సం॥లు నేను ఇలానేయుంటాను.**
– సత్యసాయి ప్రవచనములు, వాల్యూమ్ 36 చాప్టరు 14.

(4) ప్రొఫెసర్ కస్తూరి : **బాబావారు ఈ మానవదేహంలో 2020 సం॥ దాటే వరకు ఉంటామని మనకు నిశ్చయంగా చెప్పారు.**
–భగవాన్ జీవితచరిత్ర, పుట 235 ఎన్.కస్తూరి.

(రాబోవు 2020 వత్సరమునకు స్వామి వయసు 94సంవత్సరములు వారి 95వ జన్మదినము, 23 నవంబరు 2020 కి స్వామి 95 సం॥ల ప్రాయములో యుంటారు. కస్తూరిగారు 2020 దాటి అనటం వలన ఇదిపై 3వ పాయింట్‌కి సరిపోల్చుకోవచ్చు.)

(5) అతిథి[1] :స్వామి అప్పటికి ప్రపంచం మొత్తాన్ని ప్రశాంతి నిలయంగా మార్చివేసి ఉంటారు. ప్రేమసాయి అవతారములో ఎక్కువ తీర్చిదిద్దవలసిన పనులుండవు.

[1]. డా॥హిస్లాప్‌తో బాటు ఇంటర్వ్యూ గదిలో ఉన్న ఒకభక్తుడు.

**సాయి : ఇది యింకా 40 సంవత్సరాల తరువాత మాట, అప్పటికి ప్రపంచం ప్రశాంతి నిలయంగా మారిపోయి ఉంటుంది. అదే ప్రేమ సాయి, అంతా ప్రేమమయం. అంతటా ప్రేమ, ప్రేమ, ప్రేమయే, నిండుకొని యుంటుంది.**

– "నేను– నా బాబా", జాన్.ఎస్.హిస్లాప్, పేజీ 189, 1978 స్వామితో ముఖాముఖి సంభాషణము నుండి.

(పై సంభాషణ నుండి స్వామి దేహం ఎప్పుడు విడిచేదీ స్పష్టంగా తెలియక పోయినా, ప్రేమసాయి అవతారం మాత్రం 2018 తరువాతే అన్న సూచన ఉంది. అప్పటికి శ్రీ సత్యసాయి అవతారం ప్రపంచాన్ని శాంతిమయంగా మార్చేసి ఉంటుంది. పై మూడవ పాయింట్ దీనితో సరిపోతుంది.)

(6) **ఈ సంభాషణ నుండి ఒక విషయయు బయల్వెడలుతోంది. బాబా 94 సం॥ల ప్రాయము వరకు ఈ భౌతిక శరీరంతో యుంటారని మాతో చెప్పినారు.** – మోడరన్ మిరకిల్స్, ఎర్లెండూర్ హెరాల్డ్సన్ పుట 46

(7) **స్వామి ఎక్కువ పర్యాయములు భవిష్యవాణిలో, "నేను ఈ శరీరంతో 94 సం॥లు యుంటానని చెప్పియున్నారు. ఈ విషయాన్ని పాఠకులకు వదలిపెడుతున్నాను. వారే కొన్నాళ్ళకు తెలుసుకోగలరు."**

–మోడరన్ మిరకిల్స్ ఇ. హెరాల్డ్సన్.పు. 294.

(8) **ఈ దేహము 96 సం॥లు ఉంటుంది. నిత్య యవ్వనంగానే యుంటుంది.**

–జాన్ ఎస్. హిస్లాప్‌తో స్వామి సంభాషణలు. బర్తడే పబ్లిషింగ్ & కో. శాన్‌డిగో, సి.ఎ. 1978,పేజీ 83, (పై ఇంటర్వ్యూ యీ ఎడిషన్‌లో మాత్రమే ఉంది.)

(9) **1976 జూన్‌లో** స్వామి కాలేజి విద్యార్థులకు ఒక అద్భుతమై సన్నివేశాన్ని చూపించారు. **96 సం॥లు ఈ దేహంతో ఉంటానని చెప్పారు. ఈ 46 సం॥రాలలో 18 ముఖ్య సంస్థానములను ఇండియాలో నెలకొల్పుతానని చెప్పారు.** – బాబా సత్యసాయి 2వ భాగం. రా. గణపతి, పుట 85.

(పై దివ్య ప్రకటన ననుసరించి జూన్ 1976 నుంచి 46సం॥లు అంటే 2022 వరకు లేక 2021 తర్వాతి వరకు ఈ దేహంతో యుంటారు.)

స్వామి అనేక పర్యాయములు 94 సం॥లు ఈ దేహంతో యుంటానని, వేరు వేరు సందర్భాలలో 96 సం॥లు ఈ శరీరంతో యుంటానని మరియు



సత్య సాయి అవతారం గుఱించి కొన్ని భవిష్యవాణులు స్వామి 96 వరకు ఉంటారని చెప్తున్నాయి.

స్వామి అవతారం చాలించే విషయం ఇప్పుడు 1నుంచి 9 వరకు యిచ్చిన పై ఉదాహరణలు పరిశీలిద్దాము.

(ఎ) ఉదా 1 మరియు 2 అక్టోబరు 2019, ఆగష్టు 2020 మధ్యకాలం.
(బి) ఉదా : 3మరియు 8 స్వామి ఈ మధ్య ఇచ్చిన కాలంలో ఎపుడైనా దేహాన్ని వదిలి పెట్టవచ్చు. డిసెంబరు 2021 నుంచి నవంబరు 2022
(సి) ఉదా : 4 మరియు 5, పై 3–8 ఉదాహరణల వలెనే
(డి) ఉదా : 6 మరియు 7 : డిసెంబరు 2019 నుంచి నవంబరు 2020 మధ్య కాలం
(ఇ) ఉదా : 9 : 2022 సం॥లో లేదా 2021 తర్వాత ఉదా:3 – 8లో మాదిరిగానే.

పై 'ఎ'.మరియు 'డి' పరిశీలించినచో స్వామి ప్రాయము 94సం॥లు, డిసెంబరు 2019 మరియు ఆగష్టు 2020 మధ్యకాలం. ఇది " బి" తో పరిశీలించినచో (సి మరియు ఇ, బితో సమానముగా నున్నది) 96సం॥ల జీవిత కాలం అని తెలియచున్నది. ఈ విధంగా పరిశీలించినచో 15 నుంచి 36 నెలలు తేడా కన్పట్టుచున్నది. స్వామి ఈ భూమి మీద జీవిత ప్రస్థానం – ఒక పరి 94 సం॥లనియు, ఒకపరి 96 సం॥లని చెప్పి యున్నారు.(ఈ రెంటి ఆయుఃప్రమాణముల మధ్య కనీసం15నెలలు తేడా కన్పట్టుచున్నది. డిసెంబరు 2021 ఆగష్టు 2020 మధ్య 15 నెలలు తేడా, డిసెంబరు 2019 నవంబరు 2022 మధ్య తేడా 36 నెలలు)

## ఒక సానుకూలమైన వివరణ

"**ప్రాముఖ్యము వహించని ఒక్క పదం కూడా నేను పలకను.**"

– భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి జీవిత చరిత్ర, ఎన్.కస్తూరి, పుట 196.

స్వామి వేరు వేరు సందర్భములలో వేరు వేరు ప్రకటనలలోని తేడాలకు వివరణ ఏమైననూ యున్నదా? ఆ వ్యత్యాసమునకు అర్థము స్వామికే తెలుసు. మనకు తెలిసినదల్లా స్వామి తప్పులు చేయరు అని. తప్పు చెప్పరు. స్వామి ఏమి చెప్పినా, కార్యరూపం తప్పక ధరిస్తుంది. ఆ విధంగా ఆలోచిస్తూ, ఈ విషయంపై మనం ఒక నిర్ణయానికి రావటానికి ప్రయత్నిద్దాం.

ఒకసారి, ఈ శరీరంతో 94 సంవత్సరాలు ఉంటానని, వేరొక పరి 96 సం॥లు ఈ దేహంతో యుంటానని పల్కటంలో అర్ధమేమిటి? **ఒకవేళ అదేమైనా మనకు 2సం॥ కాలం అజ్ఞాతంగా యుంటానన్న హెచ్చరికా?** బహుశః అది సరియై ఉండవచ్చు. కనుక స్వామి యిప్పుడు శరీరం వెలుపల ఉన్నారు. అవునా? కాదా?

ఈ పైన వివరించిన విశ్లేషణ ప్రకారం– ఈ రెండు సంవత్సరముల వ్యత్యాసం పరిశీలించినచో **స్వామి 15 నెలల తరువాత, 36 నెలల లోపుగా తిరిగి రావచ్చు.** స్వామి 24 ఏప్రియల్ 2011న మహాభినిష్క్రమణం చెందారు, కాబట్టి, స్వామి తిరిగి దేహంలో **ప్రవేశించే సమయం జూలై 2012 మరియు ఏప్రియల్ 2014 మధ్య కాలమై యుండును.**

**" నన్ను నమ్మండి – నేను ఎట్టి దోషములు చేయను."**

–సనాతన సారధి, ఆగష్టు 1984



# నాల్గవ అధ్యాయము
## సాయి భవిష్యవాణి

స్వామి తన అవతారం గుఱించి, తన సంస్థ గురించి అనేక విషయాలు వెల్లడించారు. మనకు తెలుసు స్వామి చెప్పిన విషయాలు అన్నియు జరిగి తీరినాయి. ఇంకా చాలా విషయాలు కార్యరూపం ధరించాల్సిఉంది. కొన్ని చెప్పిన విషయాలు కొంతవరకు మాత్రమే జరిగాయి. అట్లాంటి ప్రకటనలు కొన్ని , అత్యంత వినయ విధేయతతో సేకరించి మీ ముందు ఉంచుతున్నాను. (సత్యసాయి అవతారంలో కొన్ని ఇంకా అద్భుతమైన సంఘటనలు జరిగి తీరుతాయన్న దాన్ని ధృఢ పరచటానికే, వీటిని మీ ముందుంచుతున్నాను.)

" **నేనొక చోటు నుంచి మరియొక చోటికి వెళ్ళవలసి వచ్చినప్పుడు** కారుని, విమానాన్ని కూడా విడనాడ వలసి వస్తుంది. భక్తులు పెద్ద సంఖ్యలో, ఒకరినొకరు వత్తుకుంటూ నా చుట్టూ చేరతారు. **నేను ఆకాశంలో నడవాల్సి వస్తుంది.** అవును. అది సత్యము. **అది కూడా జరిగి తీరుతుంది. నన్ను నమ్మండి."** – సత్యసాయి ప్రవచనములు, వాల్యూమ్ 2 చాప్టరు 18.

నన్ను నమ్మండి, మీరు అతి కష్టం మీద నన్ను దర్శించుకోవలసిన రోజు వస్తుంది. అదిగో కాషాయరంగు, అదిగో స్వామి అంటూ దర్శించుకుని తృప్తి పడాల్సి వస్తుంది. **నేను ఆకాశంలో అటు నుంచి ఇటు నడుస్తూ దర్శనమీయ వలసి వస్తుంది.** అవును అది కూడా జరిగి తీరుతుంది. నన్ను నమ్మండి.

–యధాతథంగా తపోవనం గ్రంథం నుంచి 11వ అధ్యాయము.

" నేను ద్వాపర యుగంలో కృష్ణునిగా యున్నప్పుడు చిన్న బాలునిగా ఒక్క గోవర్ధన పర్వతాన్నే, నా చిటికెన వ్రేలుపై ఎత్తాను. **ఇప్పుడు ఒక్క గోవర్ధనగిరినే కాదు, పర్వత శ్రేణినే ఎత్తుతా. మీరు చూస్తారు ఓర్పు వహించండి. నమ్మకం ఉంచండి."**

– సత్యసాయి ప్రవచనము. వాల్యూమ్ 3 ,చాప్టరు15,

(తాను సాధించవలసిన ధ్యేయం ఎంత బృహత్తరమైనదో తెలుపడానికి ఇక్కడ స్వామి తన యొక్క వైభవాన్ని చాలా ఉన్నతంగా చూపించారు.)

"మీరెంతో అదృష్టవంతులు, **ప్రపంచ దేశములన్నియు భారత**

**దేశ గొప్పదన్నాన్ని ప్రశంసించుట మీరు చూడగలరు. ప్రపంచము మొత్తము సత్యసాయి నామముతో మారు మ్రోగిపోతుంది. ఈ దేహము మీ ముందున్నప్పుడే ఇవన్నియు జరుగుతాయి. మరలా సనాతన ధర్మము తిరిగి ప్రతిష్టింప బడుతుంది.** ఇది మీరు చూడగలరు. ప్రపంచ క్షేమాన్ని కాంక్షిస్తూ, వేదాలలో చెప్పబడిన ధర్మం పునఃప్రతిష్టింపబడటము మీరు చూడగలరు"

– భగవాన్ దివ్యసందేశం మేనెల 17వ తేది, 1968.

**"ఈ దేహం ధర్మాన్ని స్థాపించటం కోసం వచ్చింది. నా అవతార కార్యక్రమము ముగిసిన వెంటనే నీటి మీది బుడగవలె అంతర్ధానం చెందుతాను".**

– సత్యసాయి ప్రవచనములు 10వ భాగము– అధ్యాయము 39.

పైన చెప్పిన స్వామి వాక్కులు పరిశీలించినట్లైతే, ఈ ప్రస్తుత దేహంలో ఉన్నప్పుడే అద్భుతమైన లీల జరగబోవుచున్నదని, అర్ధమవుతోంది. ప్రపంచదేశాలన్నీ, స్వామి ఈ దేహంలో యున్నప్పుడే, భారతదేశ ఔన్నత్యాన్ని ప్రజలు ఔదల దాలుస్తారు. భారతదేశ గొప్పదనాన్ని వేనోళ్ళ శ్లాఘిస్తారు. ఈ అవతారం కనుమరుగయ్యే లోపలే సంపూర్ణ ధర్మస్థాపన జరిగి తీరుతుంది. సత్యసాయి "అవతార ఘడియల్లోనే అనేకానేక విచిత్రాలు చోటు చేసుకోబోతున్నాయన్న" సూచనలు మనకు చేశారు. ఈ క్రింద ఇవ్వబడిన సంకలనములు స్వామి చెప్పిన దివ్య సందేశాల నుంచి, ఆధారాలతో కూడి, గ్రంధస్థం కాబడిన భక్తులకు ప్రసాదించిన ఇంటర్వ్యూల నుంచి గ్రహింపబడినవి. కొన్ని తరువాయి అధ్యాయంలో స్వర్ణయుగం రాబోతోందన్న చోట తెలుసుకుందాం.

## స్వామి పలుకుల సారాంశం.

1. ప్రేమసాయి అవతారం వచ్చేప్పటికే ప్రపంచ దేశాలన్నీ ప్రశాంతితో నిండిపోతాయి.

2. అందరూ ఊహించిన దానికంటే ముందుగానే స్వామివారు "స్వర్ణ యుగాన్ని" ఆవిర్భవింపచేస్తారు. దాని సౌందర్యం వూహించనలవి కానిది. దాని వైభవం మన కల్పనలన్నింటినీ మించినది.

3. ఈ మార్పు ప్రపంచవ్యాప్తంగా, అన్ని దేశాల్లోను, అన్ని స్థానాల్లోను మనము చూస్తాము. ప్రతి చోట చూస్తాము.

4. సాయి రాష్ట్రము ఏర్పాటవుతుంది. భూలోక స్వర్గమును కన్నులారా తిలకించబోయే వారు ఎంత అదృష్టవంతులో గదా!



5. భూమి పైనున్న అనిశ్చిత స్థితి పూర్తిగా తొలగిపోతుంది. భూమిపైనున్న అందరి యందు పవిత్రభావాలు ఉద్భవిస్తాయి. భగవంతుని దివ్యాశీస్సులు అందరికి లభిస్తాయి. దేశం సంపూర్ణంగా శాంతి సంతోషాలతో విరాజిల్లుతుంది. ఎవరికి ఎట్టి బాధలు, కష్టనష్టాలు ఉండవు.

6. ప్రపంచ ప్రజలంతా కలసి మెలసి ఉంటారు.

7. స్వామి రూప నామములు ఎల్లెడల వ్యాప్తి చెందుతాయి. యావత్ ప్రపంచములో ఇంచి ఇంచికి ప్రతిచోట అనుక్షణము స్వామి నామముతో మారు మ్రోగిపోతుంది.

8. సాయి సమావేశాలలో కనీసం నిలబడటానికి చోటు ఉండదు.

9. స్వామి సంస్థలలో సభ్యత్వము ముమ్ముందు చాలా ఉపయోగంగా యుంటుంది. సాయి సంస్థల సమావేశాలకి రావటానికి ప్రజలు చాలా ఇష్టపడతారు. వారిని చొప్పించడానికి వీలు కల్పించడం చాలా కష్టంగా యుంటుంది. ఉన్న స్థానాలన్నీ స్వామి సంస్థసభ్యులతో నిండిపోతాయి.

10. ప్రపంచం మొత్తం సత్యసాయి సంస్థగా మారిపోతుంది. అందరి హృదయాలలో స్వామి ప్రతిష్టింపబడతారు.

11. ప్రపంచ దేశాలన్నీ భారతదేశాన్ని గౌరవిస్తాయి. భారతదేశము ఆధ్యాత్మికంగా, సాంస్కృతిక పరంగా చారిత్రక, రాజకీయ, ఆర్ధికపరంగా చాలా ముందుండి ప్రపంచ ప్రశంసలనందుకుంటుంది.

12. ప్రపంచ దేశాలన్నీ ప్రశాంతి నిలయానికి రావటానికి ఉవ్విళ్ళూరుతుంటాయి.

13. పుట్టపర్తిని ఒక మధురా నగరంగా చూస్తాము. (శ్రీకృష్ణుడు జన్మించిన స్థలం). ప్రపంచపటములో పుట్టపర్తి ఒక ప్రముఖ స్థానంగా నిలుస్తుంది."

(మూలాధార వివరముల కొరకు 9వ అధ్యాయము "సాయి స్వర్ణయుగావిర్భావము" చూడండి.)

## మనమేమాత్రము సందేహించనవసరము లేదు.

స్వామి జీవిత చరిత్ర "సత్యం శివం సుందరం" 4వ భాగంలో, ఆర్నాల్డ్ షుల్మాన్ "కేవలము రాళ్ళు రప్పలతో రాతి యుగానికి కూతవేటు దూరంలో ఉందన్న" పుట్టపర్తి భగవాన్ సత్యసాయి సంకల్ప మాత్రము చేత అందమైన ఆధ్యాత్మిక స్వర్గ సీమలాగా పరిణామం చెందిందని వ్రాసారు. స్వామి 17 సంవత్సరముల ప్రాయమప్పుడే లక్ష్మయ్య అనే పూజారితో ఈ విధంగా చెప్పారు.

"పెద్ద ఎత్తున ప్రజలు ఈ పుట్టపర్తి స్వామి దర్శనం కోసం వస్తారు ". అని. లక్ష్మయ్య యీ మాట మొదట నమ్మలేదు. ఎందుకంటే ఆ రోజుల్లో అట్టిది జరగబోతుందని నమ్మటానికి ఏ సూచనా కనబడలేదు. సంవత్సరాలు గడుచు కొలది జనం గుంపులు గుంపులుగా రావడం మొదలు పెట్టారు. లక్ష్మయ్య స్వామిని చాలా దూరాన్నుంచి చూడవలసి వచ్చింది. అపుడు స్వామి గతంలో చెప్పింది నిజమని నమ్మారు!

స్వామి 65వ జన్మదినంలో చెప్పారు, తాను ఎవ్వరినుండి ఏమీ ఆశించకుండా ఒక ప్రఖ్యాత అన్ని వనరులతో గూడిన వైద్యశాల అక్కడ నిర్మిస్తానని, సంవత్సరం తిరగకుండానే అన్ని హంగులతో నిర్మాణం జరిగి మొట్టమొదటి గుండె ఆపరేషను కూడా ఇక్కడనే జరుగుతుందని. నిపుణులు అసాధ్యమని హేళనగా మాట్లాడారు. సంస్థ సభ్యులే స్వామిని అడిగారు. ధనము ఎక్కడ నుండి సమకూరుతుందని. డాక్టరు కేత్, ప్రఖ్యాత శిల్పి హాస్పటల్ యొక్క ప్లాను, డిజైను యిచ్చాడు. "అన్ని విధాల అభివృద్ధి చెందిన అమెరికా దేశమునకే అన్ని హంగులతో కూడిన యిట్టి వైద్యాలయ నిర్మాణమునకు కనీసం 7సం॥లు పట్టును" అనుకున్నాడు. అట్టిది ఆరునెలల్లో స్వామి ఎలా నిర్మాణము కావించగలడు అన్న సంశయాన్ని వ్యక్తం చేసాడు[1]. అన్ని అనుమానాలకి భిన్నంగా స్వామియొక్క దివ్య సంకల్పంతో ఈ వైద్యాలయము స్వామి యొక్క 66 వ జన్మదిన శుభ సందర్భమున ప్రారంభింపబడి ఒకటి కాదు నాలుగు గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించటము జరిగింది ! ఇన్ని గొప్ప గొప్ప లీలలు చూసినప్పటికి ఇంకా మనము సందేహాలతోనే కొట్టుమిట్టాడుతున్నాము. స్వామి సంకల్పము, మనకు తెలియజేస్తే గాని మనకు అంతుబట్టదు.

**" ప్రేమ స్వరూపులారా! నేను చెప్పేది మీకు అసహజంగా ఉందని మీరు అనుకోవచ్చు. నా స్వార్థము ఇందులో ఇసుమంతయు లేదు."**

– సత్యసాయి ప్రవచనములు 23వ భాగము, 34వ అధ్యాయము.

1. చూడుము: తపోవనము శ్రీ సత్యసాయి చరిత్ర.



సాయి సుదీర్ఘ వైభవగాధ(సాయిసాగా) లో సాయి ప్రకటనలో చెప్పిన విషయాలు జరగటం అసాధ్యమన్నట్లు మనకి అనిపించినా, మహా దాశ్చర్యంగా, భగవాన్ సంకల్పం వల్ల చెప్పింది చెప్పినట్లు కార్యరూపం దాల్చటం మనం గమనిస్తూనే ఉన్నాము. ఇది స్వామియొక్క వజ్ర సంకల్పం. ఎవరైతే మొదట్లో ఎట్లా జరుగుతాయని సందేహించారో, వారే అవి స్వామికి అత్యంత సహజమని తెలుసుకుంటూ స్వామిని, స్వామి మాటలని కీర్తించ వలసి వచ్చింది. అవతారాన్ని అనుమానిస్తూ తలంచిన భక్తులే, సిగ్గుపడుతూ స్వామి యొక్క వజ్రసంకల్పాన్ని వేనోళ్ళ కొనియాడవలసి వచ్చింది.

ఎప్పుడయినా స్వామి యిలా జరుగుతుంది అని చెప్తే అది ఖచ్చి తంగా జరిగి తీరవలసిందే. భగవాన్‌వాక్కుని, క్రియని అనుమానించ వలసిన పరిస్థితి ఏ మాత్రము లేదని, అతి శీఘ్రకాలంలోనే విశ్వశిం చటం జరుగుతోంది. సర్వశక్తి సంపన్నులైన భగవాన్ సత్యసాయి అవతా రాన్ని వేనోళ్ల కీర్తించిన పరిస్థితులు సంభవిస్తున్నాయి. స్వామిని ప్రార్థిద్దాం. "మాకు మీ అవతారతత్వాన్ని గ్రహించగల శక్తియుక్తులను, తెలివితేటలను ప్రసాదించమని", ఇంత కంటే మరొక మార్గములేదు. ఇది నిశ్చయము.

# ద్వితీయ భాగం.
# మరలా తిరిగి రాక



# ఐదవ అధ్యాయము

## స్వామి తిరిగి వస్తారనటానికి ఉపకరించు కొన్ని సంఘటనలు

ఈ భూమి మీద "స్వర్ణయుగం" అన్న శాంతి ప్రేమలతో కూడిన నూతనశకం ఆవిష్కరించనున్నదని స్వామి ప్రకటించారు. ఇది ఈ భౌతిక దేహంతో యున్నప్పుడే జరుగుతుంది.

**పరిస్థితులు చక్కదిద్ద బడతాయి, మనమంతా సంతోషం ఆనంద డోలికలలో మునిగి తేలుతాము, స్వర్ణయుగం వస్తుంది, సంపూర్ణ ఆనందోత్సాహాలతో ఉంటాము, అన్నస్వామి ప్రకటలను, చాలామంది నమ్మటానికి వెనుకాడుతారు. నేను మీ అందరికీ అభయమిస్తున్నాను. "ఈ ధర్మ స్వరూపము, ఈ శరీరము ఊరికే ఆషామషీగా మీ ముందుకు రాలేదు, నేను ఓడిపోను. ప్రజలు పడుతున్న అష్టకష్టాలను, ఆందోళనలను నివారించటానికి నేను వచ్చాను".** పై ప్రకటన బాబా 1968లో, " సాయిబాబా ఒక పవిత్ర మానవుడు మరియు మానసిక శాస్త్రవేత్త" అను గ్రంధములోని పుట 91 నుంచి గ్రహించబడినది.

(ఇంకా కొన్ని స్వామి దివ్యప్రకటనలు "స్వర్ణయుగం ఆవిర్భవించబోతోంది." అన్న అధ్యాయంలో చూడండి.) స్వామి తమ దివ్యసందేశాలలో చాలా వివరంగా రాబోవు స్వర్ణయుగం గురించి అనేక ఆశ్చర్యకర విషయా లు మాట్లాడారు, అనేక ఇంటర్వ్యూలలో భక్తులకు తెలియచేశారు. ఒక బ్రిటీష్ భక్తుడు 'లూకాస్‌ర్యాలీ' స్వామి తనకు అనుగ్రహించిన సందేశాలతో తాను రచించిన ''స్వామి సందేశాలు మీకూ-నాకూ'' అన్న గ్రంధంలో పొందుపరిచారు. అందు ఒక ముఖ్య సందేశం,

**"రాబోయే స్వర్ణయుగానికి ముందు సూచనగా"ఒక క్రొత్త రాకడ" తో బాటు అంతటా నిండిన దుష్టత్వాన్ని పెకలించి వేసే కొన్ని వైపరీత్యాలు సంభవిస్తాయి."**

– స్వామి సందేశాలు మీకూ నాకూ.
ద్వితీయ భాగంలో 1988, పుట.70

ఇప్పటి వరకు నేను పేర్కొన్న పరిశీలనలు రాబోవు ప్రేమసాయి అవతారం గుఱించి చెప్పబడినవి. కాని స్వామి తాను నిర్ధారించుకున్న సమయానికి ముందే నిష్క్రమించటం అన్న పంథాలో పై పరిశీలన నుంచి ప్రస్తుత దేహంతోనే స్వామి తిరిగి వస్తారన్న దానికి అన్వయించుకోవచ్చు.

సత్యసాయి అవతార కాలంలోనే స్వర్ణయుగం వస్తుందని స్వామి ప్రకటించారు గదా! ప్రజలందరిని, ఈ ఒడిదుడుకులనుభవిస్తున్న క్లిష్టపరిస్థితులలో, చెడుని తొలగించి భగవంతునిపై సంపూర్ణంగా తమ దృష్టిని మరల్చటానికి మాత్రమే స్వామి ఇంత అద్భుతమైన లీలను ప్రదర్శింపబోతున్నారని నాకనిపిస్తోంది.

ప్రఖ్యాత భారత కవివర్యులయిన ప్రొ॥ శ్రీ గోకాక్‌గారు, స్వామి విద్యాలయానికి ఉపకులపతిగా ఉంటూ, స్వామితో ప్రత్యక్ష దర్శన, స్పర్శన సంభాషణల మహాభాగ్యాన్ని పొందియున్నారు. స్వామిపై అనేక గ్రంథములను రచించారు. "భగవాన్ శ్రీ సత్యసాయి బాబా" అనే గ్రంథం 54వ పుటలో, సత్యసాయి అవతారంలో భగవంతుని మహిమాన్విత ఘట్టాలు చోటు చేసుకుంటాయని ప్రస్తావించారు. దాన్ని వారు దివ్య గడియ అని పిలిచారు. బహుశా అది సత్య సాయిబాబావారు ఇదే దేహంతో తిరిగి వస్తారన్న ఉద్దేశ్యమై ఉండవచ్చు. దైవత్వాన్ని ఆహ్వానిస్తూ అనేకానేక మహిమలతో గూడిన స్వర్ణయుగం రాబోయేముందు ప్రపంచం దృష్టిని ఆకర్షించే ఒక ఘటన జరుగుతుందని స్వామి కూడ చెప్పారు.

**"అందరికి కనువిప్పు కలిగించే రోజు** ఎంతో దూరంలో లేదు. ఎప్పుడైతే ఆ ఘడియ వస్తుందో, **భగవంతుని అసలైన శక్తి బయల్పడుతుంది.** సర్వత్రా స్వామి అనేకచోట్ల ఒకేసారి దర్శనమిస్తారు" అదే రూపంతో ప్రత్యక్ష దర్శనం సర్వులకు కలుగుతుంది. ఇది ఒక గొప్ప పురోగమనానికి నాటి కఠిన పరిస్థితులను అనుకూలంగా స్వీకరించలేని వారి నిర్మూలనకూ ఒక సంకేతం.

–"సాయి సందేశాలు మీకు–నాకు వాల్యూమ్ 1, లూకాస్ ర్యాలీ, 1985



## ఒక అద్భుతం రాబోతోంది.

" అమెరికాలోని కాంటూన్ ఒహియోలో యుంటున్న[1] సీమా దివాన్ అన్న భక్తురాలికి 24 ఏప్రియల్ 2011కి కొంచెం ముందు స్వామి అనేక సందేశాలు యిచ్చారు. సీమా దివాన్ యొక్క పేరు, ఆమె వ్రాసిన గ్రంథాల వల్ల స్వామి భక్తులందరికి సుపరిచయము. ఆయా పుస్తాకాల్లో స్వామితో తన అంతర సంభాషణలు ఆమె పుస్తకాల రూపంలో పొందుపరిచారు. అవి మానవజాతికి అత్యంత ఉపయుక్తములు అని ఆమె గ్రంథస్థం చేసారు. ఆమె మొట్టమొదటి గ్రంథము **"సాయీ దర్శన్"** ప్రశాంతి నిలయ శ్రీ సత్యసాయి ట్రస్ట్ వారు ప్రచురించారు. 1997 సెప్టెంబరులో ఆమె యొక్క వ్రాత ప్రతిని 11 సార్లు స్పృశించి, రెండు పర్యాయములు విభూది సృష్టించి, వాటిపై చల్లి స్వామి ఆశీర్వదించారు. సాయి దర్శన్ మాదిరిగానే అనేక సందేశాలు అంతరాత్మ ప్రబోధం ద్వారా ఆమెకు అనుగ్రహించారు. ఇది స్వామి మహాభినిష్క్రమణమునకు ముందు, 24 ఏప్రియల్ 2011 కు ముందు జరిగిన విషయము. ఇవి ప్రపంచవ్యాప్త సాయిభక్తులపై అత్యంత ప్రభావం చూపగలవని, ఊరడించగలవని ఆమె చెప్తున్నారు. ఆమె మాటల్లోనే :

అప్పుడు స్వామి నాకు యీ మూడు సందేశాలు యిచ్చారు. **"ఇవన్నీయు మీ కోసమే", "అన్నీ జరిగి తీరుతాయి." "ఒక అద్భుతం జరగాల్సియుంది",** అన్నవి స్వామి ఆరోగ్యం గుఱించి చివరివి. ఇవన్నీ తన భక్తులకు సాంత్వన కలిగించేవే. నా మూడవ సందేశాన్ని టెడ్ మరియు జోడి హెన్రీని[2] వీడియో తీయమని చెప్పారు.

"ఒక అద్భుతం జరగబోతోంది" అన్న సందేశాన్ని సీమా దివాన్, ఏప్రియల్

---

[1].సీమాదివాన్ గారికి స్వామి ఇచ్చిన సందేశాలలోని భాగాలను saidivineinspirations.blogspot.com నుండి గ్రహింపబడినవి.

[2] టెడ్ హెన్రీగారు రిటైర్డ్ టెలివిజన్ జర్నలిస్ట్ మరియు క్లీవ్‌లాండ్,ఒహియోలో సాయి భక్తులు. వీరు వీరి భార్య జోడి కలిసి సాయి భక్తులతో చాలా ఇంటర్వ్యూలు రికార్డు చేసారు. ఈ వీడియోలన్నీ వారి వెబ్‌సైట్ souljourns.net లో లభిస్తాయి. సీమా దివాన్ గార్కి వచ్చిన సందేశాలు కూడా వీడియో రూపంలో వీరి వెబ్‌సైట్‌లో దొరుకుతాయి.

23, 2011న దేహం విడిచే ముందురోజు పొందారు. ఆ సందేశంలో స్వామి ఏమి చెప్పారంటే.(ముఖ్యమైన విషయాలు మాత్రము యిస్తున్నాను)

**" నా అత్యంత ప్రియతమ భక్తులారా! ఒక అద్భుతం జరగవలసి యున్నది...అది నాకు మాత్రమే తెలుసు.మీరు కొంచెం ఓర్పుతో ఉండండి. ధైర్యంగా కొన్ని రోజులు ఉండండి.ఎంత ఓర్పు వహిస్తే అంత మంచిది.ఈ అద్భుతాన్ని మీ ముందు ప్రత్యక్షంగా చూడటానికి అనుగ్రహిస్తాను.... మీరు అప్పటి వరకూ వేచి ఉండండి....మీరు జీవించి ఉండాలి. దీని కోసం మీరు నన్ను ప్రార్థించారు.**

శనివారం ఉదయం స్వామి ఒక సందేశమిచ్చారు. "ఒక అద్భుతం జరగవలసియున్నది. ఉదయం 9 గం॥ల వరకు ఈ విషయాన్ని ఏవరికీ చెప్పద్దని చెప్పారు. స్వర్ణయుగం వస్తుందని వాగ్దానం చేసారు. అప్పుడు **స్వామి శరీరంలో పునఃప్రవేశిస్తారను** కున్నాను. **స్వామి వివరంగా చెప్పటం కంటే, చేసి చూపిస్తారు.**

తన కాయాన్ని, తానే బాగు చేసుకుని తిరిగి వస్తారని భావించినట్లు సీమా దివాన్ చెప్పారు. స్వామి ఒక అద్భుతం జరగబోతోందని చెప్పడంవల్ల ఆ సమయంలో ఆ సందేశం చదివిన వారెవరైనా అలానే భావిస్తారు. అయినప్పటికి స్వామి ఆ మరునాడే భౌతిక శరీరాన్ని వదలి పెట్టారు. స్వామి యిచ్చిన ఈ సందేశం చదువుతున్న ఎవరైనా యీ విధంగానే భావిస్తారు. అసలు ఆ అద్భుతం ఏమిటి?అమర్నాడు అంటే శరీరాన్ని త్యజించిన రోజు తర్వాత అనగా 25-4-2011 ఇంకొక సందేశమిచ్చారు. **"నేను ఎక్కడికీ వెళ్ళలేదు"** అని (ముఖ్య విషయాలు మాత్రమే మీకు అందిస్తున్నాను)

**పరిశుద్ధ హృదయాలతో, ప్రేమతో భక్తులు నన్ను పిలుస్తున్నారు. వాళ్ళు నిండు ప్రేమ అనే శక్తిచేత, ఈ ప్రంచానికి తిరిగి రప్పించుకుంటారు. నేను, నిండు చేతులతో మీ ముందుకు వస్తాను. నేను ఏమి చెప్పినా మీరు నా మాటలు మీద నమ్మకం కలిగి యుండండి. నేను ఏం మాట్లాడిన వృధా పోదు. నేను ఏది చెప్పినా నిజమవుతుంది. నన్ను గుర్తుపెట్టుకోండి. నేను మీ ముందే ఉన్నాను. మీరు కలత చెందకుండా ఉండండి. నారాక కొఱకు ఎదురు చూస్తూ యుండండి."**

పై సందేశంలో మరియొక్కసారి ఈ ప్రపంచానికి దర్శనమిస్తానని చెప్పారు. అది ప్రేమసాయిగా మనం భావించవచ్చు. అట్లాంటప్పుడు



తన రాకను తెలియ పరుస్తు మళ్ళీ ప్రపంచానికి దర్శన మిస్తానని ఎందుకు చెప్పాలి? (ఈ విషయంలో " అంతరిక్షంలో – ఆకాశం లో నా దర్శనం" అన్న అధ్యాయములో మరీ వివరంగా చూద్దాం.)

ముందు యిచ్చిన సందేశం అద్భుతం జరగబోతోంది అన్న దానితో చూస్తే, ఒక అద్భుతలీల జరగబోతోందనటానికి యిది గుర్తుగా భావించ వచ్చు. ఇది ప్రేమసాయిగా వస్తానన్న దానితో పోల్చలేము ఎందుకంటే తన తర్వాత అవతారం" ప్రేమసాయి బాబాగా, ఈ అవతారం చాలించిన తర్వాత అవతరిస్తానని స్వామి ముందే చెప్పారు గదా! ఈ విషయం సాయి భక్తులందరికి ముందే తెలుసుగదా! ఆ కారణం చేతనే స్వామి "ఏది ఏమైనప్పటికి నా మాట నమ్మండి. నేను ఏది చెప్పినా వృధాగా పోదు. నేను ఏది మాట్లాడినా సత్యమే అవుతుంది." అన్న అభయ వాక్యాలు ప్రేమ సాయిబాబా గురించి అని మనం ఇప్పుడు ఊహించు కోవలసిన అవసరం లేదు. ఇది కేవలం నిర్ధారించుకున్న సమయాని కంటే ముందు మహాభినిష్క్రమణం చెందిన సత్యసాయి అవతారం గుఱించి మాత్రమే కనుక స్వామి సరైన సమయంలో ఇచ్చిన వాగ్దానం, ఈ సత్యసాయి స స్వరూపంతోనే, సత్యసాయి దేహంతోనే తిరిగి పునః దర్శనం యిస్తారని కదా! అందుకనే, స్వామి మీరు ఎదురు చూసిన దానికంటే కొంచెం ఎక్కువ సమయం ఓర్పువహించి యుండండనీ, స్వామి ఆదేశం ప్రకారం వెంటనే వస్తారన్నమాట కాస్త సత్యదూరం. కానీ తప్పక అదే దేహంతో దర్శన మిస్తారన్న మాట మాత్రం సత్యం. ముమ్మాటికి సత్య దూరం మాత్రంకాదు. కనుక యీ గ్రంధంలో[1] ఇంకా కొన్ని గురుతులు దీనికి తార్కాణంగా మీ ముందుంచుతున్నాను.

## స్వామి భక్తులకు కలల్లో దర్శనం

స్వామి భక్తులకు స్వప్నాల్లో ప్రసాదించిన కొన్ని ఘటనలు చూద్దాము. కలలో సహితము స్వామి దర్శనం ప్రసాదించటం, కూడ ఆయన సంకల్పమునసరించియే జరుగును.

స్వామి కలలో కనిపించటం కూడ చాలా శుభప్రదము.(...) **"కలలు వారి వారి అంతర భోధనలే, ఇవి ప్రతిబింబాలు. ప్రతి స్పందనలు. ప్రతిధ్వనులు. కాని కలలో స్వామి దర్శనము మాత్రము ప్రత్యేకతను**

---

1. ఈ వ్యాఖ్యానములు రచయితవి

**సంతరించుకుంటుంది. స్వామి స్వయంగా తలుచుకుంటేనే, కలలో దర్శనము ప్రసాదించగలరు, కాని నువ్వు కావాలనుకున్నప్పుడు మాత్రం కాదు.**

– సత్యసాయి ప్రవచనములు 31వ భాగము, 44వ అధ్యాయము.

**“ కలలో మీరు నన్నుదర్శించుకోవటము, నాసంకల్పం ప్రకారమే జరుగుతుంది. కలలో నా దర్శనం చాలా స్పష్టంగా యుంటుంది. ఈ విషయంలో మీకు ఎట్టి సంశయము ఉండుటకు అవకాశమేలేదు. నేను మీ ముందుకు ప్రత్యక్షమై, నేననుకున్నవి మీకు అతి స్పష్టంగా, తెలియజేస్తాను.”**

–సత్యసాయి ప్రవచములు 31వ భాగము 44వ అధ్యాయము.

స్వామి శరీరాన్ని త్యజించిన కొన్ని నెలల తరువాత సత్యసాయి విద్యాలయము ముద్దెనహళ్ళిలో ప్రస్తుతం వార్డెన్‌గా యున్న బి.ఎన్.నరసింహమూర్తిగార్కి[1]. కలలో స్వామి కొన్ని ఆదేశాలు[2] జారీ చేసారు.“ **కొండపై నున్న భవనము రెడీ చేయండి. గురుపూర్ణిమ రోజు (15జూలై 2011) నేను అక్కడికి వచ్చి ఉంటాను. నేను అక్కడికి వచ్చి ఆ భవనంలో శాశ్వతంగా యుంటాను. నేను అక్కడి నుంచి ఇతర ప్రదేశాలకు వెళ్ళి మళ్ళీ అక్కడకి చేరుతూ ఉంటాను. కాని అక్కడ శాశ్వతంగా మాత్రం ఉంటాను. నేను అక్కడ కూడా కనబడతాను.”తనకు కలలో కనిపించి చెప్పిన వృత్తాంతము, శ్రీనరసింహమూర్తి గారు యీ విధంగా వివరణ యిచ్చారు.** (ముఖ్య భాగాలే ఇక్కడ ఇవ్వబడ్డాయి)

“ స్వామి ఎవరికి కనబడతారో, ఎవరికి కనబడరో ఆయన యిష్టం. స్వామి ఎవరికి దర్శనం ప్రాప్తి ఉందో లేదో అన్న విచక్షణ లేకుండా అందరికి ఒకేసారి సంపూర్ణ దర్శనం ప్రసాదించిన ఘడియలు కూడా ఉన్నాయి. కానీ 24 ఏప్రియల్ 2011 తో ఆ అవకాశం కొల్పోయాము. **మనలో ఎవరికి ఆ అదృష్టముందో, వారికి తప్పక ప్రాప్తిస్తుంది. అట్టి అదృష్టవంతులు స్వామిని ప్రత్యక్షంగా దర్శిస్తారు. అదైనా స్వామి సంకల్పంపై ఆధారపడి మాత్రం యుంటుంది. 46 సం॥లుగా స్వామితో సన్నిహిత సంబంధం ఉన్న నాకు స్వామి చెప్పిన మాటలన్నీ జరిగితీరాయి. ఏదో ఒక రోజు మనం స్వామిని తప్పక చూస్తాము.”** (శ్రీ బి.నరసింహమూర్తి.)

---

[1].సత్యం శివం సుందరం 5,6, భాగాల రచయిత.

[2].ముఖ్య విషయాలు : www.sso.net నుంచి



కీ॥శే॥ డా॥హనుమంతప్ప శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయం, మాజీ ఉపకులపతి. వీరు “యుగావతారి సత్యసాయిబాబా” అను తన గ్రంథంలో స్వామి తమకు స్వప్నంలో చూపించిన విషయాలు, పుట్టపర్తి భవిష్యతులో ఎలా యుంటుంది, అన్న కొన్ని విషయాలు 165 నుంచి 167 పేజీలందు పొందుపరిచారు. వారి మాటల్లోనే,

**భవిష్యత్తులో పుట్టపర్తి ఎలా యుంటుంది, అన్న విషయము వివరిస్తూ స్వామి నన్ను ఒక ఉన్నత ప్రదేశానికి, తీసుకువెళ్ళి, ఒకటి తరువాత ఒకటి నాకు వరుసగా చెప్పారు. ఆయన చూపిన ముఖ్యమైన విషయాల్లో నేను చూసిన ఒక విషయం, స్వామి ప్రస్తుత ప్రశాంతి మందిరం నుంచి చిత్రావతి నదికి ఎదురుగాయున్న కొండపై, ఒక పెద్ద భవనమునకు నివాసం మార్చినట్టు కనిపించారు. (...) ఆ భవనము చుట్టూ ఒక పెద్ద ప్రహరీగోడ కడుతున్నట్లు పనులు జరుగుతున్నట్లు ఒక దృశ్య రూపం కనిపించింది... ఆయుధములు ధరించిన సైన్యము, ఆ ప్రహరీని రక్షిస్తున్నట్లు కనపడింది.**

ఆ కలలో కనిపించిన కొన్ని ముఖ్య దృశ్యములు :-

(1) వివిధ దేశముల నుంచి వచ్చిన కొందరు భక్తులు పుట్టపర్తిలో అనేక కాలనీలు నిర్మించుకొనుచున్నట్లు, స్వామి కొండపై నుంచి దిగివచ్చి తన్ను తాను అనేక బాబాలుగా రూపములు ధరించి ఏక కాలములో అన్ని కాలనీలలోని అందరికి దర్శనము యిస్తున్నట్లు అగుపించారు.

(2) స్వామి, వందలకొలది బాబాలుగా మార్పు చెంది, ప్రతి దేశములోని వారి వారి కేంద్రములకు వెళ్ళి దర్శనం ప్రసాదిస్తునట్లు...

(3) పుట్టపర్తి, చాలా వైభవోపేతంగా పెరిగి పోయి, చాలా అభివృద్ధి చెందిన నగరంగా, న్యూయార్క్ నగరమంత పెద్దదిగా మారి, అత్యాధునిక సౌకర్యాలతో నిండి యున్నట్లు కనిపించింది.

(4) తనచే ఎంపిక చేయబడిన చాలా కొద్దిమంది భక్తులతో స్వామి పరివృతమై ఉన్నట్లు అగుపించారు.

(5) భవిష్యత్తులో స్వామి యొక్క క్షణకాల దర్శనము లభించటం కూడా, భక్తులకు గగనమవుతుందన్న తీరులో దృశ్యము కనిపించింది.

డా॥ హనుమంతప్ప గారు ప్రఖ్యాతి చెందిన విద్యావేత్త. వారికి స్వామితో చాలా చాలా ఆశ్చర్యకరమైన అనుభవాలు ఉన్నాయి. “యుగావ

తారి సత్యసాయి బాబా" అన్న గ్రంథంలో వారికి స్వామి ఏవిధంగా మార్గదర్శిగా నిల్చి కలల్లో దర్శనమిచ్చి అనేక సంఘటనలు వివరించారో, చాలా విపులంగా పేర్కొన్నారు. స్వామి స్వయంగా ఆ కలలన్నింటినీ ధృవపరిచినట్లు (పేజి8) పేర్కొన్నారు. ఇంకా, ఆశ్చర్యకరమైన విషయ మేమిటంటే ఆ **పుస్తకాన్ని స్వామి స్వయంగా మార్చి 7, 2008 మహా శివరాత్రి రోజున అనుగ్రహించి విడుదల చేసారు.** స్వామి పునరాగమనముతో, యీ కలల్లో తనకి యిచ్చిన దివ్య దర్శనాలన్నీ మహా అందంగా రాబోవు కాలంలో చోటు జేసుకుంటాయి. స్వామి తమ భౌతిక కాయాన్ని వీడుటకు ముందే, స్వామి భక్తులకు భవిష్యత్తులో జరగబోవు దివ్య దర్శనములు కలలో ప్రాప్తించుట అభూత కల్పనలు కాదుగదా! ఇట్టి కలలను, మనము అభూతకల్పనలని సులువుగా కొట్టి పార వేయగలమా? ఇట్టి దర్శనములు కేవలము భక్తుల యొక్క భ్రమలు మాత్రము కావని, స్వామే అనేక మార్లు మనకు స్వయంగా వ్యక్త పరిచినారు గదా!

**" నేను కలలో దర్శనమిచ్చినానంటే, ఆవ్యక్తికి ఏదో సందేశం తెలియజేయటానికే. అది సహజంగా మీరు ఊహించుకొనునట్లు కల కాదు. కలల్లో మీరు అనుభవించు సంఘటనలు కేవలం మీ యొక్క ఊహల భ్రమలని, తలంచవద్దు.** –స.శివం.సుం. 4వ భాగం, పేజి.100

స్వామి అనుగ్రహంతో, చాలా మంది సాయి భక్తులు తమ అనుభవాలు, స్వామి తమరాక గురించి నాకు అనుగ్రహించిన అనుభవాల్లాంటివే నాతో పంచుకోవటము, నేను అదృష్టంగా భావిస్తున్నాను. స్వామి మరలా తిరిగి వస్తారని, కొంత మంది వారివారికి స్వామి ఒసంగిన దర్శనాలు, కలలద్వారా వారు తెలుసుకున్న దేమిటంటే, స్వామి అంతకు ముందు మాదిరిగా కాకుండా, ఇంకా ఉన్నతమైన, మహాద్భుతమైన సంఘటనలు, సాక్షాత్కారాలు, దర్శనాలు వివిధదేశాలలో ఉంటున్న ప్రజలకు చూపించబోతున్నారని, ఇంకా కొంతమంది భక్తులు, స్వామి మరలా తిరిగి వస్తున్నట్లు దర్శించుకున్నారు.

శ్రీ జైరోబోర్జాస్ గార్కి కలలో స్వామి మరలా తిరిగివస్తారనే దృశ్యము మహాద్భుతము. వీరు వెనిజూలాకి చెందినవారు. 1988సం॥ నుంచి వారు స్వామి భక్తులు. వారు, ఓర్లాండో, కొలంబియా, మెక్సికో మరియు వెనిజులాల్లోని, వివిధ సాయి సేవా కేంద్రములలో అనేక క్రియాశీల పదవులను సాయి సంస్థల్లో చేబట్టి ఉన్నారు. వారు ప్రశాంతి నిలయంకు అనేకమార్లు వెళ్ళారు. స్వామి ఆదేశానుసారం, వారు1997-98 లో ఒక సంవత్సరం పాటు స్వామి ఆశ్రమంలో ఉన్నారు. ప్రస్తుతం వారు కొలంబియాలోని బోగోటాలో ఉన్నారు.



మానవ చరిత్రలోనే ఒక అద్భుతమైన ఘడియ త్వరలో జరగబోవుచున్నదని, ఒక అసాధారణ సంఘటన చోటు చేసుకోబోతున్నదని, తనతోటిసాయి భక్తులకు ప్రచారము గావింపుమని ఏప్రియల్ 29, 2012న స్వప్నంలో దృశ్యరూపమున స్వామి అనుగ్రహించి వారిని ఆదేశించారు. మూలం: స్పానిష్ భాషలో వివరింపబడిన సారాంశము యొక్క అనువాదము, యీ క్రింద పొందుపరచుచున్నాము[1].

గత రాత్రి నేను యింటికి చేరుకునే ముందు, ఏమేమి సంఘటనలు భవిష్యత్తులో జరగబోవుచున్నవో దానికి సిద్ధపడమని స్వామి చెపుతున్నట్లు నాకు అనిపించింది. "నీవు సిద్ధంగా ఉన్నావా? నీవు సిద్ధంగా ఉన్నావా? "అని మరీమరీ అడుగుతున్నట్లు స్వామి కంఠ ధ్వని వినిపించింది. ఇంకా గట్టిగా స్వామి అడుగుతున్నట్లు అనిపించింది. మొదట నాకు చాలా భయము వేసింది. స్వామికి ఎలా ప్రత్యుత్తర మివ్వాలో తెలియక, నేనింటికే వెళ్ళదలచుకోలేదు. స్వామీ! నీవు నా తండ్రివి. నేను నీ కుమారుడను. నీ ప్రేమకు, రక్షణకు పాత్రుడను. నీవు నా తండ్రివి, దేవుడవు నేను అనుక్షణం సిద్ధంగానే యుంటాను స్వామీ! అంటూ గాయత్రీ మంత్రాన్ని ఉచ్ఛరిస్తూ ఉండిపోయాను. నా ప్రేమమూర్తి, నా దైవము నన్నుతప్పక రక్షిస్తూయుంటాడని నా నమ్మకము స్వామీ! అన్నాను. స్వామి వాక్కు యింకా గట్టిగా వినబడటం మొదలైయ్యింది. ఏదో ఆసాధారణమైన సంఘటన జరగ బోవుచున్నదని, దానికి నన్ను సిద్ధం చేస్తున్నారని, నన్ను నేను దృఢపరచుకున్నాను.

నేను యింటికి చేరిన తరువాత, ప్రతిరోజు మామూలుగా నిద్రించు ముందుగాఁజేయు, నా పనిని నేను చేసుకుంటూ ఉండిపోయాను. చాలా అలసి పోవటం వల్ల ఎక్కువ పని చేయలేక గాయత్రీ మంత్రమును మననం చేసుకుంటూ నిద్రలోకి ఒరిగి పోయాను. స్వామి అద్భుతంగా నాకు కలలో స్పష్టంగా కనిపించారు. "నేను నా విద్యార్థులతో యున్నాను. అందులో ఒక విద్యార్థి పేరు నారద అని చెప్తూ స్వామి ఇతను పైనుంచి దిగివచ్చిన

[1]. శ్రీ జైరో బోర్జాస్ గారి అనుమతితో ఇక్కడ ప్రచురిస్తున్నాము. వారి స్పానిష్ మూలం వివరణ సోదరి ఆనాడైయాజ్ వియానాగారు అనువదించారు. వీరు జైరో గార్కి, రచయితకి స్నేహితురాలు.

నారద మహర్షి అన్నారు. స్వామి అప్పుడు చేయి ఊపుతూ మావద్దకు వచ్చారు. చాలా అందంగా యవ్వన వయసులో ఉన్నట్లు కనిపించారు. మాకు అందరికి పాద నమస్కారము యిచ్చారు. నేను ప్రమాణం చేసి చెప్తున్నాను. స్వామి ప్రత్యక్షంగా, భౌతికంగా ప్రక్కనే యున్నట్లు ఆనంద అనుభూతిని పొందాను." నేను జీవించియే ఉన్నాను. నా దేహాన్ని వదలి వెళ్ళలేదు."అన్నారు. నా నేత్రముల నుంచి, ఆనంద భాష్పములు జాలు వారుతూ యుంటే, నన్ను చేతులతో స్పృశించి, కౌగిలించుకున్నారు. అప్పుడు స్వామి నా చేయి పట్టుకుని, ఇంటర్వ్యూ రూములోకి నన్ను తీసుకుని వెళ్ళారు. ఆ గదిలోకి వెళ్ళిన వెంటనే " నీవు తయారుగా ఉన్నావా?" అని నన్ను అడిగారు. 'ఇప్పుడు సమయము ఆసన్నమైనది. నువ్వు నాకు కావాలి. నేను చెప్పేది తు.చ.తప్పకుండా పాటించటానికి "సిద్ధంగా ఉండు". అన్నారు. వర్ణనకు సాధ్యం కానంత, అంతకు ముందు ఎప్పుడూ చవి చూడని, ఆనందాన్ని అప్పుడు అనుభవించాను. నేను, చేతులు ఎత్తి నా చేతులు నీవే స్వామీ! నీకు కావలసిన రీతిలో, వీటిని మీరు ఉపయోగించు కోండి" అన్నాను. ఇట్లాంటి అద్భుత ఆంతరిక ఆనందాన్నుంచి నన్ను దూరము చేయకు స్వామీ! నా స్వామికీ నాకూ ఇసుమంతయు వ్యత్యాసము లేదు. అని నేను తెలుసుకున్నానని, స్వామికి విన్నవించాను. అట్లాంటి శాశ్వత, సత్యానుభూతితో కూడిన ఆనంద ప్రవాహంలో మునిగి తేలుతూ యున్న, నాకు తిరిగి నిద్దరపోవాలని అనిపించలా.." కుమారా ! నాకు కొన్ని పనులు చేసి పెట్టటానికి, నీవు నాకు కావాలి" అని స్వామి అన్నారు. అప్పుడు అలాగే స్వామీ! అని సమాధనం చెప్తూ మీ యొక్క సంకల్పాన్ని నాకు యింకా వివరంగా, తెలియ జేయమని వేడుకున్నాను. దానికి స్వామి స్పందిస్తూ నవ్వుతూ, చాలా ప్రకాశవంతమైన కాంతిని నా శరీరం మొత్తం వ్యాపించి యుండునట్లు, అనుగ్రహించారు.

తర్వాత, స్వామి నన్ను నా సోదరి కోరో యొక్క మందిరం వద్దకు తీసుకుని వెళ్ళారు. (...)అక్కడ కోరో రోజూ ధ్యానం చేసుకునే కార్పెట్ ఉంది. అక్కడికి చేరుకున్న వెంటనే, స్వామి శ్రీరామచంద్రునిగా మారిపోయి, ఈ స్థలము నిరంతరము భగవన్నామము- ప్రేమలతో నిండిపోయి ఉంటుందని చెప్పారు. కోరో ఒక గొప్ప భక్తురాలు. ఆమె సర్వదా భగన్నా మము స్మరిస్తూ మనసులో భగవంతుణ్ని నిరంతరం మననం చేసుకుంటూ యుంటుందని స్వామి చెప్పారు. స్వామి, ఆప్రదేశాన్నంతా కలయ



తిరుగుతూ, నేత్రముల నుండి ఆనంద బాష్పములు వర్షిస్తూ యుండగ, మహదానంతో తాండవ నృత్యము చేస్తూ అనుగ్రహవర్షము కురిపిస్తూ యీ విధంగా చెప్పారు. రామనామంతో యీ స్థలము ప్రకాశిస్తూ యుంటుంది. కోరో గొప్ప భక్తురాలు గనుక, రామానుగ్రహానికి పాత్రురాలు గనుక, అట్లాంటి పరమ దివ్య ఆనంద స్థితి నుంచి, రాముని రూపంలో యున్న తనను తాను తిరిగి బాబాగా మార్చుకుని యీ విధంగా చెప్పారు." నేను దైవాన్ని, అంతేకాకుండా, అన్ని నామములు, అన్ని రూపములు నేనే"

ఇట్లాంటి దివ్య అనుభవాన్ని పొంది, మేమంతా మరలా ఇంటర్వ్యూ రూమ్‌లోకి తిరిగి వచ్చినట్లైంది. " స్వచ్ఛమైన హృదయము గల భక్తులు, దైవత్వాన్ని, నిరంతర నామస్మరణతోనే ఆవిర్భవింప చేసుకోగలరు. ఆకోవకు చెందిన భక్తురాలే 'కోరో'". ఇట్లాంటి భక్తే నా హృదయాన్ని నిమురుతుందని స్వామి ఆనంద బాష్పాలతో చెప్తూ యీ విధంగానే భక్తులందరూ నడుచు కోవాలన్నారు.

**మానవజాతి చరిత్రలోనే, ఒక ప్రత్యేకతను సంతరించుకున్న క్షణాన్ని మీరు త్వరలో చూడబోవుచున్నారని అతి తర్వలోనే భగవంతుని యొక్క శక్తిని వైభవాన్ని, మీరు ఎప్పుడూ చూడని విధంగా , మీ తలంపులకు అందని విధంగా తిలకించబోతున్నారు, అనీ స్వామి స్పష్టంగా నొక్కి వక్కాణించారు. అట్టి సమయం చాలా దగ్గరలోనే ఉంది.(...)**

" స్వామి యింకా యీ విధంగా చెప్పారు." నా భక్తులు యీ స్వప్నము నుంచి మేల్కొనాలి. నేను దేహాన్ని గాను. ఒక్క దైవ స్వరూపానికే పరిమితం కాదు. అన్ని పేర్లు, అన్ని రూపాలూ నావే. శాశ్వతమైయుండి, కొలవటానికి అంతు చిక్కని భగవంతుని, ఒక రూపానికే పరిమితునిగా జేయుట ఎలా సాధ్యము? అట్టి నన్ను పరమానంద స్థితికి చేరుకున్నానని, సమాధిలోనో, మహాసమాధిలోనో యున్నానని ఏవిధంగా చెప్పగలరు? నేనే దైవమైనప్పుడు, నేను ఎల్లవేళలా ఆనందంగానే యుంటాను. పరమా నందస్థితే నా అసలు స్వరూపము. మీరంతా ఏ మోక్షము, కైవల్యము, ఏ ఆనందము కొఱకై ఎదురు చూస్తున్నారో ఆ పరిపూర్ణ ఆనందమునకు మూలము నేనే."

**ఓ భక్తులారా! మేల్కొండి, మేల్కొండి, మేల్కొనండి. గొప్ప గొప్ప ఋషులు, సిద్ధులు, సాధువులు, యోగులు దేనికోసమైతే యుగ యుగాల నుంచి ఎదురు చూస్తున్నారో, ఆ సమయము ఆసన్నమౌతోంది. నేనెవరినో తెలుసుకోండి. నా ఘనత, నా సర్వవ్యాపకత్వము నా దివ్యత్వము తెలియ జేయు అసాధారణ సంఘటన మీ ముందు తెరుచుకోబోతోంది. ఆ అద్భుత ఘడియలో ఎన్నెన్ని మార్గాల ద్వారా నేను తిరిగి రాబోతున్నానో, అది**

**యిప్పుడు మీ ఊహలకి అందదు. నన్ను నమ్మండి, నాపై పూర్తిగా నమ్మక ముంచండి. శరణాగతులు కండి. నా వైభవము, నా గొప్పదనాన్ని అతి త్వరలో మీరందరూ తెలుసుకొనగలరు.**

" ఇప్పుడు నీవు ప్రపంచమంతా తిరుగుతూ, నా యీ సందేశాన్ని ప్రచారం చేయి. అందరిని సిద్ధంగా ఉండమని బోధించుము. ఇది అపూర్వ ఘట్టం, అద్భుత అవకాశం, మానవ చరిత్రలోనే అత్యంత వైభవోపేతమైన సంఘటన జరగబోవుచున్నదని, నీవు అందరికీ దెలియజేయుము. స్వామి యీ విధంగా తన సందేశము వినిపించి అంతర్ధానమైనారు. నేను కన్నీరు కారుస్తూ శ్రద్ధగా అన్ని మాటలు విని స్వామీ నన్ను వదలి వెళ్ళకు మళ్ళీ నన్ను యీ మాయా ప్రపంచంలో పడవేయకుము అని వేడుకొన్నాను. ఎల్లప్పుడు నాబుద్ధిని నీ భావములతోనే శాశ్వతంగా ఉండునట్లు చూడమని, మరియు నా ప్రాపంచిక విషయాలన్నీ తననే చూచుకుంటూ యుండమని అభ్యర్థించాను. అప్పుడు నా చేతులు పూర్తిగా ఎల్లప్పుడు స్వామి సేవకు ఉపయోగపెడతానని, స్వామికి విన్నవించుకున్నాను. ఓ స్వామీ! ఎల్లప్పుడూ నీవే అన్నియు చేసేవాడవు. ఈ ఆనంద సాగరంలో నన్ను ఎల్లప్పుడు ఉండునట్లు చూడుము. స్వామి చేతులతో చేయి కలిపి స్వామికి వీడ్కోలు పలికాను. ఓ స్వామీ! నిన్ను నేను ఎంతగానో ప్రేమిస్తున్నాను. నీ ప్రేమానంద బాష్పజలములో నేను ఓలలాడాను అని మనవి చేసుకున్నాను

**జైరో బోర్హెస్ కన్న కల వృత్తాంతము :** ఒక అద్భుతమైన, ఆశ్చర్యకరమైన సంఘటన చోటు చేసుకోబోతోందనటానికి చక్కటి నిదర్శనము. స్వామి మరలా తిరిగి పునర్దర్శనము యిస్తారని చూసే కలల యొక్క సారాంశాన్ని నాతో పాలుపంచుకున్న చాలామంది సాయిభక్తుల వివరణలు స్వామి తప్పక తిరిగి వస్తారన్న దాన్ని బలపరుస్తున్నాయి. అట్టి కలలుస్వామికి భక్తునికి మధ్య ఆంతరంగిక విషయాలు కనుక వాటి వివరములు ప్రచురించటంలేదు. అదే భౌతిక దేహంతో స్వామి మరలా తిరిగి వస్తారని, భక్తులకు తెలియజేయుట కొఱకు, యీ విషయాల్ని క్లుప్తంగా ప్రస్తావించటం జరిగింది. స్వామి వివిధ ప్రదేశాల్లో చాలామంది ప్రజలకు, ఒకేసారి దర్శనం ప్రసాదించినట్లు వారు ఒకే రకమైన కలలు కనటం చాలా ఆశ్చర్యకరమైన విషయం. సరిగ్గా ఇట్లాంటి భవిష్య వాణులే కొన్ని మతగ్రంథాల్లో ఉండటం నేను చూశాను. వాటి వివరాలు రాబోవు అధ్యాయాల్లో మనము చూస్తాము.

స్వామి మనకోసం, ఇంకా ఏమేమి సిద్ధ పరిచి ఉన్నారో, కాలమే మనకు తెలియచేయగలదు. అనేకమంది సాయి భక్తుల అనుభవాలు, కలల ద్వారా నేను తెలుసుకున్నది ఏమిటంటే, ఏదో ఒక అత్యంత అద్భుతమైన సంఘటనను మనము తప్పక చూడబోతున్నామన్నది.



# ఆరవ అధ్యాయము

## అద్భుతమైన నాడీ గ్రంథాలు

వేల సంవత్సరాలకి పూర్వమే మన భారత దేశ మహర్షులు పవిత్రమైన తాళపత్రాల మీద లిఖింపబడిన భవిష్యవాణియే, మన తాళపత్ర గ్రంథాలు. ఇవి పద్యరూపాలలో పురాతన తమిళ భాషలో వ్రాయబడి యున్నాయి. మానవ అభ్యున్నతి, వారి భవిష్యత్తు ఎలాయుంటుందో, ప్రతి వ్యక్తి గుఱించిన విషయాలు, ధర్మాన్ని కాపాడటానికి వ్రాయబడి యున్నాయి. ఈ నాడీ గ్రంథాల్లో ప్రతి వ్యక్తికి సంబంధించిన వారి వారి నడవడి ఎలా ఉంటుంది? వారి కుటుంబచరిత్ర వారివారి ఆధ్యాత్మిక జీవితం ఎలాయుంటుందో, అని అసంఖ్యాకమైన ప్రజల భవిష్యత్తు అంతా ముందే తెలియబరిచారు. తమిళ భాషలో–నాడీ అన్న పదానికి వెదుకుట అని అర్థం. ఈ గ్రంథాల్లో మన పుట్టిన స్థలమేమిటి? మన జీవితాల్లో ఏ సమయంలో ఎలా యుంటాము? మొదలైన విషయాలు ఆగొప్ప ఋషుల చేత ముందుగానే తెలుపబడిఉన్నాయి. మానవ జాతి మొత్తం, వారి వారి జీవితాల్లో సంభవింపబోవు అన్ని విషయాలు చాలా సుస్పష్టంగా ఈ మహర్షులు ముందే చూసి దర్శించి తెలియజేశారు.

చాలామంది నాడీ జ్యోతిష్కులు, నాడీ గ్రంథ పాండిత్యం ఉన్న మహానుభావులు, భారతదేశంలో అనేకచోట్ల చాలా నాడీ గ్రంథాలని భద్రపరిచినారు. చోళ రాజుల పరిపాలనలో, 1000 సంవత్సరాల క్రితం, లిఖింపబడిన, తాళపత్రాలను ముఖ్యంగా తమిళనాడు రాష్ట్రంలో, చోళ రాజులు ప్రాముఖ్యమిచ్చి, వాటి ప్రాముఖ్యాన్ని గుర్తించి, భద్రతను చేపట్టినారు. చాలా నాడీ గ్రంథాలు, అనేకమంది మహర్షుల పేర్లతో లిఖింపబడియున్నవి, వాటిని భద్రపరచటం జరిగింది. ఉదాహరణకి, అగస్త్య నాడి, శుకనాడి, బ్రహ్మనాడి, కౌశిక నాడి మొదలయినవి. అవి అన్నియు పద్యరూపాలలో తమిళ భాషలో వ్రాయబడి యున్నాయి. అవి పరిశీలించి యథాతథంగా వివరించగల పండితులు చాలా తక్కువ మంది యున్నారు.

## సత్యసాయి అవతారాన్ని గురించి నాడీ శాస్త్రాల్లో చెప్పబడిన భవిష్యవాణి

1961 ఫిబ్రవరి సనాతన సారధిలో భగవాన్ సత్యసాయి బాబా వారి 500 సంవత్సరాల క్రితం లిఖించబడిన జాతకచక్రం గురించిన ఒక వ్యాసం వచ్చింది. న్యూఢిల్లీకి చెందిన డా॥ ఈ.వి.శాస్త్రి అను ఒక నక్షత్ర శాస్త్ర పరిశోధనా సంస్థ సభ్యులుగాయున్న వారు వందల సంవత్సరాల క్రితమే తాళపత్ర గ్రంధాలపై లిఖించబడిన, సత్య సాయిబాబావారి జీవితం గుఱించిన, అద్భుతమైన వివరాలు అందచేసారు. శ్రీ గంజూరు నారాయణ శాస్త్రి అన్న బెంగళూరుకు చెందిన నక్షత్ర శాస్త్రవేత్త శుకనాడిని పరిశీలించి యిచ్చిన వివరాలు శకుంతల బాలు తన 'లివింగ్ డివినిటీ' అన్న ఆంగ్ల గ్రంధంలో వివరించారు.

ఈ నాడీ గ్రంధాలలో చాలా వివరంగా, కరెక్టుగా సత్యసాయి బాబా వారి వంశవృక్షం, మరియు అనేక సత్యాలు స్వామి గురించి వివరంగా చెప్పబడి ఉన్నాయి. ఈ నాడీ గ్రంధాలు స్వామి గురించి చెప్పబడిన విషయాలు చాలామంది స్వామి భక్తులు అవి అన్నీయు నిజమని ధృవపరి చారు. ఇంకా సాయి అవతార వైశిష్ట్యాన్ని, గొప్పతనాన్ని, ఆయన జరుప బోవు మహా అద్భుతాలన్ని చాలా వివరంగా ఈ నాడీ గ్రంధాల్లో చెప్పబడి యున్నాయి.[1].

సత్యసాయి అవతార వైశిష్ట్యాన్ని, కొన్ని నాడీ గ్రంధాలు ఏ విధంగా వివరించియున్నాయో ఇపుడు మనం చూద్దాం.

[1].నాడీ జాతకాలకు ఆధార గ్రంధాలు

**ఎ.**"లివింగ్ డివినిటీ"– శకుంతలా బాలు.

**బి.**"శ్రీసత్యసాయి అవతార్– వి.అరవింద బాలసుబ్రమణ్యం...

**సి.**"ఇన్ సెర్చ్ ఆఫ్ సాయి డివైన్– శ్రీ సత్యపాల్ రుహేలా.



### బ్రహ్మనాడి :

1.ఈ అవతారము పర్తిలో సత్యసాయి నారాయణ అన్న పేరుతో, చిత్రావతి అన్న నదీతీరంలో వస్తుంది. అవతార పురుషుడైనప్పటికి, పర్తిలో ఉద్భవించిన మానవ మాత్రుడు అన్న భ్రమను కలిగిస్తాడు. ఇది శివ–శక్తి స్వరూపము. ఈ అవతారపు పూర్వపు అవతారం షిర్డిసాయియే, సత్య సాయిగా యిప్పుడు అవతరిస్తాడు. పర్తి అన్నగ్రామంలో చాలా ప్రశాంతంగా యున్న వాతావరణం లో ఈ అవతారం చాలా ప్రశాంతంగా ఉంటాడు. ప్రశాంత వాతారణ ఛాయలో ఉంటాడు.

2. శ్రీకృష్ణ, శ్రీలింగ, శ్రీరుద్ర, కాళీ, శ్రీశక్తి, శ్రీవిష్ణువుల యొక్క పునరావి ర్భావమే, ఈ సత్యసాయి అవతారము.

3. సత్యమే ఆయన స్వరూపము, మానవాకారం ధరించిన సత్యమే, మహారాష్ట్రలోని షిర్డిలో షిర్డిబాబాగా చిరిగిన దుస్తులతో, బీద వానిగ, అతి సామాన్యంగా ఉన్న షిర్డీబాబాయే, సత్యనారాయణగా అవతరిస్తాడు.

4. బ్రహ్మ, విష్ణు, శివ, త్రిమూర్త్యాత్మకమైన దత్తాత్రేయ అవతార స్వరూపమే ఇది.

5. ఈ జగద్గురువు శక్తి రూపంలో వస్తారు. సత్యసాయి తరువాత ప్రేమ సాయిగా అవతరిస్తారు.

6. 'గురువారం' యీ బాలసాయి అవతారానికి చాలా పవిత్ర దినం.

### అగస్త్య నాడి :

1. దయా స్వరూపులైన జగత్పితయే ఈ అవతారం.

2. శ్రీ సత్యసాయి అవతారము క్షణాల్లో స్వస్థత చేకూర్చే ఆరోగ్య ప్రదాయి.

3.ఈయన చాలా విద్యాలయాలు స్థాపిస్తాడు.ధార్మిక జీవనంపై వాఙ్మయాన్ని సిద్ధంచేసి, ఆయన జీవితపర్యంతం, ధర్మస్థాపన కొఱకు దైవభక్తిని ప్రభోదిస్తాడు.

4. ఈయన బాల్యంలోనే తన యిల్లు వదిలిపెడతాడు. ధర్మస్థాపన కొరకు ఒక సంస్థను స్థాపిస్తాడు. తన జీవిత లక్ష్యమే అది. గత అవతారంలో అతను షిర్డీలో షిర్డీసాయి.

### శుకనాడి:

1. ఆయన తన దయ, ప్రేమ, జ్ఞానాలతో నిత్యానందాన్ని ప్రపంచానికి అందిస్తాడు.

2. ఆయన నివశించే చోటే ఒక పవిత్ర తపోభూమిగా మారుతుంది. మానవ కళ్యాణానికి పాటు పడటం ద్వారా వారు నిరంతరం ఆనందోత్సాహాలు పొందుతారు.

3. అన్ని అవతారాల స్వరూపమే ఈ అవతారం.

4. ఈయనొక గొప్ప సంకల్పసిద్ధుడు. కానీ ప్రపంచ ధనముపైన, కీర్తి, గౌరవ ప్రతిష్టల పైన ఎట్టి దృష్టి యుండదు.

5. ఈయనకు ఇచ్ఛా మరణ ప్రాప్తి ఉంటుంది. తను తలచుకున్నప్పుడే శరీరాన్ని (త్యాగం) త్యజించే శక్తి ఉంటుంది. ఎప్పుడూ నిర్వికల్ప సమాధి స్థితిలో యుంటాడు. ఎల్లపుడూ ధర్మాన్ని కాపాడటానికే జీవిస్తూ యుంటాడు.

6. కష్టాల్లో ఉన్నవారికి ఆశ్రయం ఇస్తూ యుండటమే వీరి ముఖ్యోద్ధేశ్యంగా ఉంటుంది.

7. ఆయన ధర్మాన్ని ప్రభోదించడానికే అవతరించాడు. ఆయన నివశించే చోటు చాలా పవిత్రమైన స్థానంగా రూపొందుతుంది.

8. ఆయన అనేక రూపాలలో దర్శనమిస్తూఉంటాడు. చాలా చోట్లలో ఒకేసారి కనిపిస్తూ ఉంటాడు. అందరి కష్టాల్ని, ఆటంకాల్ని తొలగిస్తూ అపాయాల నుండి తప్పిస్తూ ఉంటాడు.

9. ఎక్కువ చక్రాలతో యున్న వాహనాలు కలచోట ఈయన తన ఆశ్రమాన్ని స్థాపిస్తాడు. (వైట్‌ఫీల్డు, బెంగళూరు, మరియు పుట్టపర్తి వద్ద గల రైల్వే స్టేషన్ల గురించి) ఆధ్యాత్మిక శక్తితో కూడిన విద్యాసంస్థలను పునః స్థాపిస్తాడు.

10. తనపై పూర్తి నమ్మకంతో సర్వస్య శరణాగతి చెందిన భక్తులకు తన సర్వజ్ఞత్వాన్ని చూపిస్తూ యుంటాడు. వాళ్ళపాపాల్ని పోగొట్టు కోవడానికి అవకాశాన్ని కలిగిస్తూ యుంటాడు. అట్టివారికి ప్రశాంతిని, మంచిని అనుగ్రహిస్తూయుంటాడు.

11. ఆయన గొప్పదనం ప్రపంచవ్యాప్తమౌతుంది. ప్రపంచ వ్యాప్తంగా నున్న ప్రజలు ఆయన వద్దకు వస్తూ ఉంటారు. కాని వారి వారి గత జన్మ కర్మ బంధాలననుసరించి అందరూ ఆయన అనుగ్రహాన్ని పొందలేరు.

12. ఆయన గొప్ప బ్రహ్మచారి. ధర్మాన్ని స్థాపించడానికి యితరులకు సహకరిస్తూ ఉంటాడు. స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని చూపిస్తూ యుంటాడు. ఆయన స్త్రీలలో తల్లిలాగా ఉంటారు. (సాయిమాత)

13. ఆయన ప్రేమకు పూర్ణరూపము (ప్రేమస్వరూపము) ఆనంద స్వరూ



పము. జ్ఞాన స్వరూపము. కేవలం జ్ఞానాన్ని పొందినవారు మాత్రమే ఆయనను ఆనంద స్వరూపునిగా తెలుసుకుని ఆనందాన్ని అనుభవిస్తారు.

14. ఒక మూగవాడు వినగలడు మాత్రమే గాని, మాట్లాడలేడు. అలాగే ఆయన మాటలకు అందక, అనుభవానికి మాత్రమే దగ్గరగా ఉంటాడు. సంపూర్ణ సమదృష్టి ఆయన తత్వం. ఈయనకి ప్రపంచం తృణ ప్రాయమైనది. ఈయన ప్రజల అభిప్రాయాల్ని పట్టించుకోకుండా ఏది ధర్మమో అదే చేస్తాడు.

15. ఈయన షిర్డీబాబా అవతారమే. షిర్డీబాబా చేసిన ప్రార్ధనల ఫలితంగా ఈయన అవతారం దాలుస్తాడు.

16. ఈయన షిరిడీ సాయి భక్తులకు సమాధి దర్శనం ప్రసాదిస్తాడు. అట్లాగే ఈ దేహం విడిచాకా సత్యసాయి భక్తులకు పుణ్యస్థలమైన వైట్ ఫీల్డులో సమాధి దర్శనం అనుగ్రహిస్తాడు.

17. భగవద్గీతలో కృష్ణభగవానుడు చెప్పినట్లు మానవాభ్యుదయానికి ఆయన జీవితం అంకితం.

18. ఆయన బృందావనం, బెంగళూరులో ఒక వృక్షాన్ని ప్రతిష్ఠిస్తాడు. ఆ స్థలము సిద్ధి క్షేత్రంగా ప్రాచుర్యం చెందుతుంది. కల్పవృక్షంగా ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటుంది.

19. సత్యసాయిబాబా దర్శనమాత్రం చేతనే ప్రతి వారిలో మంచితనం అభివృద్ధి చెందుతుంది. ఆయన అనుగ్రహమాత్రం చేత కష్టాలన్నీ తొలగిపోతాయి. వారి వారి అభివృద్ధికి మార్గదర్శకత్వం వహిస్తాడు.

20. ఆయన ఒకేసారి అనేక చోట్ల దర్శనం ప్రసాదిస్తాడు. ఆయన ఒక్కచోటే ఉన్నప్పటికీ చాలా దివ్య కార్యాలు చేస్తూయుంటాడు. అనేక వస్తువులు సృష్టిస్తూ యుంటాడు.

21. ఈయన సహనంతోను, ప్రేమ స్వభావంతోను ఉంటారు. అందర్నీ సమానంగా చూస్తూ యుంటారు. అజ్ఞానం వల్ల తప్పులు చేసిననూ ఎవ్వని మనోభావములను కించపరచడు. ఎవరి పైనను కోపాన్ని ప్రదర్శించడు.

22. ఆయన వాక్కులు వినోదానికి చెప్పినట్లు పైకి కనిపించినా ఆయన సత్యమునే పలుకుతూ యుంటాడు. తనయొక్క వైభవాన్ని అప్పుడప్పుడు ప్రదర్శిస్తూయుంటారు, మంచితనాన్ని మంచి భావాల్ని మనలో నింపటానికి మాత్రమే యిలాంటి ప్రదర్శనలు చేస్తూ ఉంటారు.

23. ఆయనకు నయం చేసే శక్తులు ఉంటాయి. తన చేతిలోని నీటితోనే

శరీరంపై చల్లుకుని తనని తాను ఆరోగ్యవంతునిగా చేసుకుంటాడు. ఆయన ఈ భూలోకంలోని ప్రజలకే కాక, పైలోక వాసులకు దేవతలకు కూడా నయం చేసే శక్తులు ఉపయోగపెడుతూంటాడు.

24. ఆయన ప్రణాళిక ప్రకారం సాయినాథుడు, ప్రతి పని నిర్వహిస్తూ యుంటాడు.

25. పవిత్ర పరిచే శక్తులు అనంతంగా ఆయన వద్ద ఉన్నాయి. కేవలం ఆయన దర్శనం గాని, ఒక్క చిన్న మాటగాని ఎవరినైనా పవిత్రుని గావించ గలదు. జీవితకాలాన్ని కూడా పెంచగలిగే శక్తి వీరికి యున్నది.

26. ఈ సాయినాథుడే మహా విష్ణు స్వరూపము.

27. తన వయసుతో సంబంధం లేకుండా సత్యసాయి బాబా ఎల్లపుడూ యువకుని లాగానే ఉంటారు.

అన్ని అవతారాల స్వరూపమే శ్రీ సత్యసాయి బాబా అని పైనాడీ గ్రంథాలలో విస్తారంగా వివరింపబడింది. ఈ రోజు మనం చూస్తున్న ప్రతి విషయం నాడీగ్రంథాల్లో చెప్పినట్లుగా సుస్పష్టంగా మనకు కనబడు తున్నాయి. శుకనాడిలో ఇంకొక అద్భుతం చెప్పబడింది. **"ఈ సత్యసాయి అవతారం ఒక పర్వదినాన బంగారు సూర్యరథాన్ని అధిరోహించి దర్శన మిస్తాడు."** (స్వర్ణ ఆదిత్య రథం) భక్తులు ఊరేగింపులో యీ రథాన్ని లాగుతారు. ఈ అద్భుతం ఈశ్వరనామ సంవత్సర భాద్రపదమాస బహుళ పక్ష షష్ఠితిథినాడు ఉదయం 7గం॥ ఒక మహా పర్వదినాన ఈ అద్భుతం జరుగుతుంది. అంటే భారత పంచాంగం ప్రకారం ఆరవనెల అంటే, సెప్టెంబరు 15 నుండి అక్టోబరు 15 మధ్య.

1997 సంవత్సరంలో జరిగిన పాదుకా మహోత్సవానికి సాయి పాదుకాట్రస్టు, అధ్యక్షులైన శ్రీ సుబ్రహ్మణ్యం చెట్టియార్, మధురై భక్తుడు (తమిళనాడు) ఒక బంగారు రథాన్ని స్వామికి తీసుకువచ్చాడు. ఈ రథం బంగారు సింహాసనంతో బంగారు ఛత్రము, ఒక పెద్ద బంగారు సూర్య బింబం బ్యాగ్రౌండ్‌తో అలకంరింపబడి ఉంది. ఈ సత్య సాయి అవతారం శివశక్తి స్వరూపం, అని నిరూపించేటందుకు గాను శివుడు, పార్వతుల బంగారు మూర్తులు రథం మధ్యలో ఉంచారు. ఈ రథాన్ని చతుర్ముఖ బ్రహ్మ, సృష్టికర్త రథ చోదకుడుగా ఉండునట్లు ఏర్పాటు చేసారు. నాడీ గ్రంథాల్లో వివరింపబడి నట్లుగా 22 సెప్టెంబరు 1997 శివునికి ప్రియమైన సోమవారంనాడు చరిత్రలో నిలిచి పోయే విధంగా ప్రశాంతి నిలయ సాయి



కుల్వంతహాలులో భగవాన్ సత్య సాయిబాబా ఉ॥ గం॥7.05ని॥లకు, ఈ బంగారు రథాన్ని భక్తులందరి మధ్య అధిరోహించారు. స్వామి తన మందిరం నుంచి, విద్యార్థులు, వేద పండితుల వేద మంత్ర పఠనంతో యీ రథంపైకి అధిరోహించారు. ఉదయపు సూర్య కిరణములు ఆహ్వాని స్తున్న శోభతో స్వామి రథం ప్రశాంతి మందిరం వరకు సాగిపోయింది. ఇది సత్యసాయి భక్తులు దర్శించారు.

శ్రీ సత్యసాయి అవతారం గురించి వేల సంవత్సరాల క్రితమే, నాడీ గ్రంథాలలో అద్భుత భవిష్యవాణిని గ్రంథస్థం చేయటం జరిగింది. కొన్ని నాడీ గ్రంథాలలో రానున్న కొద్ది రోజుల్లో భగవాన్ సత్యసాయి అవ తారం జగద్వ్యాప్తమౌతుందని, స్వామి యొక్క అద్భుత శక్తులు ప్రపంచ ప్రజలకి తెలియచేయబడతాయని, భగవాన్‌ని గొప్ప చక్రవర్తిగా ప్రపంచ ప్రజలు కొలుస్తారని, చెప్పబడినవి.

1. కలి ప్రభావం యింకా బాగా ప్రబలిపోయినపుడు, ప్రపంచ ప్రజలు స్వామి యొక్క యదార్థ శక్తిని, జ్ఞానాన్ని గుర్తిస్తారని, స్వామిని సర్వ శక్తిమయుడుగా స్వీకరిస్తారని, స్వామిని గొప్ప చక్రవర్తిగా కీర్తిస్తూ తలవంచి పాదాభివందనం చేస్తారని చెప్పబడింది.

2. ఆయన యొక్క మనోసంకల్ప మాత్రంచేత, ఇంధనం అయిపోయినా కూడా విమానం గాలిలో క్షేమంగా ఎగర గలుగుతుంది.

3. సమయమాసన్నమైనపుడు, ఒక ధర్మ స్థాపాన్ని స్థాపిస్తారు. అప్పటి నుంచి, ధర్మము విస్తృత స్థాయిలో అభివృద్ధి చెందుతూ యుంటుంది.

4. ప్రస్తుతం ఈ అద్భుతశక్తి పది శాతం మాత్రమే ఉపయోగపడుతోందని, తర్వాత ప్రపంచాన్ని రక్షించడానికి, ప్రకృతి భీభత్సాన్నుంచి ప్రజలను రక్షిం చటానికి యింకా పదియింతలు, ఆయన సంకల్పమాత్రం చేత వృద్ధి చెందు తుంది. తను మాత్రమే ప్రకృతి ప్రతాపాన్ని అణచగలరని నిరూపిస్తారు.

5. ప్రస్తుతం అధర్మం మూడు పాదాలు విజృంభించియుంది. ఇంకా మిగిలిన నాల్గవ వంతు కూడా ప్రబలి, అధర్మం వికృతతాండవం చేస్తుంది. అప్పుడు అందరూ అధర్మపరులుగా మారగా సత్య సాయిబాబా పూర్తి శక్తులతో విజృంభించి, అధర్మ వినాశనానికి ధర్మస్థాపనకు నాంది పలుకు తారు. ప్రజలందరూ యీ అద్భుతాన్ని తెలుసుకుంటారు. ఆయన దివ్య వైభవము ప్రస్ఫుట మవటానికి ముందు దుష్టత్వము, దుర్మార్గాలు అవధులు దాటాలి.

6. చాలా తక్కువ వ్యవధిలో ఆయన గొప్పదనం ప్రపంచ నలుమూలలకు విస్తరించి, భగవాన్ సత్యసాయిని అందరూ పూజిస్తారు.

## నాడీ గ్రంధాలతో నా అనుభవం.

నా(గ్రంథకర్త) సొంత పరిశోధనల వల్ల నేను తెలుసుకున్నదేమిటంటే, ఉత్తమమైన నాడీ గ్రంథ పరిశీలకుల చేత, చదివించి విన్నప్పుడు మాత్రమే ఈ యదార్ధము మనకు గోచరిస్తుంది. దక్షిణ భారతంలోని, ఒక ప్రఖ్యాత నాడీ గ్రంధ పరిశీలకుని ద్వారా 1997–98 మధ్య నేను నా జాతకం తెలుసుకున్నాను. సప్తఋషులలో ఒకరైన అగ్యస్త మహర్షి విరచిత నాడీగ్రంథాన్ని చదివించి ఎంత ఖచ్చితంగా తెలుసుకొన్నానంటే, నా తల్లి దండ్రుల పేర్లు వారి వారి పదవులు, నా బాల్యం నుంచి నేనెలా ఉంటాను, ఎక్కడెక్కడ పని చేస్తాను, అన్న విషయాలన్నీ తేటతెల్లంగా ముందే లిఖింప బడి ఉండటం, నాకు మహదాశ్చర్యాన్ని కలుగచేశాయి. ఇంకా నా భవిష్యత్తు ఎలా ఉంటుంది? నాజీవితంలో ఏఏ సంఘటనలు జరుగుతాయి అన్న సూక్ష్మాతి సూక్ష్మ విషయాలతో సహా పూస గ్రుచ్చినట్లు తెలియజేయటం జరిగింది. ముఖ్యాతి ముఖ్య విషయమేమింటే నా గురువు శ్రీ సత్య సాయి బాబావారని తెలియ చేయటం జరిగింది. ఈ భవిష్యవాణి యధాతథంగా యీ క్రింద పొందుపరిచాను.

**"నీకొక గురువు ఉంటాడు. వారు మూడు అవతారాలు దాలుస్తారు. మొట్టమొదట అవతారంమహారాష్ట్ర షిరిడీలో సాయిబాబా అవతారం, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో అవతరించిన శివశక్తి అవతారం, శ్రీ సత్యసాయి బాబాగా రెండవ అవతారం, అతని మూడవ అవతారం కర్ణాటక రాష్ట్రంలో ప్రేమసాయిగా అవతరిస్తాడు.**(...) నీ గురువు నుంచి నీకు అనేక స్వప్నాలలో నీకు సలహాలు లభిస్తాయి.

ఇక్కడొక విషయం మీకు ప్రస్తావించాలి. నేను సాయి భక్తుణ్ణన్న విషయం అతనికి తెలిసే ఆస్కారం లేదు. తర్వాత చాలామంది సాయి భక్తులు నాడీ పరిశీలకుని వద్దకు వెళ్ళి, ఆయన వారికి చెప్పిన జాతక విషయాలన్నీ నాకు సత్యమని ధృవపరిచారు. నాకు ఇప్పటివరకు చెప్పిన విషయాలు చెప్పినట్లు జరిగాయి. నా వివాహము, పిల్లలు, నా జీవిత ప్రస్థానము నా ప్రయాణాలు, నా ఆధ్యాత్మిక జీవితము మొదలైన విషయాలు సుస్పష్టంగా తెలుపబడి ఉన్నాయి.



నాడీ గ్రంధాలు స్వామి మహాభినిష్క్రమణము గురించి, తిరిగి దర్శనమిస్తారన్న విషయాలు ఏమైనా చెప్పాయా అంటే ఈ క్రింది వాక్యాలు చదవండి.

## నాడీ గ్రంధాలు, స్వామి యొక్క పునరాగమనం గురించి చెప్పాయి.

స్వామి మహాభినిష్క్రమణం గావించిన సరిగ్గా ఒక నెలకి తమిళ నాడు రాష్ట్రంలోని మధురైకి (దక్షిణభారతం) చెందిన 'వసంత సాయి' అన్న సాయి భక్తురాలు ఒకరు నిర్ధారణ చేసుకున్న సమయాని కంటే ముందుగా, నిష్క్రమణం చెందుట అన్న అంశముపై నాడీ గ్రంధాలు ఏమి చెబుతున్నాయి అన్న కోణంలో పరిశోధన గావించాలనుకున్నారు. నాడీ గ్రంధాలు భద్రపరచిన చోటైన వైదీశ్వరన్ కోవెలకు ఆమె తన సహచరుని ఒక్కరిని పంపించింది. చాలా అద్భుతాలు ఆమె తెలుసుకున్నారు. ఆమె స్వంత మాటల్లోనే:

**"నా సహచరుడు శ్రీ వెంకటరామన్ తక్షణమే వైదీశ్వరన్ కోవెలకు వెళ్ళి కొన్ని నాడీ గ్రంధాలను పరిశీలించారు. అన్ని నాడీ గ్రంధాలు స్వామి తిరిగి వస్తారని నొక్కి చెప్పాయి. నా ధ్యానంలో స్వామి స్వయంగా నాకు తెలియచేసిన విషయాలే శ్రీ వెంకటరామన్ (...)"స్వామి తిరిగి వస్తారు" అని ధృవీకరించడం జరిగింది. మరల జూలైలో శ్రీ వెంకటరామన్ వెళ్ళి స్వామి గురించి చెప్పబడిన మరికొన్ని నాడీ గ్రంధాలు పరిశీలించారు. అన్ని నాడీ గ్రంధాలు యీ విషయమే తెలియచేస్తున్నాయి (...)"స్వామి తిరిగి వస్తున్నారని"అని చెప్పాడు.**

శ్రీ వసంత సాయి సాధనలో చాలా ఉన్నత స్థితిలో ఉన్న వ్యక్తి. చాలా సంవత్సరముల నుంచి స్వామి భక్తురాలు. స్వామి ఆమెకు కలలో అనేక దృశ్యములు చూపించి అనేక అనుభూతులను కలుగచేసారు. స్వామి మీద యున్న ఆమె భక్తి ప్రభావం వలన స్వామి ఆమెను "రాధాభావ చైతన్య స్థితికి" ఒక ఆదర్శ నమూనాగా మలిచారు.

ఆమె చాలా గ్రంధాలు స్వామి గురించి, భగవతత్త్వాన్ని గురించి వ్రాసారు. ఆమె మొట్టమొదటి పుస్తకం "ముక్తి! ఇక్కడే! ఇప్పుడే!" 1997లో ముద్రింపబడింది. నేను ముందుగా ప్రస్తావించిన బంగారురథం తీసుకుని వచ్చిన శ్రీ సుబ్రహ్మణ్య చెట్టియార్, మధురై వారి యింటికి భగవాన్ శ్రీ సత్య సాయిబాబా వారు 1997మే 7న వెళ్ళారు. అక్కడ స్వామి వసంత

సాయి వ్రాసిన గ్రంధాన్ని చేతితో స్పృశించి ఆ వ్రాత ప్రతిపై తమ సంతకం చేసి అనుగ్రహవర్షాన్ని కురిపించారు. ఆమెపై స్వామి యొక్క సంపూర్ణ అనుగ్రహం ఉందనటానికి ఇంకేమి నిదర్శనం కావాలి? ఆమె ప్రస్తుతం మధురైకి దగ్గరలో నున్న 'ముక్తినిలయం' అన్న తమ ఆశ్రమంలో యున్నారు. ఈమె ఆశ్రమము ఆధ్యాత్మిక ఆనందానికి, పేదల సేవకి ముఖ్య దీపిక. నిరాశ్రయులకు ఆశ్రయం కలిపించడం, రోగులకు మందులు, విద్యాబోధన మొ॥నవి ఆశ్రమంలో నిత్యం జరుగు కార్యక్రమాలు.

స్వామి పునరుద్ధానమునకు చెందిన నాడీ గ్రంధాల భవిష్యవాణిని ఆమె అనువదించి "పవిత్ర నాడీ గ్రంధాల పరిశీలన" (సీక్రెడ్ నాడీ రీడింగ్స్) అన్న గ్రంథంగా ప్రచురించారు. దాని నుండి కొన్ని ముఖ్య అంశములు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఒక సామాన్య అవతార పురుషులు కాదు. అందరూ ఆయన శరీరాన్ని వదలి వెళ్ళారనుకుంటున్నారు. సామన్య ప్రజలే కాకుండ, ఆయన సన్నిహిత భక్తులు కూడా కొందరు యీ విధంగానే భావిస్తున్నారు. ఆయన భౌతిక దేహాన్ని వదలి వెళ్ళారన్నది నిజం. కానీ అదే శరీరంతో మరల తిరిగి వస్తారన్నది కూడా అంతే సత్యము. ముమ్మాటికీ సత్యము.

## "పవిత్ర నాడీ గ్రంధ పరిశీలనలు" అన్నగ్రంధం నుండి కొన్ని ముఖ్య విషయములు:

ఈ నాడి (విశ్వామిత్ర నాడి) పరిశీలించేటప్పటికి స్వామి భౌతిక దేహము మనముందు లేదు. అయినా కొంచెం అస్పష్టత. కాని ఆయన దేహం ఇక్కడే ఉంది. స్వామి మరల తిరిగి వచ్చి యీ దేహంలో ప్రవేశిస్తారు. తిరిగి వచ్చి ప్రవేశించడానికి స్వామి తన దేహాన్ని ముందు గానే సిద్ధం చేసుకుని యున్నారు. ఇది నిజం.
(రాజర్షి విశ్వామిత్ర నాడి, మే 25, 2011న పరిశీలించడం జరిగింది.) పుట 8.

చాలా అద్భుతాలు చూపిన ఈ శరీరం ఆందరూ దర్శించుకున్న ఈదేహం అసలైన దేహం కాదు. అది కేవలం మాయాదేహం మాత్రమే. (...)

శని తులారాశిలో ప్రవేశించగానే నిండుపున్నమి నాడు స్వామి మరల అదే దేహంతో దర్శన మిస్తారు. చాలా ఆశ్చర్యంతో ప్రపంచ ప్రజలందరూ దర్శనం చేసుకుంటారు. (అగస్త్యనాడి మే 27, 2011న పరిశీలించడం జరిగింది. పుట 20)



భగవాన్ దివ్య ఆత్మ, భౌతిక శరీరాన్ని వదలినప్పటికి, అదే ఆత్మ, అదే రూపాన్ని సంతరించుకుంటుంది. ఇది దైవ నిర్ణయం. (...) స్వామి మరీ అంత వృద్ధుడుగాను, యువకునిగాను ఉండరు. మధ్య వయస్కునిగా యీ దేహంతో దర్శనమిస్తారు. (రాజర్షి విశ్వామిత్రనాడి, పుట 86. మే 31, 2011న పరిశీలించబడినది.)

(...) ప్రస్తుతం ఆమె యొక్క దైవం సశరీరులుగా లేరు. వారు మరలా నూతన దేహంతో వస్తారు. (భృగునాడి, మే 31, 2011 నాడు పరిశీలించబడినది) పుట 96.

ఈ నాడి చదువుతున్నపుడు స్వామి ఆత్మిక స్థితిలో యున్నారు. (...) భౌతిక దేహంతో లేరు. మరల భూమి పైకి తిరిగి వస్తారు (...) స్వామి 88 సం॥లు వచ్చునప్పటికి ప్రపంచ ప్రజలందరూ సందేహాలేమీ లేకుండగా స్వామిని మనసారా ఒప్పుకుంటారు. తర్వాత 7 సం॥ల వరకు స్వామి యీ దేహంతోయుంటారు. (గోరక్కనాడి, పుట 26. పరిశీలన జూన్ 14, 2011)

"స్వామి మరలా క్రిందికి దిగి వస్తారు. 58-60 సం॥ల మధ్య వయస్కులుగా ఉంటారు. ఈ వయసులోయున్న దేహంగా స్వామి వారు మరలా వస్తారు. అపుడే తన వైభవాన్ని ప్రపంచ ప్రజలకు ప్రదర్శిస్తారు. సత్యాన్ని అందరూ గ్రహిస్తారు."
(ముచ్చముని నాడి, ఆగష్టు 5, 2011న పరిశీలింపబడినది. పుట 102)

శ్రీమతి వసంతసాయిగారు "పవిత్ర నాడీ గ్రంధ పరిశీలనలు" అన్న గ్రంథంలో ఇంకా చాలా చాలా ఆశ్చర్యకరమైన నాడీ పరిశీలనలు పొందుపరిచారు. ఒక్కొక్క మహర్షి తమకున్న దివ్యజ్ఞాన పరిధిలో స్వామి ఆకస్మిక అంతర్ధానాన్ని తెలియచేసారు. స్వామి తిరిగి రాబోవు సమయాన్ని స్వల్ప వ్యత్యాసంతో వారి వారి దృష్టికి గోచరమైన రీతిలో నాడీ గ్రంధాల్లో పొందు పరిచారు. కొన్ని నాడులు వేరు వేరు నక్షత్ర గణనములతో అనేక విధములుగా వివరించారు. క్రొత్తగా దేహంలో ప్రవేశించిన అనంతరం స్వామి నుండి మనం పూర్తి వివరాలు తెలుసు కోగలుగుతాము. ఎందుకంటే, కొన్ని నాడీ గ్రంధాల్లో కొంత కష్టతరమైన రహస్య భాష నవలింబించడం జరిగింది.

స్వామి యొక్క పునర్దర్శనాన్ని గురించి స్పష్టమైన సమయాన్ని తెలియచేయుట లేదు. శుకనాడి, మరియు రాజర్షి విశ్వామిత్ర నాడిలో స్వామి 86 సం॥లు ప్రాయము వానిగా వస్తారని చెప్పబడి ఉంది. కానీ 'గోరక్క నాడి' లో 88 సం॥లు ప్రాయము వానిగా లిఖింపబడియుంది. ఇప్పుడు తలెత్తే సందేహం ఏమిటంటే ఈ వయసు గూర్చిన భవిష్య గణనాలు స్వామి దేహం వెలుపల ఉన్న సంవత్సరాలతో కలుపుకొనా లేక కలుప కుండానా అన్నది. ఈ సందిగ్ధాన్ని "స్వామి భూమిమీద తన జీవితకాలం గురించి స్వయంగా చెప్పిన దివ్య పలుకులు" అనే అధ్యాయం నుండి మనం గ్రహిద్దాము.

(స్వామి పలుకుల ఆధారంగా, జూలై 2012 మరియు ఏప్రియల్ 2014 మధ్య స్వామి ప్రస్తుత దేహంతోనే పునర్ధర్శనం యిస్తారని సమర్ధించు కోవచ్చు)

## అద్భుతమైన నోస్ట్రాడామస్ - భవిష్యవాణి.

సత్యసాయి అవతారం గురించి, నోస్ట్రా డామస్[1] చెప్పిన భవిష్య వాణి, చాలామంది సాయి భక్తులకు తెలుసు.

పద్యం॥ గురువారానికి సుకృతమునిచ్చే గురువుకి
జన్మనిచ్చేను ఆ జలనిధిమధ్యోపఖండము
పోటెత్తును తన వాణీ బలిమీ ప్రాభవాలు
కల్లోలావృత ప్రాచ్యం దాటి ఖండాంతరములకు॥

భావము: ఒక ద్వీపకల్పము ఒక వ్యక్తిని ప్రభవిస్తుంది. ఆయన గురువారాన్ని పవిత్రదినంగా ఎన్నుకుంటాడు. ఆయన వాక్కు ప్రభావం, దివ్యశక్తి కల్లోలా వృత ప్రాచ్యం నుండి సముద్రాలు దాటి ఎంతో ఎత్తుకి ఎదుగుతుంది.

– క్వాట్రెయన్ నోస్ట్రడమస్ 1:50

పద్యం॥ నింగీ నేలా పయోరాశుల్ని గడ్డకట్టించేను
అపుడందరు చేరి గురువారాలూ అర్చన చేసేనూ
చూడబోయే చక్కదనము మునుపూ ముందర కాంచనిది
చరాచర జగత్తంతా చేరును తనకారతులెత్తగ॥

[1] మిఖైల్ నోస్ట్రేడేమ్ (నోస్ట్రడామస్) – ఒక ఫ్రెంచ్ తత్వవేత్త. 16వ శతాబ్ది వాడు. కాలక్రమంలో నోస్ట్రడామస్‌గా ప్రసిద్ధి చెందాడు. ప్రపంచ భవిష్యత్తు గుఱించిచాల విషయాలు చెప్పాడు. నేటికి కూడా పేరు ప్రఖ్యాతులు నిలిచి ఉన్నాయి. ఆయన భవిష్యవాణి నాలుగు పాదములతో కూడిన పద్యాలు, శతకాలుగా వ్రాయబడ్డాయి.



భూమ్యాకాశాలు నీటితో నిండిపోతుంది. అప్పుడు ప్రజలందరు గురు వారాలు ఆయన్ని పూజించటానికి వస్తారు. ఇప్పుడు జరగబోవునది, గతంలో యింత అందంగా ఉండి ఉండనిది. ప్రపంచం నలుమూలల నుంచి వీనిని ఆరాధించడానికి వస్తారు.

–క్వాట్రెయన్ నోస్ట్రడమస్ 10:71

పై రెండు భవిష్య వాక్కులు శ్రీ సత్యసాయిబాబా గుఱించి చెప్పిన వని తెలుస్తున్నాయి. మూడువైపులా నీటితోయున్నది భారత ద్వీపకల్పమని తెలియవస్తోంది. తూర్పున బంగాళాఖాతం, పడమర అరేబియా సముద్రం, దక్షిణమున హిందూ మహా సముద్రం, ఈ మూడింటి మధ్య భారతదేశము ద్వీపకల్పము అని నోస్ట్రడామస్ వ్రాసారు.

"సాయి అవతరణ" గురించి చెప్పేటప్పుడు, భగవాన్ సత్యసాయి అవతారం గుఱించిన సాహిత్యంలో ఈ రెండు పద్యాలు మనకు తప్పక కనిపిస్తాయి. నేను అనేక పర్యాయములు నోస్ట్రాడామస్ చెప్పిన విషయాలు చదివాను. సాయి అవతారం గుఱించిన యీ రెండు విషయాలు జరిగినవి. నేను చాలాసార్లు చదివి మననం చేసుకున్నాను. ఇవి సాయి అవతారము గుఱించి మాత్రమేనని తెలుసుకొన్నాను. ఇందులో ఒక పద్యపాదం నాలో ఉత్సుకత రేకెత్తించింది.

"భూమ్యాకాశాలు ఏకమై ప్రపంచం అల్లకల్లోలమైనపుడు, ఆయన్ని గురువారాలు పూజించటానికి అక్కడకు చేరుతారు". ఒక పద్యంలో అనేక విషయాలు దర్శించాడు నోస్ట్రడామస్. అప్పుడప్పుడు బహుశ ఇది రాబోవు సంఘటనలు గుఱించి తెలియబరచుచున్నదని అనిపిస్తోంది. నీటితో సంబం ధమున్న ప్రకృతి వైపరీత్యము కావచ్చు. ఏది ఏమైన సాయి అవతారమును దెలుపు అద్భుత భవిష్యవాణిలో చిక్కు ప్రశ్న అని ఈ క్రింది నాడీ గ్రంధ పరిశీలన చూసే వరకు నేను అనుకున్నాను.

(...) **"ఆరోజు, ఎక్కడ చూసిన గాలి-వాన వస్తుంది. అప్పుడు స్వామి తన రూపంతో ఆంధ్రప్రదేశ్, ప్రశాంతి నిలయంలో వస్తాడు.**

(కగభుజంగార్ నాడి–మే 24, 2011న పరిశీలింపబడినది. పేజి 7)

చాలా ఆశ్చర్యంగా యుంది కదూ! ఈ నాడీ గ్రంధ పరిశీలనకు నోస్ట్రడామస్ భవిష్యవాణికి సరిగ్గా సరిపోవుచున్నది. స్వామికే స్వయంగా తెలుసు ఏ విధంగా భవిష్యత్తు ఆవిర్భవించబడబోతోందని. అన్ని నాడీ

గ్రంథాలు శ్రీ సత్యసాయి బాబావారు ప్రస్తుత దేహంతోనే తిరిగి వస్తారని, కొన్ని నాడీ గ్రంథాలు, ఈ కొత్త శరీరం యువకునిగా నైన గాని, మధ్య వయస్కునిగ గాని ఉంటారు అని తెలుపుతున్నాయి. ఆ అద్భుత ఘడియ కోసం మనం వేచి ఉందాము.మానవ చరిత్రలోనే యిప్పటి వరకు సంభవించని మహాద్భుతం జరగబోతోంది.మనం చూస్తున్న ప్రస్తుత ప్రపంచ రూపు రేఖలు పూర్తిగా మారిపోవు సమయ మాసన్నమౌతోంది.

**ఫుట్‌నోట్ :** కొంతమంది పాఠకులకు, నా నాడీజోష్యం ఆసక్తికరంగా ఉండవచ్చు. నేను 1997-98లో పరిశీలించిన అగ్రస్యనాడి నుండి సేకరించిన విషయములు ఇక్కడయిస్తున్నాను.“ నీ గురువు అయిన సత్య సాయిబాబా గురించి నీవు గ్రంథము వ్రాస్తావు. గ్రంథము ప్రతులు భారత దేశము వెలుపల వితరణ జరుపబడతాయి.” ఇది నా మొట్ట మొదటి గ్రంథము. దానికి నా రచనా కౌశల పరిమితుల వలన అప్పట్లో నేను పుస్తక రచన అంటే అసంభవమేమో! అనుకున్నందువలన యీ పుస్తకము వాస్తవ రూపం దాల్చటం ఒక అద్భుతమే. ఇంకొక నాడీ పరిశీలనలో నేను నాడీ గ్రంథాల నుండి వాటి యొక్క గొప్పదనాన్ని గురించి వ్రాస్తానని ఉంది. ఈ పుస్తకము పై భవిష్యవాణిని కూడ పరిపూర్తి చేసింది. ఎంత అద్భుతమో గదా !. ఈ నాడీ గ్రంథాలు !!.



# ఏడవ అధ్యాయము

## మహదీ యొక్క అదృశ్యము – మహదీ ఎవరు?

మహదీ లేక మెహదీ, ఇస్లాం సంస్కృతికి చెందిన ఒక మెస్సయ్య. మత ఉద్ధారకుడు. భవిష్యవాణిలోని ‘తీర్పు దినమునకు’ ముందు అవతరించిన ఇస్లాం[1] మత ప్రవక్త. చాలా మంది ముస్లిం సోదరులు అల్లా, ఒక మహదీని (ప్రవక్తను), మానవ జాతి సంక్లిష్ట పరిస్థితులలో యున్నపుడు వారియందు నమ్మకము వృద్ధి చేసి శాంతిని ప్రపంచానికి అందిస్తాడని, దృఢంగా నమ్ముతారు. మహదీ అంటే ‘గురువని’, ‘సలహాదారుడని’, ‘రక్షించేవాడని’ అల్లా ‘వాగ్దానం చేసిన గురువని’, అనేక అర్ధములు. కొన్ని సార్లు “క్వైమ్ లేక అల్‌క్వైమ్” అంటే సత్యమును పెంపొందింప చేయువాడు అని అర్ధము కూడా యున్నది. షియా సంస్కృతులలో ‘అల్‌మెహదీ’, ‘హజరత్ మహదీ’ మరియు ‘మహదీ మోద్’ అన్న వాడుక నామ ధేయములతో వ్యాప్తి చెందియున్నారు.

### మహదీని గుర్తించడానికి కొన్ని సంకేతాలు :

శ్రీ సత్యసాయిఉన్నత విద్యా సంస్థకు చెందిన బాబావారి సద్భక్తురాలు శ్రీమతి జేబా బషీరుద్దీన్ నిగూఢ విషయాలు తెలిపే ఒక వ్యాసం వ్రాసారు. “హజరత్ మెహదీ మరియు సాయిబాబా: సత్యమైన భవిష్యవాణి” అన్న ఈ వ్యాసము సనాతన సారథిలో ప్రచురించబడినది. (నవంబరు 1991). ఈ వ్యాసంలో ఆమె హజరత్ మహది గురించి భవిష్యవాణిలో చెప్పబడినవన్నీ శ్రీ సత్యసాయి బాబావారికి పూర్తిగా వర్తిస్తున్నాయని నిరూపించారు. ఆమె వ్రాసిన ప్రకారం :

**ప్రపంచ వ్యాప్త ముస్లిం సోదరులందరూ తమ గొప్ప నాయకుడూ, మార్గదర్శి రాబోతున్నాడని నమ్ముతారు. వారంతా మెహది (గురువు)గా ఆయన్ని భావిస్తారు. ముస్లింల సంక్షేమం కోసం 14వ హిజ్రీ శతాబ్ధపు ఆఖరి దశాబ్ధాల్లో (ఈ శతాబ్దం ఇటీవలే ముగిసింది) హజరత్ మెహదీ వస్తాడని ప్రవక్త హజరత్ మహమ్మద్ సూచించారు. అది కల్లోల భరితమైన ప్రజలు లౌకిక లంపటాల్లో చిక్కుకు పోయిన సమయం. పవిత్ర ఖురాను గ్రంథం ప్రబోధించిన విలువలు పాటించక మానవ హృదయాలు ప్రపంచాకర్షణలకు లోనై వాటినే ఆరాధిస్తూ ఉంటారు. ఈ ప్రపంచాకర్షణల ఆరాధనని ఖురాన్ పరిభాషలో “ఇతర దేవతలు” అంటారు. హజరత్ మెహదీ**

**సత్యాన్ని పునఃస్థాపిస్తారనీ, "ఇస్లాం[1]" ప్రపంచ వ్యాప్త మతమౌతుందనీ ఈ భవిష్యవాణి ప్రతిపాదిస్తుంది."**

ఇస్లాం సాంప్రదాయంలో మహ్మదు ప్రవక్త రాబోయే మహదీ గురించి వ్రాసిన చాలా "హదిత్‌లు" ఉన్నవి. (ప్రవక్త మహ్మదు చేసిన కార్యాలు, కథనాల వివరణలను ఇస్లాం పరిభాషలో హదిత్‌లు అంటారు). మహదీ గురించిన కాలం, ఇతని వ్యక్తిగత లక్షణాలు 150కి పైగా సూఫీ రహస్యాల భాండాగారము అనదగిన నాల్గవ ఖలీఫ్ అయిన హజరత్ అలీకి ప్రవక్త వివరంగా చెప్పాడు. ఈ గుర్తులు హజరత్ అలీ తరువాతి తరాలవారైన ఇమామ్‌లచే భద్రంగా దాచబడి ప్రవక్త కథనాల షియా సాంప్రదాయం (ముఖ్యంగా ఇరాన్ దేశంలో)లో భాగం అయ్యాయి. 17వ శతాబ్దములో మహ్మద్ బకీర్‌బిన్ మహ్మద్ తాకి-అల్ మజ్లీసి-అల్ ఇస్ఫహానీ (1627-1698) అన్న ప్రముఖ పండితుడు వీటిని సమీకరించి అరబిక్ భాషలో బిహర్-ఉల్-అన్వర్ అన్న బృహత్ గ్రంథంలో పొందుపర్చాడు.

బిహర్-ఉల్-అన్వర్ యొక్క పర్షియన్ (ఒక ఇరానీ భాష) అనువాద గ్రంథం నుండి ఇస్లాం మత ప్రవక్త యొక్క కథనాలు కొన్ని క్రింద ఇవ్వబడ్డాయి.

1.ఎ. చాలా కాలం వరకు మహది అవతరిస్తాడన్న విషయం, మహమ్మదీయులకు తెలియదు.

1.బి. ఈ అద్భుతమైన అవతారం రెండు రకములయిన దుస్తులు ధరిస్తాడు. ఒకటి లోపల రెండవది వెలుపల(పుట 239)

2. ఆ అంగీ నారింజ రంగులో ఉంటుంది. పృష్ఠభాగం రూపురేఖలు కన్పించేలా ఆ అంగీ ప్రత్యేక ఆకారంలో ఉంటుంది. (పుట 292, 777)

3. కాషాయ రంగులోనున్న ఈ దుస్తులు ప్రజలపై వెలుగులు ప్రసరిస్తూ ఉంటాయి. (పుట 245)

4. ఆయన తలజుట్టు ఒత్తుగాను, నల్లగాను ఉండి భుజాల వరకు వ్యాపించి యుంటుంది.(పుట 25)

5. ఆయన కనుబొమలు మధ్యలో చేర్చి కలుపబడి ఉంటాయి.(242 వ పుట)

6.విశాలమైన ప్రస్ఫుటమైన నుదురు కలిగియుంటాడు. (263 వపుట)

[1] ఇస్లాం అన్న పదానికి అర్థం శాంతి కనుక ప్రపంచ శాంతి స్థాపించబడటం అని అర్థం చేసుకోవచ్చు.



7. ముక్కు పొడుగ్గా ఉండి మొదట్లో నొక్కు ఉంటుంది.

8. హజరత్ మోసాకున్నట్లే బుగ్గమీద పుట్టుమచ్చ యుంటుంది. కాంతివంతమైన నక్షత్రంలాగా యీమచ్చ కనబడుతూ యుంటుంది (243వపుట)

9. నల్లని కనుదోయి కలిగి ఉంటాడు. రెండు ముందు పళ్ళ మధ్య ఖాళీ ఉంటుంది. (777వ పుట)

10. యూదుల ఎత్తుతో పోలిస్తే సాధారణమైన ఎత్తుగా ఉంటాడు. (239వపుట)

11. ఆయన రంగు గుర్తించడానికి వీలు లేకుండా ఒకప్పుడు బంగారు, కంచు, నారింజ వర్ణములోను, ఒకప్పుడు చాలా వెలుగుతూ యున్న మోము కలిగి యుంటూ, అసలు రంగు గుర్తించడానికి వీలు లేకుండా యుంటుంది. (263-293 పుట)

12. అత్యంత ప్రేమతోను, హుందాగాను, ఔన్నత్యంతోనూ, ఉంటాడు. (239 పుట)

13. అందరూ తనకు ముందుగానే తెలిసిన వ్యక్తులా అన్నట్లుగా అందరితో సోదర భావంతో ఉంటాడు.

14. ఆయన ప్రవక్తలందరినీ, మహర్షులనూ ప్రేమిస్తూ ఉంటాడు.

15. ఆయనకి ఏమి కావలయునో అది జరిగి తీరుతుంది.

16. ఎవరితోను శతృత్వం లేకుండా యుంటాడు.

17. ఆయన వద్ద ఆయన భక్తులందరికి రక్షణ యుంటుంది.

18. ఆయన దివ్యానందం మూర్తీభవించినవాడని ప్రజలు విశ్వసిస్తారు. (పుట 341)

19. అనాథలు, నిరాశ్రయులకు అందరికి ఆయన వద్ద ఆశ్రయం లభిస్తుంది. (235వపుట)

20. ఆయన (అబే-ఇ-తుహుర్ క్రేసుర్) ఆధ్యాత్మికం ప్రజలకి ఉదయం, సాయంత్రం పంచుతూ యుంటాడు. (బాబా ప్రశాంతి నిలయంలో ఉదయం సాయంత్రం దర్శనంతో పోల్చవచ్చు) (పుట 343)

21. దివ్య తేజస్సు ఆయన నుంచి ఆవిర్భవిస్తూ యుంటుంది.(పుట 252.)

22. తను కొత్త మతాన్ని వ్యాప్తిచేయటానికి రాడు. (పుట 6)
(బాబా ఈ విషయాన్ని అనేకసార్లు తమ దివ్య సందేశంలో చెప్పారు.)

23. సంపూర్ణ జ్ఞానము, సర్వమత సారము అప్పుడే వికసించిన పూదోటలా ఆయన హృదయం నుండి పెల్లుబుకుతుంది. (పేజి 238)

24. ప్రపంచాన్ని శాంతితో నింపుతాడు. ఆయన ఒక మిత్రుడు. మంచి సలహాదారుడు. (287వ పుట)

25. ఆయన ఒక చక్కని రాజమార్గాన్ని చూపుతాడు(352వ పుట)

"ఓ ముస్లిములారా! ఆతని జన్మ రహస్యము మీకు తెలియకుండా దాచబడినది. ఆయనే మీ గురువు ఆయనే మెహది."(292వపుట)

## బిహర్ ఉల్ అన్వర్ అన్న గ్రంథంలోని మరి కొన్ని సంకేతాలు

1. తక్కువ బరువుతో యున్న కొన్ని బహుమతులు ప్రసాదిస్తాడు.
2. భక్తుల మధ్యకు స్వయంగా వెళ్ళి వారి తలలపై చేతితోస్పృశిస్తాడు.
3. ఆయన్ని దర్శించిన ప్రతివారు ఆనందంగాయుంటారు. మానవమాత్రులే కాకుండా, దర్శించిన దేవతలు కూడా చాలా ఆనందంగాయుంటారు.
4. **ఆయన 95 సం౹౹లు జీవిస్తారు.**
5. చివరి 20 సం౹౹లు ప్రపంచానికే రాజుగా (ప్రపంచాధినేతగా) యుంటారు. అప్పటికి ప్రపంచంలోని మూడింట రెండు వంతులు ప్రజలు మాత్రమే, అతనిని నమ్ముతారు.
6. ముస్లిమ్ సోదరులు మాత్రం **ఇంకా 9 సం౹౹లలో భౌతిక శరీరాన్ని వదలి వెళతారనగా గుర్తిస్తారు.**
7. ప్రపంచాన్ని చాలా తేలికగా, ప్రశాంతంగా ఉంచుతాడు.
8. మనం మోసపోకుండా, తెలిసికొనవలసిన దేమంటే, ప్రపంచాధినేత అయిన భగవంతుడు తన శరీరం నుంచి అనేక వస్తువులు సృష్టించి యిస్తాడు. (స్వామి నోటి నుంచి శివలింగములు ఆవిర్భవించటం మనం చూసియున్నాము – శివరాత్రి పర్వదినాన.)

ఆర్.లోవెన్‌బర్గ్ "సాయి హృదయము" అన్న గ్రంథంలో యీ విధంగా వ్రాశారు. " నేను సాయి భక్తులలో 'ఇరాని మా' అని పిలువబడే ఒక భక్తురాలిని ఒకసారి కలిశాను. ఆమె 'బిహర్–ఉల్–అన్వర్.' అన్న గ్రంధము నుంచి, గొప్ప గురువు అవతరిస్తాడని మహమ్మద్ ప్రవక్త చెప్పిన భవిష్యవాణి గుఱించి వివరించారు.

ఈ సంకేతాలన్నీ సత్యసాయిబాబా లక్షణాలతో పోలియున్నాయని లోవెన్ బెర్గ్‌కు ఆమె వివరించి చెప్పింది. ప్రవక్త మహ్మద్ యొక్క ఈ భవిష్యవాణిని ప్రచురించటానికి ఇరానీమా పూనుకొన్నప్పుడు సాయిబాబా అనుజ్ఞ ఇవ్వలేదని స్వామి మహేశ్వరానంద 'సాయిబాబా నరనారాయణ గుహ ఆశ్రమం' అన్న గ్రంథంలో వివరించారు, అని ఆమె చెప్పింది.

ఇరాన్ భక్తులు అసంఖ్యాకంగా ప్రశాంతి నిలయం రావటం "

బిహర్–ఉల్–అన్వర్ " అన్న గ్రంథంలో మహమ్మదు ప్రవక్త చెప్పిన



భవిష్యవాణి శ్రీ సత్యసాయి అవతారం గురించి వారిఉద్యమం గురించీ అన్న సత్యాన్ని రూఢీ పరుస్తుంది. మహమ్మద్ ప్రవక్త చెప్పిన రాబోవు అవతార విశేషములు మహది అవతారంలో ముందు ఊహించినట్లుగానే సత్యసాయి తన సంస్థలు, భౌతిక ఆధ్యాత్మిక నడవడికలు అన్ని సరిగ్గా సరిపోవుచున్నవి. మహది అన్నది సరిగ్గా సత్య సాయితో సరిపోవుచున్నది.

అలాగే నాడీ గ్రంథాల్లో చెప్పినట్లు ఆయన **ప్రపంచ గొప్ప చక్రవర్తి** గా కీర్తింపబడతాడు అన్నట్లు మహది గుఱించి ఆయన రాజులకు రాజు అన్న దానితో సరిపోవుచున్నది. మహది మరియు సత్య సాయిబాబా వారు ఒకటే అని సరిపోవుచున్నది.

## భూమిపై 'మహదీ' పరిపాలన

బిహర్–ఉల్–అన్వర్‌లో చెప్పబడిన భవిష్యవాణిలో రెండు ముఖ్యతమములయిన విషయాలు. అవి మెహది అవనీతల సంచారం చేసే అవధి ఎన్నేళ్ళు అన్న దాని గురించి ఉండటం వలన ప్రాముఖ్యత సంతరించుకున్నాయి. వాటిని పరిశీలిద్దాము.

1. **మహది భూమి మీద 95 సం౹౹లు** యుంటాడు.
2. మహది **– శరీరాన్ని చాలించు ముందు 9 సం౹౹లకు ముస్లిం భక్తులు, అతనిని గుర్తిస్తారు.**

ఇస్లామ్ కాలమానం ప్రకారం మహది 95 సం౹౹లు ఈ భూమి మీద దేహంతో యుంటారు. హైందవ కాలమానం ప్రకారం 93–94 సం౹౹ల మధ్య , ఈ విషయం మనకు స్వామి మాటల్లో తన జీవితకాలము గుఱించి చెప్పిన మాటలతో సరిగ్గా సరిపోవుచున్నవి. (భూమి పై తమ జీవితకాలం గురించి స్వామి చెప్పిన విషయాలు అధ్యాయం–3 చూడండి)

రెండవ విషయం చూస్తే 'మహది' తన భౌతికదేహాన్ని చివరిసారి ఒదిలి వెళ్ళే 9 సం౹౹లకు ముందు ప్రజలు నన్ను విశ్వశిస్తారు. అనిగదా! స్వామి సరిగ్గా తన 85 వ ఏట భౌతిక దేహాన్ని వదిలారు. ఇస్లాం కాలమానం ప్రకారం 9 సం౹౹లు కలిపితే 94 సం౹౹లు అవుతుందిగదా! స్వామి భూమి మీద తన జీవిత కాలము అన్న అధ్యాయములలో 94 సం౹౹లు ఉంటానని ఒకసారి, 95 సం౹౹లు ఉంటానని వేరొకసారి చెప్పడం జరిగింది కదా! అంటే ఈ రెండు సం౹౹ల తేడా ఈ దేహాన్ని ఒదిలి ఉంటారని మనం గ్రహించవచ్చు. ఇస్లాం క్యాలెండరు ప్రకారం, 12 నెలలు కాలానికి

355 లేక 354 రోజులు. 95 సం॥లు వయసు అంటే 95-96 సం॥ల మధ్య ఉండవచ్చు. మామూలు క్యాలెండరు 93-94 సం॥ల మధ్య. ఈ నిజాలన్నీ పరిశీలిస్తే అనేకమంది ఆయనను నమ్మబోతారనేది రెండవ రాకడ కారణంగానే కావచ్చు. తర్వాత 9 సం॥ల కాలము, స్వామి అవతారం ఈ భూమిమీద ఉండొచ్చు. ఇంకా ముఖ్యమైన విషయమేమంటే నేను కూడా, 'మహది ప్రపంచాన్ని (పునరాగమనం తరువాత) తిరిగి 7 నుంచి 8 సంవత్సరాలు, 9 సంవత్సరాలకు బదులు పరిపాలిస్తాడని' మహది (దైవం) గుఱించి చెప్పబడిన కొన్ని హదితులలో చదివాను.

**" మన మహది చాలా వెడల్పయిన నుదురు, ప్రఖ్యాతమైన ముక్కు కలిగియుంటారు. ఆయన సంపూర్ణ న్యాయముతో, అన్యాయ అక్రమాల నుంచి ప్రజల్ని కాపాడుతాడు. తిరిగి వచ్చిన తర్వాత మరలా 7సం॥లు పరిపాలిస్తాడు.** - బిహర్-ఉల్-అన్వర్ 13 అ.1వభా143వ పేజి.

(...)" **ఆయన పరిపాలన 7సం॥లు గాని, 8సం॥లు గాని, 9 సం॥లు గాని యుంటుంది.** -బిహర్-ఉల్-అన్వర్, 13-1, 143వపేజి.

**అవినీతి,అక్రమాలు ప్రబలినపుడు భూలోకాన్ని మహది, న్యాయం తోను, సమానత్వంతోను నింపుతాడు. అవినీతి, అక్రమాలు ప్రబలినపుడు ఆయన ద్వారా భూలోకవాసులు, స్వర్గలోకవాసులు సంతోషంగా ఉంటారు. స్వర్గం కరుణాపూర్వకంగా కురిపించిన దీవెనలన్నింటితో, భూమాత అందించిన సస్యశ్యామల సుభిక్షాలతో జీవించి యున్నవారే గతించినవారికి కుశల కళ్యాణాలందించే స్థితిలో ఉంటారు. ఆయన ఆ దేహంలో ఏడు లేదా ఎనిమిది లేదా తొమ్మిది సంవత్సరాలు ఉంటారు.**

-బిహర్-ఉల్-అన్వర్ వాల్యూమ్ 13-1, ఆంగ్లానువాదం పేజి 91.

**ఈ నాడీ జోస్యం పై భవిష్యవాణితో సరిగ్గా సరిపోతుంది.**

**భూలోక ప్రజలు ఆయనకి 88 వ సం॥ వచ్చేటప్పటికి ఎట్టి అనుమానాలు లేకుండా నిస్సంకోచంగా విశ్వసిస్తారు. ఆయన మరలా 7 సం॥లు జీవిస్తారు. (గోరకనాడి పరిశీలన జూన్ 14, 2011న జరిగింది.)**

-శ్రీవసంతసాయి,పవిత్రనాడి పరిశీలనలు, అన్న గ్రంధం, పుట 26.

**"ఆయన మరలా తిరిగివస్తారు. మరియు 7 సం॥లు ఉంటారు. ఈ7 సంవత్సరముల లోపల భూగోళంపై అనేక మార్పులు సంభవిస్తాయి.**

-బోగర్ నాడి 25.5.2011.



శ్రీ వసంతసాయి వ్రాసిన "పవిత్ర నాడీ పరిశీలనలు" అన్న గ్రంధం 18వ పుట.నుండి. (పై భవిష్యవాణులను పోలి ఉన్నాయి.)

చాలామంది క్రైస్తవులు ఏసుక్రీస్తు పునరుద్ధానమైనపుడు7 సం॥ల కాలం ఆనందోత్సాహాలడోలికలలో ఊగే కాలం వస్తుందని నమ్ముతారు. ఇది రెండవ రాకడ ద్వారా జరిగి తర్వాత 1000 సం॥ల ప్రశాంతి యీ ప్రపంచంలో వ్యాపించినట్లు ఉంటుందని భావించబడుతుంది. (మిగతా విషయాలు "సత్యసాయి స్వర్ణయుగ ఆరంభం" అనే అధ్యాయంలో చూడవచ్చు)

## మహది యొక్క అదృశ్యము:

మహది భవిష్యవాణి గురించి చెప్పిన అనేక సాయి గ్రంధాలు నేను బాల్యం నుంచి చదివాను. ఈ భవిష్య పలుకులు అన్నీ సత్యసాయి అవతారాన్ని సూచించినవే. ఇవి నిజంగా స్వామిని గురించే అయితే స్వామి ముందుగానే మహాభినిష్క్రమణం చెందటం అన్న విషయాలు కూడా ఈ పుస్తకంలో ఉండి తీరాలని నాకు అనిపించాయి. వెంటనే మహది గురించి బిహర్-ఉల్- అన్వర్‌లోని హదితులు మీద పరిశీలన మొదలుపెట్టాను. బిహర్-ఉల్-అన్వర్ లోని కొన్ని స్కందాల ఇంగ్లీషు అనువాదాలు కూడా నేను దగ్గర ఉంచుకుని చదవటం మొదలుపెట్టాను .

పై గ్రంధాలు చదువుతున్నపుడు అత్యంతాశ్చర్యకర విషయాలు కనిపించాయి. నేనేమి చదువుతున్నానో నాకే అర్థం కాని పరిస్థితి. మహది అంతర్ధానము చెంది మరల తిరిగి వస్తాడని, మరియు హదితులు-పరిశీలన ప్రకారము మహది(దైవం) 2సార్లు అదృశ్యమవుతారని మొట్ట మొదటిది చాలాకాలం అదృశ్యంగా ఉంటాడని. రెండవసారి నిజమైన పూర్తి అదృశ్యమని (లేదా దేహ త్యాగం అని) చెప్పబడి యున్నది.

**"హజరత్ మహది" కొంతకాలం కనిపించకుండా అదృశ్యమౌతాడు".**

- బిహర్-ఉల్-అన్వర్ 1వభాగము 13వ అధ్యాయం పేజి 133

**"మహది రెండుసార్లు అదృశ్యమౌతాడు. మొట్టమొదట చాలాకాలం అదృశ్యంగా ఉంటాడు. కొందరు మరణించినట్లు భావిస్తారు. కొంత మంది ఆయన వెళ్ళిపోయారు అంటారు. ఆయన ఎక్కడున్నారన్నది ఆయనని ప్రేమించేవారికి కాని ఇతరులకు కాని తెలియదు. (...)**

**-అల్-ముత్తకి అల్ -హింది అల్-బర్హాన్ ఫి అలమత్ అల్-మహది.**

**అల్లాద్వారా, మహది కొంతకాలం కంటికి కనపడకుండా మనం మరిచి పోయేంతవరకు ఉంటాడు. చాలామంది ఆయన చనిపోయారు శరీరం శిథిలమైపోయింది, ఇంకొక ప్రాంతానికి వెళ్ళారు అనుకుంటారు. భక్తులు మాత్రం చాలా దుఃఖిస్తూ సముద్రపు అలలకు, ఓడ కొట్టుకు పోయినట్లు తలక్రిందులైనట్లు కుమిలిపోతూ ఉంటారు.(...)**

– బిహర్–ఉల్–అన్వర్ వాల్యూమ్ 13, 1వ భా,ఆంగ్లం పేజి180

కైమ్‌లేక అల్‌కైమ్,మహది(ముస్లిముల దైవము) గుఱించి అరబిక్ భాషలో వ్రాసిన పద్యాలలో కైమ్ లేదా అల్‌కైమ్ అన్న పదాలకి అర్ధము సత్యారోహ ణము. ఇక్కడ రెండు పదాలు ఉన్నాయి. కైమ్ అంటే సత్యము. అల్ అంటే ఆరోహణ అంటే సత్యారోహణము. ఆరోహణము అంటే స్వధామ మునకు వెళ్ళటం". సత్యము– (సత్య సాయిబాబాలోని) పూర్వము బాల్యంలో స్వామిని సత్య, సత్య, సత్య అని పిలిచేవారు.

బిహర్–ఉల్–అన్వర్‌లో మహది (ముస్లింల దైవం) యొక్క అంత ర్ధానం దివ్యలోకాలకి తాత్కాలికంగా (గ్రహణ సమయంలో కొంచెం సేపు ఒక నక్షత్రం/ గ్రహం మరొక నక్షత్రం/ గ్రహం వెనుక దాక్కొని కనిపించకుండా వున్నట్లు) వెళ్ళినట్లు చెప్పబడి ఉంది. కొంతమంది పండితు ల అభిప్రాయంలో ఏం చెప్తున్నారంటే మహది (యొక్క అంతర్ధానం) కొన్ని వందల సంవత్సరాలు, మానవ మాత్రులకు కనపడకుండా దాగియుం టాడని, కాలము అంతమునకు ముందు మానవులకు దర్శనం యిస్తాడు అని చెప్తారు. కాని బిహర్–ఉల్– అన్వర్ ప్రకారం చాలా భిన్నంగా యుంది. ఒక ముఖ్య భవిష్యవాణి ఏంటంటే, ఆయన శరీరం శిథిలమైనప్పటికి, ఎలా తిరిగిలేచాడు, అని ప్రజలు చాలా ఆశ్చర్యపోతారు. అంటే కైమ్ (సత్యము) యొక్క అదృశ్యం అన్నది దేహం విడిచిన ఘట్టం తర్వాత ప్రారంభ మవుతుంది.

ఈ అధ్యాయంలో మిగిలిన పద్యాలు 'బిహర్–ఉల్–అన్వర్ 1వభాగము, 13వ అధ్యాయము నుంచి తీసుకొనబడినవి(ఆంగ్ల అనువాదం నుండి).

1. సత్యము(కైమ్) తిరిగి వచ్చినప్పుడు ప్రజలు, ఎముకలతో సహా పూర్తిగా శిథిలమైనప్పుడు, యిది ఎలా సంభవమయింది? అని ఆశ్చర్యపోతారు. (181 వపేజీ, అరబిక్‌కి ఆంగ్ల అనువాదం)

2. "ఓ అల్లా యొక్క దేవదూత కుమారుడా! ఆయన్ని కైమ్ అని ఎందుకు



పిలుస్తున్నారు? అని అడిగిన దానికి సమాధానంగా ఆయన గురించిన మధురస్మృతులు మరుగున పడిన తరువాత ఆయన లేచి వస్తారు. అందు కని," అని చెప్పారు.(పేజి 193)

3. జాగ్రత్తగా గమనించండి, ఆయన తమ నిరాకార దివ్య స్థితిలో స్వల్పకాలం ఉన్నప్పుడు మూర్ఖులు విస్మయం చెందుతారు, తిరస్కరించేవారు నశిస్తారు; దైవాన్ని కాల నియమాల చట్రంలో బంధించాలనుకునేవారు బొంకు లాడుతారు. సరిగ్గా అట్టి సమయంలోనే ఆయన తిరిగి వస్తారు. (పేజి 193)

4. "ఆయన రాక కోసం ఎందుకు ఎదురుచూడాలి?" అనడిగిన దానికి ఆయన సమాధానం: చాలాకాలం అదృశ్యంగా దివ్యలోకాల్లో యుంటాడు. **చాలాకాలం అంటే చాలా చాలా రోజులు,** సమయంచాలా ఎక్కువగా ఉంటుంది. అసలైన భక్తులు ఎదురు చూస్తుంటారు. అనుమానితులు ఆయ న రాక గుఱించి ఎదురు చూడక తిరస్కరిస్తారు. తిరస్కార భావంతో చూసే వారు హేళన చేస్తారు. (పేజి 193)

పై పద్యాలలో విషయాలను పరిశీలిస్తే చాలా రోజులు కనపడకుండా యుంటాడని, చాలామంది పండితులు చెప్పినట్లుగా వందల సంవత్స రాలు కాదని, చాలా రోజులు అని తెలుస్తుంది. అట్లా కాకుంటే ఈ పద్యాల్లో అంతటి దీర్ఘ కాలం గురించి సూచించడానికి "సంవత్సరాలు" అని వాడి ఉండేవారు. స్వామి తను చెప్పిన సమయాని కంటే ముందుగానే దేహాన్ని వదలి పెట్టారని, స్వామి చెప్పిన మాటలే హాస్యాస్పదమని చాలామంది ఆక్షేపించడాన్ని పై భవిష్యవాణి తెలిపి ఉండటాన్ని చూడండి !.

## మహది ఎప్పుడు తిరిగివస్తాడు?

మహది రాకతో నూతనశకం, ప్రేమ,శాంతులతో కూడిన శకం ఆవిర్భవిస్తుంది. అలాంటిదే స్వామి దివ్య సందేశాలలో కూడ 'స్వర్ణయుగం' వస్తుంది, అని మనం విన్నాం గదా! ఆ రోజుని ఇస్లాం మత గ్రంధాల్లో కూడా "**యామ్.అల్–కియామహ్"** అన్నారు. అంటే దానికి అరబిక్ భాషలో శబ్ధార్థం పునరుద్ధానం చెందేరోజు "అని. ఆరోజు ఎప్పుడొచ్చేదో దేవునికి తప్ప వేరెవరికి తెలియదని చెప్పబడింది.

" ఓ అల్లా యొక్క దూతా? ప్రపంచ గురువు కైమ్ తిరిగి ఎప్పుడు మీ వంశంలో ఉదయిస్తాడు అని అడగ్గా సరిగ్గా **"ఆఘడియ వచ్చినపుడు సమయానికి తిరిగి వస్తాడు."** అది చాలా అద్భుతమైన సమయంగా **భూలోక వాసులు, స్వర్గలోకవాసులు అకస్మాత్తుగా చాలా ఆశ్చర్యపరిచే విధంగా పునరుద్ధానం జరిగి తీరుతుంది.**(189వ పుట)

మహది (ప్రపంచ గురువు) అందర్ని ఆశ్చర్యపరిచే విధంగా ఆయనకి మాత్రమే తెలిపిన సమయాన పునర్దర్శనం అకస్మాత్తుగా మన మెవ్వరమూ ఊహించని రీతిలో జరుగుతుంది. ఆ అద్భుత క్షణాలు ఆయనకి మాత్రమే తెలుసు. అదే విధంగా క్రొత్త నిబంధనను అనుసరించి మానవ కుమారుడు రెండవసారి తిరిగి వస్తాడని చెప్పబడింది. (జీసస్ క్రీస్ట్ పునరాగమనాన్ని గురించి, అని మనకు అర్ధమౌతుంది.)

**"మానవ కుమారుడు ఎలా తిరిగి వస్తాడో ఎప్పుడు ఏ ఘడియకు వస్తాడో మీ కెవ్వరికీ తెలియదు. కనుక ఎదురు చూస్తూ ఉండండి".**

– మత్తై సువార్త (మాథ్యూ 25: 6–13)

**"ఎట్టి మానవునకూ ఆ ఘడియ, ఆరోజు, ఎప్పుడో తెలియదు. మరియు స్వర్గలోక వాసులయిన దేవతలు కూడా గుర్తించలేరు. మానవ కుమారుడయిన, ఏసుక్రీస్తుకి కూడా ఈ విషయం తెలియదు. కేవలం తనను భూలోకమునకు పంపిన తండ్రికి (దేవునికి) మాత్రమే యీ విషయం తెలియును.** – మార్కు సువార్త 13వ అ 32వచనం

**మహది (ప్రపంచగురువు)ఒక యౌవన శరీరంతో తిరిగి వస్తాడా?**

"అమూల్యమైన నాడీ గ్రంధాలు" అన్న అధ్యాయంలో చెప్పినట్లు స్వామి తిరిగి వస్తాడని మనం భవిష్యవాణి చూశాము. ఆ గ్రంధాలలోనే మరి కొన్ని పరిశీలనలలో స్వామి, తిరిగి వచ్చినపుడు వారు యువకుని మాదిరిగా గాని, మధ్యవయస్కుని మాదిరిగా గాని ఉన్న శరీర ధారణ చేస్తారని లిఖించబడి ఉంది.

"స్వామి బయటకు వచ్చినపుడు చాలా శాంతితో యుంటారు. ఆయన 85 సం॥ల వరకు మధ్యలో వదలి వెళ్ళిన కార్యకలాపములు తిరిగి కొనసాగిస్తారు. **స్వామి దేహం యౌవ్వనంలో యున్నప్పటికీ గత 85 సం॥ల పూర్తి అనుభవంతో పరిణతితో యుంటారు.** స్వామి తిరిగి వచ్చిమరలా కేవలం 7 సం॥లు ఆ దేహంతో యుంటారు.

(వసంతసాయి వ్రాసిన పవిత్రనాడీ పరిశీలన లోని పుట 18)



బిహర్–ఉల్–అన్వర్ గ్రంధం కూడా ఆశ్చర్యకరంగా ఇదే విధమైన సంకేతాలు పొందు పరిచింది. కైమ్ (మహదికి మరియొక పేరు) తిరిగి ప్రత్యక్షమైనపుడు గుర్తించటానికి గుర్తులేమిటి? అనడిగితే

**"ఈ ప్రపంచగురువు** 85 సం॥ల వయసుకి చేరినా యువకుని లా యుంటారు. వారిని చూసిన ప్రతివాడు **ఆయన 40 సం॥ల ప్రాయము లేదా అంతకంటే తక్కువ వయసులోనే** ఉన్నాడంటారు. చివరి వరకు, కాలచక్రగతులు వారికి వర్తింపవు. కాలగమనం వారి దివ్య దేహముపై ప్రభావం చూపదు" అన్నాడు.

(బిహర్–ఉల్ గ్రంధము మహమ్మద్ ప్రవక్త చెప్పిన భవిష్యవాణి. వారి అనుయాయులు (శిష్యులు) రచించిన గ్రంధము వాల్యూమ్ 13, 2వ భాగము, పేజి 178)

డా॥ జాన్ హిస్లాప్. సత్యసాయిబాబా వారితో వారి ప్రత్యక్ష ముఖాముఖి సంభాషణలు గ్రంధస్థం చేసినవి కొన్ని విషయములు యీ క్రింద ఉదహరిస్తున్నాను. **"ఈ దేహం 96 సం॥ల వరకు ఉంటుంది. నిత్య యౌవ్వనముతో ఉంటుంది"**[1]. శ్రీమతి శకుంతల బాలు వ్రాసిన 'లివింగ్ డివినిటీ'అన్న గ్రంధంలో స్వామి ఈ దేహంలో నేను షిర్ది అవతారంలో లాగా వృద్ధునిగాను, అశక్తునిగాను యుండను"[2] అని చెప్పినట్లు వ్రాసారు.

ఈ వాక్యాలన్నింటి సారాంశము స్వామి తిరిగి వచ్చినప్పుడు, యువకుని గా కనపడతారన్న సంకేతమా? 'బిహర్–ఉల్–అన్వర్' అన్న గ్రంధంలో మహమ్మదు ప్రవక్త చెప్పిన విషయాలను బట్టి, స్వామి తిరిగి వచ్చిన తరువాత 7 సం॥ల కాలము ఉంటారని తెలుసుకున్నాము.

భూలోకం నుండి మహది యొక్క అంతిమనిష్క్రమణం గురించిన కొంత భవిష్యవాణి నేను చూడటం జరిగింది.

**వారు,(మరలా తిరిగి వచ్చిన తరువాత) 7సం॥ల కాలము ఉంటారు. తరువాత మహాభినిష్క్రమణం చెందుతారు.ముస్లిములు అత్యంత దుఃఖంతో నిండిన బరువెక్కిన హృదయాలతో విలపిస్తూ ప్రార్ధిస్తారు.** –91పుట

[1] సత్యసాయిబాబాతో నా సంభాషణలు–జాన్‌హిస్లప్. బర్తడే పబ్లిషింగ్ కం. శాండిగో సిఎ. 1978. పేజీ 83.

[2] శకుంతలబాయి లండను. శాండిగో 1984, 40వ పుట.

## మహది యొక్క స్వర్ణయుగం

బిహర్–ఉల్–అన్వర్ అన్న గ్రంధంలో మహది తిరిగిరాక, రాబోయే స్వర్ణయుగాన్ని సూచిస్తుంది. అప్పుడు భూమి శాంతి, న్యాయంతో నిండి పోయి చాలా వైభవంతో నిండిపోయి ఉంటుందని బిహర్–ఉల్– అన్వర్‌లో వివరాలతో అందంగా చెప్పబడియున్నది :

అల్లా సాక్షిగా "బాధలతోను, అన్యాయముతోను నిండియున్న ప్రపంచంలో శాంతి, న్యాయ సౌభాగ్యములు నింపటానికి, పునర్దర్శనం యివ్వకుండా ఆయన, మహాభినిష్క్రమణం చెందరు. –పేజి 197

వారి రాకను చూసినవారు, ఆ సమయంలో ఉన్నవారు చాలా అదృష్టవంతులు, అనుగ్రహపాత్రులు, –పేజి 170

భగవంతుని తేజస్సుతో భూమి అద్భుతంగా ప్రకాశిస్తుంది. ఆయన పరిపాలన తూర్పు, పడమర దేశాలకు పరివ్యాప్తి చెందుతుంది.

–పేజి 113

*మీలోయున్న దుష్ట న్యాయాధికారులను, మీమీ అపాయములను పూర్తిగా తుడిచి పెట్టగలరు. అన్యాయంగా పరిపాలించు నేతలను తొలగించ గలడు. నిర్దయ, అన్యాయములను పూర్తిగా తొలగించి పరిశుభ్రము గావిం చగలరు. సమానత్వము, న్యాయ పరిపాలనతో మీ హృదయాలను పూర్తిగా నింపగలరు. మీయొక్క గతించిన పూర్వీకులు తిరిగి మరలావచ్చి మీతో జీవనయానం చేయాలని కోరుకుంటారు. ఇది జరుగుతుంది. అల్లా నిమిత్తం అణకువగా ఉండండి. మీరు మీ ఊహల లోకంలో విహరిస్తున్నారు! నాలుక ను వశంలో ఉంచుకొని మీ బ్రతుకు తెరువు పై దృష్టి పెట్టండి, లేకుంటే పాపపంకిలంలో పడి చెడిపోతారు. మీరు వేచి ఉంటే ఫలితం దక్కుతుంది, నిష్కారణంగా మిమ్ము హింసించిన వారిపై ప్రతీకారం తీర్చుకోటానికీ, మీ దగ్గర నుండి అపహరించబడిన మీ హక్కులను తిరిగి మీకు అందించడానికి వచ్చింది ఆయనేనన్న సంగతి మీరు నిస్సందేహంగా తెలుసుకుంటారు. హృదయ పవిత్రతగల వారితోనూ, సత్కార్యాలు చేసేవారితోనూ, అల్లా ఎప్పుడూ ఉంటారని అల్లా తోడుగా సత్య ప్రమాణం చేస్తున్నాను.*

*– పేజీ 155–156.*

ఆ సమయంలో, భూమి తనలో యున్న సర్వసంపదలను వెలుగు లోకి తెచ్చి అనుగ్రహిస్తుంది. నమ్మకమున్న ప్రతి వానినీ యీ సంపదలు వరించగలవు. బిచ్చము వేయవలసిన పరిస్థితులు ఔదార్యంగా ఉండవలసిన పరిస్థితులు ఉండవు. (పేజీ 233, పార్టు 2.)



ప్రస్తుత ప్రపంచ పరిస్థితులను గమనిస్తే ఈ వాక్యాలు రాబోవు స్వర్ణయుగ సౌందర్యాన్ని వర్ణిస్తున్నాయి, పై విషయాలు జరుగునా అన్న సందేహములు కనిపించవచ్చు. సర్వదేవతాతీత స్వరూపులయిన భగవాన్ సత్యసాయి, దైవగుణములతో నిండిన మహది లేక మెసయ్యల గురించి చెప్పిన భవిష్యవాణి పరిశీలించినచో స్వర్ణయుగం తప్పక వస్తుందని నిర్ధారిం చుకోవచ్చు. స్వర్ణయుగంతో నిండే, ఆసమయము ఊహకందని మహదా నందానికి నిలయమౌతుంది.

**" సంపూర్ణ మానవజాతి, ప్రేమ స్నేహ సౌభ్రాతృత్వములతో నిండి జీవించే కాలము అత్యంత సమీపంలోనేయుంది. ప్రతి వారు అటువంటి స్వర్ణ యుగం (...) అనుకున్న దానికంటే త్వరలోనే వస్తుందని నమ్మకముతో యుంటారు. బ్రతికున్నవాడు ఎవ్వడూ ఊహించలేనిది, అది ఎవరి ఊహల కి, ఆలోచనలకి అందదు. ఈ వైభవము మీరు కంటున్న కలలకంటే అత్యంత వైభవంగా ఉంటుంది.**

– సత్యసాయి బాల వికాస్, 15వభాగం, పుట 9, సెప్టెంబరు 96.

## మహది ఎందుకు తిరిగి వస్తారు ?

(...) ప్రపంచగురువు మహది ఎందుకు తిరిగి వస్తారంటే, ముందు చెప్పబడిన భవిష్యవాణి ప్రకారం భూమిపై భవిష్యత్తులో జరుగబోవు వివిధ విషయాల ప్రకారంగా న్యాయము, సమానత్వము– ధర్మము ఆయన పునఃప్రతిష్ఠించలేదు, కనుక కాలప్రమాణము యొక్క ఆఖరి దశలో యిది జరిగితీరాలి. ఈ అన్ని కారణాలు ప్రకటించిన దైవశాసనాన్ని నిస్సంశయం గా సఫలీకృతం చేయగలవు. (141వపుట)

పైవచనములు, ఈ గ్రంధరచనకు ప్రాధాన్యాన్ని సంతరింప చేశాయి. సర్వ సమానత్వముతో న్యాయముతో ప్రపంచము నిండి యుండా లన్న మహది (ప్రపంచగురువు) యొక్క సంకల్పము యిప్పటి వరకు నెర వేరలేదు, ఆ ఆశయ సాధనను సాధించటానికి ఆయన ఖచ్చితంగా తిరిగి రావాలి. ఇది ఈ గ్రంధము యొక్క ముఖ్య ఉద్దేశ్యముతో సరిగ్గా సరి పోతుంది. చాలా విషయాలు స్వామి చెప్పినవి ఇంకా జరుగలేదు. కాబట్టి యిది జరిగి తీరుతుంది. ఈ భవిష్యవాణి ఖచ్చితంగా కార్యరూపం ధరించాల్సి ఉంది. ఆయన తప్పక తిరిగి వస్తారు. ఇది నిశ్చయము!

**(...) స్వర్గలోకవాసులకి నక్షత్రములు ఎంత రక్షణగా యున్నాయో, భూలోకవాసుల రక్షణ బాధ్యత అంతయూ నాదే. కనుక త్వరలో భగవంతుని పునరాగమనానికి అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రార్థించండి. ఎందుకంటే మీ విజయం దానితో ముడిపడి ఉంది.** (పుట 498)

# ఎనిమిదవ అధ్యాయము

## అంతరీక్ష దర్శనం ...ఆకాశంలో దర్శనం

భగవంతుడు భూమిపై అవతరించుట గురించి అనేక పౌరాణిక గ్రంథములు ముందే తెలియజేసినవి. అందులో ముఖ్యమైనవి పరిశుద్ధ గ్రంథము నుండి క్రొత్త నిబంధనలో, మనుష్య కుమారుని రాకడ గురించిన భవిష్యవాణి, ముఖ్యమైనవాటిలో ఒకటి. అవి క్రొత్త నిబంధనలో తెలియ చేయబడినవి. పవిత్ర గ్రంథమైన హోలీ బైబిలులో దేవుడు ఆకాశంలో ఎవ్వరూ ఊహించని సమయంలో దర్శనమిస్తాడని, తద్వారా మానవు లందరిని మంత్రముగ్ధులను గావించి ఆధ్యాత్మికముగా శరణాగతులు అవునట్లు తీర్చిదిద్దుటకు వస్తాడని, దైవము గురించి చెప్పబడి ఉంది.

**అప్పుడు మనుష్య కుమారుని సూచన ఆకాశమందు కనబడును. అప్పుడు మనుష్య కుమారుడు ప్రభావముతోను మహిమతోనూ ఆకాశంలో మేఘారూఢుడై వచ్చుట చూచి, భూమి మీద నున్న సకల గోత్రముల వారు రోదించెదరు.** మరియు ఆయన జైకార నాథ ధన్వులతో తన దూతలను పంపును. వారు ఆకాశము యొక్క ఈ చివర నుండి ఆ చివర వరకూ నలుదిక్కుల నుండి ఆయన ఏర్పరచుకొనిన వారిని పోగుచేతురు.

–మత్తయి సువార్త 24: 30–31వచనము

ప్రధాన దూత శబ్దముతోనూ, ఆర్భాటముతోనూ, దేవుని బూరతోనూ **దైవము స్వర్గము నుంచి భూమి మీదకి దిగివచ్చును.(....)**

–మొదటి థెసలోనియన్ పత్రిక 4:16–17 వచనము

హోలీ బైబిలులోని పై వచనముల ననుసరించి ఆకాశంలోనే మానవు లందరికి, దర్శనం కలుగుతుందని అది దేవుడు "మనుష్య కుమారుడు"గా రావటాన్ని ప్రకటిస్తుందనీ సూచింపబడుతుంది. చాలా మంది ఇది ఏసుక్రీస్తు "రెండవ రాకడగా "నమ్ముతారు. భగవాన్ సత్యసాయి బాబా చెప్పినట్లు, ఏసుక్రీస్తు తాను స్వయంగా తిరిగి వస్తానని చెప్పలేదు. బాబా యొక్క రాకనే ఏసుక్రీస్తు చెప్పినట్లు బాబా అభిమతమని మనకు తెలుస్తోంది. (...) **ఏసుక్రీస్తు చెప్పిన విషయము చాలా సరళము. "ఎవరైతే నన్ను పంపారో వారే మీ మధ్యకు వస్తారు".** అని తాను ఒక గొఱ్ఱెపిల్లను చూపుతారు. అది కేవలం ఒక పోలిక, బా...బా శబ్దానికి గుర్తు (...).



ఈ ప్రకటన బాబా అవతరణ గురించే. **క్రీస్తు తానే తిరిగి వస్తానని చెప్పలేదు. "తనను సృష్టించినవాడు తిరిగి వస్తాడని చెప్పాడు. ఆ బా...బా... నే ఈ బాబా** (...)

–సత్యసాయి ప్రవచనములు 11వ భాగము, 54వ అధ్యాయము.

బైబిలు ప్రకారం "మనుష్య కుమారుని రెండవరాక" అంటే భగవాన్ సత్యసాయి బాబా రెండవ రాకడ గురించేనా? ప్రపంచము మొత్తము సత్యసాయిని అదే దేహంతో దర్శనం మరలా చేసుకోబోతున్నారా?

**ఇదిగో ఆయన మేఘారూఢుడై వచ్చుచున్నాడు. ప్రతి నేత్రము ఆయనను చూచును,** ఆయనను పొడిచిన వారునూ చూచెదరు; భూ జనులందరు ఆయనను చూచి విలపింతురు. అవును, ఆమెన్.

యోహాను– ప్రకటన గ్రంథము 1:7

బైబిలు యీ విధంగా చెప్తోంది: ప్రపంచ వ్యాప్తంగా ప్రతివాడు ఆయనను దర్శించుకుంటారు. ఇది విశ్వస్తరీయంగా జరిగే దాన్ని సూచి స్తుంది. అగస్త్యనాడిలో కూడ, బాబా తిరిగి వచ్చే ఆసక్తికర విషయం చెప్పబడి ఉంది. ఈ విషయం "పవిత్రనాడీ గ్రంధాల పరిశీలనలు" అన్న అధ్యాయంలో చెప్పబడుట జరిగింది.

(...) " భగవంతుడు యీ ప్రస్తుత దేహంతోనే దర్శనమిస్తాడు. ఇది ఆయన యొక్క సత్యమైన దేహదర్శనమే. **చాలామంది ప్రజలు ఆనందాశ్చర్యాలతో దర్శించుకొంటారు.** (...) శివ స్వరూప భగవానుడు, ఇలా చెపుతున్నాడు: **భారతదేశ ప్రజలే కాకుండా, ప్రపంచ వ్యాప్త మానవాళి కందరికి దర్శనమిస్తాడు.** అదే స్వరూపంతో దర్శనమిస్తాడు. చాలామంది భక్తులు అనేక చోట్ల దర్శనం లభించినట్లు ఆనందోత్సాహలతో యుంటారు. ఎక్కడ పడితే అక్కడ దర్శించుకుని చాలా ఆశ్చర్య నిమగ్నులై యుంటారు. నిజంగా **ఆయన వేరు వేరు ప్రదేశాలలో చాలామందికి ఒకేసారి దర్శన మిస్తాడు.**

–"పవిత్రనాడీ గ్రంధ పరిశీలనలు" వసంతసాయి–పేజీ 18

అగస్త్యనాడీ గ్రంధ పరిశీలనలు– బైబిలులో చెప్పబడిన భవిష్య వచనములను క్లుప్తంగా ప్రతిధ్వనిస్తున్నాయి. పవిత్ర గ్రంథమైన బైబిలులో, రెండవ రాక, ఎవ్వరికీ తెలియని విధంగా, అకస్మాత్తుగ వస్తుందని, రూఢిగా తెలుపుచున్నది.

" కనుక మీరంతా సిద్ధంగా యుండండి. **మనకెవరికి అర్థంగాని రీతిలో అకస్మాత్తుగా, ఏ ఘడియకో, ఏరోజునో** మానవ కుమారుడు తిరిగి వస్తాడు.

-మత్తై సువార్త 24అ.44వ వచనం.

**ఆరోజు ఆఘడియ, ఏమానవునికి తెలియదు**. స్వర్గంలో ఉన్న దేవతలు కూడ, ముందుగా యీ రెండవ రాకడను ఊహించలేరు." కుమారుడైన ఏసుక్రీస్తుకు కూడ యీ విషయం తెలియదు. తండ్రికి మాత్రమే, అన్నీ తెలుసును. - మార్కు సువార్త 13:32

అటులనే బిహర్-ఉల్-అన్వర్ అన్న గ్రంధములో మహది లేక కైయిమ్ యొక్క రాకకు, పవిత్ర గ్రంధమైన బైబిలులో చెప్పినట్లు 'మనుష్య కుమారుని' రాకకు పోలికలను మనం ఇంతకు ముందే చర్చించాం. తన అంతర్థానం నుంచి తిరిగి ఉదయించడము ఎవరూ ఊహించని ఘడియలో అన్నది 'బిహర్-ఉల్-అన్వర్' అన్న గ్రంధములో కూడా చెప్పబడినది. రెండవ రాకడను గురించి రెండు గ్రంధాల్లోని విషయాల్లో చాలా పోలికలు ఉన్నాయి.

"చూడండి! మీ మహది (ప్రపంచగురువు-దైవం) మీ నుంచి అంతర్ధానమవుతారని (...) అల్లా తోడుగా ప్రమాణం చేసి చెపుతున్నాను... తర్వాత **చాలా దివ్య వెలుగులతో, శోభలతో తిరిగి వస్తాడు."** అని అల్లా స్వయంగా చెప్పినట్లు బిహర్-ఉల్-అన్వర్ అన్న ఆంగ్ల గ్రంధంలో చెప్పబడి ఉంది.

అన్యాయ అక్రమాలతో నిండి యున్న యీ భూలోకమును సమానత్వము న్యాయ పరిపాలనతోనూ పూర్తిగా నింపివేయటానికి తీక్షణమైన వెలుతురుతో ఉల్కాపాతంలా వస్తాడు.

-బిహర్-ఉల్-అన్వర్ 13అ, 1వ భాగము.

ఇప్పుడు పైన చెప్పిన వచనములు పరిశుద్ధ గ్రంధము (హోలీ బైబిలు) లోని మనుష్య కుమారుడు మేఘాల్లోని మెరుపులా తూర్పు నుంచి పడమరకు వస్తాడన్న దానితో పోల్చి చూద్దాం.

**" మెరుపు తూర్పున పుట్టి, పడమటి వరకు ఏలాగు కనబడునో, అలాగే మనుష్య కుమారుని రాకడయు యుండును."**

-మత్తై సువార్త 24 :27వచనం.



**" అప్పుడు మనుష్య కుమారుడు, మహాప్రభావముతోను, మహిమతోను మేఘారూఢుడై వచ్చుట చూచెదరు."**

-మార్కు సువార్త 13-26 వచనం.

బైబిలులోని క్రొత్త నిబంధన మరియు బిహర్-ఉల్-అన్వర్ నుంచి చెప్పిన భవిష్యవాణి, సత్యసాయి రూపము ఆకాశములో అనేక చోట్ల దర్శనమిచ్చునన్న నా విశ్వాసాన్ని బలపరుస్తున్నాయి. ఈ విషయములు పాఠకులు, నేను ముందు వ్రాసిన "స్వామి యొక్క పునరాగమనము" అన్న అధ్యాయములో కొంతమంది, స్వామి, భక్తులకు కలలో అనేకచోట్ల, ఒకేసారి దర్శనమివ్వటం, ప్రపంచవ్యాప్తంగా భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు చెప్పుకొనటం అన్నవి గుర్తు చేసుకో ప్రార్థన. అదే విధంగా సీమ దివాన్ వ్రాసిన స్వామి సందేశాలు, తన యొక్క చివరి క్షణాల్లో తాను దేహంతో యున్నప్పుడు స్వామి చెప్పినవి చూసాము. స్వామి చెప్పిన సందేశం- "నేను ఎక్కడికీ వెళ్ళలేదు." అన్నదాని పైన చెప్పబడిన వివిధ మత గ్రంధాల భవిష్యవాణి స్వామి ఆకాశంలో దర్శన మిస్తారన్న అంశంతో కలిపి పరిశీలిద్దాం.(ముఖ్యాంశాలు మాత్రమే క్రింద పొందు పరుస్తున్నాము.)

(...) " **స్వచ్ఛమైన మనస్సుతో ప్రేమపూర్వక హృదయంతో నన్ను నిత్యం పిలుస్తారు. వారే నన్ను రప్పించుకుంటారు.** కనుక నేను మరియొక సారి, **నా చేతులు సంపూర్ణంగా నింపుకొని తిరిగి వస్తాను. నా పలుకు ఏదీ వృధా పోదు. నేనేది మాట్లాడిన సత్యమే అవుతుంది.** ఎప్పుడూ నన్ను జ్ఞాపకము నందుంచుకొనండి. నేను మీ మధ్యనే యున్నానని తెలుసుకోండి. మీరు భావోద్వేగాలకు లోనుకాకుండా **– నా రాక కోసం ఎదురు చూడండి."**

స్వామి తిరిగి వచ్చి ప్రపంచ వ్యాప్త భక్తులందరి "దృష్టి గోచరం" అన్న మాట, దైవ దర్శనానికి సంబంధించినది. ప్రపంచం చూడబోయే ఈ అద్భుతమైన దివ్య దర్శనానికి స్వామి మనకి సూచన చేస్తున్నారా? ఇది భక్తులందరికి స్వామి "మేలుకొలుపు దినము" అన్నది ఆకాశంలో మనం చూడబోయే రెండవ రాకడ దృశ్యమేనా?

**"ఆ మేలుకొలుపు రోజు ఎంతో దూరంలేదు, అప్పుడు స్వామి యొక్క, సర్వ వ్యాపకత్వం, అద్భుత శక్తి, ప్రకటింపబడతాయి.**

-శ్రీ సత్యసాయిబాబా మరియు మానవ భవిత
సత్యపాల్ రూహేలా. ఆంగ్లమూలం పేజీ 223.

## విశ్వరూపం దర్శనం వాయిదా పడింది.

**"ప్రాముఖ్యము సంతరించుకోని, ఒక్కమాట కూడ నేను మాట్లాడను. మానవజాతికి ఉపకరించని, ఏ ఒక్కపనిని నేను చేయను."**

-భగవాన్ సత్య సాయిబాబా జీవిత చరిత్ర ఆంగ్లం, ఎన్.కస్తూరి, పేజి-196

ది 4 అక్టోబరు 2007న ప్రశాంతి నిలయంలో స్వామి ఆజ్ఞతో సా॥ 7గం॥లకు, "స్వామి విశ్వరూప దర్శనం యిస్తారు". అన్న ప్రకటన వెలువడింది. పుట్టపర్తి విమానాశ్రయానికి ఈశాన్య దిశలో ఇస్తారన్న ప్రకటన రావటంతో, భక్తులందరు, విమానాశ్రయం వైపు పరుగులు తీశారు. సాయిరాం, సాయిరాం అన్న నామస్మరణతో పరుగులెత్తారు. పుట్టపర్తిలో యున్న ప్రజలందరు తమ తమ ఇళ్ళకు తాళాలు వేసి, పరుగులు దీశారు. ఈ విషయాన్ని అన్ని దూరదర్శన్ కేంద్రాలు ప్రచారం చేసాయి. ప్రక్క గ్రామాల నుంచి కూడా వేల కొలది భక్తులు ప్రశాంతి నిలయం చేరుకున్నారు. అందరు భక్తులు బృందాలు బృందాలుగా చేరి, ఆకాశం వైపు విశ్వరూప దర్శనం కోసం తలలెత్తి చూడసాగారు. భక్తితత్పరతతో భక్తులందరూ స్వామి కారు చుట్టూ గుమిగూడారు. సాయి ట్రస్టు సభ్యులు భక్తులను కూర్చోమని ఎంత బ్రతిమిలాడినా వినిపించుకోలేదు. అయినా వారు స్వామి కారు వెంటనే ఉండిపోయారు. స్వామి కారు వద్దే ఒక చిన్న వేదికను కూడా ఏర్పాటు చేయటం జరిగింది. స్వామి బలవంతంగా కారులోనే ఒక గంట వరకు ఉండి పోవటం జరిగింది. కొంత సమయానికి సత్య సాయి ట్రస్టుసభ్యులు " విశ్వరూప దర్శనం వాయిదా వేయబడినదని ప్రకటించారు. భక్తులు ఏమాత్రము సహకరించుట లేదని, ఆకాశం మేఘావృతమై యున్న కారణాన ఆ విధంగా ప్రకటించటం జరిగిందని చెప్పారు. అప్పుడు స్వామి ఆశ్రమానికి తిరిగి వెళ్ళారు.[1]

ఇది శ్రీ సత్యసాయి అవతార చరిత్రలో స్వాభావిక రీతికి భిన్నంగా ఉండటం వలన ఎంతో ఉత్సుకతను రేకెత్తించిన ఘట్టం. బహిరంగ విశ్వరూపదివ్య దర్శనం ఉంటుందని ప్రకటించడం, తదుపరి చిన్న లీలా నాటక రచనతో ఏదో కారణం చూపి దాన్ని వాయిదా వేయటం 'స్వామి పద్ధతికి వేరుగా' ఉంది. స్వామి ప్రసాదించదలచుకున్న ఉత్కృష్ట విశ్వరూప దివ్య దర్శనం అద్భుతాల్లో కెల్లా పరమాద్భుతం. దాన్ని చిన్న చమత్కారం చేసి

1. www.ssso.net నుండి



కారు లోంచి దిగలేక పోయిన కారణంగా వాయిదా వేశారనటం తర్కానికి అందని విషయం. చివరగా సరైన కారణం లేకుండా స్వామి ఏదీ చేయరని మనందరికీ తెలుసు.

గతంలో స్వామి చాలామంది భక్తులకి అంతరిక్ష దర్శనం కూడా యిచ్చారు. విడివిడిగా కొందరి భక్తులకి మరియు కొన్ని బృందాలకి అట్టి దర్శనప్రాప్తి లభించింది. అట్లాంటి ఒక సంఘటన "శ్రీ విజయకుమారి రచించిన "అన్యధాశరణం నాస్తి" అన్న పుస్తకంలో వ్రాశారు. స్వామి ఆమెకు అనేకసార్లు అంతరిక్షంలో దర్శనం యిచ్చారు. అలాగే కొంతమంది భక్త బృందాలకు కూడా.

**ఒకసారి మేమంతా స్వామితో చిత్రావతి నది ఒడ్డుకి వెళుతుంటే మా మధ్య నుండి స్వామి అకస్మాత్తుగా అంతర్థానమైనారు. మేము స్వామి కోసం వెదుకులాడుతుంటే అకస్మాత్తుగా చప్పట్లు కొడుతూ స్వామి కొండపై కనిపించారు. "నేను కొండపై ఉన్నాను." పైకి చూడండి అంటున్న స్వామి కనిపించారు. అప్పుడు సరిగ్గా సాయంత్రం 6గం॥లు అయ్యింది. స్వామి చప్పట్లు కొడుతూ కొండపైనుండి చప్పట్లు చరుస్తూ మమ్మల్ని అప్రమత్తులను గావించారు. అప్పుడు సరిగ్గా సూర్యుడు పడమర దిశకు తన కిరణములను లోనికి మెల్లమెల్లగా తాకుతూ అస్తమిస్తున్నాడు. అప్పుడు ఆకాశము నల్లని మేఘములతో ఆవృతమైయున్నది. అపుడు స్వామి, "మీరు నా వైపు చూడండి. మీకు సూర్యుణ్ణి చూపిస్తాను". అన్నారు. అస్తమించిన సూర్యుడు మరలా తిరిగి ఎలా వస్తాడు? అనుకుంటున్నాము. స్వామి తల వెనుక నుండి ఉషోదయంలో సూర్యుడు ఉదయిస్తున్నట్లు కిరణములు రావటం ప్రారంభమైనాయి. ఆకాశము మొత్తము నీలిరంగు మేఘములతో నిండుతున్నట్లు చూసాము. త్వరగా ఆ లేతకిరణములు ఎఱుపురంగులోకి మారుతూ, తీక్షణత పెరుగుతూ ఉన్నాయి. క్రమక్రమముగా కిరణముల వేడి పెరుగుతూ మేము తట్టుకోలేని స్థితిలో చెమటలు కక్కుతూ తూలిపోయాము. క్రమక్రమముగా కిరణముల వేడి పెరుగుతూ, తట్టు కోలేని, మధ్యాహ్నపు ఎండలో కాలిపోతున్నట్లు మాకు అనిపించింది.**

**ఆ ఎండవేడిమి తట్టుకోలేక మేమంతా పెద్దగా అరిచాము. "స్వామీ! చాలా వేడిగా ఉంది, చాలా వేడిగా ఉంది, అన్నాము. అప్పుడు ఆ వేడి క్రమక్రమంగా తగ్గి మామూలు స్థితికి వచ్చింది. మేము మెల్లమెల్లగా సేద తీర్చుకుంటున్నాము. వెంటనే స్వామి కొండపై నుండి "మీకు చంద్రుడ్ని**

చూపిస్తాను". అన్నారు. అప్పుడు స్వామి తల వెనుక బాగం నుండి తేనె లూరు చల్లటి చంద్ర కిరణములు రావటం ప్రారంభించాయి. క్రమ క్రమంగా అవి తెల్లని అతితెల్లని కిరణములుగా మార్పు చెందుతూ, స్వామి కనిపించారు. మేము తట్టుకోలేనంత చలికి వణుకుతూ యున్నాము. చేతులు, కాళ్ళు, అవయవాలు బిగుసుకుపోతున్నట్ల నిపించింది. "స్వామీ! చలి చలి" అంటూ అరిచాము. అలా స్వామిని వేడుకుంటూ యుంటే, ఆ చలి తీవ్రత మెల్లమెల్లగా తగ్గినది.

అలా ఆశ్చర్యంతో చూస్తూ యింకా ఏ మైనా లీల చూపిస్తారేమో నని ఎదురు చూడసాగాము. వెంటనే స్వామి "మీకు మూడవ నేత్రము చూపిస్తాను, అన్నారు. మూడవ నేత్రం ఎలా యుంటుందో చాలా జాగ్రత్తగా నిశ్చలతతో చూడండి." అన్నారు. మేమంతా ఆశ్చర్య పోయాము. అప్పుడు స్వామి దేహం కనిపించలేదు. కాని స్వామి తల చాలా పెద్దదిగా కనిపించింది. ఆకాశం మొత్తం వ్యాపించినట్లు కనిపించింది. చాలా ఆశ్చర్యంతో, మా మనస్సులు నిండిపోయాయి. ఆకాశంలోకి చూసాము. స్వామి కను బొమల మధ్యనుండి భయంకరమైన వెలుగులు చిమ్ముతూ కన్ను తెరుచు కుంది. మేము అసలు ఆ నేత్రాన్ని ఆ కాంతులను చూడలేక పోయాము. మా కనులు బైరులు కమ్మినట్లు అయినాయి. మేమంతా చాలా భయపడి పోయాము. అంతకుమించి స్వామికి ఏమౌతుందోనన్న ఆందోళన మా అందరిలోను ఆవిర్భవించింది. ఆ వెలుగులు బైటకు విరజిమ్ముతున్నట్లు కనిపించాయి. మేము వెనుకకు చూసేప్పటికి చాలా మంది భక్తులు తెలివి కోల్పోయారు. క్రిందపడి పోయి ఉన్నారు. వాళ్ళకే మైందోనని భయపడ్డాము. పైకి చూశాము. స్వామి మాకు అస్సలు కనిపించలేదు. ఏం చేయాలో తోచక దుఃఖిస్తూ యున్నపుడు అకస్మాత్తుగా స్వామి మా మధ్య కనిపించారు. "ఏం జరిగింది? ఎందుకు విలపిస్తున్నారు? అంటూ మా భుజం మీద తడుతూ స్వామి అడిగారు. ఈ పిల్లలు ఎందుకు కళ్ళు తిరిగిపడి పోయారు." అన్నారు. ఏం చేయాలో, స్వామికి ఏ సమాధానం చెప్పాలో తెలియక స్వామి ఒడిలో ఏడుస్తూ ఒదిగి పోయాము.

ఒకరి తరువాత ఒకరు పడిపోయిన వాళ్ళందరు లేవడం మొదలు పెట్టారు. ఇది మా అందరికి చాలా క్రొత్త అనుభవము. మా శరీరాలు మాకు తెలియకుండానే అటు యిటూ కదలటం మొదలైంది. గాలిలో తేలియాడుచున్నట్లు అనిపించాయి. చెప్పలేనంత హాయి, మా శరీరం మొత్తాన్ని ఆవహించినట్లు అనిపించింది.



మేము సరిగ్గా పాడలేకపోయాము. మాకు చాలా నిద్దుర మత్తుగా ఉన్నట్లు అనిపించింది. ఆ సాయంత్రం మొత్తం అలాగే యున్నట్లు అనిపించింది. తరువాత రోజు కూడా అలానేయుంది. మేమంతా స్వామిని అడిగాము. స్వామి నవ్వుతూ చెప్పారు. "మీరు గత జన్మలలో యీ దప్పిక తోనే నన్ను ప్రార్థించారు. దానికి సమాధానంగా యిపుడు మీకు యీ దర్శనం ప్రాప్తించింది. కాని కనీసం నాలోని వెయ్యోవంతు వెలుగుని కూడా మీకు చూపించలేదు. దీనికే మీరు తట్టుకోలేకపోయారు. ఆ దర్శనం వల్ల మీకు యీ అనుభూతి కలిగింది. స్వామి చేసిన యీ ప్రకటనతో మేమంతా ఆనందంతో స్వామి వద్ద ఏడ్చాము. మా కన్నీళ్ళతో స్వామి పాదాలు కడిగాము.

–'అన్యధాశరణం నాస్తి' –శ్రీ విజయకుమారి(58–61వపేజి)

స్వామి తన ప్రభావంలో వెయ్యోవంతు వెలుగు ప్రదర్శించినప్పటికి భక్తులు తట్టుకోలేక పోయారు. ఆ దర్శనాన్ని చూడలేక భక్తులు మూర్ఛ పోయారు. స్వామి యొక్క వెలుగు ప్రభావము, మన ఊహలకి ఏ మాత్రం అందనిది.

విశ్వరూప దర్శనము ప్రకటన మరియు వాయిదా వేయటము, ఇందుకోసమే జరిగి యుంటుంది. స్వామి మార్గాలు ఎవరికీ అర్థంకావు. కానీ, ఒకటి మాత్రం ఈ అవతారానికి సంబంధించి మనకుతెలుసు తగిన కారణం లేకుండ స్వామి ఏమీ చేయరు అని. మానవజాతి ఉన్నతికే స్వామి ఏమి చేసినాఅని అనిపిస్తుంది. స్వామి దేనికీ కట్టుబడరు. పై చెప్పిన పరిధుల ననుసరించి స్వామి యొక్క కొన్ని చేష్టలు కొంతవరకు మనము గ్రహించవచ్చు. స్వామి ఏదైన ఒక విషయం చెప్పారంటే, ఎట్టి కష్టతర మైనదైనను, ఖచ్చితంగా జరిగి తీరుతుంది. కనీసం ఎప్పుడు, ఎలా సాధ్య మౌతుందో మనకర్థం కాదు. అందు కొఱకే **"ఓర్పు"ను వహించి ఉండండి. "సకాలంలో మీకు అన్నీ అందిస్తాను"** [1]. అని స్వామి చెప్తారు. "విశ్వరూప దర్శనం" అన్న లీల గురించి ఆ సమయంలో స్వామి చెంతనున్న ఒక భక్తుడు ఈ డ్రామా ఎందుకు జరిగిందంటే తప్పకుండా స్వామి యొక్క "విశ్వరూప సందర్శనం" రాబోవు కాలంలో మనం చూస్తాము, అని నేను నమ్ముతున్నాను అన్నాడు. సత్యసాయి ట్రస్టు సభ్యులు "విశ్వరూప దర్శనం వాయిదా" వేయబడినది కాని రద్దుచేయ బడలేదు, అని మాత్రమే ప్రకటించారు.

[1] సనాతన సారధి, ఆంగ్లం అక్టోబరు 1996 వెనుక అట్ట.

## ప్రశాంతత రాబోవు ముందు మహా ఉప్పెనా లేక గాలివానా?

**పవిత్ర నాడీ గ్రంధ పరిశీలనలు '** అన్న అధ్యాయంలో అగస్త్యనాడి లో చెప్పిన భవిష్యవాణి ప్రకారం స్వామి దివ్య దర్శనానికి ముందు భయంక రమైన తుఫాను వస్తుందన్న విషయం మనం చూశాము.

**"స్వామి రావటానికి ముందు భయంకరమైన గాలివాన వస్తుంది. చాలా భయంకొల్పి, విలయతాండవం చేస్తుంది. కాని వెంటనే ఆగి పోతుంది. అకస్మాత్తుగా భగవద్దర్శనం ప్రాప్తిస్తుంది. ఆరోజు నుండి యింకా మరిన్ని ఆశ్చర్యకర అద్భుతాలు పెరుగుతూ వస్తాయి.**

–పవిత్ర నాడీ గ్రంథ పరిశీలనలు.(శ్రీవసంతసాయి,ఆంగ్లం,పేజీ 21–22)

"స్వామి దివ్య సందేశాలు మీకు–మాకు" అన్న గ్రంధంలో లూకాస్ రాలీ, ఉప్పెన గుఱించి స్వామి చెప్పిన దివ్య సందేశం పొందు పరిచారు. ఈ ఉప్పెన అనంతరం ప్రపంచవ్యాప్తంగా అద్భుతమైన ప్రశాంత వాతావ రణం నెలకొంటుంది. ప్రపంచవ్యాప్తంగా శాంతిని చేకూరుస్తుంది.

**"ఈ భయంకరమైన తుఫాను తరువాత ఏర్పడబోవు నూతన శకంలో ఆ వాతావరణము చాలా భిన్నంగా ఉంటుంది. యుద్ధ వాతా వరణము, పోట్లాటలు, అసూయా ద్వేషాలు, లోభిత్వము, విరోధభావాలు, అన్నీ నశించి ప్రేమ–సుహృత్, సమైక్యతలతో పరస్పర అనురాగ పూర్వక భావాలతో, ఒకరినొకరు సహకరించుకుంటూ, కలసియుండు చక్కని వాతావరణంతో కూడిన నవ్య శకం.**

–సాయి సందేశాలు మీకు–నాకు, లూకాస్ రాలీ1985 అ–1

ప్రపంచము ఉప్పెనలతోను, ప్రకృతి సిద్ధమైన ప్రళయాలతోనూ యున్న సమయంలో మానవాళిని ఉద్ధరించుట కొఱకు భగవంతుని రాక సమయో చిత ఘడియలో ఇంకోలా చెప్పాలంటే ఈవిధమైన ముందస్తుగా వచ్చే కష్టాలూ, కడగండ్లు లేకుండా స్వామివారి రెండవ రాకడ దివ్యదర్శనం జరగకపోవచ్చు. అద్భుత నాడీ గ్రంధాలు అన్న అధ్యాయంలోను మరియు నోస్ట్రడామస్ చెప్పిన భవిష్యత్ గుఱించిన విషయాలలోను మనము ప్రకృతి యొక్క విలయతాండవాన్ని సూచించే సూచనలు చూశాము.

అద్భుత కాలం వచ్చేముందు భూ ప్రపంచంలోని మానవు లందరు ఏకకంఠంతో, మరియొక గత్యంతరం లేక రక్షణ కోసం భగవంతుని ప్రార్థించే రోజు వస్తుందని, నాకు అనిపిస్తోంది. భూలోకం ఎంత అల్లక ల్లోలంగా యున్నను, భయంకరంగా యున్నను, ప్రకృతి విలయతాండవం చేస్తున్నను, ఎల్లప్పుడూ ప్రేమనిండిన హృదయంతోయున్న సర్వ రక్షకుడు సాయి మనల్ని రక్షించడానికి తిరిగివస్తాడని పైన చెప్పిన నాడీ జోస్యం ఆధారంగా మనం విశ్వసించవచ్చు.



## ఆకాశ మార్గంలో స్వామి నడక

స్వామి తమ కొంతమంది సన్నిహిత భక్తులతో " నేను ఆకాశ మార్గంలో అటు నుంచి ఇటు వైపు నడిచి వెళ్ళు సమయం వస్తుంది. అప్పుడు నా వైభవాన్ని, సర్వ మానవాళి గుర్తిస్తారు." అని అన్నారు. స్వామి అఖిల జనవేదిక మీద కూడా తన దివ్యసందేశాల్లో దీనిని వినిపించారు.

**" నేను ఆకాశమార్గంలో అటు నుంచి యిటు నడవవలసిన పరిస్థితి వస్తుంది. అవును. అది జరిగి తీరుతుంది. నామాట నమ్మండి"**

– సత్యసాయి ప్రవచనములు 2వ భా ఆంగ్లం 18వ అ


**మీరు స్వామి యొక్క వైభవాన్ని నేను ఆకాశంలో ఒక వైపు నుంచి మరియొక వైపునకు నడిచి వెళ్ళినపుడు గ్రహిస్తారు.**

– తపోవనం శ్రీసత్యసాయి సచ్చరిత్ర–11వ అ

పై విషయాల ననుసరించి, స్వామి "ఆకాశదర్శనం" అన్న విషయాన్ని తన మనస్సులో స్వామి స్థిరంగా పెట్టుకున్నారన్న విషయం రూఢి పరచుకోవచ్చు. అట్లాంటి అద్భుత దర్శనాన్ని తిలకించటానికి సిద్ధంగా యున్న మానవాళి ఎంత అదృష్టవంతులో గదా ! అది సంభవించినపుడు ఎంత అందంగా ఉంటుందో కదా !

# తృతీయ భాగం.

# నీ రాజ్యం వచ్చు గాక



# తొమ్మిదవ అధ్యాయము

## శ్రీ సత్యసాయి స్వర్ణయుగ స్థాపన

**"మీకు తెలియదు. చాలా అద్భుత విషయాలు గొప్ప విషయాలు జరగబో తున్నాయి. ఏదివిన్నా, చూసినా తలంచిన అన్నియు పవిత్రము అవుతాయి. ఇదంతయు త్వరలోనే జరిగి తీరుతుంది. ఇంత పవిత్రమైన అవకాశాన్ని జార విడువకండి. చేజార్చబోకండి. వృధా చేయకండి. ఒకసారి పోయిం దంటే మళ్లీరాదు. ఒకసారి లభించిందంటే, మీరు మళ్ళీ పోగొట్టు కోరు."**

– స్వామి దివ్య సందేశం, ప్రశాంతి నిలయం. అక్టోబరు 14, 1999.

మానవ చరిత్రలోనే ఒక గొప్ప అధ్యాయాన్ని సృష్టించడానికి వచ్చా నని స్వామి తరచుగా చెబుతూ ఉంటారు. ప్రేమ, శాంతి, ధర్మము, సత్యము లతో ప్రపంచమానవ జాతిమొత్తం ప్రశాంతితో యుండి అభివృద్ధి పథమున పయనించు "స్వర్ణయుగం", ఒక నూతన శకము ఆవిర్భవింప చేస్తానం టారు. ప్రపంచములోని యావత్ప్రజానీకము సత్యసాయి అవతారమును గుర్తించి తన నామరూపాలను దృఢంగా ప్రతిష్టించుకునే శాంతి సౌభాగ్యాల శకము దరిదాపుల్లోనే ఉంది.

స్వామి తమ దివ్య సందేశములలో అనేకమార్లు ఇంతటి ఆశ్చర్యకర మైన సమయము వస్తోందని చెప్పియున్నారు. పాక్షికంగా కొన్ని సంఘటనలు జరిగేయున్నవి. మిగిలిన విషయములు స్వామి తర్వాత రాబోవు "ప్రేమ సాయి" అవతారములో జరుగునని మన మదిలో అనుమానములు రేకెత్త వచ్చును. కానీ సర్వసాధారణముగా భక్తులందరికి తెలుసును, స్వామి యీ 'రూపంతో', 'ఈ దేహంతో' అన్నప్పుడు ప్రస్తుత సత్య సాయిబాబా అవతారంలోనే యివన్నియు జరుగుతాయని స్పష్టమవుతోంది. అంతే కాకుండా కొన్ని కొన్ని సందర్భాలలో స్వామి ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ప్రేమసాయి అవతారం వచ్చుటకు ముందే ప్రపంచం ప్రశాంతి నిలయంగా మారుతుందని వివరంగా తెలిపి యున్నారని మనకు తెలుసు. జాన్ హిస్లాప్ గారితో ఇంటర్వ్యూలలో చేసిన సంభాషణలు మనము ఇపుడు చూద్దాము. డా॥జాన్ హిస్లాప్ గారు రచించిన "నేనూ–నా సాయిబాబా" అన్న గ్రంధము నుంచి, 1978లో స్వామితో సంభాషణలు, 189వ పుట.

**హిస్లాప్**: మనమంతా చాలా కష్టపరిస్థితులు ఎదుర్కొనవలసిన సమయము వస్తుందని చాలామంది అంటున్నారు స్వామీ !

**సాయి:** నేను చెప్పినట్లు అక్కడక్కడా కొన్ని అట్టి సంఘటనలు జరుగవచ్చు. కానీ ప్రపంచము మొత్తము సంతోషంగా, ప్రశాంతంగా అన్ని విధాల అభివృద్ధిలోను యుంటుంది.

**అతిథి** : ప్రపంచ యుద్ధం రాదా?

**సాయి** : రాదు.

**హిస్లాప్** : అప్పటి వరకు జీవించి యుంటే ప్రశాంతితో నిండిన ప్రపంచాన్ని చూడవచ్చు గదా.

**సాయి** : మీరందరూ చూస్తారు. మరియు వృద్ధులు కూడా చూడటానికి జీవించి ఉంటారు.

**అతిథి** : అప్పటికి స్వామి ప్రపంచం మొత్తాన్ని ప్రశాంతంగా మార్చేసి ఉంటారు. అపుడు ప్రేమసాయికి చేయవలసిన పని ఎక్కువ ఉండక పోవచ్చు.

**సాయి** : ఇది యింకా 40 సం॥లకి గాని జరగదు. (1978నుంచి) **అప్పటికి ప్రపంచమంతా ప్రశాంతితో యుంటుంది. దానిపేరే ప్రేమ సాయి. ప్రేమ, ప్రేమ, ప్రేమ అంతా ప్రేమమయం.**

– 'నేను, నా బాబా' జాన్ ఎస్ హిస్లాప్ , ఆంగ్లము పేజీ. 189

ప్రముఖ బ్లిట్జ్ సంపాదకుడు ఆర్.కె.కరంజియాకు, సెప్టెంబరు 1976లో యిచ్చిన ఇంటర్వ్యూలో;

**"ప్రేమసాయి అవతార ధ్యేయం ప్రజలందరూ తమంతట తామే దైవ స్వరూపులమని గ్రహించేలా చేయడమని చెప్పారు. ప్రతి వానిలోనూ దైవమున్నదని గుర్తింపచేయటమే ఈ అవతారము యొక్క ముఖ్య లక్ష్యము. ప్రజలందరూ పరస్పరం గౌరవించుకుంటూ ఒకరికొకరు సహాయం చేసు కుంటూ, ఒకరినొకరు ప్రేమించుకుంటూ, కులమత వ్యవస్థలకు అతీతంగా ఉండాలి. తద్వారా ఏపని చేసినా అది ఒక పూజగా మారిపోగలదు. చివరగా మూడవ అవతారమైన ప్రేమసాయి దైవ సందేశ వ్యాప్తి ద్వారా మనలో దైవం ఉందని తెలియ జేయుటయే గాక, మనమంతా దైవ స్వరూపు లమని గుర్తింపజేస్తాడు. ప్రేమసాయి, మనందరిని దైవము వైపు మరల్చు నట్లు చేయు అద్భుత జ్ఞానాన్ని, చిట్టచివరగా మనకు అందిస్తాడు."**

–బ్లిట్జ్ ఇంటర్వ్యూ సెప్టెంబరు 1976.



ప్రేమసాయి అవతారము, తేలికగా గ్రహించలేని, చివరి అద్భుత జ్ఞానాన్ని (తెలివిని,ఎఱుకను) ప్రసాదించటానికి వస్తుంది. ఆధ్యాత్మిక మార్గ ములో అందరూ ఉన్నత స్థితికి చేరుకునే అనుభవ జ్ఞానాన్ని గ్రహించే పరిణితిని పొంది ఉంటారు. ఈ అద్భుత అనుభవ జ్ఞానాన్ని గ్రహించే పరిణితిని సత్యసాయి అవతారం గాక, యింకెవరు అందించగలరు ?

## స్వర్ణయుగ పునరావిర్భావం

**భగవంతుని దృఢ సంకల్పమును, ఎవ్వరూ అడ్డుకొనలేరు. భగ వత్ నిర్ణయాలు జరిగి తీరుతాయి. నిండు సంతోషంతో కూడుకున్న స్వర్ణ యుగం తిరిగి ఆవిర్భవిస్తుంది.**

–తూర్పు దేశాలవారి దృక్పథంలో ఏసుక్రీస్తు. 12 వ పుట.

**పరిస్థితులు మెరుగుపడతాయి. జీవితం చాలా సంతోషంగాను, ఆనందంతోను నిండియుంటుంది, మరియు స్వర్ణయుగము వస్తుందని చెబితే చాలామంది నమ్మటానికి సందేహిస్తుంటారు. "నేను మీకు వాగ్దా నము చేస్తున్నాను. ఈ దివ్యశరీరము, ఈ ధర్మస్వరూపము ఊరికినే రాలా. మానవ జాతి ఎదుర్కోబోతున్న ఈ విపత్కర పరిస్థితులను సరిదిద్దటానికి వచ్చాను. ఇందులో నేను ఖచ్చితంగా విజయము సాధిస్తాను."**

–సాయిబాబా, ది హోలీమాన్ అండ్ సైక్రియాటిస్ట్. పేజీ 91.

**మనము అనుకున్నదానికంటే, త్వరలో ముందుగానే ఇది జరిగి తీరుతుంది.**

**"భయపడకండి! నా పిల్లల్లారా! అంతా బాగా ఉంటుంది. ప్రేమ మరియు కాంతులు, చీకటులను పోవునట్లు చేసి, మీ అందరి కొఱకు ఒక నూతన శకమును తీసుకొస్తుంది.**

– శ్రీ సత్యసాయిబాబా మరియు మానవ భవితవ్యము ఆంగ్లం 110 పేజి

**సర్వ మానవకోటి కలసిమెలసి ఉండే కాలం రాబోతోంది. మీరందరు అనుకున్న సమయానికంటే ముందుగానే రాబోతోంది. అది వచ్చే ముందు గానే మానవజాతి జీవిత లక్ష్యాన్ని గుర్తింప చేయటానికి కావలసిన సరం జామాతో సిద్ధంగా ఉండండి. దీన్ని ఊహించటానికి వీలుకాదు. ఇది మనెవ్వరి ఊహలకు అందనంత వైభవోపేతమైనది. మీరు నిశ్శబ్దంగా మీ మీ పనులను చేసుకుంటూ పోతుంటే మిమ్ములను, నా హృదయానికి హత్తుకుంటాను, అప్పట్నుంచీ మీ నేత్రాలు మీలోనున్న నన్ను ప్రకటిస్తాయి.**

–శ్రీ సత్యసాయి బాల వికాస్, వాల్యూమ్15, నెం 9, సెప్టెంబరు 1996.

**(...) మానవ సోదరత్వము, భగవంతుని పితృవాత్సల్యము, అను కాంతి శోభలతో అందంగా తేజోవంతంగా ప్రకాశించే రోజు త్వరలోనే ఆవిర్భవిస్తుంది.**

–శ్రీసత్యసాయి ప్రవచనములు 13వ భాగము. 18వ అధ్యాయము.

**(...) ప్రపంచము ఇప్పుడు పూర్తిగా భయాందోళనలతోను అదుర్ధాలతోను కష్టకాలంలో ఉన్నది. ఆ చీకటి మేఘాలు త్వరలోనే తొలగిపోతాయి అని నేను మీకు అభయమిస్తున్నాను, మీరందరు, ఆనందంతో కూడిన నూతనశకాన్ని జగత్తంతా కళ్ళారాచూడగలరు.**

– సత్యసాయి ప్రవచనము 11వ భా. 28వ. అ

**(...) ఈ ప్రపంచం అస్తవ్యస్త భరితస్థితి అంచున ఉన్నప్పుడు భగవంతుడు వచ్చి మానవ హృదయాంతరాళములలో ఎగిసిపడే తుఫానులను, శాంతింప చేస్తాడు. ఈ ప్రపంచాన్ని ప్రశాంతి సౌభాగ్యములతో నింపి, రాక్షస ప్రవృత్తులను నిర్మూలనము గావించి, దారితప్పిన మానవాళిని దైవ మార్గములో నడిపించి, ధర్మాన్ని పునఃస్థాపించి శక్తివంతం చేయుటకు భగవంతుడు అవతరిస్తాడు."**

–సత్యసాయి ప్రవచనము 11వ భా, 31వఅ.

## స్వర్ణయుగము ఎలా ఉంటుంది?

**స్వర్ణయుగము ఆవిష్కారము జరిగినపుడు ప్రపంచమంతా సామరస్యంతో ఉండి ప్రేమనదులు, ఎల్లచోట్ల ప్రవహిస్తూయుంటాయి. ద్వేష భావములతో కూడుకున్న ఆలోచనలు అంతరించిపోతాయి.** ఆ విషయాన్ని అంత తేలికగా యీరోజు మీరు మనసులో స్పష్టంగా చూడలేరు. ఎందుచేతనంటే ఇపుడు ప్రపంచము ఈర్ష్యా, ద్వేషం, అసూయ, చెడు దుష్టపన్నాగాలతో, వ్యతిరేకభావములతో నిండిపోయి, దుష్టభావాలు పెరుగుతూ అల్లకల్లోలముగా యుంది. కాని చివరకి మార్పు వస్తుంది.

–'సాయి సందేశం మీకు– నాకు ' గ్రంధం నుండి వాల్యూమ్ 2, 70వపుట.

**"ఈ మార్పు ప్రపంచవ్యాప్తంగా సంభవిస్తుంది. ఒక ప్రాంతానికి మాత్రమే పరిమితము గాదు. అది అన్ని చోట్ల సంభవిస్తుంది."**

–'నేను నా బాబా' ఆంగ్లము నుండి 189 వ పుట



(...) ఆ దినమున సత్య, ధర్మశాంతి, ప్రేమ, అహింసలతో మానవ జాతి మొత్తము, ఒకే కుటుంబముగా యుంటుంది.(...) వసుధైక కుటుంబంగా, సత్య ధర్మశాంతి, ప్రేమ అహింసలు ఖచ్చితంగా పాటిస్తూ (...) **ప్రపంచము మొత్తము ఒకే సాయి రాష్ట్రముగా ఆవిర్భవించబడుతుంది. భూలోక స్వర్గమును అనుభవించ బోయేవారు ఎంత ధన్యులో కదా!**

–సాయి వందన, 25,1990.

"ఇదొక క్రొత్త యుగము. ప్రేమ యుగము. స్నేహ భావములతో పరస్పరము సహాయ సహకారములు అందించుకొను నూతన యుగము. యుద్ధములు, కలహములు, అసూయలు, లోభములు అనే వికృత స్వభావములు లేని స్వర్ణయుగము ఇది.

– శ్రీ సత్యసాయిబాబా మరియు మానవ జాతి భవిష్యత్తు పేజి 223.

"భయాందోళనలు, చీకట్లతో క్రమ్ముకొని యుండి కలుషితము గావించబడి యున్న ఈ చీకటి యుగమును ప్రేమ శాంతులు(...) పరి శుభ్రము గావించబోతున్నాయి.

– శ్రీ సత్యసాయి బాబా మరియు మానవజాతి భవిష్యత్తు పేజి–10

జీవనవిధానం మారి మెరుగుపడుతుంది. ఇన్నాళ్ళూ మీకు అందకుండా పోయిన ఉన్నతశ్రేణి సుభిక్షజీవితాన్ని మీరు అనుభవించబోతున్నారు.

–శ్రీ సత్యసాయిబాబా మరియు మానవజాతి భవిష్యత్తు –221 వపేజి.

"ఇప్పుడు ఎక్కడ చూచినా హింసా ప్రవృత్తి పెరిగిపోయింది. ఇదంతయు మీ మంచి కోసమే. **ప్రతివారిలోను పవిత్ర భావములు అభివృద్ధి అవుతాయి. అందరూ దివ్యానందాన్ని పొందగలరు. యావద్భారత దేశం త్వరలోనే శాంతి సంతోషములతో యుంటుంది. ఇక ముందు ఎటువంటి కష్టాలు బాధలు ఉండవు.**

– దివ్య సందేశము, బృందావనం, మార్చి16, 2003.

"భగవదవతారములకు, విజయము – అపజయము అంటూ ఉండదు. వారు సంకల్పించుకున్నవి, జరిగితీరవలసినదే.(...) **నేను మానవ చరిత్రలో ఒక బంగారు అధ్యాయాన్ని లిఖించడానికి వచ్చాను. చెడు, అపజయం పాలవుతుంది. సత్యము జయిస్తుంది. సద్గుణాలు వృద్ధి పొందుతాయి. ప్రపంచము యావత్తు నీతి నియమాలకు పట్టం కడుతుంది గాని తెలివి తేటలకు, ధనానికి, పరిశోధనా నైపుణ్యానికి కాదు. అన్ని దేశ సభలలోను జ్ఞానము, అధిష్టింపబడుతుంది.**

–సత్యసాయిబాబా, ప్రేమస్వరూపులు, 174వ పుట.

**సత్యసాయి అవతారమును అందరూ గుర్తిస్తారు.**

**“ నా పేరు, రూపము, అన్నిచోట్ల అభివృద్ధి చెంది ప్రతిష్టించబడుట మీరు చూస్తారు. ప్రపంచమునందు నా ప్రతిష్ఠ అంగుళము అంగుళమునకు వ్యాపించిపోతుంది.”**

– దేవుడు భూమి మీద అవతరించాడు. పేజి 37.

**“స్వామి యొక్క దైవశక్తిని, వైభవాన్ని మున్ముందు మీరు చూస్తారు. కొద్ది రోజులలోనే స్వామి ప్రపంచాన్నంతా ఆకర్షిస్తాడు. ప్రజలకు నిల్చుంటానికి కూడా స్థలము దొరకదు.”**

– భగవాన్ దివ్యసందేశం, బృందావనం మార్చి 16, 2003.

“సాయిబాబా, ఒక ఐదడుగుల, మూడంగుళాల రూపమని మీరు అనుకోకండి. **ప్రంచవ్యాప్తంగా ప్రజలు నా ఉనికిని గుర్తిస్తారు. కొద్ది దినములలోనే ప్రపంచము మొత్తము యిక్కడకు వస్తుంది.**

– సత్యసాయిస్పీక్స్ 28వ భాగము, 19వ అధ్యాయము.

**అమెరికా,జర్మనీ, జపాను, ఇటలీ, ఫ్రాన్సు, మొదలైన అభివృద్ధి చెందిన దేశములన్నియు పుటపర్తిని గుర్తిస్తాయి. ప్రతి దేశము, ప్రపంచ పటములో పుట్టపర్తిని ఒక ప్రఖ్యాత స్థానంగా గుర్తిస్తాయి.**

–భగవాన్ సందేశం, ప్రశాంతి నిలయం, అక్టొబరు19, 1999

స్వర్ణయుగము ఆవిర్భావమునకు గుర్తుగా, **సాయి వైభవము, ప్రపంచములోని అన్ని ప్రాంతములకు వ్యాపిస్తుందని, ఇప్పుడు ఉన్న దానికంటే వేలరెట్లు, అభివృద్ధి చెందుతుందని** ఒక ప్రశ్నకు సమాధానంగా స్వామి చెప్పారు. –డిసెంబరు 1993 సనాతన సారధి

“కొద్ది రోజులలోనే మీరు, గుర్తిస్తారు. **రోజు రోజుకి దైవము యొక్క శక్తి పెరుగుతూ, మీరంతా ఆనందంలో యుండేట్లుగా అనుగ్రహం ప్రసాదిస్తుంది. భూమి మీద నెలకొనియున్న అశాంతి పూర్తిగా త్వరలో రూపు మాసిపోతుంది.**

– భగవాన్ దివ్య సందేశం, బృందావనం, మార్చి 16, 2003.

మున్ముందు స్వామి యొక్క తత్వము అనేటువంటిది ఈనాడు గుర్తుంచుకోలేని వ్యక్తులందరు కూడాను ఆనాడు కంటినీరుతో ఒక విధమైనటువంటి యొక్క దీనిని అనుభవించవలసి వస్తుంది. స్వామి యొక్క తత్త్వము



అతి శీఘ్రములోనే జగత్వ్యాప్తమైపోతుంది. దీనినిమిత్తమై స్వామే గట్టిగా దీనిని అరికట్టుకుని ఉన్నాడే కాని ఒకతూరి విజృంభించినప్పుడు జగత్తంతా ఒక ప్రశాంతి నిలయంగా రూపొందుతుంది.

– శ్రీ సత్యసాయి ప్రవచన ములు భా–15:55 (స్వామి తెలుగు వచనాలు ఆడియో నుండి యథాతథంగా)

(...) **లక్షల ప్రజానీకము,** భగవదవతారము నుండి లబ్దిపొందటానికి, త్వరలోనే సమావేశమగు రోజు వస్తుంది.నా అనుగ్రహమును మీరు వీలున్నమటుకు పొంది రక్షించుకుంటూ ఉండండి.

–సత్యసాయి స్పీక్స్ వాల్యూ11, 41వ అధ్యాయము.

## సాయి సంస్థల ప్రాముఖ్యము.

సాయి సంస్థ, యిప్పుడు చిన్నదిగా కనిపించవచ్చు. **మున్ముందు చాలా మందిని ఆకర్షిస్తుంది. సాయి సమావేశములలో సాధారణ ప్రజలకు స్థానము లభించకపోవచ్చును. ఉన్న స్థానాలన్నీ సాయి సంస్థలలోని భక్తులతో నిండి పోతుంది.** సాయి సంస్థలలో సభ్యత్వం లభించటమే గొప్ప అవకాశము. –‘నేను నా బాబా’ , డా॥జాన్ ఎస్ హిస్లాప్. పేజి 209 స్వామితో ఇంటర్వ్యూ డిసెంబరు 1982

**ప్రపంచము మొత్తము ఒకే ఒక సత్యసాయి సంస్థగా రూపొందుతుంది. అంతే కాకుండా ప్రజలందరి హృదయాలలో సత్యసాయి ప్రతిష్టింపబడతాడు.**

–సనాతనసారధి, జనవరి 1999, పేజి 16.

## భారతదేశ ఔన్నత్యము

ప్రపంచములోని అన్ని దేశములు, భారతదేశాన్ని పూజించటము మీరు చూస్తారు. మీరెంత అదృష్టవంతులో గదా! **సత్యసాయి నామముతో ప్రపంచ దేశములన్నియు మారుమ్రోగుతూ యుంటాయి. ఈ దేహంతో యున్నప్పుడే,** (...) యిప్పుడే మీతోనే మీ ముందు ఉన్నప్పుడే సనాతన ధర్మము తన సహజస్థితిలో ప్రతిష్ఠింపబడటము మీరు చూస్తారు. ప్రపంచ ప్రజల మంచి కొరకు **వేదాలలో చెప్పబడిన ధర్మములన్నియు ప్రతిష్ఠింపబడతాయి.** (సనాతన ధర్మము) వేద ధర్మమును పునఃస్థాపించడమే స్వామి సంకల్పము. నా శక్తి సామర్థ్యములకు, ఆకర్షింపబడి అందరిని నా వద్దకు లాక్కుంటాను.

–దివ్యసందేశం మే 17, 1968

**భారతదేశము, ఆధ్యాత్మికంగా సాంస్కృతికంగా సాంఘికంగా రాజకీయంగా ఆర్థికంగా చాలా సమృద్ధిగా ఉండి, అన్ని విధాల ప్రపంచదేశాలన్నిటికి, నాయకత్వము వహిస్తుంది.** గతించిన ఆచార ధర్మాలని, సంస్కృతులతో కూడిన వైభవాన్ని పునర్నిర్మించి ప్రపంచ దేశాలకి, మార్గదర్శకత్వం వహిస్తుంది. భారతదేశ ఉన్నతి గత యుగాలలో ఎలా ఉన్నదో, అదే విధంగా ప్రాచుర్యాన్ని పొందుతుంది.

–శ్రీ సత్యసాయి అమృతవర్షిణి, 34వ పుట.

"ఈరోజు శ్రీ కృష్ణ జన్మాష్టమి, కృష్ణుని యొక్క జన్మదినము. **ఇపుడు మీ అందరికి ఒక వాగ్దానము చేయుచున్నాను. పాకిస్తాను, చైనా, జర్మనీ, రష్యా మొదలైన దేశములన్నియు, ఏకమైపోతాయి. (...) భారతదేశము యొక్క మంచితనము, ప్రపంచదేశాలన్నిటిని ఏకముగా విస్తుంది."**

–సనతనసారథి, సెప్టెంబరు 2002

ప్రస్తుత వైపరీత్య పరిస్థితుల దృష్ట్యా స్వర్ణయుగము వస్తుందని మనం నమ్మలేకపోవచ్చు. కానీ స్వామి చెప్పినట్లుగా మన కలలన్నీ ఫలించి నమ్మ లేనంత గొప్ప వైభవాన్ని చూస్తాము. చెడు భావముల ప్రభావములతో నిండిపోయి యున్న ప్రపంచములో అది సాధ్యం కాదనిపిస్తుంది, కాని స్వామి వాగ్ధానము చేసినట్లుగా స్వర్ణయుగము వస్తుంది.

**(ప్రొఫెసర్ కస్తూరి:)** నూతన ప్రపంచ నిర్మాణం కోసం పరిపూర్ణ సాయి సమాజం కోసం ఆనందంతో వేచి చూద్దాం. అన్ని రంగాల్లోనూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ఆరోజు మనమూహించలేనంత దగ్గర్లోనే ఉంది.

–సనాతన సారథి, ఆగష్టు 1991.

## 2012 సంవత్సర ప్రాముఖ్యము

2012 సంవత్సరము, ప్రాముఖ్యత గురించి అనేకమంది అనేక రకములుగా మాట్లాడుకుంటున్నారు. ఏదో జరగబోతోందని, వివిధ ప్రసార సాధనాలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ పలుప్రసారాలు జరిపాయి. డిసెంబరు 21, 2012, భారీ ప్రళయము సంభవించబోతోందని, కలియుగము అంతమౌతుందని, కొందరు నక్షత్ర శాస్త్రవేత్తలు, జ్యోతిష్కులు చెప్పటం జరిగింది.



కలియుగం అంతమౌతుందని, నేను నమ్మకపోయినప్పటికి 2012 సం॥ కొంత ప్రాముఖ్యము, సంతరించుకుంటుందన్న మాట నిజము. ప్రపంచ ప్రజలు ఏదో విచిత్రము 2012 లో తప్పక సంభవించ బోతోందని, కొంతమంది భావిస్తున్నారు. నిజంగా ఏం జరగబోతోందో ఎవ్వరికీ తెలియదు. మంచి జరగబోతోందో, చెడు జరగబోతోందో ఎవరికీ తెలియదు. అంత ప్రమాదమేమి ముంచుకురాదని స్వామి చెప్పిన మాటలు మనకు గట్టి నమ్మకాన్ని కలిగిస్తున్నాయి.

"అంతపెద్ద ప్రళయమేమి ముంచుకురాదు. కాలానుకూలంగా ప్రపంచంలో అక్కడక్కడ కొన్ని విపరీతములు సంభవించవచ్చు".

–సత్యసాయి ప్రవచనములు 24వ భాగము, 4వ అధ్యాయము

2012 సం॥లో భూగోళము మొత్తము ఆధ్యాత్మికంగా చాలా ముందుకుపోయి కాలాంతము కాదు, గాని నూతన శకము (యుగము) ప్రారంభము కానున్నదని చాలామంది నమ్ముతున్నారు. ఏది ఏమైనప్పటికి భూమి మీద కొంత న్యాయము, ఏదో అద్భుతము జరగబోతోందని, ప్రపంచ వ్యాప్తంగా కొంతమంది పరిశోధకులు నమ్ముతున్నారు. ప్రస్తుతం, శ్రీ సత్య సాయి సూపర్ స్పెషాలిటీ, వైద్యాలయము, బెంగళూరులో పనిచేయుచున్న ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హృద్రోగ నిపుణులు డా॥ శ్రీ కాంత్ సోలా, "రేడియాసాయి"కి ఇంటర్వ్యూ యిచ్చారు. – ఆ యింటర్వ్యూ సారాంశము.

"స్వామి, తమ విద్యార్థులతో 2007 లో, కొడైకెనాల్‌లో ఇచ్చిన ఇంటర్వ్యూలో **సత్యయుగము 2012 సం॥తో ప్రారంభమౌతుంది** అని చెప్పిన విషయం మీతో పంచుకుంటున్నాను. వర్షాకాలంలో వర్షాలు వస్తాయని చెప్పినట్లు, మనము ఒక యుగము అంతమై నూతన యుగములో ప్రవేశిస్తాము, అన్న విషయాన్ని అంత సహజమైన విషయంలా చెప్పేరు. (పై స్వామి మాటలు 2012 సంవత్సర ప్రాముఖ్యాన్ని తెలుపు ఒక నిర్దిష్టమైన సంకేతాన్ని మనకు అందిస్తోంది. ఈ సందిగ్ధ సమయంలో ఇది ఒక అద్భుతమైన సంవత్సరము)

2012 ప్రాముఖ్యాన్ని స్వామి పైన చెప్పిన విషయం ఒక ముఖ్య సంకేతము. ఇంకా ముఖ్యమైన విషయమేమంటే, ఈ సం॥లో స్వామి చెప్పినట్లు ఏదో అద్భుతం జరగబోతోంది. స్వామి చెప్పిన మాటలు ప్రకారం **2012 చెడుకి , అన్యాయాలకు పూర్తిగా స్వస్తి పలికి, అందమైన స్వర్ణ యుగానికి నాంది** అని, అనేక పురాణాలలో భవిష్యత్తు చెప్పబడిన ధర్మములుగా మనం భావించవచ్చు.

## మన పురాణాలలో చెప్పబడిన స్వర్ణయుగ లక్షణాలు.

బ్రహ్మ వైవర్తపురాణం, 4వ స్కందము కృష్ణ జన్మస్కందము. అధ్యాయము 129 లో "గోలోకారోహణము" అని ఉంది. ద్వాపర యుగాంతము తరువాత – కృష్ణుడు గోలోకము నుండి వైకుంతము అయిన తన లోకమునకు తిరిగి వెళ్ళినట్లు కనబడుతుంది. అందులో శ్రీకృష్ణునితో, గంగామాత సంభాషణము 49వ పద్యములో గంగ ప్రశ్నించడము 50 నుంచి 60వరకు యున్న పద్యాలలో కృష్ణుని సమాధానము వర్ణింపబడినవి.

49వ పద్యం: కృష్ణా ! నీవు యీలోకాన్నుంచి వెడలి, వైకుంఠమునకు వెళ్ళిపోతే ఈ కలియుగంలో నా స్థితి ఎలా ఉంటుంది.?
50వ పద్యం : కృష్ణుడు యీ విధంగా సమాధానమిచ్చాడు.

ఈ భూలోకంలో 5000 సం॥లు పర్యంతము కలి ప్రభావంతో జనులు పాపభూయిష్టులై ,తమ పాపములన్నియు నీలో మునిగి ప్రక్షాళన గావించుకుంటారు. అపుడు గంగ 5000 సం॥ల తర్వాత ఎలా ఉంటుంది అని అడిగినపుడు

55వ పద్యం :కృష్ణ: 5000సం॥లు తర్వాత, భూలోకము పాపంతోనిండి యున్నప్పటికీ, వైష్ణవులకు తీర్ధ స్థలముగా యుంటుంది.

56వ పద్యం : నా భక్తుల హృదయాలు, పవిత్రతతో నిండి ఉంటాయి. నా భక్తులు పాదధూళి సోకి, భూమాత పవిత్రమయిపోతుంది.

57వ పద్యం : ప్రపంచంలోని తీర్ధ యాత్రా స్థలములన్నీ నా నామమే నిరంతరం స్మరియించు, వైష్ణవ భక్తుల చేత నిండిపోయి ఉంటాయి. ఆతీర్ధ స్థలాలు నా భక్తులందరిని పరిశుద్ధం గావిస్తాయి. కలియుగము ప్రారంభం అయిన 5వేల సం॥రాల తరువాత భూలోకం మొత్తము, విష్ణుభక్తుల ప్రాబల్యంతో తీర్ధాస్థలంగా రూపొందుతుంది. తరువాత వేల సంవత్సరాల కాలం నా భక్తులతో నిండియుంటుంది.

**"కలియుగ ప్రమాణము 11వేల సంవత్సరాలని స్వామి చెప్పియున్నారు. అంటే (...) కలియుగాంతానికి 5320 సంవత్సరాలు గడవవలసి ఉంది".**[1] కలియుగము 5000 సం॥లు గడిచిన తరువాత కృష్ణుని అవతారం తరువాత,(అద్భుతమైన) కలికాలం చాలా వైభవంతో

[1] సత్యసాయి బాబాతో నా సంభాషణలు. పేజి 27, 28



కూడుకుని యుంటుంది. హోవర్ద్ మార్ఫెట్ గారి సాయిబాబా అవతార్ అన్న గ్రంధంలో మార్కండేయ మహర్షి, శ్రీకృష్ణునితో సలిపిన సంభాషణలు కలియుగంలో జరగబోవు చీకటి రోజులు గురించి, జరగబోవు విషయములు చెప్పటం జరిగింది. అపుడు మానవతా విలువలు పూర్తిగా దిగజారి పోవును. ఈర్ష్య, ద్వేషములు, నీతినియమాలు అడుగంటిపోయి సత్యము మీద చెడు ప్రభావములు ప్రబలమైపోతాయి. ధర్మము అడుగంటి నేరములు ప్రబలిపోతాయి. అపుడు కృష్ణభగవానుడు మార్కండేయ మునితో **"నేను మానవ దేహంతో సత్యయుగాన్ని స్థాపించడానికి వస్తాను".** అన్నాడు.

## హోవర్ద్ మార్ఫెట్ "సాయిబాబా అవతార్ "

**"చెడు ప్రభావము భూమిమీద నిండిపోయినపుడు, చెడుప్రభావాన్ని పూర్తిగా నిర్మూలించడానికి ప్రశాంతిని స్థాపించడానికి, నీతి నియమాలను కాపాడటానికి, ఓ ఉన్నత వంశంలో మానవ దేహంతో అవతరిస్తాను. భగవత్ అవతారానికి అనువైన ఘడియ వస్తుంది. పాప భూయిష్టమై ఈ కలిలో నా అవతారము చామనపు మేనితో ఉంటుంది. దక్షిణ భారతదేశంలోని ఒక కుటుంబంలో ఉద్భవిస్తాను. ఈ అవతారం చాలాశక్తితో కూడుకుని ఉంటుంది. చాలా అద్భుతమైన జ్ఞానంతో యుంటుంది. చాలా దివ్య శక్తులు ఈ అవతారమునకు ఉంటాయి. ఒక్కసారి ఈ అవతారము సంకల్పించు కున్నంతనే అవతార లక్ష్యాన్ని సాధించడానికి అవసరమైన అనేకానేక ప్రాపంచిక వస్తువులు సంకల్పమాత్రం చేతనే ఆవిర్భవిస్తాయి. తనయొక్క చక్కని గుణగణముల యొక్క శక్తితో, విజయాలు సాధిస్తాడు. ప్రపంచంలో అన్ని ప్రాంతములలో ఈ అవతారము, శాంతిని నెలకొల్పుతారు. ఈ అవతారము సత్యము అను నూతన శకమునకు శ్రీకారం చుడతాడు. ఈయన చుట్టూ భక్తులు నిండి ఉంటారు. భక్తులతో పరివేష్టితమై భూగోళము అంతయూ పరిభ్రమిస్తాడు.**

**భూలోకములోని ప్రజలందరూ, ఈ అవతారము యొక్క నడవడిని అనుకరిస్తారు. సర్వ సౌఖ్యములతోను శాంతితోను, ప్రజలంతా జీవిస్తారు. మానవులంతా తిరిగి ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ధర్మాలు పాటిస్తూ.. ఉంటారు.**

**విద్యాసంస్థలు పరబ్రహ్మ తత్వబోధలతో, దేవళములతోను, ప్రపంచము తిరిగి పూర్వపు ధర్మాచార నిష్ఠానియమాలతో అన్ని చోట్ల నిండియుంటుంది. భూమిమీద పరిపాలకులు ధర్మ నిబద్ధతతో, రాజ్యమును పరిపాలిస్తారు.**

**అన్ని ఆశ్రమములు ధర్మం, సత్యం పాటించేవారితో నిండియుంటాయి. ప్రజలందరూ చూస్తూయుండగానే, ఈ అవతారము యొక్క ప్రాభవము జగద్వ్యాప్తి చెందుతుంది. అందరు ఈ అవతార వైభవాన్ని గుర్తిస్తారు.**

-సాయిబాబా అవతార్ పేజి 71.

ఇక్కడ మార్కండేయ మహర్షి మనకు తెలిపిన విష్ణువు యొక్క పలుకులు, సత్యసాయి అవతరణ గురించి చాలా వివరంగా తెలుపుతు న్నాయి. అవతారము సత్యాన్ని పునఃస్థాపిస్తాడని, అనేకానేక ఆధ్యాత్మిక విద్యాకేంద్రాలను స్థాపిస్తాడని, అన్నిచోట్ల ప్రజలు భక్తి భావములతో యుంటారని అన్ని దేశాలలోను ధర్మ బద్ధంగా పాలించే పాలకులుంటారని మనకు తెలియచేస్తోంది.

కేవలం తమ ఉనికితోనే లోకాన్ని తీర్థరాజంగా మార్చగల తన భక్తులతో సృష్టంతానిండి పోతుందని కృష్ణపరమాత్మ బ్రహ్మ వైవర్త పురాణం లో చెప్పడాన్ని పైన చదివాము. ఇది అధికాధికంగా జనులు దైవోన్ముఖుల వటం మూలాన ప్రపంచపు ఆధ్యాత్మిక చైతన్యస్థితిని "శాశ్వతంగా నిలిపి ఉంచటానికి అవసరమైన రాశి" విశేషంగా పెరగబోవటాన్ని సూచిస్తుంది. తమ అపారమైన ప్రేమ, శక్తి, కరుణాకటాక్షాలతో ఈ లోకాన్ని మార్చివేసి, విశాల సాయి సంస్థగా రూపొందించి, రానున్న స్వర్ణయుగాన్ని నిర్మించేది సాయికృష్ణుడేనని ఊహించుకోవటం సరి అయినదే.

సాయి మాటల్లో **"ఈ ప్రపంచము అంతయు సత్యసాయి సంస్థగా మారి పోతుంది. ప్రతి ఒక్కరూ సత్య సాయిని తమ హృదయాల్లో ప్రతిష్ఠించు కుంటారు.** -సనాతన సారథి, జనవరి 1999 పేజి 16

## మానవ కుమారుని రాక

ప్రేమమూర్తి ఏసుక్రీస్తు తన శిష్యులకు బోధించిన విషయము చూడండి.

"నేను మీతో చెప్పవలసినవి, ఇంకనూ అనేక సంగతులు కలవు. కాని ఇపుడు మీరు వాటిని సహింపలేరు. ఐతే **ఆయన అనగా సత్య స్వరూపియైన ఆత్మ వచ్చినపుడు మిమ్ములను సర్వ సత్యము(...)లోనికి నడిపించును.** ఆయన తనంతట తానే ఏమియు బోధింపక వేటిని వినునో వాటిని బోధించి సంభవింపబోవు సంగతులను, మీకు తెలియజేయును."

-యోహాను 16 : 12-13

పై యోహాను సువార్తలో ఏసుక్రీస్తు "సత్యస్వరూపియైన ఆత్మ" అని సంభోదించాడు. అతను సత్యసాయి బాబా కాక మరి ఎవరై ఉందురు?



1972 క్రిస్మస్ దినమున అసంఖ్యాకులైన క్రీస్తు భక్తుల మధ్య **జీసస్ క్రీస్తుని భూమి మీదకు పంపినది నేనే** అని ప్రకటించి క్రైస్తవలోకాన్ని ఆశ్చర్యానందాల్లో ముంచెత్తారు.

"ఇక్కడ ఒక ముఖ్య విషయము మీ దృష్టికి ప్రత్యేకముగా తీసుకుని రాదలిచాను. ఏసుక్రీస్తు దైవంలో ఐక్యము చెందు క్షణమున తన అనుయా యులకు, శిష్యులకు ఒక వార్త చెప్పాడు. అది అనేక విధములుగా రకరకాలు గా ఊహించుకుని అనేక గ్రంధాలు వేరు వేరుగా వ్రాసుకున్నారు. జీసస్ మాటల అర్థాలు వారి వారి భావములకు తగ్గవిధంగా వారు ప్రకటించు కున్నారు. ఈ రాతలన్నీ ఒక పెద్ద గందరగోళంగా తయారయ్యాయి.

జీసస్ చెప్పిన మాటలు ఎవరికి వారు తమకు తోచిన విధంగా తమ తమ భావాలకనుగుణంగా మార్చుకుంటూ సందిగ్ధంతో యుండి, అర్థం చేసుకోలేనంతగా ఒక సమస్యగా మార్చుకున్నారు. నిజంగా ఆలోచిస్తే జీసస్ చెప్పింది చాలా సులభము. "**ఎవరైతే నన్ను మీ మధ్యకు పంపారో ఆయన మరలా వస్తాడు"** అని చెప్తూ ఒక గొఱ్ఱెపిల్లను చూపాడు. నిజంగా గొఱ్ఱెపిల్లలు...బా....బా... అని అరుస్తూ ఉంటాయి. ఇదే బాబా అవతరణకు సంకేతము.**"అతని పేరు సత్యము"** అని క్రీస్తు చెప్పాడు. **ఆయన ఎఱుపు రంగు వస్త్రము, నెత్తురు రంగుతో ఉన్న ఎరుపు వస్త్రము ధరిస్తాడు.** బాబా తాను వేసుకున్న దుస్తులు వేలుతో చూపిస్తూ అన్నారు **"ఆయన పొట్టిగా ఉంటాడు. కిరీటము ధరించినట్లు శిరోజములు ఉంటాయి. గొఱ్ఱెపిల్ల ప్రేమకు సంకేతము, చిహ్నము.**

ఏసుక్రీస్తు తాను మరల వస్తానని చెప్పలేదు. ఎవరైతే తనను సృష్టించారో, అతను వస్తాడు అని చెప్పాడు. **ఆ బా....బా....శబ్దమే యీబాబా.** ఆ పొట్టివాడు, కిరీటంలా ఉండే **ఉంగరాల జుట్టువాడు**, **ఎఱ్ఱని దుస్తులు ధరించిన బాబా వచ్చాడు.** ఇతను ఈ రూపంతోనే కాదు మీ అందరి హృదయాల్లోను, అంతర్యామిగా ఉన్నాడు. వామనాకారంగా రక్తవర్ణపు అంగీతో ఉంటారు.

-సత్యసాయి ప్రవచనములు వాల్యూమ్ 11 అధ్యాయము 54

పైన స్వామి చెప్పిన మాటలు (యోహాను) ప్రకటన 19:11-16 కి సరిగ్గా సరిపోవుచున్నవి.(పరిశుద్ధ గ్రంధములోని క్రొత్త నిబంధన)

"మరియు పరలోకము తెరువబడి యుండుట చూచితిని. అపుడు ఇదిగో తెల్లని గుఱ్ఱమొక్కటి కనబడెను. దానిమీద కూర్చుండి యున్నవాడు.

**నమ్మకమైనవాడును, సత్యవంతుడును** అను నామము కలవాడు. ఆయన నీతినిబట్టి విమర్శచేయుచు యుద్ధము జరిగించుచున్నాడు. **ఆయన నేత్రములు అగ్నిజ్వాలల వంటివి, ఆయన శిరస్సు మీద అనేక కిరీటము లుండెను.** వ్రాయబడిన ఒక నామము ఆయనకు కలదు, ఇది ఆయనకే గాని, మరి ఎవరికి తెలియదు. **రక్తములో ముంచబడిన వస్త్రము ఆయన ధరించుకొని యుండెను. మరియు దేవుని వాక్యము అను నామము ఆయనకు పెట్టబడి యున్నది.** పరలోకమందున్న సేనలు, తెల్లని గుఱ్ఱము లెక్కి ఆయనను వెంబడించుచుండిరి. **శుభ్రమైన తెల్లని నారబట్టలు ధరించి జనములను కొట్టుటకై ఆయన నోటినుండి వాడిగల ఖడ్గము బయలు వెడలుచున్నది. ఆయన ఇనుప దండముతో వారిని ఏలును.** ఆయనే సర్వాధికారియగు దేవుని తీక్షణమైన ఉగ్రత అను మధ్యపు తొట్టె త్రొక్కును. **రాజులకు రాజు**ను, **ప్రభువులకు ప్రభువు**ను అను నామము ఆయన వస్త్రము మీదను తొడమీదను వ్రాయబడి యున్నది.

–యోహాన్ ప్రకటన 19. 11–16

యోహాన్ ప్రకటన 19 :11–16 వచనముల ప్రకారం తెలుపు శాంతికి చిహ్నము. తెల్లగుఱ్ఱము శక్తికి ప్రతీక. "నమ్మకము సత్యానికి గుర్తు". స్వామి పాక్షిక నామము 'సత్య' అనగా సత్యమునకు సరిగ్గా సరి పోతుంది. స్వామి నేత్రములు దృష్టి ఎవరిమీదైనా పడినప్పుడు చాలా తీక్షణంగా ఉంటాయి. తన శిరోజములు చక్కగా కిరీటంలాగా ఉంటాయి కదా! బైబిలులో చెప్పినట్లు, స్వామి ధరించు దుస్తులు ఎరుపు, ఆరెంజ్ రంగులో ఉంటాయి కదా! అతని పేరే దేవుని వాక్యము ఇది 'భగవాన్' అన్న పదం యొక్క అర్థాన్ని సూచిస్తుంది. స్వామి నోటినుంచి వెలువడు వాక్కులు చాలా పదునుగా తీక్షణముగా ఉంటాయి గదా! ఆయన యొక్క వజ్రసంకల్పము, సంపూర్ణ అధికారం ఇనుప కడ్డీలాగా నిర్థుష్టంగా గట్టిగా ఉంటాయి. ఇవి మన పురాణములు కల్కి అవతారము కత్తిపట్టుకుని తెల్లని గుఱ్ఱమునెక్కి వస్తాడన్న దానితో సరిపోవుట లేదా? గుఱ్ఱమూ, ఖడ్గమూ అన్నవి మనం ముందు చెప్పుకున్నట్లుగా గుర్తులుగా చూపెట్టబడినవి మాత్రమే. యోహాన్ సువార్త ప్రకారం **రాజులకి రాజు, దేవాది దేవుడు** అని గదా ఆయన తెలియబడుచున్నాడు. కలి ప్రభావము మించి పోయి నపుడు భగవంతుడు సర్వశక్తి మయుడు అని ప్రజలందరూ గుర్తిస్తారని గదా నాడీ గ్రంధాలు ఘోషిస్తున్నాయి. "ప్రపంచ ప్రజలంతా అప్పుడు గొప్ప చక్రవర్తిగా"ఆయన్ని పూజిస్తారు.



యోహాన్ అఖండ ప్రజానీకం వేల లక్షల, కోట్ల సంఖ్యలలో మానవ కుమారుని సింహాసనము చుట్టూ చేరటాన్ని దర్శించి ఉన్నాడు.

" మరియు నేను చూడగా సింహాసనమును, జీవులను పెద్దలను ఆవరించి యున్న అనేక దూతల స్వరము వినబడెను. **వారి లెక్క కోట్లకొలది ఉండెను.**"

–ప్రకటన : 5:11,

దీన్ని ఇప్పుడు స్వామి స్వయంగా చెప్పిన వాటితో పోలుద్దాము:

(...) "**ఈ అవతారము నుంచి లబ్ధిపొందుటకు, కోట్ల కొలది ప్రజానీకము సమావేశమగు రోజు చాలా త్వరగా వస్తోంది.** కనుక మీరు నా అనుగ్రహం, ఆనందములను మీకు వీలున్నంతలో కూడబెట్టుకుని కాపాడుకుంటూ ఉండుడు "అని మీకు నేను సలహా యిస్తున్నాను"

–సత్యసాయి ప్రవచనములు భా. 11–41వ అ.

క్రైస్తవులు ఏసు పునరుద్ధానముగా నమ్మే "మానవకుమారుని" రాకడను గూర్చి క్రొత్త నిబంధనలో చాలా వచనాలున్నాయి. ఏసు తన రాకడ గురించి చెప్పలేదని స్వామి చెప్పడం ఇంతకు ముందు మనం చూశాము. అది 'బాబా' రాకడను గురించే క్రీస్తు తెలపడం. బైబిలు చెప్పే "మనుష్య కుమారుని రెండవ రాకడ" శ్రీ సత్యసాయి బాబావారి రెండవ రాకడ గురించేనా?

**తనమహిమతో మనుష్య కుమారుడును, ఆయనతో గూడా సమస్త దూతలును వచ్చుచున్నప్పుడు, ఆయన తన మహిమ గల సింహాసనము మీద ఆశీనుడైయుండును. అప్పుడు సమస్త జనులు ఆయన యెదుట ప్రోగు చేయబడుదురు.**(...) –(మత్తై సువార్త 25:31–34)

బైబిలులో చెప్పినట్లు 'మానవ కుమారుని' రాక స్వామి తన దివ్య సందేశాలలో చెప్పినట్లు సత్యసాయి శకము, ప్రేమ శాంతులతో కూడిన స్వర్ణయుగము యొక్క రాకను సూచిస్తోంది.

**మనుష్య కుమారుడు తన దూతలను పంపును. వారాయన రాజ్యములో నుండి ఆటంకములగు సకలమైన వాటిని, దుర్నీతిపరులను సమకూర్చును. వాటిని అగ్ని గుండములో పడవేయుదురు. అక్కడ ఏడ్పును, పండ్లు కొరుకుటయు ఉండును. అప్పుడు నీతిమంతులు తమ తండ్రి రాజ్యములో సూర్యునివలె తేజరిల్లుదురు. చెవులు గలవారు వినును గాక"**

–మత్తై సువార్త 13:40–43వచ.

మనుష్య కుమారుడు మరియు అతని దేవదూతలు చెడుని పూర్తిగా నిర్మూలన గావించి ఈ క్రొత్త రాజ్యములో శాంతిని, ధర్మాన్ని పునఃస్థాపిస్తారు. ఈ స్వర్ణయుగము ఈర్ష్య, అసూయ, అసహనము, పూర్తిగా లేకుండా కనీసము వెయ్యి సంవత్సరముల వరకు నిలిచి యుంటుంది.

"మరియు పెద్ద సంకెళ్ళను చేతబట్టుకుని అగాధము యొక్క తాళపు చెవి గల ఒక దేవదూత పరలోకము నుండి దిగి వచ్చుట చూచితిని. **అతడు ఆదిసర్పమును అనగా అపవాదియు, సాతానును అను ఘట సర్పమును పట్టుకొని వెయ్యి సంవత్సరములు వానిని బంధించి అగాధములో పడవేసెను.** ఆ వెయ్యి సంవత్సరములు గడచువరకు యిక జనములను మోసపరచ కుండునట్లు అగాథమును మూసి దానికి ముద్రవేసెను. అటు పిమ్మట వాడు కొంచెము కాలము విడిచిపెట్టబడవలెను.

-ప్రకటన 20 :1-3

యోహానుకు కలలో దేవదూత అపవాదిని 1000 సం॥లు బంధించి నట్లు చూచెను. దీనిని బట్టి చెడుపు, అసత్యము, అసహనత, భూమి నుంచి పారద్రోలబడటాన్ని తలంచవచ్చు. మరియు యోహాను స్వర్గము నించి ఒక అందమైన నగరము క్రిందికి దిగివచ్చే భవ్య దృశ్యాన్ని చూశాడు, అది ప్రశాంతితో నిండిన ప్రపంచమునకు కేంద్రము అవుతుంది.

మరియు నేను **నూతనమైన యెరూషలేము అను ఆ పరిశుద్ధ పట్టణము, తన భర్తకొఅకు అలంకరింపబడిన పెండ్లికుమార్తె వలె సిద్ధపడి పరలోకమందున్న దేవుని యొద్దనుండి దిగివచ్చుట చూచితిని.** అపుడు ఇదిగో దేవుని నివాసము మనుష్యులతో కూడా ఉన్నది. **ఆయన వారితో కాపురముండును. వారాయన ప్రజలై యుందురు. దేవుడు తానే వారి దేవుడై యుండి వారికి తోడై యుండును. ఆయన వారి కనుల ప్రతిభాష్ప బిందువును తుడిచి వేయును. మరణము ఇక ఉండదు. దుఃఖమైనను ఏడుపైనను, వేదనైనను, ఇక ఉండదు. మొదటి సంగతులు గతించి పోయెనని, సింహాసనములో నుండి వచ్చిన గొప్ప స్వరము చెప్పుట వింటిని.**

-(ప్రకటన 21:2-4వ వచనములు)

మానవ కుమారుడిగా దిగివచ్చిన దేవుడు తన జనులతో కలసి ఉండబోయే ఈ నూతన నగరాన్ని సెయింట్ జాన్ స్వర్గం నుంచి దర్శిస్తాడు. భువిపై ఆయన దుఃఖమును పూర్తిగా తుడిచివేయును. ఎవరికిని మరణము అంటే భయముండదు. సెయింట్ జాన్ ఆ నగరమును 'కొత్త యెరూషలేము' అన్నాడు. హిబ్రూ భాషలో యెరూషలేము అంటే శాంతికి నివాస స్థానము



అని అర్థము. (వివరాలకు వికీపిడియా చూడండి) అంటే ప్రశాంతి నిలయము అని అర్థము కాదా? యోహాను కల అంతరార్థము రాబోయే కాలంలోని ప్రశాంతి నిలయవైభవ దృశ్యము కాదా? ప్రపంచమంతా ఆ నగరానికి రావలసి వస్తుందని స్వామి చెప్పలేదూ !

**"రాబోవు రోజులలో ప్రపంచమంతా ప్రశాంతి నిలయానికి రావలసి వస్తుంది"** -సనాతనసారథి, డిసెంబరు 1991

**"పుట్టపర్తి ఓ మధురానగరముగా (కృష్ణుని జన్మస్థలముగా) మారుట చూస్తారు.** ఎవ్వరునూ యీ అభివృద్ధిని ఆపలేరు. అడ్డుకొనలేరు."

-స్వామి దివ్య సందేశాలు, ప్రశాంతి నిలయం అక్టోబరు 21,1961.

"నన్ను నమ్మండి. ఈ పుట్టపర్తి త్వరలో ఒక తిరుపతిగా మారగలదు(...) సనాతన ధర్మముయొక్క పునఃప్రతిష్ఠాపనము యిక్కడనుంచే ప్రారంభమౌతుంది. -సత్యం, శివం, సుందరం 1భాగం, 16వ అధ్యాయం.

చాలా ఆశ్చర్యకరమైన విషయమేమిటంటే హిందూ భవిష్యవాణి ప్రకారం కల్క్యావతారంలో "శంబళ" అనే గ్రామంలో అవతరిస్తారు. శంబళ అంటే అర్థము 'శాంతికి నిలయము, ప్రశాంతి, ఆనందములకు తావు". -(వికీపీడియా చూడుము)

**పరిపూర్ణ పరబ్రహ్మ స్వరూపుని యొక్క నివాసమైన స్వర్గధామం, ప్రశాంతి నిలయము సత్యసాయి స్వర్ణయుగావిర్భావాన్ని ప్రకటించి మానవ చరిత్రలో గొప్ప ఆధ్యాత్మిక విప్లవానికి కేంద్ర బిందువు కాబోయే అద్భుత ఘడియ కోసం మనమంతా వేచివుందాము.**

**(...)"ఓర్పుతో ఉండండి. ప్రతిది మీకు అందిస్తాను. దేనిగుఱించి మీరు బాధ చెందవద్దు(...) మీరందరూ పవిత్రాత్ములు. రాబోవు సరిక్రొత్త స్వర్ణ యుగములో మీరు పాలు పంచుకొనవలసిన సమయము వస్తోంది.**

-సనాతనసారథి, అక్టోబర్, 1996. అట్ట చివరిపేజి

# పదవ అధ్యాయము

## స్వామి తన దేహమును ఎందుకు వదిలిపెట్టారు ?

**"నాయొక్క తత్వ మర్మాన్ని ఎవ్వరును అర్థం చేసుకోలేరు. మీరు చేయగలిగినదల్లా దానిలో మునిగిపోవడమే."**

–సత్యసాయిబాబా,ప్రేమాత్మస్వరూపులు(The embodiment of love) 96వ పేజీ.

స్వామి దేహమును నిర్ధారింపబడిన సమయానికి ముందుగానే ఎందుకు వదిలి వెళ్ళవలసి వచ్చిందో ఎవ్వరూ తెలుసుకోలేరు. మొదట్నుంచీ ఇదంతా ఆయన యొక్క దివ్య సంకల్పములోని భాగమే అయ్యుంటుంది. మనకు తెలిసినదల్లా ఇప్పటి వరకు మనం విన్నది, చూసినది మాత్రమే. స్వామి దేహము రోజురోజుకి క్షీణించడం ముఖ్యమైన అవయవములు ఒక్కొక్కటి క్రమంగా పనిచేయకపోవడం, చివరికి దేహము వదిలి పెట్ట వలసిన స్థితికి వచ్చింది. తాను ఎందుకు దేహాన్ని నయం చేసుకోలేదు, అన్న ప్రశ్న ఉదయిస్తుంది. అలాంటి ప్రశ్నలు మనం ఊహించలేని స్వామి దివ్య మహావైభవంలోని భాగాలు మాత్రమే. ఏదీ ఆయన సంకల్పం లేకుండా జరగదు. "ఆయనే అన్నింటినీ నియంత్రించే ప్రభువు".

### ఈ దేహము భక్తుల కోసమే వచ్చింది.

(...) జబ్బుకావాలని తెచ్చుకున్నాను. బాధని అనుభవించలేని స్థితిలో యున్న ఒక భక్తుని రక్షించడం కోసం యీ జబ్బు తీసుకొనవలసి వచ్చింది. భగవంతుడు చేసే పనులలో యిదొకటి. అందుకోసమే అవతరించడం. (...) ఆ భక్తులపై అనుగ్రహం కురిపించటము. **నేను యీ దేహాన్ని ఎందుకు ధరించానంటే యితర దేహములను రక్షించి కాపాడుట కొఱకే. ఈ దేహమునకు బాధలుగాని రుగ్మతలుగాని రావు. వ్యాధి ఈ శరీరాన్ని తాకలేదు. ఇది అసలు సత్యము.**

–సత్యసాయి ప్రవచనాలు 10వభాగము, 37వ అధ్యాయం

పై స్వామి మాటలను బట్టి చూస్తే స్వామి పడ్డ బాధ తన శరీరంలో సహజంగా వచ్చినది కాదు. కర్మసిద్ధాంతము అద్భుతంగా నడిచిపోతూ యుంటుంది. ఒక్కటి మాత్రం నిజం. ప్రతి క్రియకు ఫలితం కనబడుతూ యుంటుంది. కర్మకు సంబంధించిన ఫలితాన్ని యిష్టపూర్వకంగా మరొకరు



స్వీకరించవచ్చు. తన భక్తులు కర్మను అనుభవించలేని స్థితిలో యున్నపుడు, చాలాసార్లు భక్తుల కర్మలను స్వామి స్వయంగా తీసుకొనడం జరిగింది. స్వామి తలచుకుంటే మన జన్మాంతర కర్మలను పూర్తిగా తుడిచిపెట్టగలరు. కానీ అలా చేయడం ఇష్టం లేక మనము అనుభవించవలసిన కర్మలను, తాను అనుభవించ సంకల్పించారు. దానికి స్వామిపై తన ప్రభావాన్ని చూపే శక్తి లేకపోయినా మానవ దేహం ధరించిన తరువాత కర్మ సిద్ధాంతాన్ని స్వామి గౌరవిస్తూ వస్తున్నారు.

తాత్కాలికమైన పరిష్కారము అన్నిటికీ మూలమైన కర్మ సూత్రము నకు భిన్నముగా వర్తించవలసి వస్తుంది.

–బిట్జ్ ఎడిటర్, కరంజియాకు ఇచ్చిన ఇంటర్వ్యూ సెప్టెంబరు1976.

ఇంతకుముందు స్వామి, భక్తుని కర్మలను తాను తీసుకున్నపుడు తన శరీరం కొంత బాధను అనుభవించవలసి వచ్చింది. అది చాలాతక్కువ సేపు అయినప్పటికీ. ఇప్పుడు మాత్రం స్వామి మానవజాతి మొత్తం అనుభవించవలసిన కర్మలను, ఎంతో ప్రేమమూర్తి అయిన మన ప్రియాతి ప్రియమైన స్వామి, తాను తనపై తీసుకొని తన దేహంలోని ప్రతి చిన్న కణముతో దహించి వేస్తున్నారా? మానవజాతి ఉద్ధరణకే, తనపూర్తి జీవితాన్ని వెచ్చించి, తుదకు అదే లక్ష్యానికి తమ దేహాన్ని పణంగా పెట్టారా?

ప్రఖ్యాత బ్లిట్జ్ సంపాదకులు కరంజియాకు స్వామి ప్రకృతి పరమైన వైపరీత్యాలకు కారణం మానవజాతి యొక్కసమిష్టి కర్మ లేక మానవుని చెడుపనులు మాత్రమేనని తెలియచెప్పారు.

కష్టాలూ, బాధలూ దివ్యలీలలోని భాగాలే. ఇవి భగవంతుడు కల్పించేవి కావు, మానవులే తమ పాపకార్యాలకు ప్రతిఫలంగా వాటిని ఆహ్వానిస్తారు.

–బిట్జ్ ఇంటర్వ్యూ సెప్టెంబరు 1976.

స్వామి యీ విషయం మరి యొకసారి పునరుద్ఘాటించారు.

(...)**"ప్రకృతి ప్రసాదించిన అసంఖ్యాకమైన వనరులు అనేకవిధాలుగా అనుభవిస్తూ, ప్రకృతికి మానవుడు అప్పుపడి యున్నాడు. కానీ ప్రతిగా ప్రకృతికి ఏమి యిస్తున్నాడు? దైవానికి ఏ విధంగా కృతజ్ఞతలు తెలుపుకొనుచున్నాడు? అన్నీ యిచ్చిన భగవంతుడినే మరచిపోతున్నాడు. ఆ కారణం వల్ల, అనేక వైపరీత్యాలు బాధలకు గురిఅవుతున్నాడు.**

– సత్యసాయి ప్రవచనము 21వ భాగం, 19వ అధ్యాయం.

**'మానవుని నడవడియే యీ వైపరీత్యాలకు కారణము. భూకంపాలు, అగ్ని పర్వత విస్ఫోటనాలు, యుద్ధాలు, వరదలు, కరువులు, మొ॥గు వైపరీత్యాలకి, ప్రకృతి ధర్మానికి విరుద్ధమైన మానవుల పనులే కారణం. మానవుని యొక్క చెడు నడతే దీనికి కారణం. ప్రకృతికీ, మానవజాతికి మధ్యనున్న బాంధవ్యాన్ని మానవుడు గుర్తించలేక పోతున్నాడు.**

–సత్యసాయి ప్రవచనాలు, 25వ భాగం, 37వ అధ్యాయం.

కర్మ సిద్ధాంతాన్ననుసరించి దీన్ని మానవ జాతి 'సమిష్టి కర్మ' అంటారు. పెద్దయెత్తున సంభవించే ప్రకృతి వైపరీత్యాలు మానవులు సృష్టించుకున్న స్వయంకృత వైపరీత్యాలనుండి, అణువిధ్వంసాల నుండి మనల్ని కాపాడటమే వారి ధ్యేయమని స్వామి చెప్పారు. సమిష్టి కర్మ ప్రభావం వల్ల సంభవించు వైపరీత్యాల నుండి రక్షింపబడుటకు, మానవుల కర్మను పూర్తిగ రద్దు చేయవలసిన అవసరం యున్నదిగదా ! ఈ దారుణ వైపరీత్యాలను తొలగించుట కొఱకు స్వామి మానవ జాతి సమిష్ఠి కర్మను తాను అనుభవించవలసి వచ్చిందా? స్వామి హాస్పటల్‌లో యున్నపుడు, ప్రపంచ వ్యాప్తంగా జరిగిన అనేక సంఘటనలు చూస్తే ఈ సంబంధాన్ని గుర్తించడం కష్టం కాదు. స్వామిని న్యూమోనియా/శ్వాసకోశం సరిగా పనిచేయకపోవటం వల్ల హాస్పిటల్‌లో చేర్పించటం జరిగింది. ఇది సరిగ్గా జపాన్‌లో భూకంపము, సునామీ, న్యూక్లియర్ దుర్ఘటన సంభవించిన కొద్దిరోజులకు జరిగింది. ఈ మూడు దురదృష్టకర దుర్ఘటనల వల్ల, వేలమంది ప్రాణాలు కోల్పోయారు. చాలా మంది ఇండ్లు కోల్పోయారు. వ్యాధిగ్రస్తులయ్యారు. జపాన్ దేశ చరిత్రలోనే యిది అత్యంత పెద్ద దుర్ఘటనగా చరిత్రకెక్కింది. ఫుకుషిమా న్యూక్లియర్ పవర్‌ప్లాంటు బద్ధలయి, పెద్ద అణుదుర్ఘటనకి కూడా దారితీయు పరిస్థితులు నెల కొన్నాయి. ఫుకుషిమా రియాక్టర్లను అత్యంత శక్తివంతమైన భూకంపాలను (8.2 రిక్టర్ స్కేలు రికార్డులను) కూడా తట్టుకోగలిగేటట్లు నిర్మించారు. కానీ నిజంగా భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 9.0గా రికార్డు దాటింది. పూర్తిగా రియాక్టర్లు అన్నీ కరిగి పోవలసిన పరిస్థితి. చాలామంది ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, అలా జరగకుండా ఉండటం గొప్ప అద్భుతంగా భావిస్తున్నారు. ఆశ్చర్యమును వ్యక్తం చేస్తున్నారు. కానీ రియాక్టర్లు అన్నీ దహింపబడి ఉన్నట్లయితే, మనం ఊహించలేనంత నష్టం మానవజాతి అనుభవించ వలసి వచ్చేది. ఎందుకు జరగలేదో చాలా ఆశ్చర్యంగా వుంది. ఇది భగవంతునికి మాత్రమే తెలుసు. ఈ సందర్భంలో



శుకనాడిలో చెప్పబడిన భవిష్యవాణి, యీవిధంగా తెలియచేస్తోంది. "ప్రకృతి విలయ తాండవాన్ని, భగవంతుడు ఒక్కడే అరికట్టగలడు." స్వామి తమ శరీరానికి ఏమి సంభవించినా, అది యావత్ మానవ జాతికళ్యాణం కోసమేనని తెలిపారు.

నరసింహమూర్తి చెప్పినట్లు ఒకసారి కస్తూరి నన్ను అడిగాడు. "ఒక భక్తుని రక్షించేటప్పుడు ఈ దేహాన్ని అశ్రద్ధ చేయకూడదని" దానికి నేను చెప్పాను **"ఈ దేహం భక్తుల కోసమే వచ్చింది. వాళ్ళ క్షేమం కోసం దేనికైనా నా శరీరాన్ని ఉపయోగపెడతాను. శరీరంపై అనురాగం మానవసహజం, కాని దైవానికి పూర్తి ఉదాశీనత. శరీరబంధం ఉన్నంత వరకు బాధలు తప్పవు. భగవంతునికి శరీరబంధం లేదు కనుక, దేహ సంబంధమైన బాధలకు, కృంగను, లొంగను. శరీరాన్ని ధరించిన దేహానికి, అనేకమైన విపత్తులు వస్తాయి. ఏది జరిగినా, ప్రపంచ క్షేమం కొఱకే. ప్రజాశ్రేయస్సు కొఱకే. "**

– స్వామి దివ్యసందేశము. ప్రశాంతినిలయము, జనవరి14, 1999.

ఇంతకన్నా ఇంకా ఋజువు ఏం కావాలి? మనం అర్థం చేసుకోవలసిన దల్లా **యావత్ప్రపంచ క్షేమం కోసం స్వామి తన దేహాన్ని త్యాగం చేసారు,** అని మాత్రమే. పైన స్వామి తమ దివ్య సందేశంలో చెప్పినట్లు దేహమునకు సంబంధించిన బాధలకు తానెట్టి ప్రాముఖ్యము యివ్వరని అర్థమవుతోంది. భక్తుని రక్షించడానికి స్వామి ఎంతటి స్థితినైనా అనుభవించగలనని అదే సందేశంలో చెప్పారు.

(ప్రతి ఒక్క స్వామి భక్తుడు స్వామి తెలుపు ఈ పై దివ్య సందేశాన్ని ప్రముఖమైన దానిగా భావించి చదివి తీరాలని నా అభిప్రాయం.)

"డిసెంబరునెలలో, నేను బెంగళనూరు నుండి తిరిగి వచ్చేటప్పుడు, **బాలురను పుట్టపర్తిలో జరుగు ఆటలపోటీలకు తీసుకు రావద్దని ఆదేశించాను.** వాళ్ళు నామాటలకు వేరే అర్థాన్ని తీసుకున్నారు.(...) పిల్లలు అత్యంత లేతమనస్కులు. స్వామంటే ఎనలేని ప్రేమ. ఉన్నత ఆశయాలు కలిగినవారు. వాళ్ళు నన్ను ఆనందపరచుట కొఱకు అనేక ప్రోగ్రామ్స్ తయారు చేసుకున్నారు.

**రాబోవు ప్రమాదాలు నాకు ముందుగానే తెలుసు. పిల్లలునా మాటలకు ప్రాధాన్యము ఇవ్వలేదు.** ఆ పరిస్థితులలో వాళ్ళకు ఎట్టి సలహాలు, యివ్వకూడదని నిశ్చయించుకున్నాను. నా మాటలకు విలువ యివ్వలేదు.

పరిస్థితుల ప్రభావం వల్ల వాళ్ళే తెలుసుకుంటారని నేను మిన్నకున్నాను. **ఇప్పటివరకు 11డిసెంబరు ఉదయం** ఏం జరిగిందో ఎవ్వరికీ తెలియదు. ఆటల పోటీలు విజయవంతంగా ముగిసినవని అనుకున్నారు. మీకు విజయము లభిస్తే నాకు ఆనందమే. వారి వారి శక్తి సామర్థ్యాలననుసరించి, ప్రతి ఈవెంట్ విజయవంతమైనాయి. ఈ రోజు ఉదయం నేను స్టేడియంకి వచ్చిన వెంటనే రెండులారీలు చూపించాను. వెంటనే సంభవించబోవు ప్రమాదమును నేను గుర్తించాను. ఆ లారీలు ఆ పిల్లల ముందు ఉంచారు. కొన్ని భయంకరమైన ఫీట్స్ చేద్దామనుకున్నారు. ఒక ఇనుపరాడ్డు సరిగా బిగించలేదు. నాకుతెలుసు. **అదే జరిగి ఉంటే ఆ పిల్లవాడి తలకు గట్టి దెబ్బ తగిలి ఉండేది. వెన్నుముక విరిగిపోయి ఉండేది. ఆ బాలుని రక్షించుటకొఱకు, ఆ బాధ నేను అనుభవించడానికి నాపై వేసుకున్నాను.**(...) అంతకు ముందురోజు నలుగురు బాలురని నా రథం చుట్టూ ఉండి, తీక్షణ దృష్టితో పర్యవేక్షిస్తూ ఉండండని కోరినాను. స్వామి అంటే వాళ్ళకు కూడా అత్యంత ప్రేమ, భక్తి ఉంది. ఆ స్థలంలో ఎవ్వరూ లేరు. ఎవర్నీ ఏమీ అనకూడదు. కావాలని ఎవ్వరూ ఆ పని చేయరు. స్వామంటే విద్యార్థులకు ప్రాణం. ఆ రథాన్ని ఆపమన్నాను. భక్తి శ్రద్ధలతో ఒక సీనియర్ విద్యార్థి రథాన్ని నడుపుతున్నాడు. నేను ఆదేశించిన విధంగా, అతను రథాన్ని ఆపాడు. నేను ఉపకులపతితో మాట్లాడదామనుకొన్నాను. ఇంతలో డ్రైవరు బ్రేకు వేద్దామనుకుని, పొరపాటున క్లచ్ మీద కాలు పెట్టాడు. **రథానికి జర్క్ వచ్చి నేను రథంలో పడిపోయినాను. దాని ఫలితంగా నా చేతులు, తలకు, వెన్నుముకకు దెబ్బలు తగిలాయి. పిల్లలకు రావలసిన దెబ్బలు నా మీద వేసుకున్నాను. నా వెన్నుముక బాగా నలిగి పోయింది.** చాలామంది స్త్రీలు, పురుషులు గ్యాలరీలలో కూర్చుని యున్నారు. నా గాయాలు ఎవ్వరూ చూడకుండా నేను జాగ్రత్త పడ్డాను. స్వామి లేవలేక పోతున్నారని ఉపకులపతి అనుకున్నాడు. **నేనింకా ఆలస్యం చేస్తే భక్తులు బాధ పడతారని నా బాధలు మరచిపోయి నేను వెంటనే లేచాను. చేతులు ఎత్తి ఊపుచూ అందరిని ఆశీర్వదించాను. చేతులు ఎత్తి ఊపుతున్నాను. బాధ బాగా తీవ్రంగా ఉంది. నా చేతిమీద కత్తితో కోసినట్లు పెద్ద గాయమైంది. నా చొక్కా ,చేయిని కవరుచేసింది. ఈ సంఘటన వల్ల అనంతమైన శక్తిని, దైవశక్తిని చూచే అవకాశం మీకు లభించింది.**

నాకు నేనే చాలా విచిత్ర స్థితిలో ఉన్నాననిపించింది. దెబ్బలు



ఎవ్వరికీ తెలియ నీయకుండా స్టేజిమీదకు నడిచి రావలసి వచ్చింది. **అందరూ ఆత్రుతతో ఉన్నప్పటికి, నా గాయములు ఎవ్వరూ చూడకుండా ఉండునట్లు నేను సంకల్పించుకున్నాను.** నేను స్టేజిమీదకు వెళ్ళి కూర్చున్నాను. ఇంతలో నేను ధరించిన దుస్తుల లోపలి ధోవతి, రక్తంతో తడిసి ముద్దయ్యింది. భక్తులు ఎవ్వరూ చూడకుండా, ఉండేందుకు నేను వెంటనే బాత్‌రూమ్ లోనికి నడుచుకుని వెళ్ళాను. కారుతున్న రక్తాన్ని తుడవ దానికి అక్కడున్న తుండ్లు సరిపోలేదు. రక్తంతో తడిసిన తుండ్లను, అక్కడ వదలడం నాకు యిష్టం లేదు. ఎవ్వరైనా చూస్తారు. బాధని తట్టుకుంటూ నేను ఆతుండ్లను వాష్‌బేసిన్‌లో పిండి అక్కడే ఆరబెట్టాను. నేను పడుతున్న కష్టమును, బాధను ఎట్టి పరిస్థితుల్లోను నేనెవ్వరికి తెలియ నీయలేదు. చాలా మంది విద్యార్థులు, నేను మాటిమాటికి బాత్‌రూమ్ లోనికి ఎందుకు వెళుతున్నానోనని, ఆదుర్దాతో తెలుసు కోవాలనుకున్నారు. అప్పుడు నేను చెప్పాను “మీకేమి సంబంధం?, అది నాపని ” అన్నాను. నేను సహజంగా బాత్‌రూమ్‌కి ఉదయం ఒకసారి, సాయంత్రం ఒకసారి మాత్రమే వెళ్ళే వాడను. ఆ తక్కువ సమయంలో రక్తము ఎక్కువ కారుతూ ఉండడంవల్ల 5,6 సార్లు బాత్‌రూమ్‌లోకి వెళ్ళవలసి వచ్చింది. ఈ లోపల యిద్దరు విద్యార్థులు నా వద్దకు వచ్చి పతాకం ఎగురవేయాలన్నారు. నేను కుర్చీలో నుంచి లేచేప్పుడు, ఏదో విద్యుత్ షాక్ కొట్టినట్లనిపించింది. అది చూసి నాలో నేనే నవ్వుకున్నాను. స్థిరంగా భూమిమీద నిలవలేకపోయాను. ఈ శరీర సంబంధమైన బంధనకి మోసపోగూడదని అనుకున్నాను. వెంటనే నేను పతాక ఆవిష్కరణకి నడిచి వెళ్ళాను. జ్యోతి వెలిగించాను. నేను చాలా క్లిష్టపరిస్థితిలో యున్నాననిపించింది. ఏ విధమైన భంగిమలోను స్థిరంగా కూర్చోలేని పరిస్థితి. భక్తులందరూ దేహ సంబంధమైన బాంధవ్యాన్ని మరచిపోవాలని చెబుతూ నేను వాళ్ళకి ఆదర్శంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో యున్నాను. యీ విధంగా తలుస్తూ నేను ఆ విధంగా ప్రవర్తించాను.

ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, విన్యాసాలు చాలా బాగా చేసారు. నా దేహం ఆవిధంగా స్పర్శ లేకుండా ఉంది. నా దేహంలో ఎట్టి సంచలనమూ లేదు. నా తల తిరుగుతోంది. **వాళ్ళని సంతోషంగా ఉంచడానికి నా దేహానికి ఏమైనా పర్వాలేదు. ఈ విషయాన్ని నాతోనే ఉంచుకున్నాను.**

ఆ ఆటస్థలం నుండి డయాస్ మీదకి వెళుతున్నపుడు రక్తపు మరకలు ఏమియూ కనిపించకుండా ఉండునట్లు చూసుకున్నాను. నేను, నా సీటు లోనికి ఎకాఎకిని చేరునట్లు మెట్లు ఎక్కాలి. **అంత పెద్ద సమావేశములో ఎవ్వరికీ తెలియనీయకుండా అంత పెద్ద గాయాన్ని దాచి ఉంచడం ఏమాన వునికైనా సాధ్యమా? ఐదు గంటల దీర్ఘకాలం నా కుర్చీలోనే కూర్చుని వున్నాను. నా విద్యార్థులు భక్తులు దైవం యొక్క తత్వాన్ని గ్రహిస్తారని యీ విషయాన్ని అంతా మీకు చెబుతున్నాను. నా పరిస్థితిలో ఎవరైనా యుంటే కనీసం ఒక్క క్షణం, ఒక్క నిముషం కూడా కూర్చోలేరు. ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేకపోయి ఉండేవారు. ఇది ఒక ఎలక్ట్రిక్ షాక్ నా శరీరాన్ని చీల్చి వేస్తున్నట్లనిపించింది.** నేనే ఎలక్ట్రిక్ కరెంటు అయినపుడు నాకు షాక్ ఎట్లా కలుగుతుంది?

అట్లాంటి భావనతో, మొత్తము కార్యక్రమాలు నిర్వహించి మంది రానికి తిరిగి వచ్చాను. సెంట్రల్ ట్రస్ట్ సభ్యులు నాతో వచ్చారు. నాకేం జరిగిందో వాళ్ళకు తెలియదు. సీనియర్ భక్తుడు ఒకతను జరిగిన దానికి క్షమించమని అడిగాడు. జరిగిందానికి నీవెందుకు బాధపడతావు? జరిగే దేదో జరిగిపోయింది. గతానికి నీవెందుకు చింతించడం, నేను సంతోషం గానే ఉన్నాను. గదా! నా గురించి బాధపడవద్దు. అందరూ భోజనాలు చేసారు. భోజనం అయిన తర్వాత మరలా నెత్తురు కారటం ప్రారంభ మయ్యింది. విద్యార్థులందరూ నాతో ఫోటో తీయించుకొనుటకు వేచి యున్నారు. మళ్ళీ నేను రక్తము తుడుచుకొనుటకు బాత్‌రూమ్‌లోనికి వెళ్ళాను. ఇది చూసి ఇందులాల్ షా స్వామీ ! ఏమిటిదీ? అని పెద్దగా అరిచాడు. నేను ప్రేమతో చెప్పాను."ఇందులాల్‌షా! శరీరానికి జరగ వలసింది జరిగిపోయింది. అని చెప్తూ నా గాయాన్ని చూపించాను. అందరూ బాధతో ఏడ్చేసారు. నా శరీరమంతా నెత్తురుతో ఉండటం వాళ్ళు చూసారు. ఈ విధంగా దుఃఖిస్తూ ఉంటే నేను భవిష్యత్తులో యింక ఇట్లాం టివి మీకు చూపించను అన్నాను. నేను మందిరానికి చేరేంత వరకు యీ విషయం యింక ఎవ్వరికీ తెలీదు. **ఈ విధంగా అనేక సమయాల్లో విద్యార్థుల యొక్క మరియు భక్తులయొక్క, వాళ్ళని రక్షించుట కొఱకు బాధలు నామీద వేసుకున్నాను.** ఈ సంఘటనకు ఎవ్వరు బాధ్యులు కారు. జరిగిన విషయంలో ఎవరో ఒకర్ని తప్పుపట్టవచ్చు. కానీ దీనికెవ్వరూ బాధ్యులు కారు. జరగనున్నది జరిగినది అంతే".



**నా భక్తులను రక్షించేందుకు నేను ఏదైనా చేయగలను అని తెలియ చేయుట కొఱకే యీ కథంతా మీకు చెబుతున్నాను.** నేను మందిరం చేర గానే, ఆ నలుగురు పిల్లలను పిలిచాను. వారు నా గాయాలను చూసి చాలా బాధపడి పోయారు. నా ఆజ్ఞలను ఎందుకు పాటించలేదని వాళ్ళని కోప్పడ్డాను. అక్కడ ఉండమని నేను చెప్పినపుడు మీరెందుకు అక్కడ లేరు? అని అడిగాను. **నేను, చెప్పినట్లు మీరక్కడే ఉండి ఉంటే, యీ సంఘటన అసలు జరిగి ఉండేది కాదు.** దీనిగురించి మీరు బాధ చెందవద్దని, చెప్పి ఊరడించాను. -భగవాన్ దివ్య సందేశం జనవరి 14, 1999

స్వామి దివ్య సందేశాన్ని ఆవిధంగా ముగించినప్పుడు అందరూ చాలా కలత చెందారు. భక్తులంతా దుఃఖంలో మునిగిపోయారు. విద్యార్థు లందరూ ఏడ్చారు. స్వామి యింత సీరియస్ బాధ తీసుకోవటమే కాకుండా ఆ విషయం ఎవ్వరికీ తెలియకుండా దాచటం, సభా కార్యక్రమాలకు ఆటంకం జరగకుండా చూసుకోవటం మరింత బాధనిపించింది. స్వామి యొక్క ప్రేమను మాటల్లో చెప్పలేము, విద్యార్థులు తన మాట వినక పోయి నప్పటికి, వారిని రక్షించారు. స్వామిది అనంతమైన, వేయి తల్లుల ప్రేమ. భక్తులను క్షేమంగా ఉంచటం కోసం స్వామి ఎట్టి పరిస్థితుల్లోను, రాజీపడ లేదు. అట్టిస్వామి ప్రేమను చూరగొనటంలో మనమెంత అదృష్టవంతులమో కదా!

సశరీరులుగా స్వామియొక్క "చిట్టచివరి లీలా క్రియ" ఎంత ప్రభావ వంతమైనదో, స్వామి ఒక విద్యార్థి యొక్క ఆస్మా తనపై వేసుకుని రక్షించిన తీరు గమనిస్తే అర్థమౌతుంది. బృందావన్‌లో ఒక విద్యార్థి తీవ్రమైన ఆస్మా రోగంతో బాధపడుతూ, తన బాధనుండి విముక్తుణ్ణి చేయమని ప్రార్థిస్తూ స్వామికి అనేక ఉత్తరాలు రాశాడు. ఒకనాటి సాయంత్రం దర్శన సమయం లో, స్వామి ఆ విద్యార్థి వద్దకు నేరుగా వెళ్ళి అతని చేతిని పట్టుకున్నారు. వెంటనే స్వామికి శ్వాస తీసుకోవడం కష్టమవటం విద్యార్థులు గమనించారు. అప్పుడు ఆ విద్యార్థి, "బాబా! నారోగాన్ని నయం చేయమని ప్రార్థించాను గానీ, నా రోగాన్ని మీ పై వేసుకోమని నేను ప్రార్థించలేదు. నా కోసం మీరు బాధను అనుభవించవద్దు బాబా". అని అరుస్తూ స్వామి చేతిలో నుండి తన చేతిని వెనుకకు తీసుకోవటానికి ప్రయత్నించాడు. కానీ స్వామి 2ని॥లు అట్లాగే గట్టిగా పట్టుకున్నారు. తర్వాత నార్మల్‌గా శ్వాస తీసుకోవడం మొదలుపెట్టారు. అప్పుడు ఆ విద్యార్థిని చూస్తూ యీ విధంగా అన్నారు.

**"నీకు ఏం జరుగుతోందో తెలుసుకొనుటకు నాకు నీ ఉత్తరాలు కావాలా? నీ ఆస్మా గురించి నాకు తెలుసును. నీ కర్మ ప్రభావం నా మీదకు బదిలీ చేయబడింది. నీవు 20 సం॥లు పడవలసిన బాధ నాకు కేవలం రెండు నిముషాల బాధతో సమానం.**

**ఒక వ్యక్తి ఇరువది సంవత్సరాలు అనుభవించవలసిన బాధ స్వామికి కేవలం రెండు నిముషాల బాధ అయినపుడు, ఆ 28 రోజులూ ఆసుపత్రిలో ఉండగా ప్రేమమూర్తి ఎంత మొత్తంలో కర్మను తమపైకి తీసుకున్నారో మనం కనీసం గ్రహించడానికి ప్రయత్నమైనా చేయగలమా? అంతకు ముందు నిశ్శబ్దంగా రోజులూ వారాలూ నెలల తరబడి ఎంత సమిష్టి కర్మను తమపైకి తీసుకుని ఓర్చుకున్నారో!**

## ప్రార్థనల యొక్క శక్తి

**గుర్తుంచుకోండి, నామ స్మరణకు మించిన శక్తి ఏదియూ యీ ప్రపంచములో దొరకదు. ప్రపంచాన్ని రక్షించేవి ఆయుధాలు, ఆటం బాంబులు, కాదు. దైవానుగ్రహమే ప్రపంచాన్ని రక్షించాలి. భగవంతుని అనుగ్రహం కోసం మాత్రమే ప్రార్థించటము మానవుల కర్తవ్యము. ప్రార్థించటమే అత్యంత ముఖ్యమైన బాధ్యత".**

–సత్యసాయి ప్రవచనాలు 24 వచనం, 4వ అధ్యాయం.

**"సరి అయిన ప్రార్ధనతో మాత్రమే, పర్వతాల్లాంటి పాపాలు కరిగి నశించిపోతాయి" .**

–సత్యసాయి ప్రవచనాలు 13 వ భాగం, 26వ అధ్యాయం.

స్వామి హాస్పటల్లో ఉన్నపుడు, భక్తులందరూ, స్వామిని తమ రుగ్మతను తామే నయం చేసుకోమని ప్రార్థిస్తూ వున్నారు. ప్రపంచవ్యాప్తంగా భక్తులు నిరంతరాయంగా, మంత్ర జపాలు, భజనలు నిర్వహించారు. ప్రతి సాయి భక్తుని హృదయంలో స్వామి ఆరోగ్యం గురించే ఆవేదన. నా మటుకు నేను ఏకాగ్రతతో ఆ 28రోజులు ప్రార్ధనలు చేశాను. ఆ విధంగానే భక్తులందరూ ప్రార్ధనలు చేసారని నేను అనుకుంటున్నాను. ప్రపంచ వ్యాప్తంగా ఆ ప్రార్ధనల అనుకూల తరంగాలు పెద్ద మోతాదులో వృద్ధి చెందివుంటాయి.

సీమ దివాన్ గార్కి ది.4-4-2011లో స్వామి దర్శనమిచ్చి చెప్పిన సందేశం.("స్వామి తిరిగి రావటానికి కొన్ని గుర్తులు" అన్న అధ్యాయం చూడండి.) "కేవలం మీకోసమే" గ్రంథం నుండి కొన్ని భాగాలు.



**(...)"ఎప్పుడైతే భగవన్నామము స్మరిస్తామో ఆ వెనువెంటనే ఈరోజు ప్రపంచాన్ని నిరంతరం కమ్ముకొన్న దుష్టశక్తుల శక్తి యొక్క పీడ తొలగి పోతుంది.** నా దేహం కష్టాలతో నలిగి పోతున్నప్పటికి నేనెల్లప్పుడు ఆనందంతో యుంటాను. నాకు బాధనిపించదు.(...) నేను ఎల్లప్పుడూ మిమ్మల్నే తలుస్తూ ఉంటాను.(...) మీ క్షేమమే నాకు ముఖ్యం.(...) నేను ఆనందంలో యుంటాను. మీరు కష్టకాలంలో వున్నప్పుడు నన్ను తలచుకోండి. కానీ, మీకు బాధలు నేనెందుకు కలుగచేస్తాను? నేను మీతల్లిని. నేనెల్లప్పుడూ మీ క్షేమాన్ని కోరుకుంటూ వుంటాను. మీరు ఒక్క కన్నీటి బొట్టు కారిస్తే, తక్షణమే నేను మీ ప్రక్కనే వుంటాను. నేనెప్పుడూ మీవెంటే ఉంటాను. మీ చూపులు ప్రపంచం కోసం ఆరాటపడుతున్నాయి కనుక, నన్ను చూడలేకపోతున్నారు.

మీరెవరో కాదు, నేనే. **దుష్టశక్తులను తరిమికొట్టడానికి, భగవంతుని నామం తలచుకోండి.** అందుకోసమే, యీ అనారోగ్యాన్ని నాపై వేసుకున్నాను. **నన్ను తలచుకోండి.** (...) **ప్రార్థించండి. ఎల్లప్పుడు స్వచ్ఛమైన మనస్సుతో ఉండండి. మీరు మీకు యిష్టమైన వాళ్ళు అనుభవిస్తున్న కష్టాలు, అడ్డంకులు, అన్నీ యిట్టి పాజిటివ్ శక్తి వల్ల తుడిచిపెట్టుకుపోతాయి.**

నా విషయాని కొస్తే నాకు, యీశారీరక రుగ్మత చాలా చిన్న విషయం. ఈ విధంగా మీరు **నన్ను చూసినప్పుడు మీ బాధ సహించు కోగలుగుతారు.** తద్వారా **ప్రార్థించటానికీ, ప్రేమించడానికి ఐకమత్యంగా ఉండటానికి మంచిపనులు చేయటానికి శక్తిని పొందుతారు. మీకోసం, మీనుంచి నేను కోరుకునేదదే.** మీ శాంతి, మీ మంచితనంలోనే యుంది.

(...) **తల్లియొక్క దేహం బాధపడుతుంటే భేదభావనలన్నీ మరచి పోయి పిల్లలంతా కలిసికట్టుగా ఒక దగ్గఱకి చేరుతారు. మీరందరూ కలిసిమెలిసి ఉండాలి. ఒకరిమీద ఒకరు ప్రేమతో యుండాలి. మరియు పూర్తి ఐకమత్యంతో యుండాలి. నా రక్షణ అనే గొడుగుక్రింద మీరంతా యున్నారన్న గట్టి నమ్మకంతో ఉండాలి. అదే నాకు కావలసింది.**

(...) "స్వామి యిక్కడ చాలా స్పష్టంగా తన ఉద్దేశాన్ని తెలియజేస్తున్నారు. **ప్రపంచంలో వ్యాపించిన దుష్టశక్తుల్ని తరిమి వేయడానికి భక్తులు గట్టిగా ప్రార్ధనలు చేయాలి.** నిజంగా అన్ని భజనలూ, ప్రార్ధనలు ప్రపంచ క్షేమం కోసం జరుగుతున్నాయా? స్వామి అస్వస్థతని, అనారోగ్యాన్ని తీసుకున్నారంటే కేవలం **భక్తులు వారి ప్రార్థనలలో ఐకమత్యంగా ఉండేం**

**దుకు మాత్రమే** అనిపిస్తోంది. **సాయిమాత అనారోగ్యంతో ఉన్నప్పుడు తన పిల్లలందరూ ఐకమత్యంతో స్వామి ఆరోగ్యం కోసం ప్రార్థించారు. స్వామి దేహాన్ని త్యజించిన తరువాత కూడా స్వామి భక్తుల మధ్య బంధము యింకా పదింతలు పెరిగింది.** భక్తులు ఒకరి బాగోగులు ఒకరు చూడ వలసిన అవసరం గుర్తించారు. భక్తి యింకా పెరిగింది. ప్రతి భక్తుడు స్వామి తమకు మరింత దగ్గరగా వున్నట్లు అనుభూతి చెందుతున్నారు. స్వామి సేవా కార్యక్రమాలు యింకా పెరిగాయి. ప్రజలు శరీరభావానికి అతీతంగా పయనించి, అంతరాత్మ భావనలలో మునిగిపోయి స్వామిని "హృదయవాసి"గా నిరంతరం గుర్తుంచుకుంటున్నారు.

## సర్వత్రా వ్యాపించిన వార్త :

"సత్యము తొలి అడుగు వేసే లోపే అసత్యం ప్రపంచంలో సగభా గానికి వ్యాపిస్తుంది" అంటాడు మార్క్ ట్వెయిన్. అప్రియమైన వార్తల విషయం కూడా అదే విధంగా వుంటుంది. వెంటనే అది నలుదిశలా వ్యాపిస్తుంది. నిజానికి ప్రపంచంలో చాలామంది స్వామిని గురించి తెలుసు కున్నది వారి దేహత్యాగ వార్త ద్వారానే. స్వామి దేహం విడిచిపెట్టారన్న వార్త గూగుల్ వార్తల్లో కొన్నిరోజులు పతాక స్థానాన్ని ఆక్రమించిన అంతర్జా తీయ వార్తా విశేషం. అలాగే టైమ్ సమాచార పత్రిక ప్రకారం 2011లో ఇది7వ ప్రధాన వార్తా విశేషం. భారత ప్రభుత్వం ప్రభుత్వ లాంఛనాలతో వీడ్కోలు పలికిన దృశ్యాలు చూసినవారు కొందరు తాము వ్యతిరేక వార్తలు చూడటం వలన ఏర్పరచుకున్న భావాలు మార్చుకొని మంచి దృక్పథం ఏర్పరచుకున్నారు.

వేరొక ప్రక్క విరుద్ధ ప్రచారాలు కూడా జరిగాయి. విదేశాల్లో యున్న భక్తులకు భారతదేశంలో ఇటీవల దేహాన్ని విడిచిన గురువును గూర్చిన ప్రశ్నలు ఎదుర్కొనవలసి వచ్చింది. బహుశా 96 సం॥లు యీ దేహంతో ఉంటానని స్వామి చెప్పిన మాటలకు భిన్నంగా జరిగిందేమన్నది తెలుసుకోవాలనే ఆసక్తి కావచ్చు. స్వామి హాస్పటల్‌లో ఉన్నప్పటి నుంచి యిట్లాంటి కఠోర దాడులు మొదలైనాయి. సాయిభక్తులు స్వామి ఆరోగ్యం కోసం ప్రార్థనలు చేస్తూ ఉన్నప్పుడే, దేవుడు అనారోగ్యం పాలు అవటమే మిటి? అన్న ప్రశ్నలు ఎదురైనాయి. స్వామి దేహాన్ని విడిచి పెట్టిన తరువాత భక్తులు స్వామి తిరిగి వస్తారన్న భావనలతో ప్రార్థనలు చేస్తూ ఉంటే, మన



నమ్మకాన్ని చెదర గొట్టేవిధంగా ప్రపంచంలోని వివిధ వార్తా సంస్థలు అపహాస్యం చేసాయి. ఏది ఏమైనప్పటికి, స్వామి నామస్మరణతో ప్రపంచం మొత్తం నిండిపోయింది. స్వామి తిరిగి వచ్చేటప్పటికి అనేకమంది ఆయన గురించీ, ఫలించలేదనుకున్న తన భవిష్యవాణిని గురించీ విని వుండటాన్ని ఇప్పుడు వూహించుకోండి.

నా ఉద్దేశ్యంలో యీ అబద్ధపు ప్రచారాలు మంచికే జరిగాయి. ఇది స్వామి ఆమోద ముద్ర వున్న దివ్య డిజైనులో ఒక ముఖ్యఅంశము – ప్రణాళిక అనిపిస్తోంది. ఎంతోమంది వారి స్వార్థ ప్రయోజనాల కోసం స్వామి పేరు చెడగొట్టాలని, స్వామి భక్తులలో వున్న నమ్మకాన్ని చెరిపి వేయాలని ప్రయత్నిస్తుండగా, స్వామి యొక్క ఈ దివ్య డ్రామాలో ఏదో మహాద్భుతం యీ అనంత విశ్వంలో జరగబోతోందని తీవ్ర అభిలాషతో నిండిన నామనసుకు ఒక దృశ్యరూపంగా గోచరిస్తోంది.

**మున్ముందు స్వామియొక్క తత్వము అనేటువంటిది ఈనాడు గుర్తుంచుకోలేని వ్యక్తులందరూ కూడాను ఆనాడు కంటినీరుతో ఒక విధమైనటువంటి యొక్క దీనిని అనుభవించవలసి వస్తుంది. స్వామియొక్క తత్వము అతి శీఘ్రములోనే జగత్ వ్యాప్తి అయిపోతుంది.**

–సత్యసాయి వచనామృతము 15వభాగము, 55వ అధ్యాయము.

అసలు ఏ నాటకమయినా కొన్ని ఎగుడు, దిగుడులు, వైఫల్యాలూ లేకపోతే ఎలా రక్తి కడుతుంది? ప్రధాన పాత్రకు కొన్ని అడ్డంకులు కల్పించి అవన్నీ అధిగమించి చివరలో నూతన తేజంతో విజయం సాధించినపుడు ప్రేక్షకులంతా పరమానందంతో కేరింతలతో కరతాళ ధ్వనులు చేసేలా కథా రచయిత కథరాసేటప్పుడు జాగ్రత్త తీసుకుంటాడు. స్వామి తానే సంకల్పించి ఆడించే ఈ దివ్య నాటకంలో వూహించని సంఘటనలూ, మలుపులూ ఎందుకు చేర్చరు? తద్వారా తనకు సర్వస్య శరణాగతులైన భక్తులకు తన అంతిమ దిగ్విజయ సమయాన హర్షాతిరేకంతో కరతాళ ధ్వనులూ జైకారాలూ చేసే అవకాశం ఇవ్వరా?

**ఈ దివ్యావతారము సత్యాన్ని నెలకొల్పుతుంది. అసత్యాన్ని కూకటి వేళ్ళతో సహా పెకలించి వేస్తుంది. ఆ విజయము మిమ్ములందరిని బ్రహ్మా నందముతో ముంచెత్తగలదు. ఇది సాయి సంకల్పం.**

–స్వామి దివ్య సందేశం. మే 17, 1968.

## ఒక్క వ్రేటుతో అనేక పనులు:

**నా అవతారము సాధించవలసినది తప్పక పూర్తవుతుంది. దానిని గురించి సందేహ పడకండి. మీకు సంబంధించినంత వరకు నేను చెయ్య వలసిన దానికి కావలసిన సమయము నేను తీసుకుంటాను. మీరు తొందర పడుతున్నారని నేను తొందరపడలేను. ఒక్కదెబ్బతో పది జరిగే వరకు నేను వేచి ఉంటాను. ఒక ఇంజనుకు ఒక్క పెట్టెనే తగిలించరు. ఇంజను శక్తికి తగినన్ని పెట్టెలు తగిలిస్తారు. నామాట ఎన్నటికి తప్పదు. నా ఇష్ట ప్రకారము జరిగి తీరవలసినదే.**

–సాత్యసాయి వచనామృతం, వాల్యూమ్ 1, 31వ అధ్యాయం.

స్వామి తమ దేహాన్ని ఎందుకు త్యజించారోననడానికి అనేకకారణాలు, స్వామి స్వంత మాటల ఆధారంగా మనము చర్చించి యున్నాము. స్వర్ణ యుగము ఇంకా రావలసియున్నది. విపత్తులను అడ్డుకోవాలి. సమిష్టి కర్మ దుష్టశక్తులను తరిమి కొట్టాలి. అదెట్లా సాధ్యమయ్యేందేది? అందరి కర్మను తనపైకి ఎత్తుకొని, స్వామి మనల్ని నామస్మరణలు, ప్రార్ధనలు చేయునట్లు తయారుచేయడం ద్వారానే. అది అక్కడితో ఆగలేదు. అందరి లోనూ భక్తి, సాధనలు ఎలా పెంపుచేయాలి? అందరిని కలిసి మెలిసి యుండునట్లు ఎలా తీర్చుదిద్దాలి? సాయి కేవలం దేహం కాదని; ప్రతివ్యక్తి, ప్రతివస్తువు సాయే అని ఎలా తెలియ చేయాలి? అంతే కాకుండా స్వామి దేహాన్ని విడిచారన్న వార్తతోనే చాలా మంది, స్వామిని తెలుసుకున్నారు.

సరిగ్గా ఈస్టరు రోజున దేహాన్ని త్యజించారు స్వామి. (పునరుద్ధాన వైభవము అన్న అధ్యాయము చూడండి) ఒక్క దెబ్బతో పదిపనులు జరుగు నంతవరకు వేచి ఉంటానంటారు స్వామి. కాని స్వామి హాస్పటల్లో ఉన్న సమయము, మరియు మహాభినిష్క్రమణము మధ్య సమయంలో 20 పనులు సాధించి ఉండవచ్చు.

**దేనిగురించీ మీరు బాధ చెందవలసిన పనిలేదు. ఏది జరిగినా, ఏది మీ అనుభవమునకు వచ్చినా, సాయి సంకల్పము ప్రకారం మాత్రమే జరిగిందని అనుకోండి. నా ఈ అవతార లక్ష్యాన్ని సాధించి తీరుతాను. భూమి మీద యున్న ఏశక్తి నన్ను అడ్డుకోలేదు.**

–సనాతనసారధి అక్టోబరు 1996 అట్టవెనుక కవరుపేజీ.



# పదకొండవ అధ్యాయము

## పునరుద్ధాన వైభవం

జీసస్ తన శిష్యుల పాపాలను స్వీకరించుట కొఱకు శిలువపై బాధ చెంది మరణము నొందెనని తన శిష్యులు భావిస్తారు. జీసస్ తన జీవితాన్ని శిష్యుల కొఱకు త్యాగం చేసెనని స్వామి కూడా చెప్పియున్నారు.

"నన్ను సంపూర్ణ శరణాగతి నొందినవారి కష్టములను నాపై వేసుకొనుట నా భాధ్యత. నాకు బాధలేమీ లేవు. మీరు కూడ నేను నా ఈ బాధ్యతను నెరవేర్చేటప్పుడు వ్యధ చెందవలసిన పని లేదు. ఇచ్చిపుచ్చు కోవటమన్నది ప్రేమతత్వం యొక్క క్రీడ. ప్రేమతో బాధలు స్వీకరించి నప్పుడు బాధలేంటి? తనమీద నమ్మకము పెట్టుకున్న వారికోసం **జీసస్ తన జీవితాన్నే త్యాగం చేసాడు. త్యాగమే దైవము,సేవే దైవము అన్న సత్యాన్ని జీసస్ ప్రభోదించాడు.**

–బాబా, సత్యసాయి 2వభాగము పేజి 171.

ఏసుక్రీస్తు ప్రభువు, శిలువపై మరణించిన తరువాత సరిగ్గా మూడవ రోజు పునరుద్ధానము నొందినట్లు పవిత్ర గ్రంధము హోలీ బైబిలు ద్వారా మనకి తెలుసును. భక్తుల కర్మలను తనపైకి స్వీకరించి కృశించి పోయిన జీసస్ శరీరము, తన దైవిక శక్తులతో తిరిగి ప్రాణము పోసుకున్నది. అట్లు పునరుద్ధానము చెందిన తరువాత జరిగిన క్రీస్తు చరిత్ర మనకు చాలా తక్కువ తెలుసు. తన సన్నిహిత శిష్యులకి దర్శనము ప్రసాదించినట్లు బైబిలులో ఉంది. తరువాత క్రీస్తు ఏంచేశాడు? "సత్య సాయిబాబా ప్రేమ స్వరూపులు" అన్న పెగ్గీమేసన్ మరియు రాన్‌లెంగ్ వ్రాసిన గ్రంధంలోని కొన్ని ముఖ్యాంశాలు చూద్దాం.

**పెగ్గీమేసన్** : స్వామిని ఒక ప్రశ్న అడగాలన్న తపన ఒకటుంది. నేను అడిగాను, "బాబా చాలా కాలం నుండి నేను ఒక ప్రశ్న అడగదలచు కున్నాను. 'జీసస్ యొక్క భౌతిక దేహము సమాధినుంచి పునరుద్ధానము పొందినదా?' నా ఉద్దేశ్యం ఏమిటంటే సృష్టింపబడిన ఆత్మయొక్క దేహము కాదా? అంటే యోగానంద గురువు యొక్క (స్వామి శ్రీయుక్తేశ్వర్ గిరి) దేహము సమాధి కాబడిన మూడు నెలలు తరువాత సృష్టించి చూపబడి నట్లేనా?

**స్వామి:** కాదు. ఆత్మ నుండి సృష్టించబడిన దేహము కాదు. తన భౌతిక కాయమే. అది భౌతికమైనదే" అని స్వామి చెప్పారు.

**పెగ్గిమేసన్** : స్వామీ "జీసస్ తూర్పుదిక్కుకు ప్రయాణం చేశాడా? తన ప్రచారోద్యమం కాశ్మీర్ వరకూ తీసుకెళ్ళాడా"?

**స్వామి:** "అవును. తాను కలకత్తా మరియు మలేషియా కూడా పయనించాడు".

**పెగ్గిమేసన్** : స్వామీ! "కాశ్మీర్ లోని శ్రీనగర్‌లోని రోజాబల్ మందిరంలో జీసస్ దేహము సమాధి చేయబడినదా"?

**స్వామి:** "అవును". అని తల ఊపారు.(....)

– శ్రీ సత్యసాయిబాబా ప్రేమస్వరూపులు, పేజి 48-49.

పైపుస్తకములో పెగ్గిమేసన్ స్వామితో సంభాషించటాన్ని వివరించారు. జీసస్ యొక్క సహజ దేహముతోనే పునరుద్ధానం చెందారా? లేక నిర్మాణకాయమా అని వారు అడిగారు. కానీ పై విషయాన్ని భౌతికమైన దేహంతోనే జీసస్ పునరుద్ధానం చెందారని స్పష్టం చేసారు. తర్వాత ఏసుక్రీస్తు ఇండియాకి వచ్చారని, జమ్మూ కాశ్మీర్‌లోని రోజాబల్ మందిరంలోని సమాధి జీసస్ దేనని స్పష్టం చేశారు. జీసస్ భౌతిక దేహం ("యుజ్ అసాఫ్"గా ప్రపంచంలోని ఆ ప్రాంతాల్లో తెలియబడుతోంది. యుజ్ అంటే జోసఫ్ కుమారుడని అర్ధం). జీసస్ దేహాన్ని వీడినప్పుడు అక్కడ సమాధి చేయబడిందని నమ్ముతున్నారు. మరియు జీసస్ పునరుద్ధానం చెందిన తరువాత కూడా చాలా సంవత్సరాలు ఆధ్యాత్మిక గురువుగా గడిపారని నమ్మిక.

పెగ్గిమాసన్ స్వామితో కలిసి మాట్లాడినపుడు శ్రీయుక్తేశ్వర్ గిరి స్వామీజీ, దేహం విడిచిన మూడు నెలల తర్వాత పునరుద్ధానం చెంది తిరిగి వచ్చి తన శిష్యుడైన పరమహంస యోగానంద ఎదుట సాక్షాత్కారించారన్న విషయం కూడా ప్రస్తావనకు వచ్చింది. స్వామి ధృవపరచినట్లు శ్రీయుక్తేశ్వర్ గిరి యొక్క పునరుద్ధానం నిర్మాణకాయంలో జరిగింది. అంటే రెండు రకాలైన పునరుద్ధానాల గురించి చర్చ జరిగింది. షిర్డి బాబా విషయంలో దేహం విడిచిన మూడురోజుల్లోనే తిరిగి ప్రవేశించారు. ముఖ్య విషయమేమంటే పునరుద్ధానం అన్నది అనాది కాలంగా అవతరిస్తున్న సత్పురుషుల, అవతారాల లక్ష్యసాధనలో ఒక అంతర్భాగమే. వేరే దృష్టి కోణం లోంచి చూస్తే దేహాన్ని విడవడం అన్నదే పునరుద్ధానానికి ఘనతనూ,



మహిమనూ కలుగచేస్తుంది. దేహాన్ని విడవడం అన్నది లేనపుడు తిరిగి రాకడ అన్న ప్రశ్నే లేదు. క్రీస్తుదేవుని ఆ ఒక్క అద్భుతం చేతనే కోట్లాది మందిలో విశ్వాసం జనించి ఈనాడు ఆయన అనుయాయులయ్యారు. కొరంథీయులకు వ్రాసిన మొదటి పత్రిక 15వ అధ్యాయంలో (క్రొత్త నిబంధన (గ్రంధము) సెయింట్‌పాల్ క్రీస్తు యొక్క పునరుద్ధానమును గురించి వివరాలతో స్పష్టం చేసారు.

**క్రీస్తు లేపబడి యుండని యెడల మేము చేయు ప్రకటన వ్యర్థమే, మీ విశ్వాసమును వ్యర్థమే.** –1కొరింథీయన్‌పత్రిక 15:14

సెయింట్ పాల్ విశ్లేషణని బట్టి యీ విధంగా సంక్షేపించవచ్చు. "పునరుద్ధానాన్ని నమ్మితే భగవంతుని నమ్మినట్టే." ఎందుకంటే భగవంతుడనే వాడు ఉండి ఉంటే, ప్రపంచాన్ని సృష్టించియుంటే, చనిపోయిన వానిని బ్రతికించగల శక్తి కూడా కలిగిఉంటాడు. జీవితాన్ని ప్రసాదించిన భగవంతుడే చనిపోయిన తరువాత పునరుద్ధానాన్ని కూడా గావించగలడు. సెయింట్ పాల్ చెప్పినట్లు అసలు పునరుద్ధానమే లేకపోతే, క్రీస్తు గురించిన బోధనల యొక్క ప్రయోజనం లేదు. క్రిస్టియానిటీ యొక్క పైకప్పు పునరుద్ధానము అన్న స్థంభము మీదే నిలబడియుంది. ఇదే క్రీస్తు మహాశయుడు చూపిన అన్నిటికంటే అద్భుతమైన లీల. ఇస్లాం మతము యొక్క బోధల ప్రకారం, మహది, రాబోయే ప్రపంచ గురువు, తిరిగి లేచివస్తాడని 'యూన్ అల్‌కియా మహ' అని పిలువబడతాడని అరబిక్ భాషలో దాని అర్ధం 'పునరుద్ధానం చెందిన రోజు' అని చెప్పబడి వుంది. కొత్తరాకడ స్వర్ణయుగానికి నాంది పలుకుతుందని (తను తప్పకుండా తిరిగి వస్తారన్న దానికి సంకేతాలన్న 5వ అధ్యాయము చూడండి.) స్వామి చెప్పడం ఇటువంటి అద్భుతం గురించేనా?

జీసస్ పునరుద్ధానం చెందిన ఈస్టరు రోజునే స్వామి ఎందుకు మహాభినిష్క్రమణం చెందడానికి ఎన్నుకున్నారు. సాయి అవతారంలో కూడా ఆ విధంగానే జరగబోతోందని మరో సంకేతమిస్తున్నారా? స్వామి భక్తుడు శ్రీ బి.కె.మిశ్రా, స్వామి గుఱించి అనేక పుస్తకాలు రచించారు. వారు తన నమ్మకాన్ని ధృఢంగా ఇలా తెలుపుతున్నారు.

"స్వామి దివ్యాత్మ. తన మానవ దేహాన్ని త్యజించారంతే. ఆయన మరణము ఈస్టరు రోజు అవటం వల్ల క్రీస్తు మాదిరిగానే పునరుద్ధానం చెంది తిరిగి రావచ్చన్న దాన్ని సూచిస్తుంది.

# దేహం గురించిన చర్చ

**ఒకే సమయంలో నేను రెండు శరీరాలతో ఉండగలనన్నా, ఒకేసారి వేలాది విభిన్న స్థలాల్లో వ్యక్తమవగలనని చెప్పినా మీకు ఆశ్చర్యంగా ఉం టుంది.** –సత్యం శివం సుందరం,4వ భాగం, 194వపేజి

స్వామి మహాభినిష్క్రమణానంతరం చాలా ఆలోచనలు నా మనస్సు లో మెదిలాయి. "కొన్నిరోజులలో స్వామి మరలా తిరిగి జీసస్ మాదిరి వస్తారా? జీసస్ మాదిరిగ అంత త్వరగా తిరిగి వచ్చేటట్లయితే అసలు దేహాన్ని ఎందుకు వదిలి పెట్టాలి? నా దైవత్వము ఒకఅద్భుత ఘటన ద్వారా ప్రపంచానికి తెలియచేయబడుతుందన్నారు స్వామి. బహుశా అది పునరుద్ధానం అయి ఉంటుంది. అసలు ప్రపంచం బాబా రాకను ఒప్పు కుంటుందా? (ఒకవేళ స్వామి రెండు మూడురోజులలో తిరిగి వచ్చారే అనుకుందాం, అప్పుడు ప్రభుత్వ యంత్రాంగం, సత్యసాయి ట్రస్ట్, ప్రపంచ వ్యాప్త భక్తులను ప్రజలను మోసం చేయడానికి పునరుద్ధానమనే నాటకం ఆడింది అని ట్రస్ట్ వెంటపడి ఉండేవారు. దురదృష్టకరమేమంటే యిది షిర్డిసాయి, ఏసుక్రీస్తుల కాలం కాదు.) స్వామి నిజంగా తిరిగి రావాలంటే అదే దేహం కావలసి వస్తుందా? అది కాయం క్షయమయ్యేలోపే జరగాలా? అట్లాంటి ప్రశ్నలు ఎన్నో నామదిలో వచ్చాయి. స్వామి మార్గాలు మనము తెలుసుకోలేము. అవి తర్కానికి అందనివి. వారు ప్రభువులకే ప్రభువు. దేశ కాలాతీతులు. ఒకదేహాన్ని సృష్టించటం స్వామికి గడ్డి పరకను త్రుంచటం లాంటి విషయము.

**<u>దైవశక్తి</u> సాధించలేనిది ఏదీ లేదు. భూమిని ఆకాశంగా, ఆకాశాన్ని భూమిగా మార్చగల శక్తి అది. దీనిని అనుమానించడమంటే సార్వభౌమత్వ <u>వైభవాన్ని</u> గ్రహించలేని అశక్తతయే.**

– సత్యసాయి స్పీక్స్ వాల్యూమ్ 4, చాప్టరు 49

స్వామి యీ దేహంతో వున్నప్పుడే ఒకేసారి అనేకచోట్ల దర్శన మిచ్చిన సందర్భాలున్నాయి. డా॥ కె.ఎన్.పి.నాయర్[1] అనే లండన్ డాక్టరు ఇంటికి జూన్ 6,1993న సూక్ష్మశరీరంతో వెళ్ళి దర్శనం ఇవ్వటం నాకిప్పుడు గుర్తొస్తోంది. నాలుగురోజులు వాళ్ళింట్లో ఉండటమే గాక

[1] డా॥ కె.ఎన్.పి.నాయర్ గారు ప్రస్తుతం ప్రశాంతి నిలయవాసులు



నాయరు, అతని భార్యతో స్వామి నగర పర్యటనకు వెళ్ళారు. అప్పుడు స్వామి దేహము చాలా సహజ సిద్ధమైనది. వారు స్వామిని స్పృశించటం కూడా జరిగింది. వాళ్ళు అనుభవపూర్వకంగా తెలుసుకున్న విషయం యిది. అప్పుడు స్వామియొక్క భౌతిక దేహము, పుట్టపర్తి ప్రశాంతి నిల యములో అనేక పనులలో బిజీగా ఉండటం కూడా జరిగింది. స్వామి ఒకే సమయంలో రెండు లేదా ఎక్కువ శరీరాల్లో ఉన్న సందర్భాల్లో ఇదొకటి మాత్రమే. ఇప్పుడు యిక్కడ ప్రశ్న ఏమిటంటే ఏదేహము యదార్థమైనది? ప్రశాంతి నిలయంలో అనేక ఏర్పాట్లలో యున్నదా? లేక డా॥ నాయర్ అన్న భక్తుని ఇంట్లో లండన్‌లో వున్న దేహమా? లేనిచో ఆరెండు దేహాలూ సహజమైనవేనా? అట్లయినచో మహా సమాధిలో ఉంచినది ఏ దేహము? దీనికి మనకు సమాధానం దొరకదు. స్వామి శరీరంతో యున్నప్పుడే ఒక్క దేహానికి మాత్రమే పరిమితం కాలేదు కదా! ఈ పరిమితులు, స్వామి తన దేహాల్లో ఒకానొకదాన్ని త్యజించినందుకే ఎందుకు?

స్వామి 'రామకథా రసవాహిని'లో చెప్పారు, రావణాసురుడు మాయా సీతను లేదా కల్పిత సీతను మాత్రమే ఎత్తుకుపోయాడు గాని అసలు సీతను కాదు అని. కనీసం అసలు సీతను రావణాసురుడు ముట్టు కోను కూడా ముట్టలేదు. రామావతారము అన్న డ్రామా నిర్ణయం ప్రకారం జరిగి తీరవలసియున్నది. ఈ విధంగా సీతయొక్క మాయా శరీరము ఆడిన నాటకము యిదంతా. రావణసంహారం తర్వాత అసలు సీతను అగ్నినుంచి రాముడు స్వీకరించటం జరిగింది. ఈ మాయా రూపం అసలు రూపానికి ముమ్మూర్తులా ఆకారంలో, హావభావాల్లో పోలి వుండి దివ్యనాటకానికి అనుగుణంగా నడచుకున్నది. స్వామి పూర్వావతారాల్లో జరిగిన ఇలాంటి సూక్ష్మ రహస్యాలను వివరించి చెప్పేటప్పుడు, సాధారణంగా అవతారాలు, తన సాయి అవతారంతో సహా, ఎలా నడచుకుంటారో సూచన ప్రాయంగా తెలియచేస్తున్నారు. స్వామి యొక్క మాయాశరీరం గురించి ఇంకా మహదీ గతించడంలా కన్పించే అంతర్థానం చెందడాన్ని మనం మహదీ భవిష్యవాణి లో చూశాము. స్వామి శరీరాన్ని (దేహాన్ని) వదిలిపెట్టటం కూడా బయటి ప్రపంచాన్ని భ్రమింప చేయడానికే ఒక మాయే అని కనుక స్వామి తిరిగి మరలా రావటం తన సత్యాన్ని బయలు పర్చడం లేదా తన నిజశరీరంతో పునర్దర్శనం ఇవ్వటం కావచ్చు.

## నిర్మాణ కాయములు:

చరమస్థాయిలోని ఒకానొక యోగశక్తిని నిర్మాణ కాయముగా వర్ణించారు. (అంటే దేహాన్ని సృజించడం) చనిపోయిన తర్వాత కూడా దేహాలని భౌతికంగా సృష్టించే సామర్థ్యం. గొప్ప యోగులు యిట్టి శక్తులతో ఉంటారని ప్రతీతి. ఈ వివరణ ఇసా సంస్థయొక్క సద్గురు జగ్గివాసుదేవ్ గారిది:

"గతంలో అనేకమంది యోగులు వాళ్ళ సూక్ష్మాతి సూక్ష్మ శరీరాలను నేటికీ ఉంచుకుని అనేక పనులు కొనసాగిస్తూ వున్నారు. వాళ్ళ అవసర మొచ్చినప్పుడు వాళ్ళ వాళ్ళ పాత శరీరాలను పునర్మించుకునే శక్తులు వాళ్ళకి ఉన్నాయి.(...) శరీరాన్ని పునర్నిర్మించుకునే వాళ్ళను "నిర్మాణకాయులు" అంటారు. గౌతమ బుద్ధునిది నిర్మాణకాయము అని అంటారు. అట్టివారు యింకా చాలామంది ఉండేవారు. గతంలో ఉన్నట్లుగా యవ్వనంలో ఉన్న శరీరాన్ని గాని, వాళ్ళకిష్టమైన ఏదైనా శరీరాన్ని గాని ధరించ గలిగేవారు చాలామంది ఉన్నారు. (...) వారికి కాలనియమాలు వర్తించవు.

అట్టియోగులకు శరీరాలని సృష్టించుకునే శక్తులు వున్నప్పుడు సర్వశక్తి ప్రదాతకు ఆ శక్తి లేదా ? స్వామి కూడా అలా చేయగలరా లేదా అన్నది కాదు. స్వామి అలా చేయటానికి నిర్ణయించుకుంటారా అన్నదే. స్వామి ప్రకృతి ధర్మాన్ని గౌరవిస్తారు కనుక ప్రకృతికి విరుద్ధంగా వెళ్ళరని చాలా మంది వాదిస్తారు. స్వామి ప్రకృతిని అధిగమించారనటానికి నిదర్శనంగా చాలా సందర్భాలు నేను వివరించగలను. ఆ విషయాన్ని స్వామియే స్వయంగా స్పష్ట పరిచారు. ఈ క్రింద స్వామి చెప్పిన మాటలు చూద్దాము.

కొందరు పెద్దల మాటలు మిమ్మల్ని కలవరపెట్టుచుండును. **శ్రీ కృష్ణుడు ప్రకృతికి అతీతమైన తనశక్తిని వినియోగించి ఎన్నో మహిమలు చేసెను.** వారి ఉద్దేశ్యములో అట్టి మహిమలు చేయుటవలననే తుట్టతుదకు వేటగాని బాణము దెబ్బ బాధకు మరణించెనని అదే విధముగా జీసస్ కూడా మహిమలు చేయుటచేత శిలువపై దుర్మరణమునకు గురియైనట్లు భావించెదరు. **నేను కూడ ప్రకృతి శక్తికి అతీతమైన కార్యములు చేయు చుంటిని కనుక నేనుకూడా అట్టి బాధలకు గురి అయ్యెదనని వారు భావించెదరు. దాని మూలమున అమాయకులు భయాందోళన చెందెదరు.**



**ఈ వ్యర్థ ప్రేలాపనకు కారణము వారి మనో దౌర్భల్యము, అజ్ఞానము, అసూయ, నా మహిమలను నా దివ్యతత్త్వమును ఓర్వలేని వారెందరో ఉన్నారు. వారు ఈ వైభవాన్ని అర్థం చేసుకోలేరు. ఒప్పుకోవటానికి ఇష్ట పడరు.** –సత్యం, శివం,సుందరం 3వ భాగము, 8వ అధ్యాయము.

పై మాటల ద్వారా స్వామి శ్రీకృష్ణుడు, ఏసుక్రీస్తు, మరియు తానూ ప్రకృతి నియమాల్ని అధిగమించారని పరోక్షంగా ధృవపరుస్తున్నారు. అవతారాలు దేనికీ బంధింపబడవు. వాళ్ళ అవతార లక్ష్యాన్ని సాధించడానికి ప్రకృతి ధర్మాన్ని అధిగమించవలసి వస్తుంది. వాస్తవానికి ప్రతి అవతార కాలంలోనూ, భక్తులు దివ్యలీలల్ని చూచి ఆ వైభవాల్ని కీర్తించి, వాటిపై కీర్తనలల్లి గానంచేసి వాటినే ధ్యానం చేయటానికి దివ్యమహిమలను ప్రదర్శించే అద్భుత గడియలు ఉంటూ వస్తున్నాయి. బాలుడుగా, ఉన్నప్పుడే వాన నుంచి ప్రజలను రక్షించడానికి కృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని చిటికెన వ్రేలు మీద ఎత్తాడు. ఇంకా పన్నెండు సం॥లు క్రితం మరణించిన తన గురుపుత్రునికి (సాందీపుని పుత్రుడు) ప్రాణం పోశాడు. భూమిని ఢీ కొట్టడానికి వచ్చిన నరక గ్రహాన్ని ధ్వంసం చేసాడు. ఒకప్పుడు నరక గ్రహం భూమిని తాకటానికి దగ్గరకు వచ్చినపుడు భూమి మీద యున్న జనులు అత్యంత భయం చెందారు అప్పుడు కృష్ణుని ప్రార్థించారు. అప్పుడు అత్యంత అరుదైన ప్రజ్ఞాశక్తులతో శ్రీ కృష్ణుడు ఆ నరక గ్రహాన్ని ధ్వంసం చేశాడు. ఈ సాయి అవతారంలో కూడ వూహించ శక్యంకాని అట్లాంటి అనేక అద్భుతాలు చేశారు. మరణించిన భక్తులను బ్రతికించడం, వరదలు, వానలు, ఉత్పాతాలు జరగనీయకుండా ఆపటం, అనేక దారుణమైన రోగాలు నయం చేయటం, భక్తులను ఖండాంతరాలకు క్షణంలో టెలిపోర్టు ద్వారా పంపటం, నిజానికి స్వామి యొక్క లీలలన్నీ ప్రకృతి ధర్మాన్నీ అధిగమించినట్లు కన్పిస్తాయి. అసలు అన్నీ లీలలూ, అద్భుతాలు అనిపించుకోవటం లేదా?

ప్రఖ్యాత పత్రికా సంపాదకుడు ఆర్.కె. కరంజియా అసలు భగవంతుడు మానవ శరీరాన్ని ఎందుకు ధరించాలి ? అని స్వామిని ఇంటర్వ్యూలో అడిగినపుడు స్వామి ఈవిధంగా సమాధానం చెప్పారు.

**మానవునిలోని దివ్యత్వమును ఆవిష్కరించడానికి ఇంకో మార్గం లేదు. అవతారమూర్తి మానవాకారము ధరించి మామూలు మనిషిలాగా మసలుతున్నపుడు సాటినరులు సన్నిహిత సంబంధము అనుభవిస్తారు. కొన్ని సమయాలలో వున్నత దివ్యశిఖరాలను అధిరోహిస్తూ ఉంటారు.**

**అందువలన మామూలు మనుషులు కూడా అటువంటి ఎత్తులకు చేరుకోవాలని ఆకాంక్ష చూపుతారు. మానవాకారంలో అవతారం రావటానికి ముఖ్యలక్ష్యం ఏమిటి? అంతర్యామిగా వున్న దివ్యత్వమే సమస్త జీవకోటిని నడిపించే శక్తి అని గుర్తింపచేయటమే.**

–బిట్జ్ ఇంటర్వ్యూ, సెప్టెంబరు, 1976.

మానవులను, దైవస్వరూపులని గుర్తింపజేయుట కొఱకే యీ దైవ లీలలన్నీ. ఆ ఎత్తుకి ఎదిగితే వాళ్ళుకూడా దైవం చేసే పనులు చేయగలరని చెప్పటానికే. అందుచేత జీసస్ క్రీస్తు చెప్తారు **"నేను తండ్రి యొద్దకు వెళ్ళుచున్నాను గనుక నేను చేయు క్రియలు నాయందు విశ్వాసముంచువాడును చేయును, వాటికంటే మరి గొప్పవియు అతడు చేయునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.** –యోహాను వార్త 14:12

పునరుద్ధానం గురించి స్వామి ఏమి చెప్తున్నారు? అసలు ఈ పునరుద్ధానం అంటే ఏమిటి? **మానవునిలో వున్న దివ్యత్వాన్ని వ్యక్తం చేయటమే.** – సాయి దివ్య సందేశం, ఫిబ్రవరి 28, 1964.

స్వామి ప్రపంచానికి ఆదర్శంగా ఉండేలా తన జీవితం గడిపారు. వారి లీలలు, మనలో దాగియున్న దివ్యశక్తులను మనకు గుర్తుచేయటానికే. అందుకోసమే స్వామి ఎప్పుడూ చెప్తూ ఉంటారు **"నేను దైవాన్ని, మీరు కూడ దైవమే"**అని. అందుచేత ప్రకృతి నియమాల్ని అతిక్రమించి స్వామి తిరిగిరావటం జరగదు అని నమ్మటం పూర్తిగా నిరాధారమైనది. నిజానికి అలా తిరిగి రావటం అనేది ఈ ధరణీతలంపై సంచరించిన సర్వోత్కృష్ట దివ్యావతారుని కీర్తి కిరీటానికి తగిన శోభాయమాన మణిపూస కాగలదు.



# పన్నెండవ అధ్యాయము

## ముగింపు

స్వామి తప్పక తిరిగి రావటానికి సంభావ్యత గురించి అనేక సంకేతాలు యీ పుస్తకంలో యివ్వబడినవి. అయినా, భక్తుల యొక్క ప్రార్థనలే స్వామిని మరలా తిరిగి తీసుకువస్తాయని నేను కూడా నమ్ముతున్నాను. భక్తుల యొక్క అవసరాలని తీర్చటానికి, నేను ప్రశాంతినిలయాన్ని కూడా విడిచి పెట్టటానికి సిద్ధంగా యున్నాను, అని స్వామి ఒకసారి చెప్పారు.

**" మీ అభ్యర్థనలను మన్నించటం కోసం నేను ప్రశాంతి నిలయాన్ని విడిచి పెట్టటానికి సహితం సంసిద్ధంగా యున్నాను. ప్రజల మంచి కోసం నేనేదైనా చేయటానికి సిద్ధమే. అదే నా ముఖ్య కర్తవ్యము."**

–సాయివాణి (స్వామి సందేశాల సంపుటి.)

స్వామి ఏం చెప్తున్నారో మనందరికీ తెలుసు. కానీ భౌతికంగా ప్రశాంతి నిలయాన్ని విడిచిపెడతారని మనము ఊహించలేదు. యావత్ ప్రపంచం కోసమే తన భౌతిక దేహాన్ని స్వామి విడిచి పెట్టారన్నది సుస్పష్టం. ("స్వామి దేహన్ని ఎందుకు వదిలారు?" అన్న అధ్యాయంలో వివరించిన కారణాల వలన) తిరిగి మరలా రావటం కూడా దాని కోసమే అవుతుంది. దీనికి భక్తులు మొట్టమొదటి అడుగు వేయాల్సిందల్లా స్వామి యొక్క మాటలు హృదయ పూర్వకంగా నమ్మటము మరియు వారి రాకడ కొరకు ప్రార్థించడమేనని వినయపూర్వకంగా నేనునమ్ముతున్నాను. తన అవతారం గుఱించి స్వామి మొదట్లో చేసిన ప్రకటనల్లో ఒకదాన్లో,

"సాధువులు, సంతులు నా రాక కొఱకు ప్రార్థించారు. తపస్సు చేసారు. నేను వచ్చాను అన్నారు. వేల సంవత్సరాల క్రితమే సత్యసాయి అవతరణ గురించి, అనేక గ్రంధాల్లో చెప్పబడియుంది. అయినప్పటికీ ఇంకా సాధుపురుషులు తాను దిగి రావలెనని ప్రార్థనలు చేయాలి. కనుక ఆయన రాకడ కోసం మనమంతా తీవ్ర శ్రద్ధాభక్తులతో ప్రార్థనలు చేయాలనటం సహేతుకం కాదా? స్వామివారు ఒకసారి ఒకానొక భక్తునితో ఇలా అన్నారు.

"అవును ...నాయందు స్థిరమైన విశ్వాసాన్ని కలిగి ఉన్నవారికి ఇచ్చిన మాటను నేను తప్పక నెరవేరుస్తాను."

–సత్యం శివం సుందరం 4వభాగం పేజి 181

పూర్తి నమ్మకమే కీలకం అని మనం తెలుసుకున్నాము. ఈ పుస్తకం వ్రాయుటలో ముఖ్య ఉద్దేశ్యమేమంటే, భక్తులలో సమన్వయాన్ని సాధించి, నమ్మకాన్ని వృద్ధి చేసి అందరూ కలిసి ఏకచిత్తంతో స్వామిరాక కోసం ప్రార్థనలు చేయటానికి వీలు కల్పించటం కోసమే కాని ఏదో స్వార్థ స్వప్రయోజనాల కోసం, ఏదో రహస్య ప్రణాళికతో మాత్రం కాదు. ఖర్చు లేకుండా చదవటానికి వీలుగా ఇంటర్‌నెట్‌లో కూడా యీ పుస్తకం ఉంచబడింది. **మీకు ఈ గ్రంథం ద్వారా పదే పదే మనవి చేసుకోవాలనుకున్న విషయమేమంటే స్వామి తిరిగి వస్తారని నమ్మటం బలహీనత ఎంత మాత్రమూ కాదు. నిజానికి గురు వాక్యాలపై చెక్కుచెదరని విశ్వాసం కలిగి వుండటమనేది శిష్యుని యొక్క లేదా భక్తుని యొక్క బలముగా పరిగణించబడుతుంది.** అయినప్పటికి గురువు యొక్క మార్గములను ఎవ్వరూ ప్రశ్నించకూడదు. స్వామి ఏమిచేసినా దాని అర్థం స్వామికే తెలుసును. మనం దానిని ప్రశ్నించకూడదు. స్వామి మాటలమీద సంపూర్ణవిశ్వాసం ఉంచడం మన హక్కు. స్వామి మనలందరిని అదే అడుగుతున్నారు.

**"మాటకు సత్యమే ప్రాణము. నా మాటను అసత్యంగా మార్చుకోవడం నాకు ఇష్టం లేదు. ఎవరైనా నా మాటను సరియైన రీతిలో సరియైన మార్గంలో అనుసరించనప్పుడు వారితో నేను మాట్లాడకుండా ఉంటాను. నామాటలకు విలువనిచ్చిన వారికి, నేను అన్ని విధాలా సహాయము చేసి ఆనందం ప్రసాదిస్తాను.**

–సత్యసాయి వచనామృతము 28వ భాగం. 2వ అధ్యాయం.

తన మాటల మీద నమ్మకముంచి, పూర్తి ప్రాముఖ్యత ఇవ్వాలని స్వామి బోధిస్తూ వుంటారు. అలాంటప్పుడు భక్తులమైన మనం ఆయన చెప్పిన ఈ మాటలను మాత్రమే నమ్మాలి, ఇదిగో ఈ మాటలు నమ్మకూడదని భేదభావంతో ఎలా ఎంచుకోగలం? ఆయన ఇది చేయగలరు అది చేయలేరని మన దృష్టి కోణపు హద్దుల్లో ఆయన్ని పరిమితం చేయడానికి చూస్తాము. ఆయన వాక్కులు నిశ్చయంగా ఫలిస్తాయన్న దానిపై సంపూర్ణ విశ్వాసం వుంచడానికి బదులు జరిగిన వాటిని మన అస్పష్ట వక్ర భాష్యాల మధ్య ఇమడ్చడానికి ప్రయత్నిస్తాము. అదే భగవంతుడు యీ సృష్టినంతా, నిర్మాణం గావించాడన్నది మనం మరచిపోతాము. భగవంతుడ్ని దేనికైనా పరిమితం చేయగలమా? స్వామి మహాభినిష్క్రమణం చెందిన తొలి



రోజులలో పునరుద్ధానం చెందుతారని అంతా నమ్మారు. స్వామి మాటల ప్రకారం దేహాన్ని వదలి పెట్టటానికి యిది తగిన సమయం కాదు. అయితే ఇప్పుడు వేరే విధంగా అర్థం చేసుకోవటమెందుకు? అప్పటి నుంచి ఏమి మార్పు వచ్చింది? అసలు స్వామి తిరిగి రావటానికి అడ్డంకులు ఏంటి? స్వామి ఆ దేహానికి మాత్రమే పరిమితం కాదుగదా?. ఆయన అన్ని మాటల మీద సంపూర్ణ విశ్వాసం ఉంచాల్సిన బాధ్యత మనది. మన చలించని నమ్మకమే స్వామిని మరలా తిరిగి తీసుకు వస్తుందని నా నమ్మకం.

సత్యసాయి విద్యాలయం నుంచి బంగారు పతకాన్ని సంపాదించుకున్న శ్రీ వినోద్ కార్తీక్, ఎం.బి.ఎ. ఫిబ్రవరి 15, 2012న రేడియోసాయి ద్వారా యిచ్చిన ఇంటర్వ్యూలో "స్వామిరాక విషయంలో నా స్వంత విశ్వాసాన్నే ప్రతిధ్వనించడం గమనించాను." తన అభిప్రాయం ఈ విధంగా తెలియజేశారు. (వాటిలో కొన్ని భాగాలు మాత్రమే ఇక్కడ ఇస్తున్నాను.) **"నా స్వంత విశ్వాసాన్ని పంచుకుంటున్నాను. ఎందుకో తెలియదు, కేవలం ఆత్మ ప్రబోధం. స్వామి సర్వాంతర్యామి. అన్ని చోట్ల ఉన్నారు. స్వామి ఎల్లప్పుడూ ఉంటారు. మనం తప్పకుండా వందకి రెండొందల పాళ్ళు మళ్ళీ భౌతికంగా చూస్తాము. ఈ విషయంలో నాకెట్టి సందేహము లేదు."**

**(...) స్వామి చాలా విషయాలు చెప్పారు. ఏవో కొన్ని కారణాల వల్ల మన నమ్మకాన్ని తగ్గించుకోకూడదు. స్వామి తన ప్రతిమాటను నిలబెట్టు కుంటారు. స్వామి మాటను నిలబెట్టటం కోసం యావత్ సృష్టి ఆ దిశగా సర్వ సిద్ధంగా ఉండాల్సిందే. మనము ఏదో ఒక మానవ మాత్రుని గురించి చెప్పుకోవటం లేదు, భగవంతుని యొక్క అవతారం గురించి మాట్లాడు కుంటున్నామన్న సంగతి గుర్తుంచుకోవాలి.**

నా అనుభవం ప్రకారం చెప్తున్నాను. స్వామి యొక్క భౌతిక స్థితిని గురించి అధ్యయనం చేసేటప్పుడు, **స్వామి వాక్కు అంతరాత్మ యొక్క వాణే అని నాకు తెలుసు. స్వామి చెప్పేది వేరు, అంతరాత్మ చెప్పేది వేరూ** అన్న అనుమానం ఎప్పుడూ లేదు. కనుక స్వామి చెప్పిన ప్రతి విషయము **సమయమొచ్చినపుడు కార్యరూపం దాలుస్తుందనీ జరిగి తీరుతుందనీ నేను గట్టి నమ్మకంతో చెప్తున్నాను.**

## ఎట్టి పరిస్థితులలోనైనా, స్వామి చేసిన వాగ్దానములు నెరవేర్చితీరుతారు.

తాము చేసిన వాగ్ధానములు ఎట్టి పరిస్థితుల్లోనైనా నెరవేర్చి తీరుతామని స్వామి ప్రకటించారు. తన గృహం మొత్తాన్ని స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులకు కేటాయించిన స్వామి తొలి తరం భక్తురాలు శ్రీమతి సుబ్బమ్మ గురించి ఒక కథ ఉంది. ఆమె తన ఇంటిని భక్తులు సమావేశమై స్వామి దర్శనం చేసుకొనుటకు వినియోగించింది. ఆమెకు స్వామిపై అత్యంత ప్రేమ, భక్తి ఉన్నాయి. ఆమె ఆఖరి క్షణాలలో స్వామి దర్శనం కోరుకున్నది. స్వామి దాన్ని నెరవేరుస్తానని వాగ్ధానము చేసారు. సుబ్బమ్మ చనిపోయినపుడు స్వామి పుట్టపర్తిలో లేరు. స్వామి మరునాడు తిరిగి వచ్చేంత వరకు ఆమె బంధువులు ఆమె దేహాన్ని అట్లానే ఉంచారు. ఆమె చివరికోరికను ఏవిధంగా తీర్చారో ఆ అద్భుతం స్వామి మాటల్లోనే.

( ...) భక్తులు పరుగెత్తుకుంటూ వచ్చి స్వామి! మీ సుబ్బమ్మ గత రాత్రే చనిపోయిందన్నారు. నేను కారు త్రిప్పి వెంటనే బుక్కపట్నం వెళ్ళాను. ఆమె శరీరం గుడ్డలో కప్పి వరండాలో ఉంచారు. ఇంటిల్ల పాది దుఃఖంలో మునిగి ఉన్నారు. **ఎట్టి పరిస్థితుల్లోను స్వామి ఒక వాగ్ధానం చేశారంటే తప్పక నెరవేర్చి తీరుతారు.** శరీరాన్ని కప్పివేసిన బట్ట తీశాను. ఆమె గత రాత్రే చనిపోవటం వల్ల శరీరమంతా చీమలు ప్రాకుతున్నాయి. నేను 'సుబ్బమ్మా' అని పిలిచాను. తన కళ్ళు తెరిచింది. ఆ వార్త దావానలంలా అన్ని చోట్లకు వ్యాపించింది. బుక్కపట్నం ప్రజలందరూ, సుబ్బమ్మకు తిరిగి ప్రాణం వచ్చిందని ఒకరికొకరు చెప్పుకుంటూ అక్కడికి చేరారు. సుబ్బమ్మ తల్లికి అప్పుడు 100సం॥లు వయస్సు, తులసీదళాలు, ఒక గ్లాసు నీరు తీసుకురమ్మని చెప్పాను. సబ్బమ్మ నోటిలో ఆ తులసి నీరు పోసి త్రాగించాను. 'సుబ్బమ్మా! **నేను నా వాగ్ధానాన్ని నిలబెట్టుకున్నాను. ఇప్పుడు నీవు నీ కళ్ళు ప్రశాంతంగా మూసుకొనవచ్చు.** అని చెప్పాను. స్వామీ! నాకు యింకేం కావాలి? నేను ఆనందంతో శరీరాన్ని విడిచి పెడుతున్నానంది. ఆనంద భాష్పాలతో నా చేతులు పట్టుకుని ప్రాణం వదిలి పెట్టింది.

**ఈ విధంగా నా వాగ్ధానాన్ని నేను నెరవేర్చుకుంటాను. ఎట్టి పరిస్థితుల్లోను నా వాగ్ధానాన్ని వమ్ముచేయను.**

–(స్వామి దివ్య సందేశము, అక్టోబరు 20, 2002)



సుబ్బమ్మకు ఆఖరి దర్శనం యివ్వటం కోసం స్వామి ఆమె జీవాత్మను తాత్కాలికంగా రప్పించారు. ఏం జరిగినా, యీ సంఘటన స్వామి తన మాటను నిలబెట్టు కుంటారనడానికి గొప్ప ఋజువు. తన భక్తురాలికిచ్చిన మాటను, ఆఖరి దశలో దర్శనం ఇస్తానన్న మాటను నిలబెట్టుట కొఱకు ఆమెని తిరిగి బ్రతికించిన స్వామి, తను యిచ్చిన మాట నిలబెట్టుట కొఱకు తనను తాను వెనుకకు ఎందుకు రప్పించుకోరు?

నాకు, స్వామి చెప్పిన మాటలు ఇప్పటి వరకూ నెరవేర్చబడనిని తుదకు తప్పకుండా నెరవేర్చ బడతాయన్న దాన్లో కొంచెం కూడా సందేహం లేదు. ఎప్పుడు ఎలా ఉన్నది స్వామికే తెలుసు. కొద్ది సం॥ల కాలంలోనే మనం వెనుతిరిగి చూస్తే మనకు అర్ధం అవుతుంది. శ్రీ సత్య సాయిబాబా ఒక మామూలు అవతారంకాదని, గతంలో ఎప్పుడూ లేని విధంగా చాలా శక్తివంతమైన మానవదేహంతో భూమిపైకి వచ్చిన అద్భుత అవతారం గుఱించి మనం మాట్లాడుకుంటున్నాము.

రాబోయే కాలంలో భావితరాల వారు సత్యసాయి అవతార వైభవాన్ని పారాయణ చేసుకునేటప్పుడు ఆ ప్రశంసాపూర్వక స్తోత్రాల మధ్య నిజం కాని భవిష్యవాణి ఒక్కటి కూడా మిగిలి ఉండదు. మచ్చుకు ఒక్కటైనా జరగనిది వుంటుందంటే నేను నమ్మను.

## భక్తులకు ఇది శిక్షణా సమయము.

స్వామి దేహాన్ని వదలినప్పుడు భక్తులు దుఃఖంలో మునిగి పోయారు. ఆ సంఘటనని ఎదుర్కోవటానికి మనల్ని సంసిద్ధులను చేయటానికన్నట్లు గతంలో ఒక అద్వితీయ హామీ ఇచ్చారు.

**" స్వామి ఆరోగ్యం గుఱించి, ఎవ్వరూ ఆదుర్దా, ఆందోళనలు చెందవలసిన అవసరము లేదు. బాధపడనవసరము లేదు. ఏ అపాయము స్వామికి కలుగదు. స్వామి అన్ని కష్టాలు, బాధల నుంచి బయటకు వస్తారు. ఎవ్వరూ భయముగాని, బాధగాని, దుఃఖాన్ని గాని చెందవలసిన అవసరము లేదు. స్వామి విజయాన్ని సాధించి తీరుతాడు.**

–స్వామి దివ్య సందేశం, జూలై 13, 2003.

ముందు ముందు కష్టాలూ, బాధలూఉంటాయని చెప్తూనే తాము వాటన్నింటినీ సునాయసంగా అధిగమిస్తామని చెప్పటం వలన స్వామివారి ఈ ప్రకటనకి ఈ సమయంలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. అసలు మనం

బాధ ఆ(శ్రుత ఆదుర్దా లేకుండా ఎలా ఉండగలం? మన అత్యంత ప్రియమైన స్వామి గదా?

కృష్ణుడు శరీరాన్ని వదిలినప్పుడు, అర్జునుడు ఒక్కక్షణం కూడా ఆ వియోగం తట్టుకోలేక మనో ధైర్యాన్ని కోల్పోయాడని స్వామి చెప్పారు.

**“అర్జునుడు, ప్రతి క్షణమూ కృష్ణుడు తన హృదయంలో ఉన్నాడని భావించేవాడు. ఆ భావన అతనిని ధీరోదాత్తుని చేసెడిది. కృష్ణుని ‘నిర్యాణ’ వార్త వినినంతనే, కృష్ణుడు ఇకలేడు అనే యోచన కలుగుట వలన అతను శక్తిని కోల్పోయెను.”** –సత్యసాయి బాబాతో సంభాషణలు పేజీ 159.

ద్వాపరయుగంలోనే అర్జునుడంతటి గొప్ప భక్తుడు కృష్ణుని వియోగాన్ని భరించలేక పోయినపుడు మనమెలా ఈ కలియుగంలో భరించ గలము? అయినప్పటికి చాలామంది బాబా భక్తులు, స్వామి అనుగ్రహం వల్ల పరిణతి చెంది , దేహానికి అతీతంగా వెళ్ళటానికి ప్రయత్నించి, స్వామి యొక్క రూపాన్ని తమ హృదయాల్లో నింపుకున్నారు. అది కూడ మనం స్వామి దేహంపై మితిమీరిన అనురాగాన్ని అధిగమింపచేయటానికి ఆడిన దివ్య నాటకంలో భాగమని నా అభిప్రాయం.

కనుక స్వామి తిరిగి రావాలని మనం ఆర్తితో కోరుకున్నప్పటికి మన ప్రార్ధనలు స్వామి భౌతికంగా మన దగ్గర ఉండాలని మాత్రమే కోరుకునేవిగా ఉండకూడదు. అట్లాంటి ప్రార్ధన అసలు స్వామి మన నుంచి దూరమయిన ఉద్దేశ్యాన్ని నెరవేరకుండా చేస్తుంది.ముందు అధ్యాయా ల్లో స్వామి చెప్పిన ప్రకటనలు సత్యసాయి అవతారకాలం గురించీ స్వర్ణ యుగము ఎలా రాబోతోందన్న విషయాలూ చూసాము. స్వామి ఆవిధంగా చెప్పి యుండకపోతే, ప్రేమసాయి అవతారము ఇప్పుడే వస్తుందని ఎదురు చూసేవాళ్ళం తప్ప సత్యసాయి తిరిగి రావటాన్ని ఊహించి ఉండలేక పోయేవాళ్ళము. ఈ కారణం చేతనే ప్రస్తుత దుర్భర పరిస్థితిలో వున్న ప్రపంచంపై స్వామి రాకడ చూపబోయే అద్భుత ప్రభావాన్ని దృష్టిలో వుంచుకుని మనం ప్రార్ధనలు చేయాలి.

భక్తులందరూ, సాయి దివ్య అవతారంలో తమ వంతు పాత్ర పోషించవలసి ఉందని చాలాసార్లు స్వామి చెప్పగా మనం విన్నాము.

**స్వర్ణయుగంగా మార్చటానికి అవసరమైన మార్పు తేవటానికి మీ అందరూ మీమీ పాత్ర పోషించవలసి ఉంది. అందుకు మీరు ఉపయోగించ వలసిన ఆయుధం – ప్రేమ.**

–(శ్రీసత్యసాయి బాబా –మానవ జాతి భవిష్యత్తు) పేజి 224



1979 సం॥లో ఛార్లెస్ పెన్ కి యిచ్చిన సందేశంలో, మన మందరం స్వామి సంస్థలలో పనిముట్లుగా మారటానికి సంసిద్ధులుగా ఉండాలని స్వామి మనకు ఆదేశం యిచ్చారు.

**“ఇక మీ ఉద్యమం ప్రారంభమైంది. ఓ భక్తులారా యివే నామాటలు, మీ కొఱకు, ప్రతి ఒక్కరు మీ జీవితంలో చాలా ప్రముఖ పాత్ర పోషించవలసి యున్నది. ఎవర్నైతే నేను పిలుస్తానో వారే నాకు సేవ చేయగలరు. నా మిషన్లో మీరందరు తగిన పని చేయవలసిన సమ యమాసన్నమైనది. యీ బ్రహ్మాండంలో భూగ్రహ ఉనికికి ఓ పరమార్ధం ఉంది. ఆ లక్ష్యం యిప్పుడు మన కళ్ళ ముందు ఆవిష్కృతమౌతోంది. మీలో భక్తి తరంగాలని వ్యాప్తి చేయమని మీకు పిలుపు నిస్తున్నాను. తద్వారా దాని యొక్క అదృశ్యశక్తి మీ కక్ష్యలోకి వచ్చిన వారిని ఆవరిస్తుంది. మీ పాత్ర మీరు విజయవంతంగా పోషించుటకు, నా మీదే మీ దృష్టిని కేంద్రీ కృతం చేయండి. అనంతమైన నా ప్రేమ ప్రపంచం మొత్తం అనుభవిస్తుంది. అనేక జన్మల నుంచి యీ పని కోసం మిమ్ములను సంసిద్ధులను చేస్తూ వస్తున్నాను. మిమ్ములను నా దగ్గఱకు లాక్కున్నాను. గత అవతారము లలో అనేక పెద్ద అడుగులు నా యీ మిషన్ కోసం వేస్తూ వచ్చాను. నా పనికి అంతము లేదు. ఆ విధంగానే మీ పనికి కూడా అంతముండదు.**(...)

**నేను మీలోపలా వెలుపలా కూడా వున్నానని తెలుసుకోండి. మీకు నాకూ ఏమీ తేడా లేదు. తుచ్ఛ విషయాల్ని ఎప్పటికీ మీ దరిచేర నివ్వకండి. ఇప్పుడు మీరు నాలో ఉన్నారు. నేను మీలో వున్నాను. ఏమీతేడా లేదు. నా దర్శనము మీకూ, మీ ద్వారా అందరి పైనా కుమ్మరించ బడు తుంది. ఈ నిరంతర చర్య జరుగుతూఉండటం మీకు తెలియక పోవచ్చు. మీహృదయాలలోను, అంతరాత్మలోను మీరు పరిశుద్ధంగా ఉండండి ఇట్లాంటి అద్భుత విలువల వల్ల మానవజాతి మీ జీవిత కాలంలోనే మేలు పొందుతుంది.**

**మిగిలిపోయిన వాళ్ళందరూ కూడా నా ఈ ఉద్యమంలో, నేను వాళ్ళని నా వద్దకు ఆకర్షించినపుడు చేరతారు. మానవులందరూ ప్రేమతో కలిసిమెలిసి యుండే సమయము వస్తోంది. మీరు అనుకున్న దానికంటే ముందుగానే యీ సమయం వస్తుంది. ఆ సమయం రాకముందే జీవిత పరమార్ధాన్ని ప్రతి ఒక్కరికి వెల్లడి చేయటానికి అవసరమయినదంతా సమకూర్చుకొని సంసిద్ధంగా ఉండండి.**(...)

–నా ప్రియతముడు, ఛార్లెస్ పెన్, పేజి 96–97.

స్వామి తిరిగి వచ్చి తన అవతార కార్యక్రమాన్ని కొనసాగించాలని ఎదురుచూసే బదులు, ప్రతి సాయి భక్తుడూ, సాయి భక్తురాలూ తమ సాధనని తీవ్రతరం చేసి రానున్న నూతన సాయియుగంలో తన దివ్య ఉపకారణాలుగా మనల్ని మార్చమని వేడుకుందాము. మనల్ని ఆలోచింప చేసే విధంగా పై సందేశంలో స్వామి మనల్ని అడుగు తున్నదదే. స్వామి భక్తులకు సులభంగా అందుబాటులో వుండే తొలిరోజుల్లో కూడా అంత వరకూ శ్రద్ధ కనబరచి సామీప్యాన్ని అనుగ్రహించిన భక్తుల్ని కూడా స్వామి దూరంగా పెట్టిన సందర్భాల గురించిన వృత్తాంతాలు నేను చాలానే విన్నాను. భక్తులకు తమ రూపంపై అనురక్తిని తొలగింపచేసి తద్వారా భౌతిక సాన్నిధ్యంలో వున్నంతసేపూ అంత సులభంగా పొందలేని నిరాకార నిత్య సత్యాన్ని మనచే అనుభవింప చేయాలనే మాతృవాత్సల్యంతో కూడిన ఆసక్తే వారు అలా చేయటానికి ప్రేరేపించి వుంటుందని నేననుకుంటు న్నాను. ఈ కారణం చేతనే స్వామి, అయిష్టంగానే, తాత్కాలికంగా మన నుండి అదృశ్యం అయ్యారనీ, అప్పుడు మాత్రమే మనం స్వామంటే ఎదురు గా ఉన్న రూపమే కాక ఎల్లప్పుడూ మన లోపలా, వెలుపలా, పైనా మనచుట్టూ నిండి నిబిడీకృతమై వున్నారని గ్రహిస్తామనీ నేను నమ్ము తున్నాను. ఆ జ్ఞానంతో మనం అంతర్ముఖులమై స్వామి రాబోతోందని వాగ్ధానం చేసిన సుందర ధార్మిక శకానికి మనల్ని సంసిద్ధం చేసుకోవాలి.

ఇంకో విధంగా చెప్పాలంటే స్వామి తిరిగి వచ్చినపుడు దాని ప్రభావం ప్రపంచము మీద ఎలా యుంటుందో మనం కొంచెమైనా ఊహించుకోగలమా? ఈ ప్రపంచం మొత్తం ప్రశాంతి నిలయానికి వస్తారని అప్పుడు కనీసం నిల్చుంటానికి కూడా చోటు ఉండదని స్వామి ఒకసారి చెప్పారు. డా॥ హనుమంతప్పగారు పుటపర్తి భవిష్యత్తులో ఏలా ఉంటుందో స్వామి మీద వ్రాసిన పుస్తకం "శ్రీ సత్యసాయిబాబా యుగావతారి"(పేజీ 167) లో తను దర్శించిన కలలను వివరించారు.

**" పండుగల సందర్భాలలో మాత్రమే స్వామిని చాలా దూరం నుంచి చూడవలసి వస్తోంది. అయినా పూర్తిగా స్వామిని చూడలేక పోతాము. కనుక భవిష్యత్తులో ఇది మనము ఊహించలేని పరిణామం. పాత భక్తులమయిన మనము, ఏదో వింత ప్రపంచంలో ఉన్నట్లు భావిస్తాము.**



కనుక స్వామి భౌతిక సామీప్యం ఎలాగూ సాధ్యం కాబోతుంది కనుక స్వామిని మన హృదయవాసిగా హృదయాలలో చూడటానికి ప్రయ త్నించడమే సముచితంగా ఉంటుంది. " మహది-యొక్క అదృశ్యము" అన్న అధ్యాయంలో మహది గురించిన భవిష్యవాణి, సత్యసాయి అవతార లక్షణాలతో ఎలా సరి పోలుచున్నవో చూశాము. మహది ఎలా అదృశ్య మయ్యాడో తుదకు, మరలా తిరిగి ఎలా వచ్చాడో అన్న విషయాన్ని కూడా మనం ఆ అధ్యాయములలో చూశాము. "మహది" తిరిగి వచ్చినప్పుడు ప్రత్యేకముగా ఏ ఒక్క వర్గము ప్రజల కోసమో కాదు అన్న ఆసక్తికర భవిష్యవాణిని కూడా నేను చూడటం జరిగింది.

**" క్రైమ్ " తిరిగి వచ్చినప్పుడు ఏదో ఒక ప్రత్యేక తెగను మాత్రమే సమర్ధించి వాళ్ళను భుజానకెత్తుకోవడం అనేది వుండదు.** (- బిహర్ ఉల్ అన్వర్ వ్యాల్యూమ్ 13 అధ్యాయము 1. ఆంగ్లానువాదం పే.147.) అంటే క్రైమ్ లేక మహది అంతర్ధానం చెంది తరువాత తిరిగి రావటం ఒక ప్రత్యేక తెగనుద్ధరించుట కొఱకు కాదు. ప్రపంచ ప్రజలందరికీ ఆయన ప్రభువవుతాడు. బహుశా యీ అంతర్ధాన సమయము భక్తులకు అలాంటి వియోగాన్ని భరించుటకు శిక్షణాకాలము అయియుండవచ్చును.

స్వామి తన సర్వశక్తులను ఎల్లప్పుడునూ తన మానవతత్వము మరియు మాయ అనే తెరవెనుక అణచి ఉంచుతున్నారు. కారణమేమంటే, బహిరంగంగా తన శక్తులను చూపించినట్లైతే ప్రపంచ ప్రజలందరు ఆయన వద్దకు వ్రాలిపోతారు అన్నది స్వామి ఆలోచన, కానీ అట్టి సమయము ఇంకా ఆసన్నం కాలేదు.

**దానికి (ఈశ్వరుడు సాయినాధుని రూపంలో భూమిపై అవతరిం చాడని ప్రకటించటానికి) ఇంకా సమయం రాలేదు. ఇలా ప్రకటించడానికి ముందు నా దగ్గరకు రావటానికి పూర్వజన్మలనుండి నిర్విరామ ప్రయత్నం చేస్తున్నవారిని నా సంపర్కంలోనికి తీసుకురావాలి. ముందు ముందు అవ తార తత్వమును ప్రపంచం మొత్తానికి సార్వత్రికంగా ప్రకటించే సమయం వస్తుంది.**

- సాయిబాబా నరనారాయణ గుహాశ్రమము, రెండవ భాగం పేజి 38.

మున్ముందు స్వామి యొక్క తత్వము అనేటువంటిది ఈనాడు గుర్తుంచు కోలేని వ్యక్తులందరు కూడను ఆనాడు కంటినీరుతో ఒక విధమైన

టువంటి యొక్క దీనిని అనుభవించవలసి వస్తుంది. స్వామియొక్క తత్త్వము అతి శీఘ్రములోనే జగత్ వ్యాప్తి అయిపోతుంది. దీని నిమిత్తమై **స్వామే గట్టిగా దీనిని అరికట్టుకుని ఉన్నాడే కాని ఒక్కతూరి విజృంభించినపుడు జగత్తంతా ఒక ప్రశాంతినిలయంగా రూపొందుతుంది.**

– సత్యసాయి వచనామృతము భాగము 15, అధ్యాయం 55.

బహుశా అటువంటి ప్రపంచవ్యాప్త విజృంభణకు ఇప్పుడు సమయ మాసన్నమయింది. అందుచేత స్వామి తిరిగి వచ్చునపుడు ఏ హద్దులకు పరిమితులకు లోబడి వుండరు. ఆ అవసరమే రాదు. స్వామి ఇప్పటికే 85 సంవత్సరాల దీర్ఘకాలం ఒక చక్కటి సందేశాత్మక అనుకరణీయమైన ఆదర్శ దివ్య జీవనాన్ని మనకు చూపారు. ఇప్పుడు ఈ ద్వితీయ ఆగమనము, స్వామి తమకు తాము ఏర్పరచుకున్న అవరోధాలు ఏమీ లేకుండా తమ పరిపూర్ణ సర్వశక్తి సంపన్నతని బహిర్గతం చేయడం కోసమే కావచ్చు. ఇన్ని సంకేతాలను పరిశీలించిన తరువాత స్పష్టమైన దాన్ని బట్టి అది సాధ్యం కాదని ఎవరైనా తలచగలరా?

**ఓ ప్రియతమ సత్యసాయి ప్రభో, నీ రాజ్యం వచ్చుగాక !...**
**అది శీఘ్రమే వచ్చుగాక !**



## ప్రార్థన

**ప్రియతమ సాయిమాతా !**
**నిన్ను ప్రేమతో వేడుకుంటున్నాం....**
**నీ సంకల్పం నెరవేరుగాక,**
**నీ రాజ్యం వచ్చుగాక!**
**దయతో మా నివేదన విను,**
**నీ పాద పద్మాలు పట్టుకొని ప్రతిన పూనుతున్నాము....**
**మా సర్వస్వం నీకర్పించి మీ బిడ్డలమైన**
**మేము విన్నవించుకుంటున్నాం....**
**కారుమబ్బులు సూర్యకిరణాల్ని**
**ఎంతోకాలం అడ్డగించలేవు**
**నీరాజ్యాన్ని తేజస్సుతో నింపటానికి**
**భానుడు సైతం ప్రతీక్షిస్తున్నాడు.**
**నిను పూజించి ఆరాధించే మధుర క్షణాల్ని**
**మేం మరల మరల అపేక్షిస్తాం !**

– సోదరి జుల్లీ చౌదరి విరచిత ప్రార్థన

**ఓ దేవా, నా ప్రేమను స్వీకరింపుడు,**
**అది మీ వైపు పూర్ణభక్తిగా ప్రవహించుగాక!**
**ఓ దేవా, నా హస్తములను స్వీకరింపుడు,**
**అవి మీ సేవలో నిరంతరం నిమగ్నమగు గాక!**
**ఓ దేవా, నా ఆత్మను స్వీకరింపుడు,**
**అది నీ ధ్యాసలో నీతో ఐక్యమౌ గాక!**
**ఓ దేవా, నా మదిని తలంపులను స్వీకరింపుడు,**
**అవి నీ సంకల్పంతో శృతి కలుపు గాక!**
**ఓ దేవా, నా సర్వస్వాన్ని స్వీకరింపుడు,**
**నీ సేవా కైంకర్యంలో నేనొక ఉపకరణమౌదును గాక!**

## – సంప్రదించిన గ్రంధాలు

–"యాన్ ఈస్టర్న్ వ్యూ ఆఫ్ జీసస్ క్రీస్ట్" – లీ హ్యూలెట్ మరియు కె.నటరాజ్, సాయీ పబ్లికేషన్స్,1982
–"అన్యథా శరణం నాస్తి" శ్రీమతి విజయకుమారి, సాయి శ్రీరామ్ ప్రింటర్స్, 1999
–"బాబా సత్యసాయి", రా.గణపతి, సత్యజ్యోతి–12, రాధాకృష్ణన్ వీధి, మద్రాస్ –600017. ఇండియా, 1981
–"బిహర్–ఉల్–అన్వర్", వాల్యూమ్–13, 1&2 భాగములు. అల్లా మహమ్మద్ బకీర్ అల్ – మజ్లీస్, ఆంగ్లానువాదం జా'ఫరీ ప్రోపగేషన్ సెంటర్, ముంబాయి.
–"భగవాన్ శ్రీ సత్యసాయిబాబా", (ఇంట్రప్రిటేషన్స్) వి.కె.గోకాక్ గారు, న్యూఢిల్లీ, అభినవ్ పబ్లికేషన్స్,1975
–"భగవాన్ సత్యసాయిబాబా వారితో సంభాషణలు"(ఆంగ్లం) జాన్. ఎస్.హిస్లాప్, శ్రీ సత్యసాయి బుక్స్ & పబ్లికేషన్స్ ట్రస్ట్.
–"సత్యసాయి బాబా వారితో సంభాషణలు". జాన్.ఎస్.హిస్లాప్, బర్త్‌డే పబ్లిషింగ్ కంపెనీ, శాన్‌డిగో, సి.ఏ, 1978
– "గాడ్ డిస్సెండ్స్ ఆన్ ఎర్త్," సంజయ్ కాంత్, శ్రీ సత్యసాయి టవర్స్ ప్రైవేట్.లి.,1998
– "ఇన్‌సెర్చ్ ఆఫ్ సాయి డివైన్", సత్యపాల్ రూహేలా, ఎమ్.డి., పబ్లికేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, 1996
– కె.జె.వి.,కింగ్ జేమ్స్ వెర్షన్ ఆఫ్ ది హోలీ బైబిల్.
– "లివింగ్ డివినిటీ" శకుంతలా బాలు, సా బ్రిడ్జ్ ఎంటర్ ప్రైజెస్, 1981
– "మోడరన్ మిరకిల్స్" యాన్ ఇంట్రప్రిటేషన్ రిపోర్టు ఆన్ సైకిక్ ఫెనోమెనా, అసోసియేటెడ్ విత్ సత్యసాయిబాబా, ఎర్లెండూర్ హెరాల్డ్‌సన్, హేస్టింగ్స్ హౌస్, 1997
– "మైబాబా అండ్ ఐ" డా॥జాన్.ఎస్.హిస్లాప్, బర్త్‌డే పబ్లిషింగ్ కం., 1985
– "మై బిలవ్డ్" ద లవ్ & టీచింగ్స్ ఆఫ్ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా, చార్లెస్ పెన్, శ్రీ సత్య సాయిబాబా బుక్స్ & పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్రశాంతి నిలయం. 1981
– " సేక్రెడ్ నాడీ రీడింగ్స్" సంకలనం శ్రీ వసంతసాయి, శ్రీవసంతసాయి బుక్స్ & పబ్లికేషన్స్ ట్రస్టు, ముక్తినిలయం, 2011
–"సాయిబాబా& ద నర నారాయణ్ గుహ ఆశ్రమ్, 1&2 భాగములు, స్వామి మహేశ్వరానంద్, ed. బి.పి.మిశ్రా, ముంబాయి..ప్రశాంతి ప్రింటర్స్, 1990



–"సాయిబాబా అవతార్" ఎ న్యూ జర్నీ ఇన్ టూ పవర్ & గ్లోరీ, హూవర్డ్ మర్ఫెట్, శాన్‌డిగో, బర్త్‌డే పబ్లికేషన్స్ కం.,1977
–"సాయిబాబా, ది హోలీ మాన్ అండ్ ద సైకియాట్రిస్ట్", శామ్యూల్ హెచ్ శాండ్‌వీస్, శాన్‌డిగో, బర్త్‌డే పబ్లిషింగ్ కంపెనీ, 1975
– "సాయి మెస్సేజెస్ ఫర్ యూ అండ్ మీ " లూకాస్ ర్యాలీ, వృందావనమ్ బుక్స్, లండన్. వాల్యూమ్.1, 1985 వాల్యూమ్.2,1988
– "సాయివాణి" శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య సందేశముల సంకలనము.
– "సాయి వందన" ed., కె.హనుమంతప్ప, ప్రశాంతి నిలయం, శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్, 1995
– "సనాతనసారధి" మాసపత్రిక, ప్రశాంతి నిలయం.
– "సత్యసాయిబాబా, ఎంబాడిమెంట్ ఆఫ్ లవ్" పెగ్గీమేసన్ మరియు రాన్ లేంగ్, లండన్, సాబ్రిడ్జ్, 1982
– "సత్యసాయి స్పీక్స్" శ్రీ సత్యసాయి బాబావారి దివ్య సందేశములు. తెలుగు నుంచి ఆంగ్లమూలోనికి అనువదింపబడినవి ( శ్రీ సత్యసాయి బుక్స్ & పబ్లికేషన్స్ ట్రస్ట్)
– "సత్యం శివం సుందరం" 1–4 భాగములు, శ్రీ ఎన్. కస్తూరి, శ్రీ సత్యసాయి బుక్స్ & పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్రశాంతి నిలయం 1961–1980.
– "శ్రీ సత్యసాయి అవతార్" వి.అరవింద్ సుబ్రహ్మణ్యం, సురబుక్స్ ప్రైవేట్ లిమిటెడ్–2004.
– "శ్రీ సత్యసాయి బాబా & ద ఫ్యూచర్ ఆఫ్ మేన్ కైండ్", సత్యపాల్ రూహేలా, న్యూఢిల్లీ ,సాయికృప, 1991.
– "శ్రీ సత్యసాయిబాబా ఏ యుగావతార్ ", డా॥ కె.హనుమంతప్ప, శ్రీ సత్యసాయి బుక్స్ & పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్రశాంతి నిలయము, 2008.
– "తపోవనమ్" శ్రీ సత్యసాయి సచ్చరిత్ర, జంధ్యాల వెంకటేశ్వర శాస్త్రి, శ్రీ సత్యసాయి బుక్స్ & పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్రశాంతి నిలయం,2002.
– "ద బ్లిట్జ్ ఇంటర్వ్యూ" భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారు బ్లిట్జ్ ముఖ్య సంపాదకులు శ్రీ ఆర్.కె.కరంజియా కి సెప్టెంబర్ 1976లో బ్లిట్జ్ పత్రికకు ఇచ్చిన ఎక్స్‌టెండెడ్ ఇంటర్వ్యూ.
– "ద హార్ట్ ఆఫ్ సాయి" ఆర్ లోవెన్ బెర్గ్, శ్రీ సత్యసాయి టవర్స్, ప్రైవేట్ లిమిటెడ్, 1981
– "ది లైఫ్ ఆఫ్ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా", ఎన్ కస్తూరి, శ్రీ సత్యసాయి బాబా బుక్ సెంటర్, అమెరికా,1971

